# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

మే 2023

వెల: రూ. 25/-

తిరుమల
శ్రీ వేంకటేశ్వరుని దిశా..
స్వామి లీలల
ప్రత్యేక సంచిక
అందుకోండి













# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

**సంపుటి: 16** **సంచిక: 5**

సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
**తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**

ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా।। పులిగడ్డ విజయలక్ష్మి**

ఫొటోగ్రాఫర్:
**పత్తి సుబ్రమణ్యం,** శ్రీనివాస మంగాపురం

డి.టి.పి: **సాయినాథ్**

డిజైన్: **రమేష్**



**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| ఆర్తత్రాణ పరాయణుడు నృసింహుడు | 6 |
| రామాయణంలో ధర్మసూక్ష్మాలు | 9 |
| భక్తజన సంరక్షకుడు నారసింహుడు | 13 |
| కావు – కావు | 18 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 20 |
| రామధూత హనుమ | 26 |
| రామాయణ రత్నాకరం | 29 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ... | 34 |
| ముకుందమాల | 60 |
| గంగా పుష్కరాలు | 63 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 65 |
| మీ ప్రశ్న – మా సమాధానం | 68 |
| శ్రీకృష్ణావతార విశేషము | 69 |
| దుర్యోధనుడి దుర్బుద్ధి | 71 |
| బుద్ధ పౌర్ణమి | 73 |
| తిరుమల సర్వస్వం | 75 |
| మన మహర్షులు– చ్యవన మహర్షి | 79 |
| శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి.. | 81 |
| శ్రీమాన్ అనంతాళ్వార్ల దివ్య చరితము | 84 |
| శ్రీ విష్ణు మహాపురాణం | 86 |
| రాశి ఫలితములు | 89 |
| మీ విజ్ఞానం | 90 |


సంపాదకీయం..

# స్వామిని చేర్చే వాహనం

భగవంతుని కృపను పొందుటకు ఎన్నో మార్గాలున్నప్పటికీ 'శరణాగతి' అత్యుత్తమ మార్గం. ఈ మార్గంలో మనము మనకున్న సమస్త సంపద, పరివారముతో పాటు భగవంతుని వారముగా సమర్పింపబడాలి. ప్రతి మనిషికి జీవించుటకు కొన్ని హక్కులు ఉంటాయి. సంపద పైన, స్థిరాస్థులపైన, మన సంబంధీకుల పైన ఇలా మనకున్న సమస్త హక్కులను భగవంతునికి సమర్పించి జీవించాలి. మనకు ఈ లోకంలో భగవంతుడు తప్ప మరేదీ లేదనే విధంగా జీవించాలి. మనకున్న సమస్త సంపద, పరివారము, బంధువర్గము, చివరికి కుటుంబ సభ్యులు మొత్తం ఆయన వారుగా భావించి ప్రతిక్షణము భగవంతుని కృపా కటాక్షాలతో ఆయన ఆస్తిని అనుభవించుచు, ఆయన వారముగా జీవించుచున్నామనే భావనతో జీవించాలి. ఇదే ఉత్తమమైన పద్ధతి. మానవుడు భగవంతుని తప్ప మరేదీ కోరకూడదు. అలాంటి స్థితిని పొందుటకు సర్వదా ప్రయత్నించాలి. భగవంతుడు కేవలం భక్తికి మాత్రమే వశుడవుతాడు తప్ప మరోదానికి లొంగడు. దానధర్మాలకు కూడా అంతగా లొంగడు. పూర్వము బలి చక్రవర్తి మహా సంపన్నుడు. మంచి దాత. తన వద్దకు వచ్చినవారిని సంతృప్తి పరిచి పంపే స్వభావము కలవాడు. శ్రీమన్నారాయణుడు వామనావతారము ధరించి బలిచక్రవర్తి వద్దకు వచ్చి మూడడుగుల నేలను దానముగా అడిగాడు. అప్పుడు బలిచక్రవర్తి తాను మహారాజునని, తన స్థాయికి తగ్గట్టుగా మరింత ఎక్కువ అడుగుమని వామనుని కోరాడు. కాని అది మాత్రమే చాలు అన్న వామనునికి మూడడుగుల నేలను దానమిచ్చుటకు సిద్ధపడ్డాడు. ఇంతలో బలిచక్రవర్తి భార్య వచ్చి భర్తను మందలించింది. తనకున్న సర్వము ఆ శ్రీహరిదే అయినప్పుడు తాను ఏ విధముగా మూడడుగుల నేలను వారికి దానముగా ఏల ఇవ్వగలవన్నది. నీవు ఆ మూడడుగుల నేలకు యజమానికి కానప్పుడు దానిని ఇంకొకరికి దానమిచ్చే అధికారము నీకెక్కడిదని ప్రశ్నించింది. ఈ భావన శ్రీమన్నారాయణునికి ఎంతో నచ్చింది. మురిసిపోయాడు. ఆమెను దీవించాడు. ఈవిధంగా జీవించువారు భగవంతునికి ఎంతో ఇష్టులు. ఇక అంతా నాదే! నాదీ నాదే, నీదీ నాదే అని జీవించే దుర్యోధనుని లాంటి వారు మానవ జాతికి కళంకంగా మిగిలిపోతారు. చాలామంది జీవితమున్నంత వరకు సుఖంగా జీవించాలని అడ్డదారులలో ప్రయాణిస్తుంటారు. అది చాలా ప్రమాదమని తెలుసుకొని వారి జీవితమును వారు చేతులారా నశింపచేసుకున్నామని చివరి దశలో బాధపడతారు. ప్రతి మనిషికి ధనమవసరమే. కాని ధనరాశులు అవసరం లేదు. ఎంత సాధారణ జీవితం గడిపితే భగవంతుడికి అంత దగ్గర కాగలం. మనం ఈ మానవ జన్మను ఎత్తింది కేవలం శ్రీమన్నారాయణుని కృపను పొందుటకు మాత్రమే అనే జ్ఞానమును ప్రతివారు గ్రహించాలి. స్వామియందు సంపూర్ణ విశ్వాసముతో ఆయనవైపు ఒక అడుగు వేసినచో దయామయుడైన భగవంతుడు మనవైపు నాలుగడుగులు తప్పక వేస్తాడు. ఇది సత్యం. మనం ఎంతో కష్టపడి, శ్రమకోర్చి, పరుగులు పెట్టి సంపాదించిన ప్రతి వస్తువు మరియు మనవారనుకున్న ప్రతి వ్యక్తి మనవారు కారు. ఏ వస్తువూ మనతో రాదు. ఈ సత్యమును గ్రహించి జీవించాలి. మన ఉద్ధారణ కోసమే శ్రీమన్నారాయణుడు ఈ కలియుగములో తిరుమల కొండపై మనకోసం శ్రీవేంకటేశ్వరునిగ వెలసి మనలను వెయ్యి కళ్ళతో రక్షించుచున్నారు. ఆయనకు శరణాగతులమై సదా ఆయన నామ స్మరణతో జీవించుట ఉత్తమమైన విధానం. శ్రీవేంకటేశ్వరుని దృష్టిలో అందరూ సమానులే. మేము భగవంతుని దృష్టిలో ఉన్నామా? మమ్ములను ఆయన రక్షించునా? ఆదుకొనునా? మా సేవ స్వీకరించునా? అనే అనుమానము లేక శ్రీవేంకటేశ్వరుడు మనవాడు, మనము ఆయన వారిమనే ప్రగాఢ విశ్వాసము ప్రతి ఒక్కరికీ ఉండాలి. ఈ విశ్వాసమే మనలను స్వామి చెంతకు తీసుకుపోయే వాహనము. నమో వేంకటేశాయ!

నమో వేంకటేశాయ

వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి ।।

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. Editor: Pullagurla Saireddy: Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు

(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 1 సం॥ | 250-00 |
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 3,000-00 |
| ☐ పోషకులు | 5,116-00 |
| ☐ రాజపోషకులు | 10,116-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను

లేదా

**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో

చేరునట్లు ఏదేని పీఎన్బీ కాని, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు: ____________________

____________________

చిరునామా: ____________________

____________________

____________________

____________________

____________________

పిన్‌కోడ్: ____________________


చందా వివరాలు: ____________________

మా చిరునామా:

శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

**చందాదారులకు స్వామివారి పవిత్ర పాదాలు (10"x8") ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

## శ్రీవేంకటేశ సుప్రభాతము వరివస్యా వ్యాఖ్య

శ్లో ॥ కౌసల్యా సుప్రజా రామ! పూర్వాసంధ్యా ప్రవర్తతే ।
ఉత్తిష్ఠ! నరశార్దూల! కర్తవ్యం దైవమాహ్నికమ్ ॥

తాత్పర్యము: కౌసల్యా కుమారుడా! ప్రాతః సంధ్యాకాలము ప్రారంభమగుచున్నది. పురుషోత్తమా! లెమ్ము. నీవు ప్రాతఃకాలమున చేయవలసిన సంధ్యోపాసన, దైవప్రార్థన, నిత్య సత్కర్మలు చేయవలసి ఉన్నది.

ఈ శ్లోకము వాల్మీకి మహర్షి రచించిన రామాయణములో విశ్వామిత్రుడు శ్రీరాముని నిద్ర లేపుచున్న సందర్భమున కలదు. శ్రీరాముడు, వేంకటేశ్వరుడు ఒక్కరేయని, ఇద్దరు శ్రీమన్నారాయణుని అవతార, అర్చామూర్తులని తెలుపుటకై పై శ్లోకము సుప్రభాత రచయిత యగు అణ్ణన్ స్వామిచే గ్రహించబడింది. కౌసల్యా సుప్రజా – తల్లితండ్రులలో తల్లికే ప్రథమ గౌరవం. ''మాతృదేవోభవ, పితృదేవోభవ'' అను ఆర్యోక్తి తల్లికే ప్రాధాన్యమును తెలుపుచున్నది.

కౌసల్యాదేవి సుపుత్రుడైన రాముడు తన రూపసౌందర్యముచే, సద్గుణములచే, సత్ప్రవర్తనముచే అందరినీ ఆనందింపజేయువాడని తాత్పర్యము. కావున అతనికి రామనామము సార్థకమగుచున్నది. విష్ణుదేవుని సహస్ర నామములతో ఒక్క రామనామము సమానమగుట రామనామ మహిమ, వైభవమును తెలుపుచున్నది. రామనామము కల్గినవారు ఎందరో కలరు. కాని ఆ పేరు కౌసల్యా కుమారునికే రూఢి యగుచున్నది. అతడు అవతార పురుషుడైనను నిత్యము పురుషులు చేయదగిన సంధ్యోపాసన దైవప్రార్థనలు పూజలు మొదలగు అనుష్ఠానము కర్తవ్యముగ నెరవేర్చవలసి యున్నదని తాత్పర్యం. ''యద్య దాచరతి శ్రేష్ఠస్తత్తదేవతరో జనః'' – గొప్పవాడు ఏ కర్మను చేయునో దానినే సామాన్య ప్రజలు చేయుచుందురు. కనుక నరశ్రేష్ఠుడైన రాముడు లోకహితము కోరి విధి విహితమైన నిత్య సత్కర్మలు చేయవలయును.

**వ్యాఖ్యానం: డా॥ తిరుమల శ్రీనివాసాచార్య**

# ముక్తిమార్గము



## వరాళి

పెంచి తమ పెట్టుఁజెట్టు – పెరికివేయ రెవ్వరు
మంచివాఁడఁగాకున్న – మన్నించకుండేవా? || పల్లవి ||

1. తెరువు దప్పి యడవిఁ – దిరిగేటివారిఁదెచ్చి
తెరువునఁ బెట్టుదురు – తెలిసినవారలు,
నరుఁడవై నేరక – నడిచేటి నన్ను నీవు
మరగించి కావక – మానవచ్చునా? || పెంచి ||

2. దిక్కుమాలినట్టి వారిఁ దెచ్చి దయగలవారు
దిక్కయి కాతురు వారిఁ దిగఁదోయరు,
తక్కక మాయలోఁబడి – దరిదాపులేని నన్ను
వెక్కసాన రక్షించక – విడిచేవా నీవు? || పెంచి ||

3. ఆవల భయపడ్డవా – రంగడిఁబడితే దొర
లో నవు?)ల విచారించి – వూరడింతు రంతలోనే
శ్రీవేంకటేశ! నీవు – సృష్టికల్లా వేలికవు
వేవేలు మా మొర నీవు – విచారించకుండేవా?
|| పెంచి ||





**భావము:** దేవా! తామే పెట్టి పెంచిన చెట్టు చెడ్డదైననే తమ చేతులార ఎవరును పెరికి వేయరు. నీవే కదా నన్ను పుట్టించి పోషించితివి. నేను మంచివాడను కాకున్నచో నన్ను మన్నింపకుండుట నీకు తగునా? ఎరుగనివారెవరైన దారితప్పి అడవిలో బడి తిరుగుచున్నచో తెలిసినవారు వారికి సరియైన తెరువు జూపి కాపాడుదురు. నరుడనై పుట్టి నేను సన్మార్గము నెఱుగక అపమార్గములో బడి పోవుచున్నాను. ఇట్టి నన్ను నీవు ఐహిక భోగములకు మరగించి తరుణోపాయము జూపి కాపాడక వదలిపెట్టవచ్చునా? దయగల పుణ్యాత్ములు దిక్కులేనివారికి దిక్కయి సంరక్షింతురే కాని వారిని విడనాడరు. దయామయుడని పేరు గాంచిన నీవు మాయామయ మగు ప్రపంచములో బడి దిక్కు దెస గానక తికమక లాడుచున్న నన్ను ఎంతేని కృప జూచి రక్షింపక విడిచిపుత్తువా? ఏ కారణముచేనైన భీతి జెందినవారు తమ కొలువు కూటము చొచ్చినచో అచ్చటి దొరలు వెంటనే వారి భీతి హేతువును ఉచిత రీతిని విచారించి భయపడకుమని చెప్పి ఆశ్రయమిచ్చి ఊరడింతురు. శ్రీవేంకటేశ్వరా! చరాచరాత్మకమైన ఈ విశాలసృష్టి కంతటికీ నీవే ఏలికవు. అట్టి నీవు జన్మ జరా మరణాత్మకమైన ఈ సంసారమునకు భయపడి పదింబదిగా మేమొనర్చు మొర లాలిపంక మా సంగతి పట్టించుకొనకుందువా?

**భావానువాదం:**

**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**





# ఆర్తత్రాణ పరాయణుడు
# నృసింహుడు

– చింతలపాటి శివశంకర శాస్త్రి

## (చందనోత్సవ సేవ)

శ్లో ॥ శ్రీమత్పయోనిధి నికేతన చక్రపాణే
భోగేంద్ర భోగ మణిరంజిత పుణ్యమూర్తే
యోగీశ శాశ్వత శరణ్య భవాబ్ధి పోత
లక్ష్మీ నృసింహ మమదేహి కరావలంబం

విశాఖ నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసం వైశాఖ మాసం. ధాత అనే పేరుతో సూర్యుడు లోకాన్ని ప్రకాశింప చేసేకాలం వైశాఖమాసం. ఈ మాసం మాధవ మాసమని ప్రతీతి.

"న మాధవ సమోమాసో న కృతేన యుగం సమమ్
నచ వేద సమం శాస్త్రం న తీర్థం గంగయా సమమ్"

వృక్షములలో కల్పవృక్షము, సర్పములలో ఆదిశేషువు, పక్షులలో గరుత్మంతుడు, విద్యలలో వేదవిద్య, మంత్రములలో ప్రణవము వలె, దేవతలలో విష్ణువు వలె, చాతుర్వర్ణములలో బ్రాహ్మణుని వలె, నదులలో గంగానది వలె, తేజములలో భానుడి వలె వైశాఖమాసం అత్యుత్తమమైనదని స్కంద పురాణం ఎన్నో రీతులలో శ్లాఘించింది. ఈ మాసంలో జలాలన్నీ నిర్మలంగా ఉంటాయి. నారాయణుని ఆదేశంతో సర్వదేవతలూ జలాలలో ఉపస్థితులై ఉంటారు. అటువంటి వైశాఖమాసంలో స్నాన, దాన, పూజ, ఉపవాసాలు ఇహంలో సౌఖ్యం, పరంలో మోక్షం కలిగిస్తాయని శాస్త్ర వచనం. ఈ మాసంలో విష్ణుమూర్తిని తులసిదళాలతో అర్చిస్తే అనంత ఫలప్రదం. విష్ణు ఆరాధనతో సర్వశుభాలు కలుగుతాయి.

అత్యంత, అనంత పుణ్యప్రదమైన ఈ మాసంలో అద్వైత సిద్ధాంతాన్ని ప్రపంచానికి అందించి హైందవ సంస్కృతిని సుసంపన్నం చేసిన జగద్గురువు శ్రీ ఆదిశంకరాచార్యులు, వైష్ణవ భక్తిని సుసంపన్నం చేసిన విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవక్త శ్రీ రామానుజాచార్యులు జన్మించిన మహా మహిమాన్విత మాసం వైశాఖమాసం.

"యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్"

ధర్మానికి హాని జరిగినా, అధర్మం మితిమీరినా భూమిపై అవతరిస్తానని శ్రీకృష్ణ పరమాత్మ గీతలో చెప్పాడు. ఆ విధంగానే దుష్టశిక్షణ, శిష్టరక్షణా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడినప్పుడల్లా భగవంతుడు ఈ భూమిపై అవతరిస్తూనే ఉన్నాడు. అలా అనేక రూపాల్లో అవతరించినా, వాటిలో దశావతారాలు ప్రధానమైనవి. దుష్టశిక్షణ కోసం భగవంతుడు దాల్చిన అవతారాలలో నాలుగవ అవతారమే అమేయమైన నృసింహావతారం. దశావతారాలలో అత్యంత ప్రజ్వలితమైంది నరసింహావతారం.

కుంఠము కానిది వైకుంఠం. ఆ వైకుంఠములో ద్వారపాలకులు జయ – విజయులు. విష్ణుసేవా తత్పరులు.

ఒకమారు సనక సనందనాది మునులు నారాయణ దర్శనార్థమై వైకుంఠమునకు రాగా, నారాయణుని దర్శనమునకు ఇది తగిన సమయం కాదని ద్వారపాలకులు వారిని అడ్డగించారు. అందుకు మునులు ఆగ్రహించి యుక్తా యుక్త జ్ఞానమెరుగంక మమ్మల్ని అడ్డగించినందులకు మీరు విష్ణులోకానికి దూరమయ్యెదరని శపించారు. అప్పుడు జయ విజయులు శ్రీమహావిష్ణువును శరణు కోరగా మహర్షుల శాపానికి తిరుగు లేదని శిక్ష (శాపం) అనుభవించక తప్పదని, మీరు నా భక్తులైనందున మీకు కొంత శాప విమోచన కలిగిస్తానని, నా భక్తులు ఏడు జన్మలు గాని, విరోధులుగా మూడు జన్మలు కాని భూలోకమున జన్మించిన పిమ్మట, మరల వైకుంఠానికి వస్తారని ఉపశమనాన్నిచ్చాడు. అందుకు వారు మీకు దూరంగా ఏడు జన్మలు ఉండలేమని, విరోధులుగా మూడు జన్మలు ఎత్తుతామని పలికారు. మహర్షుల శాప ఫలితంగా కృతయుగంలో హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగాను, త్రేతాయుగంలో రావణ కుంభకర్ణులుగాను, ద్వాపరయుగంలో శిశుపాల దంతవక్త్రులు గాను జన్మించారు. ప్రతి జన్మలోనూ విరోధులుగా శ్రీహరిని ఎదిరించి దూషించి, వధులై అనంతరం శాపవిముక్తి పొందారు.

కశ్యప ప్రజాపతి భార్యయైన దితియందు హిరణ్యాక్ష హిరణ్యకశిపులనే మహావీరులు జన్మించారు. హిరణ్యాక్షుడు వరగర్వితుడై బ్రాహ్మణులను, ఋషులను, మునులను, దేవతలను హింసిస్తూ, యుద్ధంలో ఓడిస్తూ అందరినీ భయకంపితులను గావించాడు. హిరణ్యాక్షుని బాధలను భరించలేక దేవతలు, మునులు శ్రీమహావిష్ణువును ప్రార్థించి మొర పెట్టుకున్నారు. భూదేవి హిరణ్యాక్షుని వలన తాను అనుభవించిన వేదనలను వివరించగా శ్రీహరి భూదేవిని, దేవతలను, మునులను ఓదార్చి వరాహావతారమెత్తి హిరణ్యాక్షునితో తలపడి ఆతనిని సంహరించాడు.

సోదరుని మరణానికి చింతించి, అందుకు కారణభూతుడైన శ్రీహరి మీద పగ పెంచుకొని, రాజ్యభారాన్ని మంత్రులకు అప్పగించి, మందరగిరికి వెళ్ళి బ్రహ్మను గూర్చి ఘోరమైన తపమాచరించాడు. ఆతని తపస్సు ఉగ్రతకు లోకాలన్నీ కంపించాయి. బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకొమ్మన్నాడు. హిరణ్యకశిపుడు బ్రహ్మను చూచి పరిపరి విధాలుగా స్తుతించి, మ్రొక్కి తనకు గాలిలో గాని, ఆకాశంలో గాని, భూమిపైన గాని, నీటిలో గాని, అగ్నిలో కాని, రాత్రి గాని, పగలు గాని, దేవ, దానవ, యక్ష, కిన్నర, కింపురుష, మనుష్యాదుల చేత గానీ, జంతువులచే గాని, ఇంటా, బయటా మరణము సంభవించరాదని కోరాడు. 'తథాస్తు' అని బ్రహ్మ వరాన్ని ప్రసాదించాడు. సర్వభూతములచే అవధ్యునిగా వరము పొంది, యోగసాధనలచే దేవతలను జయించి, సర్వదేవతా స్వరూపాన్ని పొందాడు, వర మహిమచే దేవతలందరినీ వశం చేసుకున్నాడు. లోకాలను ఆక్రమించాడు.

రాక్షస పీడితులైన దేవతలు శ్రీహరిని ఆశ్రయించారు. మొర పెట్టుకున్నారు. మునులు, దేవతలు, యక్ష, కిన్నరుల మొరలను విన్న విష్ణువు లోక కంటకుడైన హిరణ్యకశిపుడిని వధించి, శిష్టరక్షణ గావించెదనని వారికి అభయమిచ్చాడు.

జన్మలలో నరజన్మ ఉత్తమమైనది. జంతుజాలంలో మృగరాజైన సింహం శ్రేష్ఠమైనది. అందువలననే ఆ శ్రీహరి నరసింహ రూపాన్ని ధరించాడు. సగం మానవాకృతి, మరో సగం సింహాకృతి. బ్రహ్మ వరానికి భంగం కలగకుండా ఉండటానికి నరసింహావతారాన్ని ధరించాడు. ధర్మాన్ని రక్షించాలని తలపోశాడు.

లీలావతి, హిరణ్యకశిపుల కుమారుడు ప్రహ్లాదుడు. విష్ణుభక్తి పరాయణుడు. ప్రహ్లాదుడనగా పరిపూర్ణమైన ఆహ్లాదం కలవాడు. నిండు సంతోషం కలవాడు. సర్వులకూ సంతోషాన్ని కల్గించేవాడు. అఖిలలోక ప్రహ్లాదం బొనరించుటం చేసి బాలునకు ప్రహ్లాదుడను నామకరణమొనరించాడు హిరణ్యకశిపుడు. సంతోషానికి మూలం భక్తి. భక్తిభావ పరిమళాల్నే ప్రహ్లాదుడు అందరికీ పంచేవాడు. ప్రహ్లాదుడు తల్లి గర్భము నుండి ఆవిర్భవించింది మొదలు విష్ణుపద కమల ధ్యాన వివశుడై దినదిన ప్రవర్ధమానుడయ్యాడు. మృదుమధురమైన పలుకులతో సుమధుర, సుజ్ఞాన వాక్య వివేక దక్షుడై, ఆటపాటలతోను, అందరితో కూడినప్పుడు విష్ణుసేవ, విష్ణుకీర్తనమే అలవడి విరాజిల్లాడు. పెద్దల పట్ల, గురువుల పట్ల వినయ విధేయతలు కలిగినవాడు.

సర్వకాల సర్వావస్థలలోనూ హరినామం వీడని ప్రహ్లాదుడిని శిక్షించడానికి హిరణ్యకశిపుడు అతణ్ణి సముద్రంలోకి తోశాడు. అయినా హరి కృపా కటాక్ష వీక్షణాలతో బతికి బయటపడ్డాడు. సముద్రంలోకి తోసినా చెక్కు చెదరకుండా బయటపడిన ప్రహ్లాదుని చూచి ఆగ్రహించి చీకటిగదిలో బంధించాడు. అయిననూ చెక్కు చెదరకుండా శ్రీహరిని ప్రార్థిస్తూ ''జీవము నీవే కదా! దేవా! కనపడు చీకటి మాయే కాదా! నిను కనలేని బతుకే నిజముగ చీకటి అవునా! కాదా!'' అంటూ స్తుతించాడు. ఏనుగులతో తొక్కించాడు. ఎంత చేసినా చిరునవ్వుతో స్వీకరించి హరి గానామృతంలో లీనమయ్యాడు.

కంటికి కనిపించే బాహ్యాపరమైన వస్తువులపై వ్యామోహం చెందకుండా, భగవంతునిపై నమ్మకంతో అతని నామస్మరణ చేస్తే మోక్షం లభిస్తుందని గ్రహించి, ఆచరించి చూపాడు ప్రహ్లాదుడు. అందువలననే తండ్రి హింసించినా తొణక్కుండా

బెదరకుండా హరి గానామృతంలో లీనమయ్యాడు. కుమారుని నోటి నుండి వెలువడే హరి గానామృతాన్ని విని భరించలేని హిరణ్యకశిపుడు పర్వతం పైనుంచి కిందికి తోసేయగా, ప్రహ్లాదుడు ఆ పర్వతం నుండి

"నితాంతం ఖగపతి యమృతం పయన్న్యపాణౌ సింహాద్రౌ
శీఘ్రు పాదక్షితా పిహితపదః పాతుం మాం సరసింహాం"

అంటూ వేడుకున్నదే తడవుగా వైకుంఠ నారాయణుడు పరుగు పరుగున బయలుదేరాడు. తాను కట్టుకున్న పీతాంబరం జారిపోతున్నా చెంతనే ఉన్న సిరికి చెప్పకుండా ఏ పరివారమునూ పిలువకుండా, శంఖ చక్రములను ధరించకుండా హుటాహుటిన వేంచేసి గరుత్మంతుని పైనుంచి ఒక్క ఉదుటన కిందకి దూకాడు. ఆయన పాదాలు పాతాళం వరకు చొచ్చుకొని వెళ్ళాయి. వరాహావతారంలో భూమిని చుట్టగా చుట్టి ఎత్తి వేదాలను కాపాడిన ఆ శ్రీహరి పర్వతాన్ని ఎత్తి తన భక్తుడైన ప్రహ్లాదుడ్ని రక్షించాడు.

బ్రహ్మ ఇచ్చిన వరాలు పొంది గర్వితుడైన హిరణ్యకశిపుని సాయంసంధ్యవేళ, ఇంటా బయట కాకుండా, ద్వారబంధం మీద ఎలాంటి ఆయుధాలు లేకుండా వాడియైన తన గోళ్ళతో ఉదరాన్ని చీల్చి సంహరించాడు. అటు నరునిగా కాకుండా, ఇటు సింహము గాకుండా హిరణ్యకశిపుని సంహరించడానికి ఎత్తిన వినూత్నమైన రూపమును గాంచి భీతిల్లిన అందరూ హాహాకారాలు చేశారు. జ్వలితం, భీషణం, ఉగ్రమైన ఆయన స్వరూపాన్ని దేవతలు కూడావీక్షించలేకపోయారు. దేవతలు పరిపరి విధాలుగా స్తుతించి శాంతమూర్తిగా మారమని ప్రార్థించారు. ఆ స్వామిని శాంతించపరచడం ఎవరివల్లా కాలేదు. ప్రహ్లాదుడు స్వామివారిని పరిపరి విధాల ప్రార్థించి దేవదానవుల కోసం, లోకక్షేమం కోసం ప్రసన్నుడవమని కోరి, వరాహ, నరసింహ రూపాలతో సేవించుకునే భాగ్యాన్ని కల్పించమని వేడుకున్నాడు. ప్రహ్లాదుని అభ్యర్థనను మన్నించి, శాంతమూర్తిగా మారి, వరాహ నరసింహ రూపిగా ద్వయావతారునిగా సింహగిరిపై కొలువుతీరాడు. నాటినుండి నేటివరకు భక్తుల కొంగుబంగారంగా భాసిల్లుతూ పూజలందుకుంటున్నాడు సింహాచల దేవుడు.

తన రక్షణార్థం సింహగిరిపై అవతరించిన నృసింహస్వామిని ప్రహ్లాదుడు కొంతకాలము సేవించుకున్నాడు. తదనంతరం దీప ధూప నైవేద్యాలకు నోచుకోకపోవడంతో స్వామిపై పుట్ట వెలసింది. షట్చక్రవర్తులలో ఒకరైన పురూరవునికి స్వప్నంలో కనిపించి గంగధార పడేచోట మాలతీలత కింద ఉన్న పుట్టలో ఉన్నాను. ఆ పుట్టను తొలగించి ఆరాధించమని పలికి తాను ఇన్నాళ్ళూ పుట్టలో ఉన్నాను. ఇప్పుడు బయటకు వచ్చాను. చల్లదనం కోసం పుట్టకు బదులు గంధపు పుట్టను కల్పించమని శ్రీచందనం కల్పించమని ఆనతిచ్చాడు. అప్పటినుండి చందనోత్సవం ప్రారంభమైంది. సింహాద్రి అప్పన్నకు సమర్పించేందుకు దేవాలయ వైదిక అధికారులు మూడు మణుగుల చందనాన్ని అరగదీసి సుగంధ ద్రవ్యాలను కలుపుతారు.

తెల్లవారు ఝామున బ్రాహ్మీ ముహూర్తంలో అప్పన్నస్వామిపై చందనాన్ని ఉంచి ఏడాదిపాటు పూజలందుకున్న చందనాన్ని తొలగించి చందనపు ముద్దను పెడతారు. దానిని "హృదయ చందనంగా" అభివర్ణిస్తారు. ఘటాభిషేకం తర్వాత స్వామివారికి శీతలోపచారములను చేస్తారు. నిత్యం చందనంతో కనిపించే స్వామిని తనివి తీరా దర్శనం చేసుకోవడానికి మన రాష్ట్రం నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు తహ తహలాడుతారు. చందనాన్ని తొలగించాక అభిషేకం, ప్రత్యేక పూజలతో, వేదమంత్రోచ్చారణలతో ఆలయమంతా మారుమ్రోగుతుంది. చందన సమర్పణ వైశాఖ శుక్ల తదియతో మొదలై ఆషాఢ పూర్ణిమకు పూర్తవుతుంది. పరిపూర్ణమైన ఆకారాన్ని ధరిస్తాడు. నిజరూప దర్శనం కోసం, చందనోత్సవం కొరకు ఆలయ ప్రాంగణం భక్తజన సంద్రంగా మారుతుంది. సింహగిరిలో అణువణువు నారాయణ స్వరూపమే. హరినామ స్మరణమే. అప్పన్న చంద్రబింబమంత అందమైన ముఖంతో, త్రినేత్రంతో అలరారుతుంటాడు. లలిత సుందరంగా త్రిభంగిలో నిలిచి యుంటాడు నృసింహుడు.

**"మాతా నృసింహ, పితా నృసింహ**
**భ్రాతా నృసింహ, సఖా నృసింహ**
**విద్యా నృసింహ, ద్రవిణం నృసింహ**
**స్వామి నృసింహ, సకలం నృసింహ"**

అని స్వామిని తలచుకొని మనసారా పూజించినవారికి కష్టాలనేవి దరి చేరవు. నృసింహ ఉపాసన చేసిన అది రక్షణ కవచంగా మనల్ని నిత్యం కాపాడుతూ ఉంటుంది.

"నారసింహాయ విద్మహే వజ్రనఖాయ ధీమహీ తన్నో సింహః ప్రచోదయాత్" అనే మంత్రాన్ని జపిస్తే అనేక రుగ్మతల నుండి విముక్తి లభిస్తుంది.

**"సంసార ఘోర గహనే చరతే మురారే**
**మారోగ్ర భీకర మృగ ప్రవరార్థితస్య**
**ఆర్తస్య మత్సర నిదాఘ నిపీడితస్య**
**లక్ష్మీ నృసింహ మమదేహి కరావలంబం"**

అని శంకరాచార్యుల వారే ఎంతో ఆర్తిగా స్తుతించారు. భక్తుల కష్టాలను గట్టెక్కించి, వారి కోరికలను తీర్చే ఆ దేవదేవుని పూజించి, అర్చన గావించి, కీర్తించి, స్మరించి ముక్తి నొందెదము గాక.



# రామాయణంలో ధర్మ సూక్ష్మాలు

- గోనుగుంట మురళీకృష్ణ

**సాధారణంగా మనలో కొంత మంది రామాయణం గురించి చాలా అపోహలతో మాట్లాడుతూ ఉంటారు. వాలిని చెట్టుచాటు నుంచీ బాణం వేసి చంపటం ధర్మం ఎలా అవుతుంది? సీత పవిత్రురాలని అగ్నిదేవుడు చెప్పిన తర్వాత కూడా ఆమెని శంకించి అడవులలో విడిచి పెట్టటం అన్యాయం కాదా! తండ్రి అడవులకి వెళ్ళమంటే, తల్లి వద్దు అంటుంది. తల్లి మాటకు మాత్రం విలువ ఇవ్వవద్దా! ఇలా అనేక రకాలుగా మాట్లాడుతూ ఉంటారు. కానీ వాల్మీకి రామాయణం క్షుణ్ణంగా చదివితే ఎలాంటి అనుమానాలు ఉండవు. ఇలాంటి సందేహాలన్నిటికీ సమాధానాలు లభిస్తాయి.**

"రామో విగ్రహవాన్ ధర్మః" అని అంటారు. అంటే ధర్మం మనిషి రూపం పొందితే ఎలా ఉంటుందో, రాముడు అలా ఉంటాడు అని అర్ధం. ఈ విధంగా ప్రశంసించినది గురువు వశిష్టుడు కాదు, విశ్వామిత్రుడు కాదు, ఉపకారం పొందిన సుగ్రీవుడు కాదు, మహాభక్తుడైన ఆంజనేయుడు కాదు, విభీషణుడు కాదు. మరి ఎవరు? రాముడి చేతిలో చావుదెబ్బలు తిని చావుతప్పి కన్నులొట్టపోయినట్లుగా అయిన మారీచుడు ఈ మాటలు అంటాడు. రావణుడు మారీచుడి దగ్గరకు వచ్చి ఖరదూషణాదులను వధించిన రాముడి మీద ప్రతీకారంగా సీతను అపహరించుకు రావాలనుకున్నట్లు ఆ విషయంలో తనకు సాయం చేయమని అడిగినప్పుడు మారీచుడు ఇలా అంటాడు. రాముడు ఆత్మరక్షణ కోసం ఖరాదులను వధించటం ధర్మమే! నువ్వు ఆయన గురించి తప్పుగా విన్నావు అని చెబుతూ ఇంకా ఇలా అంటాడు మారీచుడు.

**"రామో విగ్రహవాన్ ధర్మః సాధు స్సత్య పరాక్రమః**
**రాజా సర్వస్య లోకస్య దేవానా మివ వాసవః"**

అంటే విగ్రహము పొందిన ధర్మము రాముడు. అతడు సాధువు, సత్య పరాక్రముడు, దేవతలకు ఇంద్రుడిలా అతడు సకల లోకాలకు రాజు అని అర్థం.అలాంటి రాముడు ఏనాటికీ ధర్మం తప్పడు అని అర్థం.

రాముడు వనవాసానికి బయలు దేరుతుంటే కౌసల్య దుఃఖిస్తూ "తండ్రి నీకు ఎలా పూజ్యుడో తల్లినైన నేను కూడా అలాగే పూజ్యురాలిని. నువ్వు అడవులకు వెళ్ళటానికి నేను అంగీకరింపను. నా మాట పాటించు" అంటుంది. ఇప్పుడు రాముడు ఏం చేయాలి? తండ్రి మాట పాటించాలా, తల్లి ఆజ్ఞ పాలించాలా! అదేవిధంగా రాముడు చిత్రకూటంలో ఉన్నప్పుడు భరతుడు వచ్చి ఆయనను అయోధ్యకు తిరిగి రమ్మని ప్రార్థిస్తాడు. వశిష్టుడు కూడా "ఆచార్యుడిగా నా ఆదేశాన్ని పాటించు. అయోధ్యకు తిరిగివచ్చి సింహాసనం అధిష్ఠించు" అని చెబుతాడు. అప్పుడు రాముడు ధర్మసూక్ష్మం ఇలా వివరిస్తాడు.

"తల్లిదండ్రుల వలన శరీరం కలుగుతున్నది. ఆ శరీరంతోనే ఎవరైనా గురువుని సేవించగలుగుతున్నారు. శరీరమే లేకపోతే గురుసేవే లేదు. కనుక ఆచార్యుడి కంటే తండ్రే అధికుడు. కాబట్టి తండ్రి ఆజ్ఞకు విరుద్ధంగా గురువు ఆజ్ఞాపిస్తే ఆ ఆజ్ఞ చెల్లదు" అని చెబుతాడు (ఈ ధర్మ సూక్ష్మాన్ని అనుసరించే భీష్ముడు పరశురాముడితో యుద్ధానికి సిద్ధపడ్డాడు తప్ప తండ్రి కోసం తను స్వీకరించిన బ్రహ్మచర్య దీక్షను వదులుకోలేదు). కౌసల్య విషయంలో కూడా, పతివ్రతకు భర్తే దైవం. తల్లి కన్నా తండ్రే అధికుడు. పై అధికారి ఆజ్ఞకు విరుద్ధంగా కింద అధికారి ఇచ్చే ఆజ్ఞ చెల్లదు. భర్త ఆదేశానికి విరుద్ధంగా కౌసల్య ఆదేశం ధర్మం ప్రకారం వీలుకాదు. అందుకే రాముడు తల్లిమాటను పాటించలేదు.

**"నాస్తి శక్తి: పితుర్వాక్యం సమతి క్రమితుం మమ**
**ప్రసాదయే త్వం శిరసాః గన్తు మిచ్ఛా మ్యహం వనం"**

"అమ్మా! తండ్రి ఆజ్ఞను అతిక్రమించే శక్తి నాకు లేదు" అంటాడు. ఇక్కడ శక్తి అంటే అంతకు మించిన ధర్మం అని అర్థం.

అలాగే తాటక విషయంలో స్త్రీని చంపకూడదు, రాముడు స్త్రీ హత్య చేసాడు అనే అపోహ ఉన్నది. తాటక సుకేతుడు అనే ఒక యక్షుడి కుమార్తె. బ్రహ్మవరంగా వెయ్యి ఏనుగుల బలం కలదిగా జన్మిస్తుంది. ఒకసారి అగస్త్యుడిని మింగబోగా ఆయన కోపించి రాక్షసివి కమ్మని శపిస్తాడు. ఆ శాపానికి దానికి మరింత కోపం వచ్చింది. అగస్త్యుడు సంచరించిన మలద, కరూద దేశాల ప్రజలను నిష్కారణంగా చంపి తింటూ నాశనం చేసింది. అప్పటినుంచీ ఆ ప్రదేశం ఘోరారణ్యంగా మారిపోయింది. తాటక దుష్టురాలు. ప్రజారక్షణమే రాజధర్మం. దుష్టుల పట్ల యుద్ధనీతిని పాటించవలసిన అవసరం లేదు (స్త్రీలను, బాలలను, వృద్ధులను వధించ కూడదు అనేది యుద్ధనీతి). అందుకే తాటకను వధించాడు రాముడు.

వాలిని చెట్టుచాటు నుంచీ చంపటం కూడా ధర్మం కాదని ఒక అపోహ ఉన్నది. బాణం వేసిన తర్వాత వాలి రాముడితో ఇలా అంటాడు. "నేను ఇంకొకడితో పోరాడుతున్నప్పుడు చెట్టు చాటునుంచీ బాణం వేశావు. నిద్రపోతున్న వాడిని విషసర్పం కాటు వేసినట్లుగా చేశావు. సుగ్రీవుడు నాకు జ్ఞాతి. కనుక అతడితో నేను యుద్ధం చేయవచ్చు. ఏ సంబంధమూ లేని నువ్వు వచ్చి నా మీద బాణం వేయటం అధర్మం కాదా!" అని ప్రశ్నిస్తాడు. అప్పుడు రాముడు ధర్మసూక్ష్మం ఇలా వివరిస్తాడు.

"నువ్వు నీ తమ్ముడిని రాజ్యం నుంచీ వెళ్ళగొట్టావు. అతడి రాజ్యభాగం ఆక్రమించటమే కాక అతడి భార్యను అనుభవించావు. అనుజన్ముడు కొడుకుతోనూ, అతడి భార్య కోడలితోనూ సమానం. కోడలిని గానీ, కుమార్తెను గానీ, సోదరిని గానీ అనుభవించిన వాడికి మరణమే తగిన శిక్ష అని ధర్మ శాస్త్రాలు చెబుతున్నాయి. పర్వతాలతో, మహారణ్యాలతో నిండిన ఈ భూమి ఇక్ష్వాకులది. అధర్మాన్ని నిగ్రహించే అధికారం ఇక్ష్వాకు వంశీయులది.

**"యాంతి రాజర్షయ శ్చాత్ర మృగయాం ధర్మ కోవిదాః**
**తస్మాత్త్వం నిహతో యుద్ధే మయా బాణేన వానర,**
అయుధ్యన్ ప్రతి యుధ్యన్ వా యస్మాచ్ఛాఖా మృగోహ్యసి"

ధర్మకోవిదులైన క్షత్రియులు క్రూరమృగాలను వలలు పన్నో, చాటున దాగో, పారిపోతున్న వాటిని వెంబడించో, ఏదో విధంగా వేటాడతారు. నువ్వు వానరుడవైనా క్రూరమృగంలా ప్రవర్తించావు. కనుక నిన్ను వేటాడవలసి వచ్చింది. నీతో యుద్ధం చేయవలసిన అవసరం నాకు లేదు" అని చెబుతాడు. చివరికి వాలి అర్థం చేసుకుని "అధికుడవైన నీతో అల్పుడనైన నేను ప్రతివాదం చేయరాదు. నన్ను క్షమించు" అని అంగీకరిస్తాడు.

వాలి వృత్తాంతంలో రాముడి పైన అనేక అపప్రథలు ఉన్నాయి. భరతుడు వచ్చి రాజ్యం స్వీకరించమని బ్రతిమిలాడినా వద్దని చెప్పిన రాముడికి వాలిని శిక్షించే అధికారం ఉన్నదా? స్వార్థపరుడైన సుగ్రీవుడు చెప్పినంత మాత్రం చేతనే నమ్మటమేనా? వాలిని కూడా విచారించాలి కదా? ఇలా........వాల్మీకి రామాయణం లోతుగా చదవకుండా

మిడిమిడి జ్ఞానంతో ఉన్నవారే ఇలా విమర్శిస్తారు. వీటన్నిటికీ రామాయణంలో సమాధానాలు ఉన్నాయి. భరతుడు చిత్రకూటం వచ్చి రాముడిని తిరిగి రమ్మని అడిగినప్పుడు ఇలా అంటాడు.

**"త్వం రాజా భరత భవ స్వయం నరాణాం**
**వన్యానా మహామపి రాజరాజాణ్మృగాణాం**
**గచ్ఛత్వం పురవర మద్య సంప్రహృష్ట:**
**సంహృష్టస్త్వ హమపి దండకాన్ ప్రవేక్ష్యే"**

"భరతా! మన తండ్రి నీకు రాజ్యము, నాకు వనవాసం విధించాడు. మనం ఇద్దరం కలిసి ఆయనను సత్యసంధుడిగా చేయాలి. కాబట్టి నువ్వు మనుషులకు రాజువి కా! నేను వన్యమృగాలకు రాజుని అవుతాను. ఇక నువ్వు అయోధ్యకు తిరిగి వెళ్ళు. నేను దండకారణ్యంలోకి ప్రవేశిస్తాను" అని చెబుతాడు రాముడు. కాబట్టి వాలిని శిక్షించటానికి రాముడికి అధికారం కలదు.

అదేవిధంగా రాముడు కేవలం సుగ్రీవుడి మాటలు విని మాత్రమే వాలిని శిక్షించలేదు. వాలి, సుగ్రీవుల గురించి మొదట చెప్పినది కబంధుడు. రాక్షస దేహం పోయి దివ్యదేహం వచ్చినప్పుడు బ్రహ్మలోకానికి వెళ్లేముందు కబంధుడు "రామా! ఋష్యమూక పర్వతం పైన కపివీరుడు సుగ్రీవుడు ఉన్నాడు. అతడు అన్న చేత రాజ్యం నుంచీ వెళ్ళగొట్టబడ్డాడు. అతడు సత్యసంధుడు, వినీతుడు, సమర్థుడు. సీతాన్వేషణ విషయంలో నీకు తప్పక సాయం చేస్తాడు. అతడితో సఖ్యం చెయ్యి" అని చెబుతాడు.

హనుమంతుడు కూడా సుగ్రీవుడి గురించి చెబుతాడు. దూరం నుంచీ ధనుర్ధారులై వస్తున్న రామలక్ష్మణులను చూసి సుగ్రీవుడు, వారు వాలి పంపిన వీరులేమో తెలుసుకుని రమ్మని హనుమంతుడిని పంపుతాడు. వారిని గురించి తెలిసిన తర్వాత హనుమంతుడు "వీరుడు, ధర్మాత్ముడు అయిన సుగ్రీవుడు అనే వానరుడు సోదరుడి చేత వంచింపబడి అరణ్యంలో ఉన్నాడు. అతడు సీతను వెతకే విషయంలో నీకు సహాయం చేయగలడు" అని చెబుతాడు.

అంతేకాదు, ఋష్యమూక పర్వతానికి అపూర్వమైన శక్తి ఉన్నది. పూర్వం బ్రహ్మచేత అది నిర్మించబడింది. ఆ పర్వతం మీద నిద్రించిన వాడు కలలో గన్న సంపదను తిరిగి పొందుతాడు. పైగా పాపాత్ముడు దాని మీదకు ఎక్కినప్పుడు అక్కడి రాక్షసులు అతడిని చంపుతారు. సుగ్రీవుడు ఇంతకాలం అక్కడ నిర్భయంగా ఉన్నాడంటే ధర్మాత్ముడనే నిదర్శనం కదా!

రాముడు ధర్మాధర్మాలను వివరించి చెప్పిన తర్వాత వాలి కూడా "స్వామీ! బాణం చేత కలిగిన బాధ వలన మనసు చెదిరిపోయి తెలియక నిన్ను విమర్శించాను. నన్ను క్షమించి, నాకు దక్కని నీ అనుగ్రహాన్ని నా పుత్రుడికి ప్రసాదించు" అని అడుగుతాడు.

అదేవిధంగా సీతా పరిత్యాగం విషయంలో కూడా ఇలాంటి అపోహే ఉంది. సీత గర్భవతిగా ఉన్నప్పుడు నీకు ఏం కావాలో కోరుకోమంటాడు రాముడు. "గంగానదీ తీరంలోని తపోవనాలను దర్శించాలని ఉన్నదనీ 'ఏషమే పరమః కామః' (ఇది నాకు శ్రేష్ఠమైన కోరిక)" అని చెబుతుంది. ఒకరోజు రాముడు "ప్రజలు నా గురించి ఏమనుకుంటున్నారు?" అని చారులను అడిగితే "రావణుడు ఒడిలో పెట్టుకుని వెళ్ళిన సీతను సిగ్గులేక ఇంటికి తెచ్చుకున్నాడు రాముడు" అని అనుకుంటున్నారు అని చెబుతారు. ఆమెని అరణ్యాలలో విడిచి రమ్మని ఆదేశిస్తే లక్ష్మణుడు " అగ్నిహోత్రుడు కూడా పాపరహిత అని చెప్పిన భార్య కంటే, అర్థం లేని మాటలు మాట్లాడే ప్రజలే ముఖ్యులా?" అని అడుగుతాడు. అప్పుడు రాముడు సోదరులతో "సీత పరిశుద్ధురాలు అని నాకు తెలుసు. కానీ అపవాదు బాపుకోవటానికి సోదరులను అయినా, భార్యనైనా పరిత్యజించ వలసినదే!" అని అంటాడు.

వాల్మీకి ఆశ్రమంలో ఏకాంత వాసంలో దుఃఖం అనుభవిస్తున్న సీత కూడా భర్తకు కలిగిన అపవాదు తనకు అపకీర్తిగానే భావించింది. దాన్ని తొలగించుకోవటంలో తనకు కూడా బాధ్యత ఉన్నది అని అనుకుంటుంది. అది పతివ్రతల యొక్క లక్షణం. కాబట్టి సీతకూడా అది అధర్మం అని భావించలేదు.

అందువల్ల ప్రతి ఒక్కరూ రామాయణాన్ని పూర్తిగా చదివి అందులో నిగూఢ రహస్యాలను అర్థం చేసుకుని, రాముడు ధర్మాత్ముడని తెలుసుకుని, అయన మీద ఉన్న అపవాదులు అన్నీ అర్థరహితాలు అని గ్రహించాలి.

రామలక్ష్మణభరత శత్రుఘ్నుల పుట్టుక విషయంలో కూడా విమర్శ కాదుగానీ, ఇంకొక ధర్మసూక్ష్మం ఉన్నది. తల్లులందరూ పాయసం ఒకేసారి తీసుకున్నారు కదా, వయసు తారతమ్యం ఎలా వచ్చింది? అని. పుత్రకామేష్టిలో ప్రాజాపాద్య పురుషుడు ఇచ్చిన పాయసాన్ని దశరధుడు ఇలా విభజిస్తాడు. మొదట సగభాగాన్ని కౌసల్యకు ఇస్తాడు. మిగిలిన సగభాగంలో సగాన్ని సుమిత్రకు ఇచ్చాడు. ఆ మిగిలిన నాలుగో వంతుని మళ్ళీ రెండు సగాలు చేసి సుమిత్రకు, కైకేయికి ఇచ్చాడు. కైక ఎంత ప్రియపత్ని అయినా ఆమెకి దక్కింది ఎనిమిదవ భాగం మాత్రమే!

కౌసల్యకు ఇవ్వగానే వెంటనే ఆలస్యం చేయకుండా ఆమె

భుజించింది. అందువల్ల మొదట రాముడు జన్మించాడు. కైకేయి కూడా వెంటనే తన భాగాన్ని భుజించింది. అందువల్ల వరస క్రమంలో రాముడి తర్వాత భరతుడు జన్మించాడు. సుమిత్ర మాత్రం భర్త తనకు రెండుసార్లు ఇచ్చిన భాగాలను ఒకదానితర్వాత ఒకటిగా రెండుసార్లు భుజించింది. అందువల్ల ఆమెకు లక్ష్మణుడు, చివరిగా శత్రుఘ్నుడు జన్మిస్తారు. పెద్దయిన తర్వాత రాముడిని లక్ష్మణుడు ఎలా అంటి పెట్టుకుని ఉంటాడో, భరతుడికి శత్రుఘ్నుడు అలా సన్నిహితంగా ఉంటాడు. లక్ష్మణ శత్రుఘ్నులలో ఒకరు భగవంతుడి సేవకు అంకితమైతే, మరొకరు భాగవతోత్తముడి సేవకు అంకితమైనవారు.

శ్రీరాముడిలా సత్ప్రవర్తనతో, ధర్మనిరతితో ప్రజలను పాలిస్తే భగవంతుడిలా ఆరాధింపబడతాడు అని వాల్మీకి మహర్షి వర్ణించాడు. వాల్మీకిలా వర్ణించగలిగే కవి ఈనాటికీ లేడు. వర్ణింపబడే నాయకుడూ లేడు. అందుకే శ్రీరాముడిధర్మనిష్ఠ, సీతారాముల దాంపత్యం, రామానుజుల భ్రాతృప్రేమ భారతీయులకు ఈనాటికీ ఆదర్శప్రాయాలై వెలుగొందుతూ ఉన్నాయి.

మంగళం కోసలేంద్రాయ మహనీయ గుణాబ్ధయే !
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళమ్!
వేదవేదాంత వేద్యాయ మేఘశ్యామల మూర్తయే!
పుంసాం మోహన రూపాయ పుణ్య శ్లోకాయ మంగళమ్

## పూరీ జగన్నాథ ఆలయంలో నవ కళేబర ఉత్సవం

– కౌతా నిర్మల

పూరీ జగన్నాథుని రథయాత్ర ప్రపంచ ప్రఖ్యాతి చెందింది. యాత్రలో పాల్గొనడానికి దేశ విదేశాల నుంచి ఎందరో యాత్రికులు, భక్తులు పూరీ పట్టణానికి చేరుకుంటారు. రథయాత్ర పురవీధులలో జరుగుతుంది. ఇది కాక నవ కళేబర ఉత్సవం పూరీలో జరుగుతుంది. ఈ నవ కళేబర ఉత్సవం జ్యేష్ఠమాసం కృష్ణ చతుర్దశి నాడు బ్రహ్మం మార్పిడి జరుగుతుంది. ఈ పద్ధతి ఆలయంలోనే జరుగుతుంది. ఈ ప్రక్రియను ఎంతో రహస్యంగా, నియమ నిష్ఠలతో జరుపుతారు. ఆ చర్య చేయటానికి ముందుగా ఆలయంలో భక్తులను ఉండనివ్వరు.

జగన్నాథస్వామి, బలభద్రుడు, సుభద్ర నూతన విగ్రహాలను ఆలయంలో ఉంచుతారు. ఆ ఉత్సవం చేయటానికి ముందుగా ఆ కొత్త విగ్రహాలను తెచ్చి అప్పటివరకు పూజలు అందుకుంటున్న విగ్రహాల ముందు ఉంచుతారు. బ్రహ్మ మార్పును చేయవలసిన నలుగురి కళ్ళకు ఏడు పొరలుగా చేసిన పట్టు వస్త్రాన్ని గంతలుగా కడతారు. అదేవిధంగా చేతులకు, కాళ్ళకు కూడా వస్త్రాన్ని చుడతారు. బ్రహ్మ మార్పిడికి ఎంపిక చేసిన నలుగురిని దైతాపతులు అంటారు. ఆ నలుగురిని మాత్రమే ప్రధాన ఆలయం లోనికి వెళ్ళటానికి అనుమతిని ఇస్తారు. అర్థరాత్రి కాగానే ఆలయంలోని విద్యుచ్ఛక్తిని ఆపేస్తారు. ఆ కటిక చీకటిలో కళ్ళకు గంతలు కట్టబడిన దైతాపతులు బ్రహ్మం మార్పిడికి సిద్ధపడుతారు.

ఎవరెవరు, ఏయే భగవంతుని బ్రహ్మ పదార్థాన్ని మార్చాలో ముందుగానే నిర్ధారించుకుంటారు. తమ నిర్ణయం ప్రకారంగానే వారు ఆయా దైవ విగ్రహాల వద్దకు



వెళ్ళి ఆ విగ్రహాల నాభినుండి బ్రహ్మ పదార్థాన్ని బయటకు తీసి, జాజిపూలు, తులసి, కస్తూరి, చందనం మొదలైన ద్రవ్యాలతో బ్రహ్మ పదార్థాన్ని నూతన విగ్రహాల్లో ఉంచి నాభి ద్వారాన్ని మూసేస్తారు. ఆ విధంగా చేయడంతో బ్రహ్మ పదార్థ మార్పిడి ప్రక్రియ పూర్తవుతుంది. ఆ బ్రహ్మం ఏమిటన్నదీ ఎవ్వరికీ తెలియదు. ఎవ్వరూ ఇంతవరకూ చూడలేదు. ఆ బ్రహ్మ పదార్థమేమిటో ఆ బ్రహ్మకే తెలియాలి.

ఆ సమయంలో పూరీ పట్టణంలో విద్యుచ్ఛక్తిని నిలిపివేస్తారు. ఆ పట్టణమంతా చీకటి అలుముకుంటుంది. నూతన దారు విగ్రహాలలో బ్రహ్మ పదార్థాన్ని నింపిన వెంటనే, వాటికి నవకళేబర ప్రాప్తి లభిస్తుంది. అటు పిమ్మట, అప్పటివరకూ ఆలయంలో కొలువై పూజలు అందుకుంటున్న పాత విగ్రహాలను తొలగించి, ఆ స్థానంలో, నూతన విగ్రహాలను ఉంచుతారు. పాత దారు విగ్రహాలను ఆ తర్వాత భూస్థాపితం చేస్తారు. ఈ విధంగా చేసే చర్యనే నవకళేబర ఉత్సవం అంటారు.



ధర్మమునకు హాని సంభవించినప్పుడు గాని, అధర్మము మితిమీరినప్పుడు గాని, బాధితులను రక్షించడానికి పృథ్విపైన అవతరించెదనని శ్రీకృష్ణ భగవానుడు గీత యందు చెప్పాడు. చెప్పినట్లుగానే భగవంతుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ నిమిత్తము ఎత్తిన అవతారములలో దశావతారములు మిక్కిలి ప్రసిద్ధి నొందినాయి. మీనం, కూర్మం, వరాహం, నారసింహం – అను నీ నాలుగు అవతారాలు సద్యోజాతాలు అనగా సంకల్పము మాత్రమున జనియించినవి. తన భక్తుడు ప్రహ్లాదుడిని బాధించుచున్న హిరణ్యకశిపుడిని సంహరించడానికి సంకల్పము చేత విష్ణువు ధరించిన విశిష్ట అవతారము నరసింహావతారము.

# భక్తజన సంరక్షకుడు శ్రీనారసింహుడు

: చిల్లర సీతారామారావు

దశావతారములలో ఇది నాలుగవ అవతారము. సింహం తల, మానవ శరీరం కలిసియున్నదే నారసింహావతారం. బాలభక్తుడు ప్రహ్లాదుడిని రక్షించడానికి వైశాఖ శుద్ధ చతుర్దశి నాడు విష్ణువు నారసింహుడుగా అవతరించాడు. ఈరోజున సింహాచలంలో చందనోత్సవం జరుగుతుంది. ఆ రోజున స్వామివారి నిజరూప దర్శనమును వీక్షింపవచ్చును. విష్ణువు నారసింహుడుగా ఆవిర్భవించిన రోజును నృసింహ జయంతిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. భక్తి శ్రద్ధలతో నారసింహుడిని ఆరాధిస్తే సకల సౌభాగ్యాలు ప్రాప్తిస్తాయి. శౌర్యం, క్రూరత్వం, కరుణ, ప్రసన్నత స్వామివారి విభిన్న లక్షణాలు. విష్ణువు నారసింహుడిగా ఆవిర్భవించడానికి ఒక పౌరాణిక గాథ ఉంది.

పూర్వం హిరణ్యకశిపుడు అను రాక్షస రాజు ఉండెడివాడు. ఇతడు దితి పుత్రుడు. హిరణ్యము అంటే ప్రకృతి, కశిపుడు అంటే హింసించేవాడు అని అర్థము. ఆ రాక్షసుడు పేరుకు తగ్గట్టు ప్రకృతిని నిర్బంధించి తన కనుసన్నలలో మెలిగేలా చేసుకున్నాడు. అతడి భార్య పేరు లీలావతి. లీలావతి గర్భవతిగా ఉన్నప్పుడు హిరణ్యకశిపుడు తపము గావించడానికి అరణ్యములకు వెళ్ళాడు. హిరణ్యకశిపుడి తపస్సుకు బ్రహ్మ ప్రసన్నుడై ప్రత్యక్షమయ్యాడు. వరమును

కోరుకొమ్మని అడిగాడు. బ్రహ్మను స్తుతించిన హిరణ్యకశిపుడు వరమును అడిగాడు. దేవా! ఋషులు, మహర్షుల శాపము వలన నాకు మరణము సంభవింపరాదు. యక్ష, రాక్షస, కిన్నర, కింపురుష, దేవతలు, గంధర్వులు, సర్పములు మున్నగు వారి ద్వారా నాకు మరణము కలగరాదు. వరుణుడు, కుబేరుడు, యముడు, ఇంద్రుడు, సూర్యుడు, అగ్ని, వాయువు, జలము, ఆకాశము ఏదైనగాని, ఎవరైనా గాని నా ఇష్టప్రకారము నడుచుకోవాలి. ఆయుధాలు, పర్వతాలు, వృక్షములు, తడి, పొడి గలిగిన వస్తువుల ద్వారా నాకు మరణము రాకూడదు. పగలు గాని, రాత్రి గాని, ఎటువంటి ఆయుధముల వలన గాని నాకు మరణము కలగకూడదు. నరులు గాని, జంతువులు గాని నన్ను సంహరింప కూడదు. బ్రహ్మ రాక్షసుడు అడిగిన వరములనిచ్చి అదృశ్యమైనాడు.

హిరణ్యకశిపుడు తపము కొరకు అరణ్యములకు వెళ్ళినాడని ఇంద్రునకు తెలిసింది. ఇంద్రుడు ఆలోచనలో పడిపోయాడు. హిరణ్యకశిపుడు బ్రహ్మ వలన వరములు పొంది తిరిగి వస్తే దేవతలు భరించరాని బాధలనుభవిస్తారు అని గ్రహించి హిరణ్యకశిపుడి రాజ్యముపై ఆక్రమణ చేసి రాక్షసులనందరినీ సంహరిస్తాడు. లీలావతిని కూడా సంహరింపబోతుండగా నారదుడు ఆమెను రక్షించి తన ఆశ్రమమునకు తీసుకొని పోతాడు. తన ఆశ్రమములో నారదుడు లీలావతి గర్భస్థ శిశువుకు విష్ణుభక్తిని బోధిస్తాడు. రాజ్యమునకు తిరిగి వచ్చిన హిరణ్యకశిపుడు జరిగిన వృత్తాంతమును తెలుసుకుంటాడు. తన భార్య లీలావతిని రక్షించిన నారదునకు కృతజ్ఞతలు తెలియచేస్తాడు.

హిరణ్యకశిపుడి తనయులలో ప్రహ్లాదుడు భక్తాగ్రేసరుడు. తనయందును, అన్ని జీవుల యందును ఒకేమాదిరి సమభావము కలిగి యున్నవాడు. పెద్దవాళ్ళు కనబడినప్పుడు సేవకుడి వలె నమస్కారము చేయువాడు. పరాయి స్త్రీలు కనబడినప్పుడు తల్లి భావన చేసెడివాడు. దీనులను తల్లితండ్రుల వలె రక్షించాలనుకొనెడివాడు. తనతో సమాన వయసు కలిగిన వాళ్ళను సోదరుడి వలె చూచువాడు. గురువులను దేవునిలాగా భావించేవాడు. నీరు త్రాగుచు, ఆహారము తింటూ, మాట్లాడుతూ, నిద్రపోతూ, కలలో, అన్నివేళలా శ్రీనారాయణుని పాదములను ధ్యానించుట యనే అమృతమును త్రాగుతూ ఈ ప్రపంచమునే అనగా తన శరీరమునే మరచెడివాడు. శ్రీహరిని చింతిస్తూ ఒక్కడూ ఆడుకొనెడివాడు. శ్రీవిష్ణువు నందు మనస్సు లగ్నమై ఒకచోట పాడును. నిరంతరము విష్ణునామ స్మరణము, విష్ణునామ సంకీర్తనము మున్నగు వాటితో కాలము గడిపెడివాడు. ప్రహ్లాదుడు నిరంతరము ఆధ్యాత్మిక చింతన యందే కాలము గడుపుట గమనించిన హిరణ్యకశిపుడు ఆలోచనలో పడిపోయాడు. ప్రహ్లాదుడు ఇలా అవడానికి కారణము విద్యాభ్యాసము లేకపోవుటయని భావించాడు. తన పురోహితుడి తనయుడు చండామార్కులను పిలిపించాడు. ప్రహ్లాదుడితో ఇలా అన్నాడు.

**క. "చదువనివాడజ్ఞుడగు**
**జదివిన సదసద్వివేక చతురత గలుగుం**
**జదువగ వలయును జనులకు**
**జదివించెదన నార్యులొద్ద జదువుము తండ్రీ"**

ప్రహ్లాదా! చదువు లేనివాడు అజ్ఞాని యగును. చదివిన యెడల మంచి చెడ్డల నిరూపించుకొను నేర్పు గలుగును. కనుక మానవులందరును చదువుకొనవలెను. నిన్ను పెద్దల సన్నిధి నుంచి చదివించెదను. చదువుకొనుము నాయనా! అని పలికాడు. చండామార్కులు రాగానే ఆయనకు సత్కరించి ఇలా అన్నాడు. గురువర్యా! ఈ బాలునికి గ్రంథములు చదివించి నీతి కుశలుడిని గావించి రక్షించ ప్రార్థించుచున్నాను. తండ్రి అభీష్టానుసారము చండామార్కులతో కలిసి గురుకులమునకు విద్యనభ్యసించడానికి బయలుదేరుతాడు. గురుకులమునందు చండామార్కులు ప్రహ్లాదునకు యోగ్యమైన శాస్త్రములను బోధించసాగారు. గురువులు బోధించెడి విద్యలు మిథ్యయని తెలిసి కూడా వారు బోధించిన విద్యలన్నింటినీ అభ్యసించాడు ప్రహ్లాదుడు. ఆచార్యులు లేనప్పుడు రాక్షస బాలలకు విష్ణుభక్తిని బోధించసాగాడు ప్రహ్లాదుడు. వారు కూడా బోధనలను వినడానికి ఆసక్తిని కనబరచసాగారు.

హిరణ్యకశిపుడికి తన తనయుడి విద్యాభ్యాసము ఎంత వరకు వచ్చిందో నన్న కుతూహలము కలిగింది. వెంటనే తన కుమారుని గురుకులమునుండి పిలిపించుకున్నాడు. తనయుడిని ఒడిలో కూర్చుండబెట్టుకుని ఆప్యాయముగా అడిగాడు. ప్రహ్లాదా! పద్యము నొకటి చెప్పి అర్థ తాత్పర్యములను వివరింపుము. వినాలని కుతూహలముగా నున్నది అని అడిగాడు.

**క. "చదివించిరి నను గురువులు**
**చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులున్**
**జదివినవి గలవు పెక్కులు**
**చదువులలో మర్మమెల్ల జదివితి తండ్రీ"**

తండ్రీ! మా గురువులు నాకు ధర్మ శాస్త్రాది విద్యలనేకము బోధించిరి. ఆ విద్యలలోని సారమును, మర్మములను, గుర్వనుగ్రహము వలన తెలుసుకున్నాను. వాటిని తెలియజేస్తాను వినండి అని ప్రహ్లాదుడు జెప్పసాగాడు.

మ. తన హృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబు దైత్యోత్తమా!

రాజోత్తమా! మనోవాక్కాయ కర్మలయందేకత్వమును, సద్గ్రంథ శ్రవణమును, దాస్యము, వందనము, నర్చనము, సేవ, యాత్మజ్ఞానము, సంకీర్తనము, చింతనము అను ఈ తొమ్మిది భక్తి మార్గములననుసరించి, సర్వాత్మకుడైన శ్రీహరిని నమ్మి సజ్జనుడై జీవించుట శ్రేయస్కరమని నా నిశ్చితాభిప్రాయము. ప్రహ్లాదుడి మాటలకు అచ్చెరువు నొందిన హిరణ్యకశిపుడు నాయనా, మీ గురువులు బోధించని ఈ బుద్ధి నీకెటుల వచ్చినది? విష్ణువు మన విరోధి. మన విరోధిని పదే పదే స్మరించెదవేలా? నీకీ పాడుబుద్ధి నెవ్వరు నేర్పిరో తెలుపుము. వారిని వెంటనే శిక్షింతును అని పలికాడు. తండ్రీ! నిత్యము హరిని స్మరించువారికే సర్వమూ అవగతమవుతుంది. వీటిని మరొక్కరు చెప్పాలా? బాహ్యపరమైన వస్తువులపై వ్యామోహము చెందకుండా భగవంతుడిపై నమ్మకముంచి ఆయన నామస్మరణమ గావించితే మోక్షము తప్పక ప్రాప్తిస్తుంది. ప్రహ్లాదుడి మాటలు హిరణ్యకశిపునకు ఆగ్రహమును కలిగించాయి. పదే పదే హరియని ఉచ్చరిస్తున్నవు. ఆ హరి ఎక్కడున్నాడు? అని అడిగాడు హిరణ్యకశిపుడు.

"కలడంబోధి గలండు గాలి గలడాకాశంబునం, గుంభినిం
గలడగ్నిన్, దిశలంబగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలం
గల డోంకారమునం ద్రిమూర్తుల ద్రిలింగవ్యక్తులం దంతటం
గలడీశుండు గలండు తండ్రి వెదుకంగానేల? ఈ యా యెడన్?

తండ్రీ! విష్ణువైన ఈశుడు సముద్రమునందును, గాలియందును, భూమియందును, నగ్నియందును, దిక్కులయందును, రాత్రింబవలుల యందును, సూర్యచంద్రాదుల యందును, నోంకారము నందును, త్రిమూర్తుల యందును, త్రిలింగముల యందును, ఇల, నటనన నేల యంతటను గలడు. ఇక్కడను, అక్కడను గలడని వెదుకనేల? ఆ విష్ణువు అన్నింటను గలడు.

క. "ఇందుగలడందు లేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే కలడు దానవాగ్రణీ వింటే"

దానవాగ్రణీ! చక్రధరుడైన విష్ణువు ఒకచోట నుండి, ఇంకొక చోట లేదను సందేహమును వదిలిపెట్టుము. ఆ మూర్తి సర్వ ప్రదేశములందును గలడు. ఎక్కడ వెదికి చూచిన నక్కడనే గలడు అని ప్రహ్లాదుడు పలికాడు. ప్రహ్లాదుడి పలుకులు మరింత ఆగ్రహమును కలిగించాయి. ప్రహ్లాదా! అన్ని స్థలముల యందు శ్రీహరి ఉండునని పలుకుచున్నావు. నీ ఎదురుగా కనిపించు ఈ స్తంభమున నీ హరిని చూపగలవా? చూపించని యెడల నీ తలను ఖండించెదను. అప్పుడు నిన్ను రక్షించడానికి నీ హరి వస్తాడా? అని పలికాడు. బ్రహ్మ మొదలుకొని గడ్డిపోచ వరకు ఉన్న ప్రపంచమంతనూ ఆత్మరూపములో ఉండిన శ్రీహరి ఈ స్తంభమునందు మాత్రము ఉండడా? తప్పకుండా ఉంటాడు. సందేహము అవసరము లేదు. ప్రత్యక్ష రూపమున కాని పంపగలాడు అని జవాబిచ్చాడు ప్రహ్లాదుడు. అలా అయితే నీ హరిని ఈ స్తంభమున చూపింపుము అని పలికి హిరణ్యకశిపుడు తన గదతో స్తంభమును గట్టిగా కొట్టాడు. భక్తజన సంరక్షకుడైన మహావిష్ణువు నరసింహ రూపమున భయంకరమైన రూపముతో స్తంభము నుండి ఆవిర్భవించాడు. మనిషి ఆకారము గాను, జంతువు ఆకారముగాను, హరి మాయా రచితమైన ఆ రూపమును చూచిన వెంటనే హిరణ్యకశిపుడు గదా దండమును గిరా గిరా త్రిప్పి నరసింహస్వామి పైకి విసిరాడు. ఆ గదను లక్ష్యపెట్టక పాము ఎలుకను పట్టినట్టు నరసింహస్వామి హిరణ్యకశిపుని పట్టుకున్నాడు. హిరణ్యకశిపుడు ప్రాణభీతితో గిలగిలా కొట్టుకోసాగాడు. కేవలము మనుష్యరూపమును, జంతువు రూపమును గాని నరసింహ రూపమున రాత్రి, పగలు గాని సంధ్యా సమయమున, లోపల, బయట గాని సభాద్వారమున, ఆకాశము, భూమి కాని తొడమీద హిరణ్యకశిపుడిని పరుండజేసి తన గోళ్ళతో వక్షమును చీల్చి హిరణ్యకశిపుడిని వధించాడు. దేవతలందరూ నరసింహస్వామిని స్తుతించారు. కాని భయంకరమైన ఆ ఉగ్రరూపమును చూచి భయభీతులై దగ్గరికి వెళ్ళలేకపోతున్నరు. నరసింహుడి ఉగ్రరూపమును శాంతింప చేయమని లక్ష్మీదేవిని ప్రార్థించారు దేవతలు. స్వామివారి ఉగ్రరూపమును నేను ఎన్నడూ చూడలేదు. ఆ భయంకర రూపము దగ్గరకు నేను వెళ్ళలేను అని లక్ష్మీదేవి పలికింది. అందరూ కలిసి ప్రహ్లాదుడి దగ్గరకు వచ్చి స్వామి వారిని శాంతింప చేసే శక్తి నీకొక్కడికే ఉంది. కనుక స్వామిని శాంతింప చేయుము అని కోరారు. ప్రహ్లాదుడు నెమ్మదిగా స్వామివారి చెంతకు చేరి సాష్టాంగ ప్రణామము గావించాడు. భక్తపరాధీనుడగు నారసింహుడు ప్రేమతో ప్రహ్లాదుడి శిరస్సు మీద తన అభయ హస్తమునుంచి దీవించాడు. భక్తి శ్రద్ధలతో ప్రహ్లాదుడు నరసింహస్వామిని నుతించాడు. ప్రహ్లాదుని భక్తితత్పరతకు ప్రసన్నుడైన స్వామి ప్రహ్లాదుడిని వరములు

కోరుకొమ్మని అడిగాడు. స్వామీ! నా తండ్రి గావించిన భాగవతాపరాధములు మన్నించండి అని వేడుకున్నాడు. నా స్పర్శతో నీ తండ్రి పునీతుడైనాడు. నీవు నీ తండ్రికి ఉత్తర క్రియలు సలిపి రాజ్యాధికారమును స్వీకరించుము. విజ్ఞుల ఉపదేశామృతమును చూరగొనుము. శరీరమును త్యజించిన తరువాత త్రైలోక్య విరాజమానమును, దివిజ రాజజేగేయమానమును, పరిపూరిత దశ దిశలునైన కీర్తితో ముక్తబంధుడవై నన్ను చేరుకుందువు అని పలికి అదృశ్యుడైనాడు నారసింహుడు.

నృసింహ జయంతి నాడు వేకువ జాముననే లేవాలి. స్నానాదికములు పూర్తి గావించుకోవాలి. గృహములను శుభ్రపరచుకోవాలి. వేదికను ఏర్పాటు చేసి విగ్రహమును ప్రతిష్ఠించాలి. షోడశోపచారములతో, అష్టోత్తర శతనామములతో విగ్రహమునకు పూజలు జరిపిన తరువాత నైవేద్యము సమర్పించాలి. పిదప ఆ విగ్రహమును సద్బ్రాహ్మణునకు దానముగా ఇవ్వాలి. నరసింహస్వామిని భక్తిశ్రద్ధలతో ఆరాధించుకుంటే భూతప్రేత పిశాచాదులు దరిచేరవు. ఆరోజు నృసింహ ఆలయమునకు వెళ్ళి స్వామివారి దర్శనము చేసుకోవాలి.


నృసింహ జయంతి నాడు భక్తి శ్రద్ధలతో స్వామివారిని సేవించుకొని జీవితములకు ధన్యత చేకూర్చుదాము. ఈ విధముగా ప్రార్థించుకుందాం.

**శ్లో ॥ శ్రీమత్పయోనిధి నికేతన చక్రపాణే**
**భోగీంద్ర భోగ మణిరంజిత పుణ్యమూర్తే**
**యోగీశ శాశ్వత శరణ్య భవాబ్ధి పోత**
**లక్ష్మీ నృసింహ మమదేహి కరావలంబం**

# గోమాతకు సాటి లేదు

– శ్రీమతి వెలమకన్ని పద్మావతి

చ్యవన మహర్షి గొప్ప తపస్వి. ప్రయాగ తీరంలోని రెల్లు పొదలలో విష్ణుమూర్తిని గురించి కఠోరమైన తపస్సు చేస్తున్నాడు. ఆ తపో తీవ్రతకు గంగా యమునా నదులు పాయలుగా విడిపోయి చెరొక దిక్కుగా ప్రవహించాయి. సరస్వతీనది అంతర్వాహినిగా వుండిపోయింది. ఆ సమయంలో చేపల వేటకు వెళ్ళిన జాలర్లు మహర్షి తపస్సు చేసుకుంటున్న ప్రాంతంలో వల వేశారు. చేపలతో పాటు చ్యవన మహర్షి కూడా వలలో చిక్కుకున్నాడు. వల బరువుగా ఉండడంతో పెద్ద చేప పడిందని జాలర్లు ఆనందపడ్డారు. కానీ వలలో చిక్కుకున్న చ్యవన మహర్షిని చూసి జాలర్లు కంగారు పడ్డారు. ఆ మహర్షిని రాజు దగ్గరకు తీసికొని వెళ్ళారు. "మహారాజా పొరపాటు జరిగింది. ఈ స్వామి మా వలలో చిక్కుకున్నారు. ఈ స్వామిని మీరు తీసుకోండి" అని ప్రార్థించగా ఆ రాజు ఒక లక్ష బంగారు నాణాలను ఇచ్చి "ఈ మహర్షిని నేను తీసుకొంటాను" అన్నాడు. "నా విలువ లక్ష బంగారు నాణాలేనా?" అంటూ కోపంగా అడిగాడు చ్యవన మహర్షి. రాజు నివ్వెరపోయాడు. లక్షల నుండి బేరం కోట్ల వరకు వెళ్ళి అర్ధరాజ్యం దగ్గర ఆగింది. "సర్వసంగ పరిత్యాగినైన నాకు అర్ధరాజ్యంతో పనేంటి?" అని మహర్షి తిరస్కరించాడు. అదే సమయంలో గౌతమ మహర్షి అక్కడికి వచ్చాడు. "ఒక గోవును దానం చేసి ఈ మహర్షిని తీసుకోండి మహారాజా" అన్నాడు గౌతమ మహర్షి.



వెంటనే ఆనందంతో అంగీకరించాడు చ్యవన మహర్షి.

ఆశ్చర్యపోయిన మహారాజు "అర్ధరాజ్యం కూడా అంగీకరించకుండా కేవలం ఒక గోవుకి సరే అనడం వింతగా.. దీని రహస్యమేమిటి?" అని గౌతమ మహర్షిని అడిగాడు. "మహారాజా గోమాతకు సరిపోయేది ఈ పద్నాలుగు లోకాలలో ఏదీ లేదు. పదునాలుగు లోకాలు, సమస్త దేవతలూ గోవు అవయవాలలో కొలువై ఉన్నాయి" అని గౌతముడు సమాధానం చెప్పాడు.


**గవా మంగేషు తిష్ఠన్తి భువనాని చతుర్దశి**
**సర్వదేవమయీ ధేను తస్మాత్ గోభ్యో నమామ్యహమ్**

త్రిమూర్తులు ఇంద్రుడు సమస్త దేవతలు పదునాలుగు భువనాలు గోవు యొక్క సర్వాంగాలలో కొలువై ఉన్నారు. అటువంటి గోదేవతకు నమస్కారం. ఒక్క గోమాతకు నమస్కరిస్తే సర్వదేవతలకు నమస్కరించినట్లేనని భావము.

తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

## 21వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వరా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగి రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సీగూడ, హైదరాబాద్ - 500007.
ఫోన్: 040- 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:
**93482 12354**



# “కావు - కావు”

– డా|| కూర్మాచలం శంకరస్వామి

**“కావు కావు యనెడి కాకుల అరుపుల్లో**
**మర్మమెంతో గలదు మదిని దలప**
**కావు ఏవి తుదకు కాటికి దరిచేర**
**శంకరునిది పలుకు శంక వలదు”**

**నిజమే కాకి నలుపే. అది పెంట మీద బొర్లేదే. దాని అరుపులు కర్ణకఠోరమే. కాని కావు కావు అనే అరుపుల్లో ఎంతో పరమార్థం దాగి యున్నదని గ్రహించలేక పోతున్నాం. కోకిల లాగా కాకి శ్రావ్యంగా కూయకపోవచ్చు. చిలుకల్లా చక్కని పలుకులు పలుకకపోవచ్చు. దాని నాట్యం నెమళ్ళలాగా నయనానందం కలిగించకపోవచ్చు. హంసల్లా వయ్యారంగా నడవకపోవచ్చు. కాని దాని అరుపుల్లో, నడకల్లో, నడతల్లో, చూపుల్లో మానవులకు ఉపకరించే, మానవులు ఆచరించే చక్కని సందేశం దాగి ఉంది.**

ఎవరన్నా గట్టిగా అరిస్తేఏమిట్రా కాకిగోల అని కసురుకుంటామే తప్ప ఆ గోలలోని గొప్పదనాన్ని గమనించలేకపోతున్నాం. కాకుల అరుపులు కర్ణభేరి పగిలేటట్లు కఠినంగా ఉంటాయి. ఆ మాటకొస్తే మనకు సుద్దులు నేర్పే పెద్దల మాటలు కూడా కఠినంగానే ఉంటాయి. ఆ కాఠిన్యం వెనుక కరుణరసం దాగి ఉందని తెలుసుకోలేకపోతున్నాం. ఎంతసేపు పెద్దవారు మనల్ని తిట్టారని బాధపడతామే తప్ప వారి తిట్ల వెనక వారి చల్లని దీవెనలు ఉంటాయని గమనించలేకపోతున్నాం. జన్మనిచ్చిన అమ్మనో, నాన్ననో, ప్రేమగా చూసుకునే అక్కనో, అన్ననో మందలించారని మధనపడుతుంటామే తప్ప, ఆ మందలింపులో మన మనుగడ దాగి ఉందని, దాని వల్ల మన భావి జీవితం బంగారు మయమవుతుందన్న నగ్న సత్యాన్ని తెలుసుకోలేకపోతున్నాం.

ఒక రకంగా కాకి గొప్ప బోధ గురువు. ఇంటి మీద కాకి అరిస్తే ఆ ఇంటికి చుట్టాలు వస్తారని ఒక అనుభవ పూర్వక


విశ్వాసం ఉంది. ఎవరైనా చనిపోయినప్పుడు పిండం చేసి మొదట కాకులకు గద్దలకే పెడతాము. అవి మన పితరులుగా భావిస్తాము. ఒకవేళ అవి పిండాన్ని ముట్టుకోకపోతే ఏదో దోషంగా భావిస్తాం. కాకి నెత్తిమీద వాలితే అరిష్టంగా భావిస్తాం.

కావు కావు అనే కాకుల అరుపుల్లో ఈ భూమిమీద నివసించే ఏ ప్రాణి శాశ్వతం కాదు. వారు సంపాదించిన సొమ్ములు, రత్నాల రాశులు ఏవీ శాశ్వతం కాదు. ''కారే రాజులు రాజ్యముల్ గలగవే గర్వోన్నతుల్ వారేరి సిరిన్ మూటకట్టుకొని పోజాలరే'' అని బలి చక్రవర్తి శుక్రాచార్యునితో చెప్పిన మాటలను బట్టి వేదభూమిగా, నాదభూమిగా, దివ్యభూమిగా, కర్మభూమిగా కీర్తి పొందిన ఈ భారతదేశంలో ఎంతోమంది రాజులు పరిపాలించారు. ఎన్నో కోటలు, పేటలు, సామ్రాజ్యాలు నిర్మించారు. కాని వారి మరణ సమయంలో అవి వారి వెంట పోలేదు. అవి అలాగే ఉన్నాయి. కాని ఒక్క శిబిచక్రవర్తి పేరు మాత్రమే ఉంది. ఎందుకంటే ఒక పావురం కోసం శిబి చక్రవర్తి తన తొడ మాంసం దానం చేసి త్యాగధనుడయ్యాడు. అంతేకాని ఈ బాహ్యవస్తువులు ఏవీ శాశ్వతం కావు – కావు – కావు అనేదే కాకుల అరుపుల్లోని పరమార్థం.

ప్రతి జీవి ఆశా పాశాలచే బంధింపబడి కర్మల వలయంలో చిక్కి సతమతమవుతుండగానే ఆయుస్సు క్షీణిస్తుంది. వయస్సులో ఉన్ననాడే ధర్మకార్యాలు చేస్తూ మానవులు ధన్యత పొందాలని కాకి హెచ్చరిక.

''సంపదః స్వప్న సంకాశం – యౌవనం కుసుమోపదం'' అనగా ఈ సంపదలూ, ఈ భోగాలూ స్వప్న సదృశాలు. అనగా ఒక కల లాంటివి. అనగా మిథ్య. అవి శాశ్వతం కావు కావు. పుష్పము చిగురించి ముకుళించి రాలిపోయినట్లు అవన్నీ రాలిపోతాయి.

**కావు కావు అనే కాకుల అరుపుల్లో ఈ భూమిమీద నివసించే ఏ ప్రాణి శాశ్వతం కాదు. వారు సంపాదించిన సొమ్ములు, రత్నాల రాశులు ఏవీ శాశ్వతం కాదు. "కారే రాజులు రాజ్యముల్ గలగవే గర్వోన్నతుల్ వారేరి సిరిన్ మూటకట్టుకొని పోజాలరే" అని బలి చక్రవర్తి శుక్రాచార్యునితో చెప్పిన మాటలను బట్టి వేదభూమిగా, నాదభూమిగా, దివ్యభూమిగా, కర్మభూమిగా కీర్తి పొందిన ఈ భారతదేశంలో ఎంతోమంది రాజులు పరిపాలించారు.**



యౌవనం మెరుపు తీగలాంటిది. అది ఒకసారి తళుక్కున మెరిసి మాయమవుతుంది. ''మాతా నాస్తి, పితా నాస్తి, నాస్తి బంధు సహోదరా'' అనగా తల్లితండ్రులు, భార్యాబిడ్డలు, బంధువులు, సోదరులు, ధనము, భూమి, గృహము శాశ్వతం కావు కనుక కావు కావని కాకి హెచ్చరిస్తుంది.

''జన్మ దుఃఖం జరా దుఃఖం । జాయా దుఃఖం పునః పునః । సంసార సాగరం దుఃఖం తస్మాజ్జాగ్రత జాగ్రతః'' అని శాస్త్రం చెబుతుంది. దుఃఖంతో కూడుకున్న జన్మ. ముసలితనం, సంసారం కోసం దుఃఖించడం మూర్ఖత్వమే.

సాయంత్రం కాగానే అనేక పక్షులు ఒకే చెట్టు మీదికి చేరి తమ తమ గూళ్ళలో సేదతీరి ఉదయం కాగానే దేని మార్గంలో అది వెళ్ళినట్లుగా ప్రతి మానవుడు తన భార్యా బిడ్డలతో కలవడం, విడిపోవడం జరుగుతుంది. కనుక ఈ లోకంలో ఏవీ నీవి కావు కావు. ఎవరూ నీ వెంట రారు రారు.

**"రావు రావనెడి రాగాల యందున్న**
**రాగ బంధమెల్ల రావు రావు**
**రావు ఏవీ తుదకు రాగ రంజితములును**
**శంకరునిది పలుకు శంక వలదు"**

కోట్లు కూడబెట్టే కోటీశ్వరుల మరణాన్ని వారు సంపాదించిన సొమ్ము ఆపలేదు. బతికి ఉన్నప్పుడు ఎంత ప్రేమగా చూసుకున్నా రాగబంధాలూ, రతనాల రాశులూ సౌఖ్య సౌధాలూ ఏవీ కావు వెంటరావు. అందుకే కాకి నీవెవరికీ ఏమీ కావు. నీవి యనునవి నీకేవి కావు. కావు కావు కావు కావు అని నిరంతరం నినదిస్తూ మానవజాతికి మేలుకొలుపు గీతాన్ని ఆలాపిస్తుంది. అంతేకాదు. కాకులు ''గొప్ప సంఘజీవులు. ఒక్క కాకికి ఆపద సంభవిస్తే వంద కాకులు వస్తాయి. అవి మనకు ఆదర్శం''.

**కాకులందు కలదు కడు గొప్ప ఐక్యత**
**కష్టకాలమందు కలసియుండు**
**ఏక తత్వమెపుడు ఏకాకి బతుకవును**
**కలిసి మెలిసి యున్న కలదు సుఖము**

కావు ఏవి మనవి కావు కావు అనేదే కాకి గోలలోని పరమార్థం.

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

## సావిత్రి

**గత సంచిక తరువాయి**

సూతమహర్షి మునులందరి వైపు చూస్తూ ''అందరూ వచ్చారా నాయనా! ప్రారంభిద్దామా'' అని అడగటంతో మునులు తలలూపుతూ తమ అంగీకారాన్ని తెలిపారు. శౌనకుడు లేచి ''మహాత్మా! నిన్న మీరు చెప్పినదంతా విన్న తర్వాత మాలో ఎన్నో ప్రశ్నలుదయించాయి. యమధర్మరాజు అంతర్థానం చెందిన తరవాత సావిత్రి ఏమి చేసింది? సత్యవంతుని దేహాన్ని దాచిపెట్టి ఆ స్థలం నుంచి చాలాదూరం నడిచి వచ్చింది గదా! అంతదూరం మళ్ళీ వెంటనే వెళ్ళగలిగిందా? పతిని చేరుకొని ఏమి చేసింది? జరిగిన విషయమంతా భర్తకు తెలియజెప్పిందా? ప్రాణవంతుడై సత్యవంతుడు యథాస్థితికి చేరుకోగలిగాడా? ఆలోచిస్తున్న కొద్దీ అంతా ఆశ్చర్యంగా ఉంది. నిజంగా పాతివ్రత్యానికింత శక్తి ఉందా?'' అంటూ సూత మహర్షి వైపు చూశాడు. సూతుడు చిన్నగా నవ్వుతూ ''ఉండబట్టే గదా! సావిత్రి భర్తను తిరిగి బ్రతికించుకోగలిగింది. యమధర్మరాజు వెళ్ళిపోయిన తరవాత ఏం జరిగిందో వివరంగా చెబుతాను వినండి'' అంటూ చెప్పటం మొదలుపెట్టాడు.

''సావిత్రి యమధర్మరాజుకు భక్తితో మనసులోనే నమస్కరించి తన భర్త శరీరం ఉంచిన చోటుకు చేరి, కూర్చుని పూర్వంలాగే సత్యవంతుని శిరస్సును తన తొడలపై పెట్టుకొని భగవద్ధ్యానంలో నిమగ్నురాలైంది. కొంతసేపటికి సత్యవంతుడు చైతన్యవంతుడై సావిత్రిని చూసి –

**"కడు తడవు నిద్రపోయితి**
**పడతీ! ననుఁ దెలుపవలదె; బలియు డొకరుడె**
**క్కుడు జవమునపట్టి బలం**
**బెడలగ ననుఁ దిగిచె; నాతడెవ్వడు సెపుమా!"**

**-మహాభారతము - అరణ్యపర్వము - సప్తమాశ్వాసము - ప.253**

''నేను చాలాసేపు నిద్రపోయినట్లున్నాను. నన్ను

లేపకపోయావా? ఆలస్యమైపోతే చీకటిలో ఇల్లు ఎలా చేరగలము? అవును. నిద్రలో వరో ఒక బలిష్ఠుడైన వ్యక్తి నా వద్దకు వచ్చి మిక్కిలి వేగంతో నన్ను పట్టి తన బలమంతా ఉపయోగించి ఒక్క లాగు లాగినట్లనిపించింది. ఆ తరవాత ఏమైందో తెలియలేదు. అతడెవరో చెప్పు. అతడిని నీవు చూశావా? అది మొదట్లో కలేమో అనుకొన్నాను. కాని, కలకాదు. నిజంగానే జరిగినట్లుంది. ఆ బలిష్ఠుడు పట్టి లాగుతుంటే నాకు చాలా భయం వేసింది'' అని అనగానే సావిత్రి సత్యవంతుని చూసి ధైర్యం తెచ్చుకొని ''నాథా! ఇదంతా రేపు నీకు సవిస్తరంగా చెబెతాను'' అని లేవబోయింది. సత్యవంతుని కళ్ళలో కనిపిస్తున్న ఆత్రుతను చూసి ''నాథా! చూడు అప్పుడే చీకటి నలువైపులా క్రమ్ముకున్నది. రాత్రి ఎక్కువ కాకముందే ఆలస్యం చేయకుండా ఇక్కడ నుంచి వెళ్ళిపోవటమే చాలా మంచిది. నీవు లేస్తే త్వరగా వెళ్ళిపోదాము. అటు చూడు. రాక్షసులు మహోగ్రాకారంతో అటూ ఇటూ తెగ తిరుగుతున్నారు. మనమిక్కడ ఉన్నామని తెలిస్తే మనమీదకే వస్తారు. నీవు వాళ్ళను పరిమార్చలేవని కాదు. నక్కలు విపరీతమైన భయాన్ని కలిగించే విధంగా అరుస్తున్న అరుపులు ఆకాశాన్ని అంటుతున్నాయి. క్రూరమృగాలన్నీ ఇదే సమయమంటూ గుంపులు గుంపులుగా కలిసి అరణ్యమంతా కలియ తిరుగుతూ ఆహారం కోసం వెదుకుతున్న వాటి పదధ్వనులు చెవులను అదరగొడుతున్నాయి. ఇదంతా చూస్తుంటే నా ఒళ్ళు భయంతో వణికిపోతోంది.

ప్రాణనాథా! నా మనసులో మెదులుతున్న మరొక మాట కూడా చెబుతాను.

**"విను! నీవు దడయుటకు మీ**
**జననియు జనకుండు కరము సంతాపభరం**
**బున పొందుదురింతకు; క్ర**
**న్నన వారికి సంతసం బొనర్పవె యధిపా!"**

**- మహాభారతము - అరణ్యపర్వము - సప్తమాశ్వాసము - ప.256**

''నీవింత ఆలస్యం చేసి, ఆశ్రమానికి ఇంకా రాకపోయినందుకు వృద్ధులైన నీ తల్లితండ్రులు భయాందోళనలతో ఎంతగా కుమిలిపోతున్నారో! ఇప్పటికైనా త్వరగాఇల్లు చేరి వారికి సంతోషాన్ని కలిగించడం నీ బాధ్యత గాదా?''అని ఆమె ఎంత చెప్పినా సత్యవంతుడి ముఖంలో ఇంకా కనిపిస్తున్న విషాద చేష్టలు సావిత్రి చేత మరికొంత మాట్లాడింప చేశాయి.

''స్వామీ! లేచి ఒక్కసారి నాలుగువైపులా చూడు. అడవి అంతటా చీకటి ఎలా దట్టంగా వ్యాపించిందో? కన్ను పొడుచుకున్నా దారి కనబడటం లేదు. పోనీ మన ఆశ్రమ భూమి దగ్గరా? అంటే కాదే! చాలా దూరం కదా! నీ ముఖ కవళికలను బట్టి నీలో అలసట ఇంకా పోలేదని తెలుస్తోంది. పోనీ, ఆనందంగా ఈ రాత్రి అంతా ఇక్కడే గడిపి, తెల్లవారిన తరువాత రేపు ఆశ్రమానికి వెళదామంటావా? మనకూ ధైర్యంగా ఉంటుంది. ఈ రాత్రివేళ ఈ భయంకరారణ్యం దాటి వెళ్ళటం కూడా కష్టమే కదా? నీ ఆలోచన ఏమిటో చెప్పు. ఆవిధంగానే చేద్దాం'' అన్న సావిత్రిని చూసి సత్యవంతుడు



తన తల నొప్పి కొంచెం తగ్గటం వల్ల మాట్లాడసాగాడు.

సావిత్రీ నీవు చెప్పిందే నిజం. ఇప్పటికి నా శిరోవేదన పూర్తిగా తగ్గిపోయింది. నా శరీరం బలంతో దృఢంగా ఉంది. ఇంతవరకూ ఉన్న నీరసమంతా తృటిలో పోయినట్లనిపిస్తోంది. మెల్ల మెల్లగా జరిగి, లేచి నిలబడగలనని అనిపిస్తోంది. అవును. తల్లితండ్రులను చూడకుండా, వారి యోగ క్షేమాలు తెలుసుకోకుండా ఈ రాత్రంతా ఈ అడవిలో ఎలా ఉండగలను? ఇంతకుముందు నేను వాళ్ళను వదిలి ఎక్కడా ఇంతవరకు ఉండలేదు. ఈరోజు జరిగిన ఆలస్యానికి జననీ జనకులు ఎంత బాధపడ్డారో? ఆహారం అందక ఏమైపోయారో? ఎట్లా ఉన్నారో గదా! నేను కనపడలేదని, ఇంత పెద్ద ఆలస్యం జరిగినందుకు వారు ఎంతగా కుమిలిపోతున్నారో!

**"సంధ్య ప్రొద్దు నన్ను జనని యెన్నడు నిల్లు**
**వెడలనీదు; నేడు విపిన భూమి**
**మధ్యరాత్రి వేళ మసలుట కాయమ**
**యెట్టి పాటుపడెనొ, యే నెఱుంగ"**

**-మహాభారతము – అరణ్యపర్వము – సప్తమాశ్వాసము – ప.261**

సావిత్రీ! ఇప్పుడిప్పుడే నాకొక్కొక్క విషయము గుర్తుకు వస్తోంది. సూర్యాస్తమాన సమయంలో నన్ను మా అమ్మ ఎక్కడికీ పోనివ్వదు – ఏ అపాయం కలుగుతుందో అని. ఈరోజు మధ్యరాత్రి అయినా నేనింటికి వెళ్ళలేకపోయాను గదా! దానికి మా అమ్మ ఈ అడవిలో ఇంత రాత్రివేళ ఎందుకు తిరుగుతున్నానో, ఏం జరిగిందో, ఏ కష్టం వాటిల్లిందో అని నేను కనపడక పోయేసరికి ఎంతగా బాధపడుతోందో, ఏమో! నాకు తెలియదు గదా!

ప్రియసతీ ఇంకో విషయం చెప్పనా!

**"కౌగిట నను చిక్క గదియించి శిరము మూ**
**ర్కొంచును బాష్పముల్ గురియుచుండ**
**పట్టి "మా యొడలుల ప్రాణంబులును నెల్ల**
**యర్థముల్ నీవ; మాయన్న! నీవు**
**తెప్పగా సంసార తీరంబు సేరెద**
**మని తలంచెదము సుమ్మన్న! యన్న!**
**కన్నులు లేని మా కన్నులు కాళులు**
**నీవకదన్న; మా నిఖిలవంశ**
**మును సముద్ధరించు మోపు నీయదియక**
**దన్న!"యనుచు నిట్టులగ్గలంపు**
**ప్రేమ నను దినంబు ప్రేముడింతురు వృద్ధు**
**లక్కటకట! యేమి యైరొ నేడు?"**

**-మహాభారతము – అరణ్యపర్వము – సప్తమాశ్వాసము – ప.262**

వృద్ధులైన నా తల్లితండ్రుల ప్రేమానురాగాలే నన్నింతకాలం మననిచ్చాయి. వారి వాత్సల్యం ముందు నా భక్తి ఏపాటిది? కౌగిలిలో నన్ను గట్టిగా పట్టుకొని, తలను వాసన చూస్తూ, ఆనంద బాష్పాలు జాలువారుతుండగా ''తండ్రీ! సత్యవంతా! మా శరీరాలలో నిలిచి ఉన్న ప్రాణాలు నీవే నాయనా! మా సమస్త సంపదలు నీవే! నిన్ను తెప్పగా భావించి ఈ సంసార సాగర తీరాన్ని తప్పక చేరుకోగలమన్నదే గదరా మా ఆశయం. అసలు నీవు లేనిది మేము లేము గదా అన్నది పరమ సత్యం. ఎందుకంటే కళ్ళు లేని మాకు కళ్ళూ, కాళ్ళూ అన్నీ నీవే. మా వంశాన్ని అంతటినీ ఉద్ధరించే భారం అంతా నీ భుజాల మీదే ఉంది గదా!'' అంటూ రకరకాల విషయాలు గుర్తు చేస్తూ, నామీదే అన్నివిధాలా ఆధారపడుతూ, ప్రతినిత్యం వారి అనంతమైన ప్రేమను నామీద వర్షిస్తూ కాలం గడుపుతున్నారు వృద్ధులైన నా తల్లితండ్రులు. అటువంటి ఆ ప్రేమమూర్తులు నేడు నేను తిరిగి ఇంటికి రాకపోవటం వల్ల ఎంత బాధపడుతున్నారో! ఏమయ్యారో! ఒకే ఒక్క కొడుకును నేను కనపడకపోవడంతో ఆ ముసలి దంపతులు ఇంతవరకూ అసలు ఏమైనా తిన్నారో! లేదో! అలాగే అలమటిస్తున్నారో యేమో! సావిత్రీ అసలు అడవికి ఏ పని మీద వచ్చాము? పండ్లు, కందమూలాలు, కట్టెలు, సమిధలు మొదలైన వాటిని తీసుకుని వెంటనే ఆశ్రమానికి వెళ్ళిపోక ఎందుకిక్కడ ఆలస్యం చేసినట్లు? విధి బలీయం కాకపోతే ఇక్కడే ఎక్కువసేపు అరణ్యశోభ చూస్తూ ఎందుకు ఉండిపోవాలి? అనవసరంగా ఆపదపాలెందుకు కావాలి? కర్మ కాకపోతే దైవం చేతిలో చిక్కుకుపోయి, అవస్థపాలైనేనిక్కడే ఉండిపోవడమా? ఇప్పుడేం చేయను? ఏం చేయగలను? అయ్యో! ఎంత ప్రమాదం వాటిల్లింది? నేనెక్కడ ఉన్నానో తెలియక నా తండ్రి దిగులుతో దుఃఖాన్ని ఆపుకోలేక ఆశ్రమ వాసులైన మునులందరినీ ఒక్కొక్కరినీ వేరు వేరునా పేరు పేరునా అడుగుతూ ఎంతగా తిరుగుతున్నాడో ఏమో? ఎవరూ నా ఉనికిని చెప్పలేక పోవడంతో ఆయన మనోవేదన అంతు లేకుండా ఆయనను ముప్పుతిప్పలు పెడుతూ ఉండి ఉంటుంది.

**"నా వార్త వినక యింతకు**
**నా వృద్ధులు భిన్న హృదయులై ప్రాణంబుల్**
**పో విడుతురుగా కచటికి**
**పోవంబని గలదె యేను పుచ్చెద నసువుల్"**

**-మహాభారతం – అరణ్యపర్వం – సప్తమాశ్వాసం – ప.265**

సావిత్రీ! నా తెలివి తక్కువతనం కాకపోతే నా తల్లితండ్రులు ఇంకా బతికే ఉన్నారంటావా? వాళ్ళు ఎలా

ఉన్నారో, ఏం చేస్తున్నారో అని బాధపడుతున్నానే గాని, నేను బాగానే ఉన్నాననే వార్త వినకపోవడం వల్ల ఈ పాటికే వారి హృదయాలు పగిలిపోయి ఉంటాయి. ఇంకా ప్రాణాలతో జీవించి ఉండటం అసంభవం. వారే లేకపోతే నేనక్కడికి వెళ్ళి మాత్రం ప్రయోజనమేముంటుంది? నేను కూడా ప్రాణాలు వదిలేస్తాను’’ అని రకరకాలుగా తల్లితండ్రులను తలపోస్తూ వివశుడైన సత్యవంతుని చూసి అంతవరకు ధైర్యంగా ఉన్న సావిత్రి కూడా దుఃఖంతో క్రుంగిపోయింది. కొద్దిసేపటికి కొంచెం తేరుకొని భర్తను ఓదార్చి మెత్తటి మాటలతో ఆశ్రమోన్ముఖుడు కావటానికి నచ్చచెప్పింది.

సావిత్రి మాటలతో తేరుకొన్న సత్యవంతుడు ఆమె ఒడినుండి లేవటానికి ప్రయత్నించి విఫలుడు కావడంతో మరింత దుఃఖితుడైనాడు. వెంటనే సావిత్రి సుకుమారమైన తన బాహువులతో సత్యవంతుని కౌగిలించుకొని మెల్లగా లేవదీసింది. ఆమె శక్తితో తనను తాను కూడదీసుకుని మెల్ల మెల్లగా లేచి నిలబడి శరీరమంతా అలముకొన్న దుమ్మునంతటినీ దులిపి ప్రయాణానికి సిద్ధమైనాడు. సత్యవంతుడిలో నెలకొన్న ఉత్సాహాన్ని చూసిన సావిత్రి కూడా వెంటనే పండ్లనన్నిటినీ ఒకచోట కూర్చి, బుట్టలో పేర్చింది. సమిధలను మరొక బుట్టలో పెట్టింది. ఆ రెండు బుట్టలను మోసుకుని అంతదూరం నడిచి వెళ్ళటం కష్టమని భావించి ఆ అడవిలోని ఒక చెట్టు కొమ్మకు తగిలించింది. మార్గమధ్యంలో ఏమైనా ఇబ్బంది కలిగినా, ఆధారంగా ఉంటుందని ఒక గండ్రగొడ్డలిని తనతో తీసుకొంది. సత్యవంతుని ఎడమ చేతిని తన ఎడమ భుజంపైన పెట్టుకొంది. కుడి చేతితో భర్తను గట్టిగా కౌగిలించుకుని అతనికి ఆసరాగా నిలబడింది. నాథుని అనుమతితో మెల్ల మెల్లగా ఆశ్రమ మార్గంలో నడక సాగించింది’’ అని సూత మహర్షి కొద్ది క్షణాలు చెప్పటాన్ని ఆపాడు. వింటున్న మునుల భావాలు ఎలా ఉన్నాయో అని వారినందరినీ తేరిపార చూశాడు. ఆయన వైపే చూస్తూ శ్రద్ధగా వింటున్న ఒక తపస్వి లేచి నిలబడ్డాడు. ఏమిటన్నట్లు ప్రశ్నార్థకంగా చూశాడు సూతర్షి.

‘‘గురుదేవా! మహాసాధ్వి సావిత్రి చరిత్ర అద్భుతంగా, పుణ్యప్రదంగా నడిచింది. అంత బాగా చెప్పారు. యమధర్మరాజును వరాలు కోరటంలో కూడా ఆ సుగుణవతి ధర్మాన్నే పాటించింది. ముందుగా ‘‘భర్త ప్రాణాలు కాకుండా ఇంకేదైనా కోరుకో’’ అని సమవర్తి చెప్పినప్పుడు మామగారికి దృష్టిని ప్రసాదించమని వేడుకొంది. యముని దయవల్ల నేత్రాలు వచ్చిన ద్యుమత్సేనుడు, కొడుకు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో ఏమి చేశాడు? వార్ధక్యం వల్ల ఆశ్రమంలోనే



ఉండిపోయాడా? లేక మునులను సంప్రదించాడా? కాక తాను కూడా కర్ర పట్టుకుని అరణ్యానికి బయలుదేరాడా? ఆ తల్లి పరిస్థితి ఏమిటి? సత్యవంతుని మాటలలో వారి పరిస్థితి కొంతవరకు అర్థమైంది. ఒకవేళ వారు కొడుకు రాకపోవడంతో, అడవిలో కొడుకూ, కోడలూ ఏమైపోయారో అన్న దిగులుతో నిజంగా ప్రాణాలు వదలలేదు గదా! అదే జరిగితే సావిత్రి ప్రయత్నమంతా వృథా అయినట్లే. ఇంత ఆందోళన కలిగించిన ఆమె కథ ఇంకా ఇంకా వినాలనిపిస్తోంది. ఆమె తల్లితండ్రులకు పుత్రప్రాప్తి కలిగిందా? ద్యుమత్సేనుడు రాజసింహాసనాన్ని అధిరోహించాడా? ఇవన్నీ వింటేగాని సావిత్రి కథ పూర్తిగా విన్నట్లూ కాదు, అందులోని ధర్మగుణాన్ని తెలుసుకొన్నట్లూ కాదు. మా కుతూహలం మీకర్థమైంది కదా! అక్కడ ఆశ్రమంలో ఏం జరిగిందో చెప్పండి గురుదేవా! సత్యవంతుడు మరణించాడే అన్న బాధతో ఇంతసేపూ విన్నాం. ద్యుమత్సేన దంపతుల ఆవేదన గురించి తెలుసుకోవాలన్న విషయమే మర్చిపోయాము’’ అని

కూర్చున్నాడు ఆ తపస్వి.

"అవును మహర్షీ! సత్యవంతుని తల్లితండ్రుల గురించి చెబుదామని అనుకొంటున్నాను. నీవడగనే అడిగావు. యమధర్మరాజు సావిత్రికిచ్చిన వరం ప్రకారం ద్యుమత్సేనుడికి దృష్టి వచ్చింది. చూపు రాగానే కళ్ళు విప్పార్చి నలువైపులా చూశాడు. అన్ని వస్తువులు, భార్య కనిపించగా తన అదృష్టానికి ఒక్కక్షణం మురిసిపోయాడు ఆ వృద్ధ తపస్వి. అప్పుడే సాయం సమయమవుతోంది. తనకు కళ్ళవంటి కుమారుడు ఎటు చూసినా కనబడలేదు. అడవినుంచి పండ్లు, సమిధలు మొదలైనవి తీసుకొని సత్యవంతుడు ఇంకా ఆశ్రమానికి ఎందుకు రాలేదని చింతించాడు. కొడుకు కోడలితో సహా వెళ్ళాడు. అక్కడ వారికి ఏ ఆపదా రాలేదు కదా? లేకపోతే ఎప్పుడూ లేనిది ఇంత ఆలస్యం ఎందుకైంది? ఏ రాక్షసుల బారి అయినారో? ఏ క్రూరమృగాల పాలపడ్డారో? ఎలా ఉన్నారో? అసలు ఉన్నారో లేదో? రాత్రి పెరిగిపోతోంది. ఇంకా ఇంటికి రాలేదంటే ఏం జరిగిందో ఏమో అని దుఃఖార్తులై ఆ రాజదంపతులు అలమటించారు. ద్యుమత్సేనుడు కళ్ళు వచ్చి కూడా కొడుకును చూడలేకపోయానే అని కళ్ళు లేనివాడిలాగానే విపరీతంగా విలపిస్తూ ఆశ్రమం చుట్టూ తిరగసాగాడు. కొడుకు ఎటునుంచైనా వస్తున్నాడేమో చూద్దామని.

**"కొడుకు నిందును నందు రోయుచు కోరి ప్రేమ భరంబునం**
**గొడుకు సద్గుణ కోటి యెల్లను గోటి భంగుల నోలి ను**
**గ్గడన సేయుచు సత్యవంతునిఁ గానరే మునులార! యే**
**యడవి లోపల నంచు హా సుత! యంచు ధైర్యము డించుచున్"**

**-మహాభారతము – అరణ్యపర్వము – సప్తమాశ్వాసము – ప.270**

రాత్రి ఎంత పొద్దు పోయినా కొడుకు ఇంటికి రానందుకు ద్యుమత్సేనుని బాధ ఇంతా అంతా కాదు. సత్యవంతుని సద్గుణాలనన్నిటినీ పేర్కొంటూ, కొడుకు మీద ఉన్న ప్రేమాధిక్యాన్ని చాటుతూ చుట్టుప్రక్కల ఉన్న ఆశ్రమాలన్నింటికీ వెళ్ళసాగాడు. 'ఏ అడవి లోపలనైనా నా కుమారుని చూశారా? అడవికి వెళ్ళినవాడు ఇంకా తిరిగి రాలేదు. మీరన్ని అడవులూ వెళుతుంటారు గదా!' అని ప్రతి ఒక్క ఋషినీ అడుగుతూ ఎవరినుంచీ సరైన సమాధానం రాకపోయేసరికి ఆ వృద్ధ భూపతి ధైర్యాన్ని కోల్పోయి 'హా పుత్రా! ఏమైపోతివిరా?' అని పనవి పనివి ఏడువసాగాడు. నాకు కళ్ళు కనిపిస్తున్నాయి. కాని ఏమి ప్రయోజనం? నా కొడుకును గుణవంతుని, సుందరాంగుని చూడలేకపోయాను గదా!' అని భార్యతో చెప్పుకుంటూ విలపించసాగాడు. ద్యుమత్సేనుని పరితాపాన్ని చూసిన మునులందరూ అతనిని పొదివి పట్టుకొని అనేక విధాల ఊరడించారు. సాళ్వ భూపతికి నయనాలు వచ్చినందులకు ఆశ్చర్యపడి, "మహారాజా! నీకు అనుకోకుండా దృష్టి వచ్చింది గదా! నీ తపః ఫలమే కారణమనుకో. నీ కొడుకు సుగుణాలే హేతువయ్యాయనుకో. అన్నిటినీ మించి నీ కోడలి పాతివ్రత్యమే మిమ్మల్ని ఆదుకుందనుకో. ఇదంతా ఎందుకు చెబుతున్నామంటే నీకు ఏవిధంగా కళ్ళు వచ్చాయో, అదేవిధంగా నీ కొడుకు కూడా నీ దగ్గరకు అతి త్వరలో వస్తాడు. మా మాట నమ్ము. దుఃఖించకు. నీ దుఃఖం అతనికి శ్రేయస్సు కాదు. నీ ఆశీస్సే అతనిని అన్నివిధాలా రక్షిస్తుంది" అని మునులందరూ వృద్ధ దంపతుల దగ్గరే ఉండి మంచి మాటలు చెబుతున్న సమయంలో సావిత్రితో కూడి సత్యవంతుడక్కడకు రావడంతో అందరూ పరమానంద భరితులైనారు. ద్యుమత్సేనుడు కూర్చున్నవాడు లేచి కొడుకును కౌగిలించుకుని, శిరస్సునాఘ్రాణించాడు. పాదాలకు నమస్కరించిన సత్యవంతుని లేవనెత్తి తల్లి కౌగిలించుకొని చిరంజీవివి కమ్మని ఆశీర్వదించింది. ఆశ్రమ వాసులందరు సంతోషంతో సత్యవంతుని దీవించి వారి వారి నెలవులకు వెళ్ళిపోయారు.

"నాయనా! సత్యవంతా! ఎందుకింత ఆలస్యమైంది? నీవు రాకపోవడంతో మేమంతా ఎంత కంగారు పడ్డామనుకొన్నావు? దారిలో ఏమైనా ఆపద సంభవించిందా?" అని దుఃఖంతో అడుగుతున్న తండ్రిని చూసి సత్యవంతుడు తాను పండ్లు కోయటం దగ్గర నుంచి తననొక బలిష్ఠుడు బంధించినంత వరకు సవిస్తరంగా చెప్పాడు. సావిత్రి వెంటనే తాను కల్పించుకొని తరవాత జరిగిన విషయాలనన్నిటినీ చెప్పసాగింది.

"మామగారూ! నారద మహర్షి మీ పుత్రుడికి ఈనాడు మరణ గండం ఉన్నదని మా తండ్రికి చెబుతుండగా విన్నాను. ఆ మహర్షి వాక్కు అమోఘమని అందరికీ తెలుసు కదా? ఆ మాటలు గుర్తుంచుకొని మీ అనుమతితో మీ కుమారుని వెంట ఈనాడు నేనూ అడవికి వెళ్ళాను. మీ కొడుకు తలనొప్పి భారంతో నిద్రపోతున్న సమయంలో యమధర్మరాజు వచ్చి ఇతని ప్రాణాలు తీసుకొని వెళ్ళిపోతున్నది చూసి, నేను ఆ దిక్కుతి వెంటనే వెళ్ళాను. దైవబలం చేత, నా పతిభక్తి చేత, ఆ దేవుని వెంటనంటి పరుగు పరుగున వెళ్ళగలిగాను. యమధర్మరాజుతో పాటు సమంగా నడుస్తూ ఆ కృపాపరుని వివిధ విధాలుగా స్తుతిస్తూ ప్రార్థించాను. ధర్మపద్ధతిలో, సత్యవిషయంగా నేను చేసిన స్తోత్రాలు ఆ ధర్మమూర్తి హృదయాన్ని కరిగించాయి. నా వినయ విధేయతలకు,

ధర్మబుద్ధికి, పతిభక్తికి, దేవారాధనకు సమవర్తి సంతుష్టుడై నాకు నాలుగు వరాలు ప్రసాదించాడు. ఆ నాలుగింటిలోని ఒక వరం వల్ల నీ తనయుడు ప్రాణవంతుడైనాడు. ఇంకొక వరం వల్ల నీకు దృష్టి వచ్చింది. మరొక వరం వల్ల శత్రురాజుల అధీనంలో ఉన్న రాజ్యం మీకు లభిస్తుంది. వేరొక వరం వల్ల నా తల్లితండ్రులకు సుతశతం కలుగుతుంది. యమధర్మరాజు ఇచ్చిన వరం వల్ల సత్యవంతుడు పునర్జీవితుడై నీ వద్దకు రాగలిగినాడు. అంతదూరం నుంచి ఇంత అర్ధరాత్రి వేళ రావటం వల్ల మేము ఇక్కడకు చాలా ఆలస్యంగా చేరుకొన్నాము. ఇదీ జరిగిన విషయం. ఈ విషయాలేవీ సత్యవంతుడికి కూడా ఇప్పటివరకూ తెలియవు. ముగ్గురికీ ఒకేసారి చెబుదామనుకొన్నాను. నన్ను దీవించండి'' అని అత్తమామల పాదపద్మాలకు నమస్కరించింది. కోడలి పాతివ్రత్యానికి, ఆత్మశక్తికి, ధర్మచింతనకు, సత్యవర్తనకు, వాగ్విధానానికి, సత్యనిరతికి ద్యుమత్సేన మహారాజ దంపతులు పొందిన ఆనందం అంతా ఇంతా కాదు. సావిత్రిని తాము కోడలిగా పొందటం తమ పూర్వజన్మ సుకృతమే అని మురిసిపోయారు. సావిత్రిని చూసి –

**"ఆపత్సముద్ర మగ్నం**
**బై పోయెడు నస్మదన్వయము పెంపొసగం**
**దేపయయి కడవ పెట్టితి;**
**నీ పుణ్య చరిత్ర కీర్తనీయము తల్లీ!"**

**-మహాభారతము – అరణ్యపర్వము – సప్తమాశ్వాసము – ప.274**

''తల్లీ! నీవు మమ్మల్ని ఉద్ధరించటానికే మా గృహంలో అడుగుపెట్టావు. ఆపద అనే సముద్రంలో మునిగిపోతున్న వంశాన్ని తెప్పపై తీరాన్ని చేర్చి వృద్ధిలోకి తెచ్చావు. పవిత్రమైన నీ చరిత్ర ఎంతో ప్రశంసనీయమైనది'' అని అభినందించారు. మునులందరూ సావిత్రి ఏదో చెబుతోందన్న విషయాన్ని కర్ణాకర్ణిగా విని మరల ద్యుమత్సేనుని ఆశ్రమానికి వచ్చి ఆయన ద్వారా పుణ్యవతి అయిన ఆ మహాసాధ్వి సాధించిన అపూర్వ సంగతులను విని సంతోషాత్ములై ఆమెను ఆశీర్వదించి గృహోన్ముఖులైనారు.

సత్యవంతుడు పునర్జీవితుడైనందుకు సర్వులూ ఆనందోత్సాహాలతో కాలం గడుపుతున్న కొద్ది రోజులకు సాళ్వ భూవిభుడైన ద్యుమత్సేనుని పూర్వమంత్రులు, ఆంతరంగికులైన భృత్యులు, ఆయన క్షేమాన్ని ఆకాంక్షించే పెద్దలు – అందరూ కలిసి అరణ్యానికి వచ్చి తమ మహీపతిని చూసి ''ప్రభూ! మీరు వచ్చి సింహాసనాధిష్ఠులై మమ్మల్ని పరిపాలించాలి. శత్రురాజు, ఆత్మీయుల వైరభావం వల్ల వారిలో వారు కొట్టుకొని యుద్ధానికి సిద్ధం కావడంతో ఆ రణంలో మరణించాడు. ఇప్పుడు సాళ్వదేశం రాజులేని రాజ్యంగా అష్టకష్టాలకు నిలయమైంది. ప్రజలందరు మీరే రాజుగా పట్టాభిషిక్తులు కావాలని కోరుకుంటున్నారు. నీ విజయ ఘోష ఇప్పటికే దేశమంతా వ్యాపించింది. నీ కొరకు పట్టపుటేనుగును కూడా తీసుకు వచ్చాము. దానినధిరోహించి రాజధానికి రావలసిందని ప్రార్థిస్తున్నాము'' అని వినయంతో నిలబడ్డారు. యమధర్మరాజిచ్చిన వరం ఇలా పరిణమించిందని సంతోషిస్తూ ద్యుమత్సేనుడు మునులందరినీ వీడ్కొని, భద్రగజాన్ని ఎక్కి, తనవారితో రాజధానికి వెళ్ళి పట్టాభిషిక్తుడైనాడు. సత్యవంతుడికి యౌవరాజ్య పట్టాభిషేకం చేసి మహదైశ్వర్య వంతుడైనాడు'' అని సూత మహర్షి చెప్పి అందరివైపు ఆనందంగా చూశాడు. వెంటనే శౌనకుడు లేచి ''మహాత్మా! అంధుడైన ద్యుమత్సేనుడు దృష్టిని పొంది నృపాలుడు కాగలిగాడంటే నిజంగా ఆశ్చర్యంగా ఉంది. ఆయన చేసిన తపస్సు, సావిత్రి పాతివ్రత్య శక్తి కారణాలు కాకపోతే అలా జరగటం ఎక్కడైనా ఉందా? మృతుడైన వ్యక్తిని బ్రతికించగలగటమంటే మాటలా? ఆమెలో ఎంత ధర్మవర్తన లేకపోతే యమధర్మరాజు వంటి ధర్మమూర్తి ఆమెను అనుగ్రహిస్తాడా? ఈనాడు మేము నిజంగా సావిత్రి చరిత్ర విని ధన్యులమయ్యాము'' అంటూ హర్షం వ్యక్తం చేశాడు. తక్కిన మునులంతా ఔనౌనంటూ గొంతులు కలిపారు. సూతమహర్షి వెంటనే ''అవును మునులారా! మార్కండేయ మహర్షి అన్న మాటలు మరచిపోకూడనివి.

**"తన మగని నత్తమామల**
**జననీ జనకులను దన్ను సకలంబును దా**
**ఘనముగ సముద్ధరించెను!**
**జనవర! సావిత్రి ధర్మచరితము కంటే!"**

**-మహాభారతము – అరణ్యపర్వము – సప్తమాశ్వాసము – ప.279**

''తన భర్తను బ్రతికించుకోవటమే కాదు. అత్తమామలను, తల్లితండ్రులను, తనను, సమస్తాన్ని ఉద్ధరించిన సతీ సావిత్రి చరిత్ర ఎంత గొప్పదో అర్థమైందా ధర్మరాజా! దానికామె ధర్మప్రవర్తనమే కారణము. అటువంటి ధర్మప్రవర్తన గల ద్రౌపది కూడా పాండవులనే కాక కురువంశం మొత్తాన్ని ఉద్ధరిస్తుంది అని చెప్పటానికే ఈ ఉపకథను మార్కండేయ మహర్షి ధర్మరాజుకు చెప్పటం జరిగింది'' అని సూతుడు లేవటంతో ధర్మగుణంలో, ధర్మప్రవర్తనలో ఎంత మహత్తు ఉందో అని సావిత్రి కథలోని వివిధాంశాలను ముచ్చటించుకుంటూ తపస్వులందరూ గురువుగారితో పాటు తమ తమ ఆశ్రమాలకు చేరుకొన్నారు.

❊ ❊ ❊



# రామదూత హనుమ

**- డా. దేవులపల్లి పద్మజ**

మనోజవం మారుతతుల్య వేగమ్ జితేంద్రియమ్ బుద్ధిమతాం వరిష్టం !
వాతాత్మజం వానరయోధ ముఖ్యమ్ శ్రీరామదూతమ్ శిరసా నమామి !!

భక్తి తత్త్వము, వినయ విధేయతలతో కూడిన స్నేహధర్మము, శక్తివంతమైన కార్యదక్షత కలిగియుండి, ఆదికావ్య నిర్మాణమునకు, రామాయణ రూపకల్పనకు ప్రధాన సూత్రధారియైన పవనతనయుడు కారణజన్ముడు. పరాశర సంహిత ప్రకారము వైశాఖ బహుళ దశమి, శనివారం పూర్వాభాద్ర నక్షత్రములో వైధృతి యోగములో, మధ్యాహ్న సమయుములో హనుమంతుని జననం కలిగింది. అంజనాదేవి సంతానం కోసం తపస్సు చేయుచున్న సమయంలో దైవ సంకల్ప ప్రేరేపితుడైన వాయుదేవుని వలన కలిగిన కుమారుడే శ్రీహనుమంతుడు. దక్షిణభారతదేశములో వైశాఖ బహుళ దశమినాడు హనుమంతుని జయంతిని జరుపుకుంటారు.

హనుమంతుడు అపారమైన బలశాలి మరియు శక్తిమంతుడు. పసితనంలోనే తూర్పున ఉదయిస్తున్న సూర్యుని చూసి, ఫలముగా భావించి పట్టుకునేందుకు ప్రయత్నించినాడు. అదే సమయుములో రాహువు సూర్యుని

పట్టుకునే ప్రయత్నం చేయగా, హనుమంతుని చూచి, రాహువు వెనుకకు మరలిపోయెను. ఈ సమయంలో ఇంద్రుడు హనుమపై వజ్రాయుధమును ప్రయోగింపగా, ఆయన దవడకు గాయమయ్యెను. ఈ గాయము కారణముగా హనుమంతుడు పెద్ద మూతిగలవాడుగా మారెను. అందువలనే ఆయనను హనుమంతునిగా భక్తులు పిలుచుకుందురు. వజ్రాయుధ ప్రభావముచే హనుమంతుడు క్రింద పడిపోగా, అలిగిన వాయుదేవుడు గాలిని బంధించి లోకాలను తపింప చేసెను. అప్పుడు ఇంద్రుడు మరియు ఇతర దేవతలు ప్రత్యక్షమై హనుమంతునకు విశేష వరములను ప్రసాదించినారు. ఆనాటినుండి హనుమంతుడు అపార బలశాలిగా మారెను. హనుమను చూసి రాహువు మరలిపోయిన కారణంగా హనుమంతుని ఉపాసన చేయుటవలన రాహుదోషము తొలగునని భక్తుల విశ్వాసము. తనకు గలిగిన అపార శక్తులతో, హనుమంతుడు తపము చేసుకునే మునులను బాధింపసాగాడు. మునులందరు హనుమంతుడు కారణజన్ముడు మరియు శ్రీరామ కార్యార్థిగా జన్మించెనని తమ తపో బలముతో గుర్తించిరి. అందువలన హనుమను ''అపారశక్తి సంపన్నుడవైన నీకు నీ బలము తెలియగుండు గాక, కాని ఎవరైనా గుర్తుచేసినంతనే నీ బలశౌర్యములు నీకు తెలియును గాక'' అని మునులు శపించిరి. అందువలనే హనుమంతుని పొగడిన, అమిత




సంతోషముతో భక్తుల మనోరథము నెరవేర్చును. వివిధ దేవతలు ఇచ్చిన వరప్రభావముతో, ఇంద్రుని వజ్రాయుధము ఎటువంటి ప్రభావము చూపదు. సరస్వతీ వరప్రభావముచే అఖండ జ్ఞానము కలిగెను. సూర్య వరప్రభావనుచే అఖండ తేజస్సు కలిగెను. వేదవేదాంగములను అతి సల్ప సమయములో నేర్చుకొనెను. వాయుదేవుని వరప్రభావముచే అమిత బలము కలిగెను. బ్రహ్మదేవుని వరప్రభావముచే భవిష్యత్ బ్రహ్మగా నియమితుడయ్యెను.

ఋష్యమూక పర్వత ప్రాంతమందు శ్రీరాముడు తన తమ్ముడైన లక్ష్మణునితో కలసి సీతాదేవిని వెదకుచు వచ్చిరి. వారితో హనుమ సంభాషించిన విధము శ్రీరాముని ఎంతగానో ఆనందపరచెను. హనుమంతుని సంభాషణా కౌశలము వ్యాకరణ దోష రహితమై, శుద్ధ వాక్యప్రయోగమై కాన్పట్టును. దేవతలచే అనుగ్రహింపబడినవాడై, రుద్రాంశ సంభూతుడై, అపార శక్తి సంపదలచే, దేవతా కార్యసాధనమునకై ఆవిర్భవించిన తేజోమూర్తి, వజ్రాంగ బలశాలి, సరస్వతీదేవి కటాక్షవర సమన్వితుడు. శ్రీరాముని కార్యసాధనలో ఆయనదే అగ్రస్థానము.

**హనుమాన్ అంజనా సూనుః వాయుపుత్రో మహాబలః !**
**రామేష్టః ఫల్గుణ సఖః పింగాక్షో అమిత విక్రమః !**
**ఉదధి క్రమణశ్చైవ సీతాశోక వినాశకః !**
**లక్ష్మణ ప్రాణదాతాచ దశగ్రీవస్య దర్పహా !!**

అని కీర్తించుచు సమస్త మానవజాతి ఆయనను ఆశ్రయించి, ప్రశాంతతనొంది, సుఖముగా జీవనము సాగించుచున్నారు. హనుమ ఆశీర్వాదము, అనుగ్రహము పొందుటకు బదరికావనంలోని మునులకు నరనారాయణ స్వామి ఈ క్రింది ఉపాసనా మంత్రాన్ని ఉపదేశించెను.

**సప్తకోటి మహామంత్రాః సిధ్యంత్యేవ, న సంశయం !**
**ఆరాధితే కపిశ్రేష్ఠో సమస్త అధిదేవతాః !!**

**....సంహితం పరాశర**

పంచముఖ ఆంజనేయుడుగాను, సువర్చలా సమేతుడుగాను, ఒంటె వాహనముపై నెక్కినట్లుగాను, సీతాలక్ష్మణ భరత శత్రుఘ్న సమేత శ్రీరామచంద్ర పాదసేవకునిగాను, రామక్ష్మణులను తన భుజాలపై నెక్కించుకున్నట్లుగాను ఇంకా అనేక రూపాలలో మనకు ఆంజనేయుని మూర్తులు లభ్యమౌతాయి.

**యత్ర యత్ర రఘునాథ కీర్తనం**
**తత్ర తత్ర కృతమస్తకాంజలిం!**
**బాష్పవారి పరిపూర్ణలోచనం**
**మారుతిం నమత రాక్షసాంతకం !!**

ఎక్కడ శ్రీరామ నామ సంకీర్తన జరుగుతుందో అక్కడ హనుమంతుడు తిష్ఠవేసుకుని కూర్చుంటాడు. ఆయన హృదయఫలకముపై వెలసిన శ్రీసీతారాముల అనుగ్రహము మనకు కలుగుతుంది. ఎంత భక్తి శ్రద్ధలతో మనము హనుమంతుని పూజచేస్తామో, అంతగా ఆంజనేయుని అనుగ్రహము మనకు కలుగుతుందనుటలో ఎటువంటి సందేహము లేదు. సూర్యుని వద్ద నవవ్యాకరణము నేర్చిన హనుమంతుడు సంగీతములో నారదుని, తుంబురుని మించివాడు. జ్యోతిషంలోను, సాముద్రికంలోను అపార జ్ఞానము కలిగి ఇతరుల మనసును చదివే శక్తిసంపన్నుడు. ఈ విషయం సుందరాకాండ చదివిన ప్రతీ ఒక్కరికి అవగతమౌతుంది. అవతారమూర్తులైన సీతారాముల ఎడబాటుసమయంలో, సముద్రమును లంఘించి, లంకకు చేరి, సీతాసాధ్విని కనుగొని శ్రీరామ ముద్రికను సీతాదేవికి, సీతాదేవి ఇచ్చిన చూడామణిని శ్రీరామునకు ఇచ్చి వారిని కలిపిన సంధానకర్త. సముద్రవారధి నిర్మాత, లంకాదహన అజేయుడు. పవనతనయుని ఆశ్రయించినచో సమస్త దుఃఖములు తొలగి, సుఖసంతోషాలు కలుగుతాయి. భార్యాభర్తల మధ్య సయోధ్యకోసం ప్రతీమంగళవారము హనుమంతుని దర్శనము చేసుకుని, సుందరాకాండలోని 15వ మరియు 36వ సర్గలను పారాయణ చేసినచో అద్భుత ఫలితాలు కలిగి ఎడబాటుకు అవకాశం లేనివిధంగా అన్యోన్యత ఏర్పడుతుంది.

రుద్రాంశతో జన్మించిన పవనతనయుడు హరినారాయణుడగు శ్రీరాముని సేవించటంద్వారా, హరిహరులు ఇరువురు వేరుకాదని, ఒక్కరేనని మనకు అవగతమౌతుంది. ''శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయం శివః శివస్య హృదయం రామో రామస్యాహి శివస్తథా!! '' అని శ్రీరాముడు పలికిన మాటలే ఇందుకు ప్రమాణము.

శ్రీరామదూతకు లభించిన అద్భుతమైన వరము మనకు ఆశ్చర్యమును ఆనందమును కలిగిస్తుంది.

**చరిష్యతి కథా యావదేషా లోకే చ మామికా !**
**తావత్తే భవితా కీర్తిః శరీరకప్యసవస్తథా !**
**లోకాహి యావతే స్థాస్యంతి యావత్ స్థాస్యతి మే కథా !**
**ఏకైకస్యోపకారస్య ప్రాణాన్ దాస్యామి తే కపే !!**
**శేషస్యే హోపకారాణాం భవనామ ఋణినోవయమ్ !**
**మదంగే జీర్ణతాం యాతు యత్త్వయోపకృతం కపే !**
**నరః ప్రత్యుపకారాణా మాపత్స్వాయాతి పాత్రతామ్ !!**
**...... (వాల్మీకి రామాయణం)**



''హనుమా! లోకంలో నా కథ నిలిచియున్నంత కాలము నీ కీర్తి జీవనము స్థిరముగా నుండగలవు. ప్రపంచము నిలిచియున్నంతవరకు నా కథ నిలిచియుండును. సూర్యచంద్రుల విధినిర్వహణ జరుగుతున్నంతవరకు నా కథ నిలిచియుండును. నా కథ నిలిచియున్నంతకాలము నీవు నాతోనే వుందువు. అనగా చిరంజీవిగా సంచరించుచు, భవిష్యత్ బ్రహ్మగా బాధ్యతలను చేపట్టుదువు'' అని ఆలింగనము చేసుకుని శ్రీరాముడు హనుమకు వాగ్దానము చేసెను.

రామస్యోపనిషత్తును పరిశీలించినచో హనుమంతుడు ఎంత గొప్ప తత్త్వవేత్తయో తెలియును. హనుమ మన మధ్యనే యున్నాడన్న సత్యమును గ్రహించిన తులసీదాసు మున్నగు మహాభక్తులు హనుమంతుని సాక్షాత్కారము చేసుకున్నారు. మనము హనుమంతుని జీవితము పరిశీలించినచో ఆయన తన కొరకై ఏ కార్యమును చేసికొనడని, ఇతరుల కొరకై అనునిత్యము శ్రమించునని తెలియును. చిరంజీవిగా మనకందరకు అభయమునిచ్చు శ్రీఆంజనేయుని ప్రార్థిద్దాం.

**జైశ్రీరామ్! జై జై శ్రీరామ్!! జై వీరహనుమాన్! జై జై వీరహనుమాన్ !**

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

గత సంచిక తరువాయి

సీతాదేవి పాతివ్రత్యమే ఆమెకు భద్ర కవచం. పైగా ఆమె రామ రక్షణలో ఉంది. సూర్యకాంతిని వేరు చేయలేం. అలా రాముని నుంచి సీతను వేరు చేయలేం. అది అసాధ్యం. సీతంటే ఏమనుకున్నావ్ – ఎగిసిపడే అగ్నిజ్వాల. ఆమెను అపహరించడమే అసాధ్యం. నువ్వు రాముని కంట పడ్డావో – ఆ క్షణమే నీ జీవితానికి ముగింపు. ప్రభూ నా మాట విను. నీది వ్యర్థ ప్రయత్నం. లంకా రాజ్యం ఉంది. ఏలుకో. సుఖించు. నీ మంత్రులున్నారు. తమ్ముడు విభీషణుడున్నాడు. అందరితో ఆలోచించు. గుణదోషాలు లెక్కించు. బలాబలాలు గమనించు. ఏది కీడో ఏది మేలో నిర్ణయించు. రాముని జోలికి పోవద్దు. అతనికి అపకారం చేయవద్దు. అలా ఎన్నిసార్లు అయినా చెబుతాను.

మళ్ళీ చెబుతున్నాడు మారీచుడు. “ప్రభూ నేను యవ్వనంలో ఉన్న రోజులు. ఋషులను చంపేవాణ్ణి. తినేవాణ్ణి. విశ్వామిత్రుడు యజ్ఞం చేస్తున్నాడు. అది భగ్నం చేయాలనుకున్నాను. అపుడు రాముణ్ణి తీసుకొని వచ్చాడు మహర్షి. రాముడు పన్నెండేళ్ళవాడు. అస్త్ర విద్య తెలియనివాడు. యాగరక్షణకు దిగాడు. బాలుడే కదా అనుకొన్నాను. ఒక బాణం వేశాడు. అంతే నూరు యోజనాల అవతల పడ్డాను. అదీ సముద్రంలో పడ్డాను. చాలాకాలానికి స్పృహలోనికి వచ్చాను. అదే రామునికి ఇపుడు పాతికేళ్ళుంటాయి. ఎంతో బలవంతుడై ఉంటాడు. అస్త్రవిద్యా విశారదుడై ఉంటాడు. రాక్షసరాజా! పాపాత్ముల సాహచర్యం చేయకు. చేశావో – పాములున్న మడుగులోని చేపలా చావాలి. సీత కారణంగా రాక్షసులు హతులై పోతారు. ఆ దుస్థితి కళ్ళారా చూడగలవు. నీది బంగారు లంక. రామబాణాలలో దగ్ధమై పోవచ్చు.

రాజా! పర భార్యలను ఆశించరాదు. అది మహాపాపం. నీకు వేలమంది యువతులున్నారు. వాళ్ళతో సుఖించు. నీ వంశాన్ని కాపాడుకో. నీ ఐశ్వర్యాన్ని కాపాడుకో. నీ రాజ్యాన్ని కాపాడుకో. నిన్ను నమ్మిన వారున్నారు. వారితో కలకాలం జీవించు. అంతేకాని రామునికి అపకారం చేయకు. సీతాపహరణం విరమించుకో. నీ మేలు కోరి చెబుతున్నాను.

ప్రభూ నీకు మరో విషయం చెప్పాలి. రామబాణం రుచి చూశాను. చావలేదు బతికాను. అయితే రాముడు అంటే కోపం, పగ. సమయం కోసం కాచుకున్నాను. యాగశాలల్లో పుణ్యతీర్థాల్లో ఋషులు తపస్సు చేసేవారు కొందర్ని

హింసించాను. కొందరిని చంపాను. రక్తం తాగాను. మాంసం తిన్నాను. అలా తిరుగుతూ తిరుగుతూ దండకారణ్యం లోకి వెళ్ళాను. నాతో మరో ఇద్దరు రాక్షసులు వచ్చారు.

‘‘నేను జింకగా మారాను. ఒకచోట రాముణ్ణి చూశాను. సీతాలక్ష్మణుల్ని చూశాను. తాపస వేషంలో ఉన్నాడు రాముడు. హింసించడు కదా అనుకున్నాను. పూర్వ వైరం మనసులో మెదిలింది. కోపం వచ్చింది. బాగా వాడియైన కొమ్ములు నావి. రాముణ్ణి పొడవాలి. చంపాలనుకున్నాను. అతని దగ్గరికి పోయాను. వెంటనే మూడు బాణాలు వేశాడు. అవి వజ్రతుల్యాలు. రక్తం తాగేవి. రామబాణం శక్తి తెలుసు. అందకుండా పరిగెత్తాను. నాతో వచ్చిన వాళ్ళు చచ్చారు. వీపు చూపి పారిపోతే – రామబాణం చంపదు. ఆ విషయం మిగిలిన ఇద్దరికీ తెలియదు. అంతే. ఆనాటి నుంచి మారిపోయాను. ఆశ్రమం కట్టుకున్నాను. తపస్సు చేస్తున్నాను. మనో నిగ్రహంతో ఉన్నాను’’.

**“వృక్షే వృక్షేచ పశ్యామి చీర కృష్ణాజినాంబరమ్ |**
**గృహీత ధనుషం రామం పాశహస్త మివాంతకమ్ ||**

ఏ చెట్టు చూసినా ఏ పుట్ట చూసినా పాశహస్తుడైన యమునిలా కనపడేవాడు రాముడు. అతడెలా ఉన్నాడంటే – చీర కృష్ణాంబరధరుడు కోదండపాణియైన రాముడు – ఒక్కడే అయినా ఎటు చూసినా ఏది చూసినా వందల వేల రాములు కనిపించడం – ఒక్క మాటలో చెప్పాలంటే – అడవి అంతా రామమయం. అంతేకాదు కలలో కూడా కనపడేవాడు. రాముడంటే భయం భయం. రత్నాలు రథాలు– రకారంతో ఉన్న పదాలు వింటే చాలు భయం – గజ గజ వణికిపోతాను.

రావణా! రామ పరాక్రమం తెల్సినవాణ్ణి. నీవు అతనితో పోరాడలేవు. నా మాట విను. సీతాపహరణం మానుకో. ఊరికే ఉండు. బతకాలనుకుంటే – నన్ను చూడాలనుకుంటే – రాముని ప్రస్తావన చేయకు. చెప్పాలనుకున్నది చెప్పాను. ఇక నీ ఇష్టం. నన్ను మాత్రం రొంపిలోకి దింపకు. నేను నీ వెంట రాను’’.

‘‘రాజా నిజం చెబుతున్నాను. శూర్పణఖ ముక్కు చెవులు కోయబడ్డాయి. చెప్పిందా ఆమె. ఆమె కారణంగా ఖరుడు తొందరపడ్డాడు. రామునిపై కాలు దువ్వాడు. దానికి ఫలం అనుభవించాడు. రామునిలో దోషం లేదు. నీ క్షేమం కోరుతున్నాను. నీ బంధువుల హితం కోరుతున్నాను. నా మాట విను. వినకపోయావో సబాంధవంగా నీవు హతమైపోతావు’’.

ఓపిగ్గా విన్నాడు రావణుడు. మారీచుని హితోపదేశం పని చేయలేదు. మూర్ఖుడు రాక్షసేశ్వరుడు. చావు మూడిన



రోగి మందు తీసుకోడు. పరుషంగా పలుకుతున్నాడు లంకేశ్వరుడు.

‘‘మారీచా! నీ ప్రసంగం అనుచితం. చవిటి నేలలో చల్లిన విత్తనాలు నీ మాటలు. రాముడు ఒక మూర్ఖుడు. ఒక మానవమాత్రుడు నన్ను చంపుతాడా? ఒక ఆడదానికి భయపడ్డాడు. వనాలకి వచ్చాడు. వాడు ఖర ఘాతకుడు. వాడికి ప్రియమైంది సీత. నీ కళ్ళముందే ఆమెని అపహరిస్తాను. ఇది నా మనసులోని మాట. నా నిశ్చయం కూడా. ఇంద్రాది దేవతలు నన్ను ఆపలేరు’’.

‘‘సీతాపహరణ విషయం వద్దని నీవు చెబుతావా? నాకు చెప్పగల సాహసానికి శిక్ష ఉంది. గుణదోషాలు నేనడిగితే చెప్పాలి. రాజుని నేను. వినమ్రుడవై చెప్పాలి. నమస్కరించి చెప్పాలి. రాజు ఆలోచనలకు ప్రతికూలంగా చెప్పరాదు. రాజు మీద భక్తి ఉండాలి. శ్రద్ధ ఉండాలి. గౌరవం ఉండాలి. అది లేనివాడు హితోపదేశం చేయరాదు. చేసినా రాజు మెచ్చడు’’.

**ఆదేశం**

‘‘మారీచా! నేను నీ ఇంటికి వచ్చాను. ఒక రాజులా వచ్చాను. నీవు గౌరవించలేదు. అజ్ఞానిలా మాట్లాడావు. పరుషంగా మాట్లాడావు. సీతను ఎత్తుకు రావాలనుకున్నాను. అది మంచిదా చెడ్డదా నాకు క్షేమమా కాదా నిన్ను అడగలేదు. నీ సాయం కోరాను. రాజుగా చెబుతున్నాను. నువ్వు మాట వినాలి. చెప్పింది చేయాలి. జింకగా మారిపో. సీతకు కనిపించు. రాముడు వస్తాడు. దొరకవద్దు. దూరంగా పారిపో.

రాముని గొంతు అనుకరించు. హా సీతా! హా లక్ష్మణా! అని అరుచు. లక్ష్మణుని పొమ్మంటుంది సీత. రామభక్తుడు కదా అన్నకోసం వెళ్తాడు. ఇంద్రుడు లేని సమయంలో శచీదేవిని తెచ్చినట్లు – వైదేహిని ఎత్తుకుపోతాను నేను. నీవు సాయం చెయ్. నా రాజ్యంలో నీకు సగభాగం ఇస్తాను''.

''సౌమ్యుడా! కార్యం సాధించు. జింకవైపో. నేను రథం మీద వస్తాను. యుద్ధంతో పనిలేదు. రాముణ్ణి వంచిస్తాను. సీతను అపహరిస్తాను. నీతో లంక చేర్తాను. నీవు సాయం చేయవా. కార్యం సాధించవా నిన్ను ఇపుడే చంపేస్తాను. నేను రాజుని. రాజుకి ఎదురు తిరిగేవాడు బతకడు. సుఖ పడడు. ఆలోచించుకో. వస్తావా చస్తావా – నీ ఇష్టం''.

**తెలుసుకో**

విన్నాడు మారీచుడు. రాక్షసరాజుని చూశాడు. మరోసారి మంచి చెప్పాలనుకున్నాడు. కాస్త పరుషంగానే పలుకుతున్నాడు. ''నిశాచరా! నీకు ఉపదేశం చేసిందెవరు? నీ కొడుకులు నీ మంత్రులు నాశనమవుతారు. నీవూ హతమవుతావు. అది తెల్సుకోలేకున్నావు. తెల్సుకో. వాడెవడో నీ ముఖాన్ని చూశాడు. సహించలేకపోయాడు. నిన్ను మృత్యుముఖంలోకి పంపుతున్నాడు. ఆ పాపిష్టివాడెవడు? తెల్సుకో. నీ హిత శత్రువు ఎవరు? తెల్సుకో. నిన్ను సర్వనాశనం చేయాలని ఉన్నాడు. తెల్సుకో. తెల్సుకోలేకపోయావో – అది నీ స్వయం కృతాపరాథమే అవుతుంది. సజ్జనుల్ని కాదన్నావు. దుర్జనుల చెంత చేరావు''.

''రాజు నడత గమనించాలి మంత్రులు. చెడు దారి అయితే – మంచి దారిలోకి మళ్ళించాలి. నీ మంత్రులు అలా చేయడం లేదు. రాజు నిరంకుశుడు కారాదు. ప్రజాభీష్టానికి విరుద్ధంగా ప్రవర్తించరాదు. మిట్టపల్లాలు గమనించడు సారథి. అపుడేమవుతుంది? రథం, గుర్రాలు దెబ్బతింటాయి. సారథి పతనమవుతాడు. నక్కతో మేకలకు ఎలా ప్రమాదమో – క్రూరుడైన రాజుతో ప్రజలకు అంతే ప్రమాదం. ఇంత చెప్పినా నీవు తెలుసుకోలేకున్నావు''.

''నన్ను చూస్తాడు రాముడు. వెంటనే చంపేస్తాడు. ఆ వెంటనే నిన్నూ చంపేస్తాడు. నీ చేతుల్లో కన్నా రాముని చేతిలో చావడం మిన్న. అపుడు నేను కృతార్థుడనవుతాను. రామ దర్శనంతో నేను పోతాను. సీతాపహరణంతో నీవు పోతావు. నీ పరివారం పోతుంది. ఒకవేళ మనమిద్దరం కలిసి వెళ్ళామనుకో – నీవు ఉండవు. నేనుండను. రాక్షసులుండరు. లంక ఉండదు.

**''గతాయుషో నరా హితం న గృహ్ణంతి సుహృద్భిరితమ్**

అల్పాయుష్కులు, కాలం తీరినవాళ్ళు – స్నేహితులు చెప్పే హితవచనాలు వినరు. మంధర మాటతో కైకలో దుర్బుద్ధి పుట్టింది. శూర్పణఖ మాటతో రావణునిలో దుర్బుద్ధి పుట్టింది. కాంతా కానకాలే వినాశనానికి కారణం. ఆ సత్యాన్ని నర్మగర్భంగా శ్రీ రామాయణం చెబుతోంది.

ముళ్ళబాటలో నడుస్తాడొకడు. ఆ దారి మంచిది కాదు. ఇటు నడు. ఇది పూలబాట అని చెప్పాలి. చెప్పడం ధర్మం. చెప్పకపోతే పాపం చుట్టుకుంటుంది. దుర్యోధనునికి మంచి చెప్పాడు కృష్ణుడు. వినలేదు. యుద్ధమే కావాలన్నాడు. అది కౌరవసభ. వస్త్రాపహరణ సమయం. ధర్మనిర్ణయం కోరింది ద్రౌపది. భీష్ముడు మాట్లాడలేదు. ద్రోణుడు మిన్నకున్నాడు. గుడ్డిరాజు మౌనం వహించాడు. ముగ్గురూ ధర్మహానికి గురయ్యారు. 58 రోజులు అంపశయ్యపై పడి ఉన్నాడు భీష్ముడు. యుద్ధంలో దారుణంగా చంపబడ్డాడు ద్రోణుడు. దావాగ్నిలో దగ్ధమైనాడు ధృతరాష్ట్రుడు. ఇక్కడ మంచి చెప్పాడు మారీచుడు. పెడచెవిని పెట్టాడు రాక్షసేంద్రుడు.

జీవితంలో చెడిపోతారు కొందరు. ఎలా బాగుపడాలో తర్వాత నేర్చుకుంటారు. పడిపోతారు కొందరు. తర్వాత ఎలా నిలబడాలో నేర్చుకుంటారు. జీవితం ఒక పాఠశాల. నేర్పేవాడు చెబుతూనే ఉంటాడు. ఎంత చెప్పినా ఎన్నిసార్లు చెప్పినా తెల్సుకోరు కొందరు. తెలిసిన మూర్ఖుడు రావణుడు. తెలియని మూర్ఖుడు దుర్యోధనుడు అన్నారు పెద్దలు.

**మాయలేడి**

రాక్షసరాజుకి భయపడ్డాడు మారీచుడు. దుఃఖించాడు. చూశాడు రావణుని.

**కిం ను శక్యం మయా కర్తుమ్ ఏవం త్వయి దురాత్మని ।**
**ఏషగచ్ఛామ్యహం తాత । స్వస్తి తేస్తు నిశాచర ।।**

''రాజా నీవు దురాత్ముడవు. నీ అధీనంలోని వాణ్ణి. ఏం చేసేది? ఇదో వస్తున్నా. నీకు మేలు కలుగు గాక''.

మారీచుడు రథమెక్కాడు. అది విమానం లాంటి రథం. కదిలింది. పట్టణాలు పర్వతాలు దాటింది. వనాలు నదులు దాటింది. దండకారణ్యం చేరింది. దిగారు ఉభయులు. 'అదో ఆశ్రమం మనం వచ్చని పని కానివ్వు' – అని రావణుని ఆదేశం.

జింకగా మారాడు మారీచుడు. అది అద్భుతంగా ఉంది. దాని కొమ్ములు ఇంద్రనీలమణులు. ఒక పెదవి ఎర్ర తామర. ఇంకో పెదవి నల్ల కలువ. నిగనిగలాడే నల్లతామరల్లా చెవులు. మల్లెపువ్వులా పొట్ట. నెమలి రంగులో పార్శ్వ భాగాలు. వైడూర్యాల్లా గిట్టలు. ఇంద్రధనుస్సులా తోక. వెండిలా తెల్లటి చుక్కల శరీరం.

గంతులేస్తోంది లేడి. సీతమ్మకి కనపడేలా తిరుగుతోంది.



అడవిలోని జింకలు చూశాయి. మాయలేడిని చూశాయి. వాసన చూశాయి. భయపడ్డాయి. పారిపోయాయి.

వైదేహి వచ్చింది. పూలు కోస్తోంది. చూసింది జింకను. కనులు పెద్దవి చేసింది. నిశితంగా చూసింది. ఆశ్చర్యపోయింది. 13 ఏళ్ళ వనవాసం – ఎప్పుడూ ఎక్కడా అలాంటి జింకను చూడలేదు.

**కోరిక**

'ఆయుధాలతో రండి' – పిలిచింది రామలక్ష్మణుల్ని. వచ్చారు అన్నదమ్ములు. చూశారు జింకను. చూసీ చూడగానే అంటున్నాడు లక్ష్మణస్వామి. ''అన్నా ఇది నిజమైన జింక కాదు. రాక్షసుడే. మారీచుడే. వాడు కామరూపి. మాయలమారి. జింక రూపంలో వచ్చాడు. జగన్నాథా! రామా! ఇలాంటి జింక జగత్తులో ఉండదు. సందేహం లేదు. ఒకప్పుడు వేటాడే రాజుల్ని చంపేవాడు. వాళ్ళ మాంసం తినేవాడు...'' ఇంకేదో చెప్పబోయాడు. అడ్డుపడింది సీత.

''ఆర్యపుత్రా! ఈ జింక నా మనసు దోచింది. దాన్ని తీసుకురా. ఇది మనకు క్రీడా మృగమవుతుంది. త్వరలో వనవాసం పూర్తవుతుంది. అయోధ్యకు వెడదాం. మన అంతఃపురానికి అలంకారమవుతుంది. అత్తయ్యలు భరత శత్రుఘ్నులు ఆశ్చర్యపోతారు. అది ప్రాణాలతో పట్టుబడకపోతే దాని చర్మం తీసుకురా. ఆసనంగా పనికి వస్తుంది. మనమిద్దరం కూర్చోవచ్చు.

**"కామవృత్తమిదం రౌద్ర స్త్రీణామ్ అసదృశం మతమ్"**

అది ఘోర కార్యం. ఆ పని చేసిపెట్టు అని భర్తల్ని పురికొల్పడం స్త్రీలకు తగదు. కానీ నన్ను జింక ఆకర్షిస్తోంది. విస్మయపరుస్తోంది. ఏం చేసేది? అంది సీతమ్మ.

విన్నాడు రాముడు. అంటున్నాడు లక్ష్మణునితో ''లోకంలో రెండే మృగాలున్నాయి. ఒకటి ఆకాశంలో తారామృగం (మృగశిర నక్షత్రం), రెండోది భూమిమీది ఈ కాంచనమృగం. రాజులు జింకల్ని వేటాడుతారు. చంపుతారు. ఇది రాక్షస మాయ అన్నావు. వాడు మారీచుడైతే – వాడు దుర్మార్గుడు. అగస్త్యుడు వాతాపిని అంతం చేశాడు. నేను వీణ్ణి హతమారుస్తాను. సౌమిత్రీ! ధనుర్బాణాలతో సిద్ధంగా ఉండు. మైథిలికి రక్షకునిగా ఉండు. జటాయువు

బలశాలి. సమర్థుడు. అతణ్ణి తోడు తెచ్చుకో. అనుక్షణం అప్రమత్తుడవై ఉండు. ఈ జింకను సజీవంగానైనా చంపి అయినా తెస్తాను. రఘునందనుడు ఖడ్గం తీసుకున్నాడు. నడుముకు కట్టుకున్నాడు. ధనుర్బాణాలు ధరించాడు. రెండు తూణీరాలు ధరించాడు. జింక వెంట పడ్డాడు.

**కనక మృగము భువిని కలదు లేదనుకను**
**తరుణి విడిచిపోయె దాశరథియు**
**తెలివి లేనివాడు దేవుడెట్లాయెరా**

అది వేమన పద్యం. బాగా ఆలోచిస్తే – అది వేమన రాసింది కాదు. తమ్మునితో చర్చించాడు రాముడు. మాయలేడి – మంచిచెడ్డలు తర్కించాడు. అది మారీచుడైతే చంపేస్తాను. జింకనో జింక చర్మమో తెస్తాను. సీతను రక్షిస్తూ ఉండు – అని లక్ష్మణునికి జాగ్రత్తలు చెప్పాడు. సీతను ఒంటరిగా విడిపోలేదు రాముడు. దమయంతిని నలుడు విడిచిపోయాడు. అలా పోలేదు రాముడు. ఎవడో ఆ పద్యం రాశారు. వేమన శైలి అనుకరించాడు.

**మాయలేడి వెంట**

రాముణ్ణిచూశాడుమారీచుడు.మోసగించాలనుకున్నాడు. మాయమైనాడు. మళ్ళీ కనిపించాడు. వేగంగా పరిగెత్తాడు. వెంట పడ్డాడు రాముడు. దొరికినట్లే దొరికి తప్పించుకుంది జింక. ఒక క్షణం దగ్గరలో – మరోక్షణం దూరంలో తళుక్కుమంటుంది. ఆశ్రమం పరిసరాలు దాటింది. అడవి దారి పట్టింది. దూరంగా లాక్కెళ్ళింది రాముణ్ణి.

అది వంచిస్తోంది. గ్రహించాడు రాముడు. వెర్రి ఎత్తిస్తోంది. తెల్సుకున్నాడు. క్రుద్ధుడైనాడు. అలసిపోయాడు. చెట్టునీడన నిలుచున్నాడు. అది జింకల్లో కలిసిపోయింది. కాసేపటికి కనపడలేదు. అంతలో చెట్ల చాటునుంచి వచ్చింది. ఇంక పట్టుకోవడం కుదరదు. చంపాలి. నిశ్చయానికి వచ్చాడు రాముడు.

బాణం తీశాడు. అది బ్రహ్మ నిర్మితమైంది. మహాస్త్రం. అది సూర్యకిరణ కాంతి సదృశం. దాన్ని సంధించాడు. నారి సారించాడు. ప్రయోగించాడు. బుసలు కొట్టే పాములా ఉంది. నిప్పులు కక్కుతోంది. దూసుకుపోయింది. మృగరూపాన్ని ఛేదించింది. మాయరూపం విడిచాడు మారీచుడు. తాటి చెట్టంత ఎత్తున్నాడు. భయంకరంగా అరిచాడు. కిందపడ్డాడు. సీతను ఒంటరిదాన్ని చేయాలి. అది రావణుని మాట. గుర్తొచ్చింది. రాముని కంఠం అనుకరించాడు. హా సీతా, హా లక్ష్మణా – ఆర్తనాదం చేశాడు. ప్రాణాలు విడిచాడు.

చూశాడు రాముడు. మారీచుని మాయ – లక్ష్మణుని మాట గుర్తుకొచ్చింది. ప్రమాదం పసికట్టాడు. మనసు మైథిలి మీదకు పోయింది. సీత ఏమవుతుందో? లక్ష్మణుని స్థితి ఏమిటో – ఒళ్ళు గగుర్పొడిచింది. రోమాలు నిక్కబొడిచాయి. దిగులు చెందాడు. భయపడ్డాడు. మరొక మృగాన్ని చంపాడు. దాని మాంసం తీసుకున్నాడు. ఆశ్రమం వైపు నడిచాడు.

దుర్మార్గుడు రావణుడు. వాడి చేత చావాలనుకోలేదు. ధర్మాత్ముడు రాముడు. ఆ మహాత్ముని చేతిలో చావాలనుకున్నాడు. మృత్యువుని ఆహ్వానించాడు. అయితే రామలక్ష్మణులు ఉభయులు వస్తారనుకున్నాడు. లక్ష్మణుడు రాలేదు. అంటే సీతకు రక్షకునిగా ఉన్నాడేమో. స్వామి భక్తి ప్రకటించాడు. చస్తూ చస్తూ రాముని గొంతు అనుకరించాడు. అది దైవ సంకల్పం. ఆ కేక రామావతార ప్రయోజనకారి. అది మారీచుని గొంతు. అది తెల్సు లక్ష్మణునికి. విధి బలీయం.



జీవితం కూడా అంతే. మాయ లేడి లాంటిదే. ఏదేదో పొందాలి. ఎన్నో సుఖాలనుభవించాలి. ఆస్తిపాస్తులు సంపాదించాలి. అలా మభ్యపెడుతుంది. కవ్విస్తుంది. ఆకర్షిస్తుంది. అది ఎండమావి అని తెలియదు. పరుగులు తీస్తాం. ఆశపడతాం. మోసపోతాం. ఏడుస్తాం. అయినవాళ్ళుంటారు. ఒక్కరూ ఆదుకోరు. ఏదో పట్టుకోవాలి. పిడికిలి బిగిస్తాం. పుడతాం. పోయేటపుడు బిగిసిన పిడికిలి పట్టు కోల్పోతుంది. వట్టి చేతులతో పోతాం. జీవితం ఒక ఆట. ఒక భ్రమ. దానికి లోను కారాదు. అంటే నేనెవరో తెల్సుకోవాలి. పరమాత్మ సొత్తు అని తెల్సుకోవాలి. ఆ స్వామిని చేరాలి. అదే మన గమ్యం. అదే మన లక్ష్యం.

**(సశేషం)**

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

సేకరణ : కె.వి.రాఘవాచార్యులు

గత సంచిక తరువాయి

## 201. అతికాయ శిరశ్ఛేత్రే నమః

అతికాయుడు రావణాసురుని కుమారుడు. పుట్టుకతోనే అతి బలవంతుడు. శివుని సేవించి సమస్త విద్యలు అభ్యసించినాడు. శివుని వలన పాశుపతాస్త్రం పొందినాడు. తపస్సు చేసి బ్రహ్మ వలన అవధ్య కవచమును పొందినాడు.

రావ రావణ యుద్ధంలో అతికాయుడు ఘోర యుద్ధం చేయగా వానిని లక్ష్మణుడు బ్రహ్మాస్త్రముతో సంహరించినాడు.

అతికాయుని సంహరించిన అనంతుని అవతారమగు లక్ష్మణుని సోదరుడు, ప్రభువు అగు రామునిగ అవతరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 202. కుంభకర్ణ విభేదనాయ నమః


కుంభకర్ణుడు రావణుని సోదరుడు. రావణ కుంభకర్ణులు సనక సనందాదుల శాపముచే రాక్షసులుగా జన్మించిన విష్ణుదేవుని ద్వారపాలకుడు జయ విజయులు.

కుంభకర్ణుడు బ్రహ్మను గూర్చి ఘోరమైన తపస్సు చేసినాడు. బ్రహ్మ ప్రత్యక్షమైనాడు. కుంభకర్ణుడు వరము కోరుకొను సమయమున దేవతల ప్రార్థనచే సరస్వతీదేవి ఇతని నాలుకపై ప్రవేశించినది. దానితో కుంభకర్ణుడు 'నిర్దేవతం' అను వరము కోరుకోదలచి సరస్వతి ప్రభావముచే 'నిద్రావత్వం' అని కోరినాడు. బ్రహ్మ ఆ వరమును ప్రసాదించి అదృశ్యుడయినాడు.

ఈ వరము కారణముగా కుంభకర్ణుడు ఆరు నెలలు నిద్రపోయి ఆరు నెలలు మేల్కొని ఉంటాడు. అయితే నిద్రాభంగాము కలిగినపుడు మరణము కలుగునను నియమము కలదు. రావ రావణ యుద్ధము జరుగుచున్నపుడు ముఖ్యవీరులు యుద్ధములో చనిపోగా గత్యంతరము లేక రావణుడు కుంభకర్ణునికి నిద్రాభంగము చేసి లేపి యుద్ధమునకు పంపినాడు. యుద్ధములో లక్ష్మణ సుగ్రీవులు కుంభకర్ణుని జయింపలేకపోయినారు. అంత రాముడు కుంభకర్ణుని ఎదుర్కొని దివ్యాస్త్రములతో వానిని సంహరించినాడు. కుంభకర్ణుడు రాక్షసుడైనను సజ్జనుడు. రావణుడు మంత్రాంగము జరుపకుండా సీతను అపహరించుట దోషమని సభలో ప్రకటించినాడు. అయినా సోదర భావంతో రావణుని వైపున నిలిచి యుద్ధం చేసినాడు.

కుంభకర్ణుని యుద్ధములో సంహరించిన రామునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చావతారమగు వేంకటేశునకు నమస్కారము.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

## 203. దశ కంఠో శిరో ధ్వంసినే నమః

పది కంఠములు గల రావణుని యుద్ధములో రాముడు సంహరించినాడు.

రావణాసురుడు లంకాధిపతి. తండ్రి విశ్రవసుడు. తల్లి కైకసి. రావణుని భార్య మయుని కూతురు మండోదరి. సోదరులు కుంభకర్ణ విభీషణులు. రావణునికి పది తలలు ఉండుట చేత దశకంఠుడు, దశగ్రీవుడు అను నామాంతరములు కలిగినవి. రావణుడు తీవ్రమైన, ఘోరమైన తపస్సు చేసి మానవులతో తప్ప ఇతరులచే మరణము లేకుండా వరము పొందినాడు. బలగర్వితుడు. సాధువులను, ఋషులను హింసించినాడు.

రావణుడు నలకూబరుని భార్య రంభను బలాత్కరించగా ఇష్టపడని స్త్రీని తాకినచో రావణుని తలలు నేల పడతాయి అని నలకూబరుడు శపిస్తాడు.

రాముడు సీతా లక్ష్మణులతో కలిసి పంచవటి ఆశ్రమంలో ఉండగా శూర్పణఖ రాముని వరించి. వివాహమాడుమని కోరగా లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులు కోసి విరూపిని చేసి పంపినాడు. అంత శూర్పణఖ రాముడు చేసిన అవమానాన్ని గూర్చి అన్న యగు రావణునికి చెప్పి రాముని భార్య సీత సౌందర్యమును ప్రశంసించింది. అంత రావణుడు పంచవటికి వచ్చి మారీచుని సహాయముతో రామలక్ష్మణులు కుటీరము నుండి దూరముగ పోవునట్లు చేసి, సన్యాసి వేషమున రాముని కుటీరమును చేరి భిక్ష అడుగుతాడు. నిజము తెలియని సీత లక్ష్మణ రేఖను దాటి రాగా ఆమెకు నిజ స్వరూపము చూపిస్తాడు. సీత మూర్ఛపోవగా ఆమెను అపహరించి, ఆమెను తీసుకొని వచ్చి అశోక వనమున బంధిస్తాడు.

శ్రీరాముడు లక్ష్మణుడు సీతను వెదకుతూ వచ్చి సుగ్రీవునితో స్నేహము చేసి, హనుమంతుని ద్వారా సీత లంకలో క్షేమమగా నిర్బంధములో నున్నదని తెలియగా రాముడు సుగ్రీవ అంగద హనుమదాది వానరులతో దక్షిణ సముద్రము చేరి వారధి నిర్మించి లంకకు వానరసేనతో చేరుతాడు. అంగద రాయబారము విఫలము కాగా రామ రావణ యుద్ధం జరుగుతుంది. రావణునిచే దేశ బహిష్కారమునకు గురి అయిన విభీషణుడు అన్నను వదిలిపెట్టి రాముని వద్దకు వచ్చి శరణము కోరుతాడు. రాముడు అభయమిచ్చినాడు. రావణుని మరణానంతరం విభీషణుని రాజుగా పట్టాభిషిక్తుని చేసినాడు. రామ రావణ యుద్ధములో రాముడు బాణప్రయోగంతో రావణుని పది తలలు ఖండించినను రావణుడు విగత జీవుడు కాలేదు. ఆ సమయమున విభీషణుడు రావణుని ఉదరములో నున్న అమృత భాండము గురించి చెప్పగా రాముడు మరునాటి యుద్ధములో రావణుని కడుపులో నున్న అమృత భాండమును బాణ ప్రయోగముతో పగులగొట్టి రావణుని సంహరించినాడు. ఇట్లు రావణుడు బలహీనులని తలంచిన మానవుని చేతనే సంహరింపబడినాడు. కాలధర్మము అందరికీ అనుల్లంఘనీయము కదా.

రాముడు విభీషణుని సహాయముతో రావణుని సంహరించి సీతను బంధవిముక్తిని చేసి విభీషణుని లంకా రాజ్యమునకు అధిపతిగా చేసి, సీతతో, లక్ష్మణునితో అయోధ్య చేరినాడు. ఇంతకు మందే రాముని వనవాస కాలము 14 సంవత్సరములు ముగిసింది. ఇట్లు రాముడు పితృవాక్య పరిపాలన చేసి భార్యయగు సీతను చెర నుండి రక్షించి ఆమెతో అయోధ్య చేరి రాజ్యాభిషిక్తుడై రాజ్యపాలన చేసినాడు. రామరాజ్యము ఆదర్శనీయ పాలనగా ప్రసిద్ధి పొందింది.

దశకంఠుడైన రావణాసురుని సంహరించిన రామునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

మే 2023

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ..



తెలంగాణలో మరో తిరుపతిగ
తన 'హరినామక్షేత్రము'ను
ఏర్పాటు చేయుటకై
తిరుమల శ్రీవేంకటేశ్వరుని
లీలల ధారావాహికం

**2వ భాగం**







# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ.. నా దశ!

## 2వ భాగము

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామక్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీవేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

పుల్లగూర్ల సాయిరెడ్డి
(గోవింద దాసు)



## లక్ష్యం

తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు తన భక్తుల ఉద్ధరణనే లక్ష్యంగా చేసుకొని గతంలో ఎన్నో ప్రాంతాలలో వెలసి ఆయా ప్రాంతపు భక్తులను అనుగ్రహించుచున్నారు. రాబోవు కాలంలో సిద్ధిపేటకు 7 కి.మీల దూరంలో ఉన్న మా సొంత గ్రామమైన చిన్నగుండవెల్లిలోని మా తోటబావి వద్ద వెలసి ఆ ప్రాంతపు భక్తులను అనుగ్రహించదలచుకున్నాడు. అక్కడ మరో తిరుపతిని ఏర్పాటు చేయాలనుకున్నారు. దాదాపు తిరుమలతో సమానమైన ఆకర్షణ కలిగి అదే విధంగా భక్తులను ఆకర్షించుచూ అనుగ్రహించదలచుకున్నారు. ముఖ్యంగా భక్తులు ఈ క్షేత్రంలో స్వామివారిని అత్యంత సులభంగా పొందగలరు అనే విశ్వాసాన్ని భక్తులలో కల్పించదలచుకున్నారు. మరియు తిరుమల లాంటి ఒక పవిత్రమైన స్వామి క్షేత్రాన్ని సాధించుటలో ఆసక్తి గల భక్తులకు వారి సేవలను తపస్సులను వినియోగించుకునే ఒక అపూర్వ అవకాశాన్ని నేడు భూమిపై జీవించుచున్న భక్తులకు ఇవ్వదలచి ఈ క్షేత్రాన్ని ఎన్నుకున్నారని భావించుచున్నాను. ఈ క్షేత్రం తిరుమల ఆలయ ప్రతిరూపంగా కనీసం రెండు ప్రాకారాల వరకైనా నిర్మించాలని తిరుమలలోని సాంప్రదాయమైన వైఖానసమునే ఏర్పరచాలని మరియు ఇక్కడ వివిధ భక్త బృందాలచే వంతుల వారిగ అఖండ హరినామ స్మరణ జరగాలనే కోరికను కూడా వెలిబుచ్చారు. ఇక్కడ స్వామివారిని దర్శించుకునే భక్తులకు తిరుమల శ్రీ వేంకటేశ్వరున్ని దర్శించుకున్న అనుభూతి కలగాలన్నది స్వామివారి అభిమతం.

దీనిని సాధించుటకు ఒక పనిముట్టులాగా నన్ను ఎన్నుకొని కావలసిన శిక్షణను ఇచ్చుటలో స్వామివారు చూపిన లీలలే ఈ అనుభూతులు. శ్రీ వేంకటేశ్వరుడు భక్తవత్సలుడు, భక్తప్రియుడు. ఆర్తితో పిలిస్తే మన ఇంటికి రాగలడనే నిజమును లోకానికి మరోమారు తెలుపదలచుకున్నారు.

పూర్వం భద్రాచలం ఏర్పాటుకు కారణమైన భద్రునిలాగా, యాదగిరిగుట్ట ఏర్పాటుకు కారణమైన ఋషి యాదగిరిలాగ సాధన చేసి యోగ్యతను పెంచుకొని శ్రీ వేంకటేశ్వరున్ని పొంది చిన్నగుండవెల్లిలో హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయమన్నారు. యోగ్యతను సాధించుటకు కావలసిన శిక్షణ సం|| 2000 నుండి మొదలై నేటికి కొనసాగుచున్నది.

## యోగ్యత సాధించుటకు సేవలను ప్రసాదించుట :

యోగ్యత సాధించుటకు తన సేవా వృక్షాన్నే ప్రసాదించారు. స్వామివారు ప్రసాదించిన సేవలను అత్యంత సమర్థవంతంగా చేయుచు, కావలసిన యోగ్యతను సాధించుట నా కర్తవ్యంగా దిశానిర్దేశం చేసారు. స్వామి వారి కొన్ని లీలలు ద్రాక్షా పాకం లాగ కాకుండా నారికేళ పాకంలాగ ఉండేవి. కొన్ని స్వామివారి లీలలు అర్థం పర్థం లేనివాటిగ, అసలు ఎందుకు కల్పించుచున్నారో తెలిసేది కాదు. కాని సమయం గడిచిన తరువాత వాటి అంతరార్థం బహు చక్కగా తెలిసేది. మేము స్వామివారి లీలలను సం॥ 2000 నుండి పొందుచున్నప్పటికీ, మాలో కొంత యోగ్యత సిద్ధించిన తరువాత సం॥ 2022 ఏప్రిల్ లో మాత్రమే తన అసలు లక్ష్యమును తెలిపారు.

నాకు ప్రసాదించిన సేవలను ఉపయోగించుకొని తగిన యోగ్యతను సాధించమన్నారు. ఉదా :- ఒక ఐ.ఎ.ఎస్ పట్టా పొందాలంటే ముందు ఒక డిగ్రీ చదవాలి. ప్రిలిమినరీ, మెయిన్ లో పాస్ అయిన తరువాత ఇంటర్వ్యూలో నెగ్గితేనే ఒక వ్యక్తి ఐ.ఎ.ఎస్ సాధించగలడు. ఇక్కడ డిగ్రీ, ప్రిలిమినరీ, మెయిన్ లకు మాత్రమే చదవాలి. ఇంటర్వ్యూకు మాత్రం, వ్యక్తి యోగ్యతతో పాస్ కావలసి ఉంటుంది. ఈ యోగ్యతకు మనం చదివిన విషయ పరిజ్ఞానమే కాకుండ, లోకంలోని ఇతర విషయాలను కూడ తెలుసుకోవాలి. ఇదే విధంగ స్వామి ప్రసాదించిన సేవలను చదవదగిన విద్యలనుకుంటే అన్య విషయ సేకరణ మాత్రం నా వ్యక్తిగత సాధన ద్వారా సాధ్యమవుతుంది. స్వామివారు సూచించిన నియమాలను, అంటే వ్యాపారం, మిత్రులతో కాలక్షేపం వంటి వాటికి దూరంగా ఉంటూ, ప్రతిక్షణం స్వామినే స్మరిస్తూ, విషయ వాసనలను మరియు 'నా' అన్నదానిని సంపూర్ణంగ వదలి, స్వామి పట్ల అత్యంత వ్యామోహమును ఏర్పరచుకోవాలి. అప్పుడే స్వామివారు ఆశించిన యోగ్యత సాధ్యమవుతుంది. దీనిని సాధించుట నా కర్తవ్యంగ దిశా నిర్దేశం చేశాడు. దీనిని సాధించుటకే వేలకు పైగా అనుభూతుల రూపంలో దిశా నిర్దేశం చేశాడు. ఎలాగైన లక్ష్యాన్ని ఛేదించమన్నారు. జీవితానికి పొడిగింపును ప్రసాదించి, కనీసం ఈ పొడిగించిన జీవితంలోనైన దీనిని సాధించమన్నారు. కఠిన శిక్షణ ఇచ్చుచున్నారు.

### అనుభూతుల వివరాలు :

**ఈ భాగంలో స్వామివారి అత్యంత ప్రభావవంతమైన లీలలను క్లుప్తంగా తెలుపుచున్నాను. ఒక చెరువు నీటిని బావి వరకే పరిమితం చేయటం ఎంత కష్టమో స్వామి ప్రసాదించిన వందల అనుభూతులను ఒక భాగంలో తెలుపుట అంతే కష్టం. మేము కొన్నివేల అనుభూతులను చూచినప్పటికీ 700కు పైగా అనుభూతులను ఒక ఆరు పుస్తకములలో వ్రాశాము. తేది 18-08-2009 నుండి 24-02-2011 వరకు తప్ప మిగిలినవి కొన్ని జిరాక్స్ రూపంలో, కొన్ని ఒరిజినల్స్ గా ఈ క్రింది విధంగా ఉన్నవి.**

### సంవత్సరం 2002 నుండి 31-03-2023 వరకు నేను, నా భార్య పొందిన అనుభూతుల వివరాలు

| బుక్ నెం. | కాలము | లభ్యత | సురేఖ | సాయిరెడ్డి | మొత్తం అనుభూతులు |
|---|---|---|---|---|---|
| 1, | ఏప్రిల్ 2000 నుండి 05-01-2005 వరకు | జిరాక్స్ | 5 | 95 | 100 |
| 2. | 06-01-2005 నుండి 11-11-2008 వరకు | జిరాక్స్ | 19 | 105 | 124 |
| 3. | 12-11-2008 నుండి 17-08-2009 వరకు (కొంత భాగము మాత్రమే) | ఒరిజినల్ | 2 | 13 | 15 |
| 4 | 18-08-2009 నుండి 24-02-2011 వరకు | లభించలేదు (గుర్తున్నవి) | - | 4 | 4 |
| 5. | 25-02-2011 నుండి 28-03-2016 వరకు | ఒరిజినల్స్ | 14 | 91 | 105 |
| 6. | 04-01-2017 నుండి 30-03-2023 వరకు | ఒరిజినల్స్ | 18 | 185 | 203 |
| | మొత్తం | | 58 | 493 | 551 |

## బాల్యం నుండి స్వామి దిశా నిర్దేశం :

చిన్నప్పటి నుండి నాకు శ్రీవేంకటేశ్వరుడంటే అమితమైన ఇష్టం. నేను 2వ తరగతి చదువుచున్నప్పటి నుండి ప్రతి పూజలో ''నాచే లోకానికి ఉపయోగపడే ఏదేని మంచి పనిని చేయించమని'' ప్రార్థించేవాడిని. ఊరిలో మాకు తగినంత భూమి ఉన్నప్పటికీ, నీరు లేక పంటలు పండక అత్యంత దీనావస్థలో బాల్యం గడిచింది. సిద్ధిపేటలో 1979 లో ఇంటర్ పూర్తైన తరువాత ప్రయత్నించినప్పటికీ ఇంజనీరింగ్ లో సీటు లభించనందున, మా ఊరిలోనే వ్యవసాయము చేయుచు, సిద్ధిపేటలో బి.ఎస్సీ రెండవ సంవత్సరము వరకు చదివాను. ఆ తరువాత 1981లో ఉస్మానియా విశ్వవిద్యాలయం కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్ లో సీటు లభించింది. ఈ రెండు సంవత్సరాలు ఊరిలో వ్యవసాయము చేయుట వలన అక్కడి ఆర్థిక పరిస్థితి చాలా బాగ అర్థం చేసుకున్నాను. ఇంజనీరింగ్ చేసినప్పటికి, ఉద్యోగము చేయక వ్యాపారము చేసి డబ్బు సంపాదించి మా కుటుంబమును ఉన్నత స్థితికి తీసుకురావాలనే బీజం అప్పుడే పడింది.

ఊరిలోని ఇల్లు మా తల్లితండ్రుల స్వార్జితము. చాలా చక్కగా, సౌకర్యవంతంగా ఉంటుంది. కాని మమ్మల్ని ఆర్థికంగా చాల ఇబ్బంది కలిగించిందనే కసి చేత 1999 సంవత్సరంలో దీనిని అమ్మి క్రొత్త ఇల్లును నిర్మించుకున్నాము. ఆ తరువాత సంవత్సరం 2000 నుండి స్వామి లీలలు ప్రారంభమైనాయి. ముఖ్యంగా ఈ ఇల్లును ఉపయోగించుకుని ఒక 50 కి పైగ అనుభూతులను చూపాడు. ప్రతిసారి మా ఇల్లు అంటే ఇదే ఇల్లని అర్థం.

నాకు వ్యాపారంలో, నా భార్యకు కుటుంబము పైన ఎక్కువ ఇష్టాలు ఉండేవి. వీటిలో వచ్చిన చిక్కులను తీర్చే క్రమంలో శ్రీవేంకటేశ్వరుడు మాకు అత్యంత సన్నిహితుడైనాడు. ఆ తరువాత ఆయా సమయాలలోని మా మానసిక స్థితికి అనుగుణంగ సామ దాన భేద దండోపాయాలను ఉపయోగించి తన దారికి తెచ్చుకున్నాడు.

## స్వామివారి ప్రభావవంతమైన లీలలు :

ఏప్రిల్ 2000 – ఏప్రిల్ 2002 :- నా విద్యాభ్యాసం తరువాత మా కుటుంబంతో పాటు హైదరాబాద్‌లో నివసించుచు కన్‌స్ట్రక్షన్ రంగములో బిల్డరుగా వ్యాపారము చేసుకొనుచున్నాను. అనుకోకుండా ఒకనాటి కలలో శ్రీ ఆంజనేయస్వామివారు మా చిన్నగుండవెల్లి ఊరిలోని మా తోట బావి వద్ద జై శ్రీరాం అంటూ పైకెగురుటతో స్వామి లీలలకు శ్రీకారం చుట్టాడు. ఆ తరువాత లీలలో స్వామివారు నా హృదయంలో 'భక్తి' బీజాలను నాటారు. భవిష్యత్‌లో నా జీవితంలో ఎన్నో కష్టాలు రాగలవని భయపడవలదని తాను రక్షించుదునని అభయం కూడా ఇచ్చారు.

మొట్టమొదటి నా స్వామి అనుభూతి మరువలేనిది. ఒక రాత్రి నేను హైదరాబాద్‌లోని మా ఇంటిలో పడుకున్నప్పుడు ఒక శక్తి ఆవహించి బలవంతాన ఆకాశమార్గాన తమిళనాడువైపు తీసుకెళ్ళింది. ఆ తరువాత తిరుమల ఆనంద నిలయంలోని శ్రీ వేంకటేశ్వరుని ముందు నిలిపింది. అప్పుడు శ్రీ వేంకటేశ్వరుడు తన అణువణువును చూపెట్టాడు తన చేతిలోని రేఖలను కూడా స్పష్టంగా చూడగలిగాను. భవిష్యత్తులో నీకు ఆపదలు రాగలవని, తాను ఆదుకుందునని అభయం కూడ ఇచ్చాడు. ఆ తరువాత నేను చేయు వ్యాపారంలో చాలా పెద్ద సమస్యను ఎదుర్కొన్నాను. ఆ సమస్యకు భయపడి స్వామివారిని స్మరించిన వెంటనే పరిగెత్తుకొచ్చి నా హృదయంలో నిలిచేవాడు. వెనువెంటనే రోమాంచితుడనై నా కళ్ళనుండి ఆనంద బాష్పాలు జల జల కారేవి. నన్ను నేను మైమరచేవాడిని. ఇలా రోజుకు ఐదు నుండి పదిసార్లు చొప్పున మొత్తం ఒకటిన్నర సంవత్సరం సాగింది. ఈ కాలంలో నా నరనరాలలో స్వామివారు నిక్షిప్తమైపోయారు. మా మధ్య బలమైన బంధం ఏర్పడింది. ఒక మారుమూల గ్రామం నుండి విద్యాభ్యాస నిమిత్తం హైదరాబాద్ వచ్చి 10 x 10 సైజు గల చిన్న గదిలో స్వయంపాకం చేసుకుంటు, ఒక సంవత్సరం కాలం గడిపిన ఇద్దరు మిత్రులు ఎంత స్నేహంగా, ఎలాంటి దాపరికము లేకుండా ఒకరి మనసులోని విషయాలు మరొకరికి తెలుపుదురో, అంతటి స్నేహం మా మధ్యన ఏర్పడింది. శ్రీవేంకటేశ్వరుడు నావాడు, నేను ఆయన వాడిననే బంధం ఏర్పడింది. స్వామివారిని స్మరించుట వలన కలిగే ఆనందస్థితిని వదలలేక అంతర్ దృష్టి బాహ్య దృష్టి అనే రెండు దృష్టి కోణాలను ఏర్పరచుకొన్నాను. బాహ్య దృష్టి ద్వారా ఈ లోక విషయాలను గమనించుచున్నప్పటికీ, అంతర్ దృష్టితో సదా శ్రీవేంకటేశ్వరుని స్మరించేవాడిని. కొన్ని రోజుల తరువాత ఈ స్థితి నాకు నా చుట్టూ ఉన్న జనాల పేర్లను మరిచే స్థితిని కల్పించింది.

నేను ఏనాడు చూడని ఆలయాలు కనబడ్డవి. అందులో కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మి అమ్మవారు మొదటిది. ఆలయంలో ప్రధాన గోపురంలో నిలబడి ఒక ప్రత్యేకమైన కోణంలో చూచినప్పుడు, ఎంతో దూరంలో ఉన్న అమ్మవారు, ఎన్నో ఆర్చుల గుండ మన దృష్టి వెళ్ళి అమ్మవారు కనబడును. మరోసారి ఈ అమ్మవారు నేను గర్భగుడిలోపల ఉన్నప్పుడు ఎంత స్పష్టంగ చూడగలనో ఆ విధంగా కనబడినారు.

మరోసారి నా కళ్ళముందు శివలింగమును దర్శింప చేసి, నేనే శివుడను నీవు పూజించు అంటు సెలవిచ్చారు. అప్పటి నుండి శివుడిని నా ప్రభు శ్రీవేంకటేశ్వరుని యొక్క రెండవ రూపముగ భావించుచు శ్రీవేంకటేశ్వర అంటూ సంబోధించుచు పూజించేవాణ్ణి.

అమ్మవారు, శివుడు, సమస్త దేవతలు శ్రీవేంకటేశ్వరునిలో అంతర్ భాగమని నమ్ముచు ఆయా దేవతలలోని శ్రీవేంకటేశ్వరుని అంశకే నమస్కరించేవాడిని. ఎలాగైతే ధనార్జనే లక్ష్యంగా గల ఒక వ్యక్తికి, ఒకరోజు ఒకే పనికి ఒకరు 100 రు॥లు, మరొకరు 1000 రు॥లు ఇస్తున్నప్పుడు ఆ వ్యక్తి 1000 రు॥లు ఇచ్చేవారిని ఎన్నుకున్నట్లు నేను శ్రీవేంకటేశ్వరుణ్ణి ఎన్నుకున్నాను.

## ఈయనొక్కడే సర్వేశ్వరుడు :

ఆ తరువాత రోజులలో స్వామిపై భక్తి తారాస్థాయికి చేరింది. లోకంలోని ప్రతి వస్తువులో స్వామివారినే చూచేవాడిని. ఈ సృష్టికి మూలం శ్రీ వేంకటేశ్వరుడు. ప్రతి దేవి, దేవత ఆయన అంశనే అనే జ్ఞానం కలిగింది. తిరుమలలో స్వామివారిని ఈయనొక్కడే సర్వేశ్వరుడనే భావంతో అర్చించు విధానం నా ఒంట పట్టింది. నా భాగ్యవశాత్తు ఒకానొక రోజు స్వామి వారి రెండు పాదాలు నాపైన పెట్టినట్లనిపించింది. ఒక రకంగా నాకు సమాశ్రయణం కావించారు. ఆ తరువాత నేను పరవశంతో నాది నేను, నాకున్న సమస్త సంపద, కుటుంబంతో సహా స్వామివారికి సమర్పించుకున్నాను. ఎంతగ శరణాగతుణ్ణైనానంటే సంపూర్ణ వ్యక్తిత్వమును కోల్పోయాను. నన్ను లోకానికి ఉపయోగపడే ఏదేని ఒక మంచి పనికి ఉపయోగించుకొమ్మని ప్రార్థించాను, మరియు నా మనస్సులో జనించు భావాలు స్వామివారివని, నేను ఆ భావాల ప్రకారమే నడుచుకోవాలనే బంధం ఏర్పరచుకున్నాను. ఆ తరువాత నేను వేసే ప్రతి అడుగు, తెలిసి వేసినా తెలియక వేసినా స్వామివైపే వెళ్ళేది. స్వామివారు కల్పించు ప్రతి అనుభూతి యాదృచ్ఛికమని భావించక ఏదో ఒక సందేశం కోసమని భావించాలని తలంచాము. మరియు యాదృచ్ఛికమనే పదమును మా నిఘంటువు నుండి తీసివేసాము. ఆ తరువాత ఈ జీవితములో అలసిపోయేంతవరకు శ్రీ వేంకటేశ్వరునికి సేవ చేయాలనిపించింది.

ఒకరోజు అత్యంత భక్తి పారవశ్యముతో శ్రీ ఆంజనేయుల వారి లాంటి సేవను ప్రసాదించమన్నాను. ఎలాగైతే రామాయణాన్ని రచించి శ్రీ ఆంజనేయుడు మొదలగువారికి మీ సేవా భాగ్యమును ప్రసాదించారో అలాంటి మరో క్రొత్త రచనను రచించి నాకు మీ సేవా భాగ్యమును ప్రసాదించమని అత్యంత ఆర్తితో నా కళ్ళనుండి కారే అశ్రువులచే నా ఛాతీపైనున్న చొక్కా నానిపోగా దీనాతి దీనంగా వేడుకున్నాను.

స్వామి సేవ ప్రారంభములో నన్ను తిరుమల తీసుకెళ్ళి తన ఉత్తర మాడ వీధిలో నిలబెట్టి, తన మాయచే ఆకాశ గంగను తెప్పించి స్నానం చేయించాడు.

జూన్ సం॥ 2002 ప్రాంతములో మేము ప్రయాణించుచున్న మార్గములో ఒక తుఫాన్ వచ్చింది. శ్రీ వేంకటేశ్వరుని కృపచే ఎలాగో దాని ధాటికి తట్టుకోగలిగాము. ఇంతలో ఈ తుఫాన్ నుండి ఒక సుడిగుండం పుట్టుకొచ్చి మమ్ములను పైకెత్తుకెళ్ళింది. ఆకాశంలో ఉన్న మమ్మల్ని ఎక్కడ ఈ తుఫాన్ పడేస్తుందోనని భయపడి గజ గజ వణికాము. చివరికి శ్రీ వేంకటేశ్వరున్ని శరణు జొచ్చాము. రక్షించమని దీనంగ వేడుకున్నాము. దయామయుడైన శ్రీ వేంకటేశ్వరుడు ఆ సుడిగాలికి ఆదేశాలిచ్చి ఒక నూతన మార్గంలో జాగ్రత్తగా మమ్ములను క్రిందికి దింపి అదే మార్గములో పయనించమన్నారు. తిరిగి వెనుకకు రావద్దన్నారు. ఒకవేళ వెనక్కు వస్తే మళ్ళీ తుఫాన్‌లు వస్తాయని హెచ్చరించారు. చివరికి స్వామివారు సూచించిన మార్గంలోనే పయనించాము. ఆ మార్గమే శ్రీ వేంకటేశ్వరుని సేవా మార్గం. ఈ విధంగా మాకు శ్రీవారి సేవను



శ్రీ వేంకటేశ్వరుడు స్వయంగా కల్పించారు. ఈ జీవితంలో తనివి తీరేవరకు సేవను ప్రసాదించారు.

స్వామివారి లీలలు అద్భుతంగా ఉంటాయి. ఆకలి గొన్నప్పుడే రుచెక్కువన్నట్లు తపనను పెంచి లీలలను ప్రసాదించును. నా మొదటి పుట్టినరోజు పండుగ సందర్భంగా ప్రపంచంలో ఉన్న మన్నికైన వజ్రవైఢూర్యాలు పొదిగిన నగను బహుమతిగ ఇచ్చి, నన్ను తన్మయుణ్ణి చేసారు. కొంత తడవు స్పృహ కోల్పోయేలా చేసారు.

ఒకానొక సందర్భంలో శ్రీవేంకటేశ్వరుడు ఇలా అన్నారు. "సాయిరెడ్డి నా వాడు. నాకోసం ఏమైనా చేస్తాడు" ఈ మాట విన్న వెంటనే పరవశించిపోయాను. ఈ జన్మాంతం శ్రీవేంకటేశ్వరునికి ఋణపడి ఉండాలనుకొన్నాను.

ఏ మాత్రం తిరుపతితో సంబంధం లేని నాతో తిరుపతిలోని టి.టి.డి. డైరీఫామ్‌లో తేది 21-09-2002 నాడు శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపమును నిర్మింపచేసి, తిరిగి దానిని స్వీకరించి పరమానంద భరితుణ్ణి చేసారు. ఈ స్థూపాన్ని నీ జన్మాంతము వరకు నీవే నిర్వహించగలవని కూడా చెప్పారు. అత్యంత అథమస్థాయి వ్యక్తినైన నాకు స్వామివారి దివ్యమైన అనుగ్రహము లభించుటతో పరవశించి, ఈ జన్మ మొత్తం ఆయన ఋణం తీర్చుకొనుటకు సేవ చేయాలనుకున్నాను. తగిన సేవను సూచించమని వేడుకొన్నాను.

స్వామి నామం స్మరిస్తూ ఉంటే ఒక ప్రక్క ఎంతో ఆనందమును

పొందుటతో పాటు నాకున్న జటిలమైన సమస్యలు తీరేవి. ఈ భాగ్యాన్ని నాతోపాటు స్వామివారి భక్తలకు అందించాలని, దానికి తగిన ఉపాయమును ప్రసాదించమని వేడుకున్నాను. ఋణం తీర్చుకొనుటకు ఒక అజ్ఞాత భక్తునిగా సేవ చేయాలని భావించాను. స్వామివారి సేవకుడుగ ఆయనతో ఒక బంధం ఏర్పరచుకొన్నాను. స్వామివారు నాకు ప్రసాదించిన ప్రతిదానిని తిరిగి వారి భక్తులు అనుభవించేటట్లు చేయుట నా కర్తవ్యంగా నిర్ణయించుకున్నాను. ఎంత ఎక్కువ మంది భక్తులకు దీనిని చేరవేస్తానో అది నా సామర్థ్యానికి నిదర్శనంగా ఎంచుకున్నాను. చివరికి శ్రీవారి కృపా విశేషం చేత తేది 15-10-2002 దసరా రోజు, శ్రీవేంకటేశ్వర మహా మంత్ర పీఠమును ఏర్పాటు చేసి దాని ద్వారా జప సమర్పణ కార్యక్రమమును చేపట్టాలనుకున్నాము.

స్వామివారి కృపతో శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర లిఖిత జపము అనే జప పుస్తకమును సంకలనము చేసి ముద్రించి తేది 15-11-2002 నుండి ఉచిత పుస్తక పంపిణి మొదలు పెట్టాను. ప్రతి జప పుస్తకములో 1250 నామాలు పట్టునట్లు మొత్తం 70300 జప పుస్తకములను సిద్ధం చేశాను. ఇంతలో నాకు దగ్గరగా వున్న గురుతుల్యుడైన వ్యక్తి నీకు మహా మంత్రపీఠంను స్థాపించే అర్హత లేదని, మహా మంత్రమును వ్రాయించే అర్హత కూడా లేదని దీనిని వదులుమని సూచించడంతో చివరికి శ్రీవేంకటేశ్వర సేవా సమితి అనే ఒక ట్రస్టును నేను, నా భార్య సురేఖ మరియు మా అమ్మ కీ.శే. పుల్లగూర్ల రుక్కమ్మలు మెంబర్లుగా ఏర్పాటు చేసి దీని ద్వారా సేవ చేయాలనుకున్నాను. ఆ తరువాత శ్రీ వేంకటేశ్వరుడు తన మరో లీలలో, నీవు శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం మరియు జపసమర్పణను కొనసాగించమని ఆజ్ఞాపించుటచే శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠమును, జప సమర్పణను కొనసాగించాను.

## స్వామివారితో పందెం కాయుట :

శ్రీ వేంకటేశ్వరుని లీలల ప్రభావముచే నాలో ఆయనకు సేవ చేయాలనే తపన తారాస్థాయికి చేరింది. స్వామివారిని చూడాలని తపించి పోయేవాడిని. విరహ వేదనను అనుభవించాను. కొన్ని సందర్భములలో స్వామి కొరకు క్రిందపడి పొర్లుచు ఏడ్చేవాడిని. స్వామివారికి చిన్న చిన్న సేవలు చిన్నతనంగా భావించేవాడిని కాబట్టి చాలా సం॥ల వరకు నిలిచి ఉండే సేవను ఎన్నుకోవాలనిపించింది. భాగ్యవశాత్తు నాకు జప సమర్పణ సేవ లభించింది. ఈ సేవను చాలా సం॥ల పాటు మధ్యలో ఏ మాత్రం పలచబడకుండ ఉండుటకు ఒక సంకల్పమును చేసుకోవాలనిపించింది. ఇదే సందర్భములో శ్రీ వేంకటేశ్వరుడు తనకు బొట్టు పెట్టే సంకల్పమును తీసుకోమన్నారు. ఆయన తిరునామములో మూడు ఒకట్లు ఉంటాయని, నా ఇంజనీరింగ్ మైండ్‌తో ఆలోచించిన నేను మొత్తం 111 కోట్ల జపంను ప్రతి సం॥ కనీసం 7 కోట్ల చొప్పున, కనీసం 70 వేలమంది భాగస్వాములుగ 16 సం॥ల వరకు సమర్పించి, ఆ సేవ ఫలితంగా ఆయనకు బొట్టు పెట్టాలనుకున్నాను. వెంటనే ఇంత కష్టపడి మీకు బొట్టు పెట్టి వదలను ప్రభూ! మిమ్మలను మా ఇంటికి ఆహ్వానించుదును రమ్మన్నాను. మన హైందవ ధర్మములో బొట్టు పెట్టి పిలిచినట్లు, దానికి శ్రీ వేంకటేశ్వరుడు ఒప్పుకొని, నేను ఏ తప్పు లేకుండ, అత్యంత ఆర్తితో సేవ చేస్తే మా ఇంటికి తప్పక వస్తానన్నారు. మొత్తం సేవలో ఒకే ఒక తప్పుకు అనుమతించారు. ఈ విధంగ మా మధ్యన పందెం ఏర్పడింది. దీనిని సాధించుట లక్ష్యంగా పెట్టుకున్నాను. నిజానికి స్వామివారిని పొందుటకు నేను యోగ్యుణ్ణి కానని భావించి, అలాంటి కోరిక నాకు లేనప్పటికి దీనిని బోనస్ గ భావించుకున్నాను. మరియు నేను కఠినంగ స్వామి సేవ చేయుటకు ఇది ఉపయోగపడుతుందని భావించాను. మరోప్రక్క కొన్ని నెలల ముందు జరిగిన ఒక సంఘటనలో దెబ్బతిన్న కారణంగా ''నా మనసులో జనించు ప్రతి భావన స్వామిదే. నేను ఆ భావాల ప్రకారమే నడుచుకోవాలి'' అనే దానిని కొంచెం సడలించాను. అందుకే అంత విశ్వసించలేదు. ఎవరైనా వింటే నవ్వుకుంటారనుకున్నాను. అయినప్పటికీ సంకల్పాన్ని వదలలేదు. మొత్తం మీద తిరుమల శ్రీవేంకటేశ్వరునికి సం॥2002 నుండి 2018 వరకు, 16 సం॥లు సేవ చేసి 111 కోట్ల జప సమర్పణ కావించి, దాని ఫలితముచే స్వామివారికి బొట్టుపెట్టి మా ఇంటికి ఆహ్వానించాలి. ఆ తరువాత మా ఇంటికి వచ్చిన శ్రీ వేంకటేశ్వరున్ని తనివితీర దర్శించి, ఆయనతో రెండు మాటలు మాట్లాడి, పాద పూజ చేసి తిరిగి తిరుమలకు పంపాలి, ఇది సంకల్పం. దీనిని సాధించుటే లక్ష్యంగా చేసుకొని సేవను ప్రారంభించాను. నిజానికి జప సమర్పణ నా లక్ష్యం కాదు. స్వామివారిని మొత్తం 111 కోట్ల సార్లు, ప్రతి సం॥ము 7 కోట్ల కంటే తక్కువ కాకుండ, కనీసం 70 వేల మంది భక్తులచే మా కారణంగా స్మరింపచేయాలన్నది ప్రధాన సంకల్పం. దీనిని నెరవేర్చుటకు జపం వ్రాయించుటను ఆయుధంగ చేసుకున్నాము.

స్వామివారికి బొట్టు పెట్టడమనే విషయం నలుగురైదుగురికి తెలిసినప్పటికి వారిని మా ఇంటికి ఆహ్వానించుటనే విషయం, నాకు శ్రీవేంకటేశ్వరునికి తప్ప మరెవ్వరికీ తెలియదు. ఈ మొత్తాన్ని ఒక 'సింబల్ గ... లోగోగ' చేసి, ఈ లోగోను సాధించుటే శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం యొక్క లక్ష్యంగ చూపుచు సేవ చేశాము. శ్రీవేంకటేశ్వరుడు మా ఇంటికి వస్తాడన్న విషయం కాని, మా మధ్యన ఏర్పడిన పందెం గురించి కాని చివరికి నా భార్యకు కూడ తెలియదు. ఆమెకు 2021 జనవరిలో చెప్పాను. ఈవిధంగ స్వామివారి సేవను తేది 15-11-2002 నాడు ప్రారంభించి, 7 నెలల్లో ఏడు కొండల వాడికి 7 కోట్ల జపాన్ని తేది 14-06-2003న సమర్పించాము.

మొదటి 7 కోట్ల జప సమర్పణలోనే మేము 70300 జప పుస్తకములను పంచినప్పటికి ఒకరు ఒకటికంటే ఎక్కువ పుస్తకములను వ్రాయుట వలన 70 వేల మందిని భాగస్వాములుగా చేర్చుటలో విఫలుణ్ణైనాను. కాని ఇది మొదటి తప్పు అగుట వలన స్వామివారు స్వీకరించారు.

## 'నమో వేంకటేశాయ రథం' :

ఆ తరువాత ఈ 7 కోట్ల జపములో కనీసం 70 వేలమంది భక్తులను భాగస్వాములుగ చేర్చుటకు, ప్రతి సం॥ హైదరాబాద్ నుండి తిరుపతి వరకు 25 రోజుల రథయాత్ర చేయుచు స్వామివారిని ఇల్లిల్లు తీసుకు వెళ్ళుటకని ఒక మహత్తర లీలను చూపు 'నమోవేంకటేశాయ' రథమును ఏర్పాటు చేయించారు. తిరుపతిలో కట్టిన 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము' యొక్క బ్రాస్ నమూనా మరియు దీనిని నిర్వహించుటకు నియమాలు కూడా ఏర్పాటు చేసాడు. ఈ రథయాత్ర ద్వారా మాకు స్వామి వారి అమితమైన, అనిర్వచనీయమైన సేవాభాగ్యం లభించింది.

ఈ రథయాత్ర ఏర్పాటు చేయుటకు ఎన్నో లీలలను ప్రసాదించాడు. స్వామివారు మా ఇంటికి వచ్చారనే అనుభూతిని భక్తులు పొందే విధంగా చేయుటకై ఒక దివ్యమైన అనుభూతి చూపారు.

**"కృతేతు నారసింహోభూత్ త్రేతాయాం రఘునందనః**
ద్వాపరే వాసుదేవశ్చ, కలౌ వేంకటనాయకః" అనే విధంగా, కృతయుగంలో నారసింహునిగ, త్రేతాయుగంలో శ్రీరామునిగ, ద్వాపరయుగంలో శ్రీకృష్ణునిగ అవతరించిన భగవంతుడు ఈ కలియుగములో శ్రీ వేంకటేశ్వరునిగ అవతరించి భక్తులను కాపాడుచున్నారనే విధంగా రథమును తయారు చేయించాడు. రథయాత్ర మొత్తం శ్రీ వేంకటేశ్వరుని మహా మంత్రమును పలుకుచు ఉండాలని దిశా నిర్దేశం చేసాడు. స్వామిని సేవించుటకై రథం వద్దకు వచ్చిన భక్తులతో స్వామి మహా మంత్రమును వ్రాయుటకు వీలుగ 'సమర్పణ క్రతువు' అనే పేరుతో ఒక కాగితపు ముక్కను ఏర్పాటు చేయుమని, మరియు దానిని రథంలో సమర్పించుటకు, ముత్యాలతో అలంకరించిన ప్రత్యేకమైన శంఖులను ఏర్పాటు చేయవలసిందిగా సూచించాడు. ప్రతి ప్రక్క శ్రీ వేంకటేశ్వరుడు మరియు శంఖులతో నాలుగు ప్రక్కలు ఒకే విధంగా, అత్యంత సుందరంగా చూచిన ప్రతి వ్యక్తి నమస్కరించే విధంగా తయారు చేసి ఒక లారీ వెనకాల ఛ్చసిన్‌పై బిగించి, దీని ముందు భజన మండపాన్ని శాశ్వతంగా, స్వామి కృపతో ఏర్పాటు చేసాము.

స్వామివారు దీనిని ఆదిశేషునిగా భావించమని చెప్పారు. మేము ఈ రథమును తయారు చేయు సమయాన పెద్ద పామును తయారు చేయునట్లు నేను నా భార్య ఎన్నోసార్లు కల కన్నాము.

తేది 11-08-2004 రోజున అప్పటి టి.టి.డి. ఈవో శ్రీమాన్ అజయ్ కళ్ళాంగారు, దీనిని తిరుపతి లోని పాదాల మండపం వద్ద ప్రారంభించి, స్వామి సేవలో ఒక నూతన అధ్యాయమని అన్నారు.

ఈ రథమును 2వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ సమయము నుండి వాడుచున్నాము. జపసమర్పణ కంటే 25 రోజుల ముందు మా ఇంటినుండి బయలుదేరిన రథయాత్ర హైదరాబాద్ లో 16 రోజులు, హైదరాబాద్ నుండి తిరుపతి వరకు ఆరేడు రోజులు ఉండునట్లు ఏర్పాట్లు చేయుదుము. ఆహ్వానితుల ఇంటి లేదా వీధిలోనికి ఈ రథమును తీసుకెళ్ళేవారము. రథం వద్దకు వచ్చిన ప్రతి భక్తునికి, "సమర్పణ క్రతువు"ను ఇచ్చి, వారి కోరికలను



తీర్చుమని స్వామివారిని ప్రార్థించిన తరువాత, ఈ క్రతువుపై స్వామివారి మహామంత్రమును వ్రాసి, సమర్పణ భావంతో, శరణాగతి భావంతో, రథంలో ఉన్న శంఖులలో సమర్పించమని చెప్పేవారిమి. ఈ విధంగా సేకరించిన క్రతువులు 7 కోట్ల జపంలో భాగంగా ఉండేవి.

ప్రతి సం॥ము ఈ రథం ఏ ప్రాంతాలలో తిరుగాలనే విషయం కూడా శ్రీ వేంకటేశ్వరుడే సూచించేవారు. రథయాత్ర ప్రారంభంలో నా మనసుకు వచ్చిన మొదటి ఆలోచన ప్రకారం నేను యాత్రను నిర్వహించాలని దిశా నిర్దేశం చేసారు. నా భార్యను ఈ రథయాత్రకు సహకరించమని చెప్పుచు, దివ్యమైన అనుభూతులను కల్పించి ఆనందపరిచేవారు. కఠిన నియమాలను ఏర్పాటు చేశాడు. ప్రతి రథయాత్రలో మా పడక అక్కడి "ఫుట్ పాత్" మాత్రమే అని నిర్ణయించుకుని రథయాత్ర చేయాలి. సం॥ 2005 లో కడప వెళ్ళమనే సందేశాన్ని పొందాను. కాని అక్కడ తెలిసినవారు లేరని, వసతి దొరకదని వెనకడుగు వేశాము. వెంటనే శ్రీవేంకటేశ్వరుడు "నా రూంలో చోటిస్తాను రా" అని వ్యంగ్యంగా మాట్లాడి చివరికి తన గుడిలో చోటిచ్చారు.

నా భార్యకు స్వామివారు నాగుపాము రూపముతో బంధం ఏర్పడింది. రథయాత్ర ప్రారంభపు రోజులు వస్తున్నాయనగా చుట్టుకున్న పాములో కదలికలు మొదలై రథయాత్ర జరుగుచున్నన్ని రోజులు తిరుగుతు ఉండేది. ఆ తరువాత మా ఇంటికి వచ్చి తిరిగి చుట్టుకొని పడుకున్నట్లు ఆమెకు కనబడేది.

ఈ రథముతోపాటు 7 గురము స్వామి సేవకులము ఉండేవారిమి. ఒక డ్రైవర్, ఒక బ్రాహ్మణుడు, నేను, మరో నలుగురం

మొత్తం 7 మందిమి. రథయాత్ర సమయాన స్వామి సేవకులను మాతో సమానంగా చూడమని చెప్పేవారు.

రథయాత్ర హైదరాబాద్‌లో 16 రోజులు, ఉదయం మరియు సాయంత్రం వేరు వేరు ప్రాంతాలలో తిరిగి ఆ తరువాత హైదరాబాద్ నుండి తిరుపతి వరకు వివిధ ప్రాంతాలలో కనీసం 5 రాత్రులు తిరగాలనే నిర్ణయం కావున మేము హైదరాబాద్ నుండి తిరుపతి ప్రయాణం 5-7 రాత్రులు ఉండునట్లు చూచుకునేవారిమి. ఒకే ప్రాంతములో ఎక్కువ రోజులు ఉండుచు, 5 రాత్రుల కంటే తక్కువైనప్పుడు వెంటనే సూచించే వారు. మేము అక్కడ మరో రోజు గడపలేని స్థితి కలిగేది.

ఈ విధంగా ఈ 'నమోవేంకటేశాయ రథయాత్ర' ను సం॥ 2004 లో ప్రారంభించి సం॥ 2019 వరకు ప్రతి సం॥ము హైదరాబాదు నుండి తిరుపతి వరకు, గోకులాష్టమికి తిరుపతిలో ఉండే విధంగా త్రిప్పాము.

హైదరాబాద్‌లో 16 రోజులు త్రిప్పి ఆ తరువాత హైదరాబాద్ నుండి తిరుపతికి ప్రతి సం॥ము ఒక నూతన మార్గంలో వెళ్ళేవారిమి.

శ్రీ వేంకటేశ్వరుని సేవలలో అత్యంత తృప్తిని ప్రసాదించింది ఈ రథయాత్రనే. హైదరాబాద్‌లో కంటే బయటి ప్రాంతాలు తిరుగుచున్నప్పుడు ఎక్కువ ఆనందమును అనుభవించేవారము. రథయాత్ర తిరుపతికి చేరే సమయము వరకు ఎంతగ సమర్పించబడేవారమంటే మా సంపూర్ణ ఆస్తిపాస్తులు ఇతరులు లాక్కెల్లుచున్నారని తెలిసినా చలించేవారం కాదు. వరుసగ 25 రోజులు రథయాత్ర చేసినప్పటికి మాలో ఎలాంటి నీరసము కలిగేది కాదు, కాని తిరిగి ఇంటికి వచ్చిన తరువాత, కోలుకొనుటకు 20 రోజులు పైగా పట్టేది.

## జప సమర్పణలో స్వామివారి లీలలు :

ప్రతి జప సమర్పణలో శ్రీవేంకటేశ్వరుడు ప్రత్యేకమైన లీలను ప్రదర్శించేవారు. మేము ప్రతి సంవత్సరం 7 కోట్ల జపమును హైదరాబాద్ నుండి తిరుపతికి తీసుకెళ్ళే సమయాన ఇంటిలోని 'నమో వేంకటేశాయ' షెడ్డులో ప్రత్యేక పూజలు చేసేవారిమి.మరియు ప్రతి గోకులాష్టమి కంటే ఒకరోజు ముందు, ఈ మొత్తం జపమును తిరుపతిలో అలిపిరి వద్దనున్న శ్రీవారి పాదాల మండపముపై పెట్టి పూజించేవారిమి. అప్పుడు స్వయంగ శ్రీవేంకటేశ్వరుని మూలమూర్తి వచ్చి ఆ పాదాల మండపములో నిలిచి మా పూజను స్వీకరించేది. ఆయనను తనివితీర చూచుచు, ఆయన పాదాలకు పూజ చేసేది. మరియు గోకులాష్టమి నాడు, జప సమర్పణ సమయాన తిరుపతిలో ఎస్వీ డైరీఫాంలో ఉన్న శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం ముందు ఈ మొత్తం జపమును 5' X 6' సైజు గల ఒక కుప్పగ పేర్చి పూలతో అలంకరించి జపం వ్రాసినవారి కోరికలు తీర్చండని ప్రార్థించుచు, జప హోమాదులు చేసేవారిమి. ఇదే కాలములో స్వామివారు అద్భుతమైన చమత్కారమైన లీలను చూపేవారు. ఈ మొత్తం 5' X 6' సైజు గల జపం కుప్పపైన తన రెండు పాదములను, మొత్తం జప పుస్తకాలు తన పాదాల క్రింద ఉండునట్లు, జపం పైన నిలబడేవారు. నాకు ఆయన పాదాలు మరియు ఆ పాదాలపై స్వామివారు ధరించిన ధోవతి యొక్క అంచు మాత్రమే కనబడేది. స్వామి వారు ఆకాశమున నిలబడినట్లు భ్రమ కలిగేది. కాని ఆయన నల్లని పాదాలను స్పష్టంగ చూచేవాడిని. ఆ పాదాలకే పూజ చేయుచు, తన్మయత్వము చెందేవాణ్ణి. ఇలా ప్రతి జప సమర్పణలో జరుగుచున్నది. ఈ దృశ్యం నాకు మాత్రమే కనిపించేది. ఈ విధముగ ప్రతి జప పుస్తకము వ్రాసిన భక్తుణ్ణి అనుగ్రహించేది. ఇలా ప్రతి జప సమర్పణలో రెండుసార్లు ఆయన పాదాలను, ఒకసారి మూల మూర్తిని చూచుచు పూజ చేయుట స్వామివారు నాకిచ్చిన మహాభాగ్యం.

తన పాద సేవక వృత్తిని ప్రసాదించి, శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయరు స్వామిగారిచే 'గోవింద దాసు'గ నామకరణం చేయించాడు. సెప్టెంబర్ 2003 నుండి నా దిశను మార్చే ప్రయత్నాలు చేయుట మొదలు పెట్టాడు. భవిష్యత్‌లో తీవ్రమైన కష్టాలు రాగలవని, ప్రతి క్షణం స్వామి నామాన్ని స్మరిస్తూ జీవించమని దిశా నిర్దేశం చేసాడు. మరియు ప్రతిసారి ఆలయాల దర్శనం అవసరం లేదని ఇంటిలోనే సాధనను చేసుకొమ్మని సూచించాడు. విశ్వము తన ఆధీనములో ఉన్నదని, క్షణంలో కొండలను లోయలుగ, లోయలను కొండలుగ మార్చగలనని కూడా తెలిపారు. ఒక రకంగా భవిష్యత్‌లో నీ ఆర్థిక పరిస్థితిని హరించి వేయుదుననే సూచననిచ్చాడు. నీకు ముందు వెనుకాల నేనున్నాను, భయపడకుమని సూచించారు. ఇదే కాలంలో 'శ్రీవేంకటేశం' అనే ఒక తెలుగు మాస పత్రికను స్థాపించమని దాని ద్వారా భవిష్యత్‌లో మీరు గోవిందుని పొందగలరని సూచించాడు.

స్వామి సేవా మార్గములో, రాళ్ళు రప్పలు లాంటి ఎన్ని ఆటంకాలు వచ్చినా లెక్క చేయకూడదని, స్వామిని చేరుటే లక్ష్యంగా చేసుకొని ఈ పత్రికను నడపమన్నారు. ఇది మాకు యోగ్యతను పెంచే సాధనముగ ఉండగలదని సూచించారు. చివరికి నన్ను పై తరగతిలో అంటే యం.టెక్ లో చేర్చి చదివి ఉత్తీర్ణుడవు కమ్మన్నారు.

హైదరాబాద్‌లో మాకు ఒక ఇల్లును ప్రసాదించమని చేసిన ప్రార్థన కనుగుణంగా ఒక సం॥ ముందే ఆ ఇంటి ప్రదేశమును చూపి, అక్టోబర్ 2004 లో హబ్సిగూడలోని రోడ్ నెం.2, కాకతీయనగర్‌లో ప్రసాదించాడు. స్వామి ప్రసాదించారు కాబట్టి ఆనందముతో విశాలంగా కట్టుకుని 'శ్రీవేంకటేశ్వర ప్రసాదం' అని పేరు పెట్టుకున్నాము.

స్వామివారు ప్రసాదించిన ఇంటి గృహప్రవేశ సమయమున శ్రీవేంకటేశ్వరుని మా ఇంటికి భోజనానికి ఆహ్వానించాను. అప్పుడు "నీ ఊరిలోని ఇంటిలోనికి వచ్చి భుజించెదను" అని అన్నారు. దీనర్థం అప్పుడు నాకు తెలియలేదు. హరినామ క్షేత్రం ఏర్పాటు చేసిన తరువాత తప్పక వచ్చెదనని దీనర్థం. ఇప్పుడు మాత్రం నా బదులు శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయరు స్వామివారిని పంపుచున్నానని చెప్పి, వారిని పంపారు.

జనవరి 2005 న, తాను సాక్షాత్ శ్రీమన్నారాయణుడనని, బ్రహ్మ మొదలగు సమస్త దేవతలకు మూలం తానేననే జ్ఞానమును ప్రసాదించారు. ప్రస్తుతము శ్రీవేంకటేశ్వరుడనే తొడుగును ధరించి ఉన్నానని చెప్పారు. అయినప్పటికి ఈ సృష్టికి మూలం శ్రీవేంకటేశ్వరుడే అనే భావంలో నేను ఎలాంటి మార్పు చేసుకోలేదు.

ఒక సందర్భములో నేను పరమశివుడిని ప్రార్థించి వెనుతిరుగునప్పుడు, "ఈ రాత్రి నీకు దర్శనమిచ్చెద"ననే సందేశమును పరమశివుడి నుండి పొందాను. వెంటనే ప్రభూ! మీరు నా ఆనందం కోసం మీ దర్శనాన్ని ప్రసాదించుచున్నారని, అందుకు ధన్యవాదములు తెలిపి, ఒకవేళ మీరు నా స్వామి తిరునామం ధరించి దర్శనమిచ్చినచో మరింత ఆనందించుదునన్నాను. ఆ రాత్రి కలలో "చూడు చూడు అంటూ తన తిరునామాన్ని ప్రత్యేకంగ చూపుచు , తిరుపతి కపిల తీర్థం ఆలయంలోని శేషశయనుడైన శ్రీలక్ష్మీనారాయణుడు దర్శనమిచ్చారు.

గత కొన్ని సం॥ల నుండి,శ్రీ వేంకటేశ్వరుడు నా వాడని, నేను చెప్పింది చేయుననే భావం నాలో క్రమంగా సడలిపోయింది. స్వామివారు ఏదో ఆశించి నన్ను ప్రత్యేక మార్గంలో పయనించునట్లు చేయుచున్నారని ఆయన అనుకున్నట్లుగ నేను నడుచుకొనుటే నా ధర్మమనే భావం కలిగింది. స్వామివారిపై విశ్వాసము పెంచే ఎన్నో లీలలను కల్పించాడు. సంఘంలో అత్యంత సాధారణ వ్యక్తిగా, ఎలాంటి ఆర్భాటాలు లేకుండా జీవించమన్నాడు.

శ్రీవేంకటేశ్వరుడు ఎలాగైనా నన్ను తన దారిలోనికి తెచ్చుకొనుటకు విశ్వప్రయత్నాలు చేసారు. అవసరమైతే ద్వంద్వ అర్థాలను ఉపయోగించి ఒక ప్రక్క నన్ను సంతోషపరచుచు, మరోప్రక్క తన దారిలోనికి తెచ్చుకునేవారు.

నేను శ్రీ వేంకటేశ్వరుడు చెప్పినట్లు నడుచుకుంటేనే, నా సేవను స్వామివారు స్వీకరించేది, అలాకాక ఎప్పుడైన నా సొంత అభిప్రాయాల ప్రకారం చేసినచో, "నీ సేవ స్వీకరించను. నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో" అని అనేవారు. వెంటనే నా అభిప్రాయాన్ని మార్చుకునేవాడిని.

అత్యంత కఠిన సాధన చేయించారు. "అతడు నీతో సరిగా మాట్లాడుటలేదు నీవెందుకు మాట్లాడుచున్నావనేవాడు". అవసరము లేనిచోట మాట్లాడకుమనేది, స్వామివారిని స్మరిస్తూ గడపమనేది. లేనట్లైతే మన దారిలో ఆటంకాలు కలుగునని దీని ఉద్దేశ్యం.

ఏప్రిల్ 2005 న నా భాగ్యం పండింది. 'నమో వేంకటేశాయ' రథమును స్వీకరించుటకు, నా షరతులను ఒప్పుకొనుచు నన్ను పరమానందభరితుణ్ణి చేసాడు. అర్జునుని తరువాత అంతటి అదృష్టవంతుణ్ణి నేనే అనే భావం నాలో కలిగేలా అనుగ్రహించాడు. మరోసారి పూర్వం ద్రౌపదిని అనుగ్రహించినట్లు అనుగ్రహించాడు.

ఒకసారి స్వామి లీలలు కలలు కదా! ఇవి నిజమెలా అవుతాయి, అనే అనుమానం వచ్చింది. వెంటనే శ్రీ వేంకటేశ్వరుడు ఇవి కలలు కాదని, నిజం అని చెప్పుచు, కలలో నన్ను స్పృశించాడు. వచ్చే 3 రోజుల వరకు ఆ స్పృశించిన భాగం ప్రత్యేకంగా ఉండునని చెప్పాడు. అది అట్లే జరిగింది. అప్పటి నుండి శ్రీ వేంకటేశ్వరుడు కల్పించు ప్రతి కల నిజమని నమ్మి అనుమానించకూడదనిపించింది.

ఎప్పుడైన నా మనస్సులో స్వామి సంకల్పానికి విరుద్ధమైన భావాలు కాని, మరో చెడ్డ భావాలు కాని ప్రవేశించినపుడు వెంటనే శ్రీ వేంకటేశ్వరుడు కలుగ జేసుకొని, ఇది మంచిది కాదు, వదులుమనేవాడు. మరియు మా సేవలో ఏదేని లోపం జరిగినప్పుడు సరిదిద్దేవాడు.

ప్రతిసారి స్వామివారు చెప్పదల్చుకున్న విషయాన్ని, ఆర్తితో ప్రార్థించితేనే చెప్పేవారు. ఆ విషయాన్ని ఆర్తితో ప్రార్థించుటకు కావలసిన పరిస్థితులను నా చుట్టూ కల్పించేవారు. ఒకసారి బలవంతులైన దుండగులు నా ఆస్తిని కబళించుకున్నారు. నేను బలహీనున్ని, ఒంటరిని, వెనక ముందు ఎవరూ లేని వాడిని, రక్షించమని వేడుకున్నప్పుడు, "వెనుకా ముందూ" నేనున్నానన్నారు.

## స్వామివారి ఆలింగనము :

జీవితంలో ఒకసారి చాలా దెబ్బ తిన్నాను. చాలా కష్టాలను, అవమానాలను ఎదుర్కొన్నాను. ఎంతో విలువైన ఆస్తులను కోల్పోయాను. ఇదంతా కూడా శ్రీ వేంకటేశ్వరుని ఆజ్ఞతోనే జరిగిందని భావించి ఆయనపై కోపము పెంచుకున్నాను. మీరు నా కోరికనే నెరవేర్చనప్పుడు, నేను మీ 'నమో వేంకటేశాయ రథము'ను తీసుకొని, ఇల్లిల్లు తిరుగుచూ, మీరు స్వామివారిని స్మరించండి, మీ కోరికలను స్వామివారు తీర్చునని ఏ విధంగా భక్తులను అడగాలని అన్నాను. నన్ను మోసగించారనే భావం కూడా మనస్సులో ఏర్పడ్డది. నేనంటే స్వామివారికి ఇష్టం లేదనే భావం ఏర్పడింది. మొత్తం మీద ఆయనపై అలిగి ఉన్నాను.

దీనిని గమనించిన శ్రీ వేంకటేశ్వరుడు తేది 10-01-2006 వైకుంఠ ఏకాదశిరోజు తన యోగమాయను హైదరాబాద్‌లో ఉన్న నా వద్దకు పంపి, నన్ను బంధించి తిరుమలలో తన ముందు నిలబెట్టి, నేనంటే తనకెంతో ఇష్టం అని చెప్పుచు ఆలింగనము చేసుకున్నాడు. క్షణంలో నేను పొందిన కోపము, ఆస్తి పోయిందనే దుఃఖము మాయమైపోయింది. నా ఆస్థి ఒక ప్రక్క, స్వామి ఆలింగనాన్ని మరో ప్రక్క త్రాసులో వేసి చూచుకున్నాను. స్వామి ఆలింగనము ఎంతో బరువైందని తెలిపోయింది. ఏదో సాధించుటకు కొన్ని కఠిన నియమాలతో శిక్షణ ఇచ్చుచున్నాడనిపించింది. స్వామివారు చెప్పినట్లే నడుచుకోవాలనిపించింది. ఆస్తిని హరించుట ఇందులో భాగమేననిపించింది. ప్రతి క్షణము స్వామివారిని స్మరించుటకు ఈ పరిస్థితి అవసరమనిపించింది.

ఆర్థికముగా ఎంతో అధమ స్థాయిలో ఉన్నాము. కొన్నిసార్లు నా భార్య బంగారం కుదువ బెట్టి వచ్చిన డబ్బుతో సేవ చేశాము. మా పిల్లల చదువులు, సంసారము, పొడిగించుకుంటూపోయే స్వామి సేవ ఏ విధంగా చేసేదని నా భార్య భోరున విలపించిన సందర్భాలు ఎన్నో ఉన్నవి.

మాకు తెలిసిన అందరు కూడా స్వామివారు ప్రసాదించిన రాజభవనము లాంటి మా ఇల్లును చూచి, స్వామివారి సేవలో ఆనందంగా చేయు లక్షల రూపాయల ఖర్చులను చూచి, వీరు

అత్యంత ధనవంతులనే అభిప్రాయాన్ని కల్గి వున్నారు.

ఒక లీలలో నన్ను బద్రినాథ్ తీసుకెళ్ళారు. స్వామివారి దర్శనార్థియై గుడిలోనికి ప్రవేశించగనే, ఎడమ ప్రక్కన ఉన్న శ్రీఆంజనేయుణ్ణి చూచుచు అలాగే నిలబడ్డాను. దీనిని సహించలేని అక్కడి పూజారి “నీ గోవిందుడు ప్రక్కన ఉన్నాడు అక్కడికి వెళ్ళమని” కఠినంగా చెప్పాడు.

## శ్రీవేంకటేశం మాసపత్రిక :

సం॥ 2007 ఏప్రిల్ నుండి ‘శ్రీవేంకటేశం’ మాసపత్రికను, స్వామి వారి ఆజ్ఞచే ప్రారంభించాము. ఈ సేవను ప్రారంభించుటకు స్వామివారు చాలా కష్టపడ్డారు. నేను ఈ పత్రికను స్థాపించలేనని, నావల్ల కాదని, మీరు తప్పుడు వ్యక్తిని ఎన్నుకున్నారని, నాకు తెలుగు రాదని, పైగా ఇతర పనులు ఉన్నాయని చెప్పుచు ఒక 4 సం॥లు లాక్కొచ్చాను. చివరికి నేను చెప్పిన ప్రతి ఆటంకాన్ని త్రుంచివేసి, స్వామివారు చూపిన దారిని ఎన్నుకునేలా చేసాడు. ఇలా ప్రారంభమైన ఈ మాసపత్రికను కొన్ని సం॥లు నడిపి మానేద్దామని అనుకున్నప్పుడల్లా, స్వామివారు కొనసాగించమని ఆజ్ఞాపించేవారు. ఒకసారి కత్తి మెడపై పెట్టి చేస్తావా, ఛస్తావా, అన్న సందర్భం కూడా ఉన్నది. ఈమధ్య నొకసారి ఆపుదామనుకున్నప్పుడు దగ్గరి కొచ్చేసరికి దమ్మొచ్చిందా?” అంటు వ్యంగ్యంగా మాట్లాడాడు. చివరికి స్వామివారి లీలలకు ప్రతిఫలంగా దీనిని వారు స్వయంగా చాలు అనే వరకు కొనసాగించాలని నిర్ణయించుకున్నాము.




తేది: 17-02-2008 భీష్మ ఏకాదశి రోజు నన్ను ఇంజనీరింగు కళాశాలలో మాస్టర్ డిగ్రీలో చేర్పించి, ఆధ్యాత్మిక విద్యను చదివి ఉత్తీర్ణుడవు కమ్మని దిశా నిర్దేశం చేశాడు. నా యోగ్యతను పెంచుకొమ్మన్నాడు. ‘నా’ అన్నది వదిలించుకోమన్నాడు. నేను ‘నా’ అన్నది వదిలినప్పుడు ఒక బహుమానం ఇస్తానన్నాడు. ఒక రెండు పర్యాయాలు, మూడు నెలల చొప్పున సాధన చేసి బహుమానాన్ని అడిగాను. బహుమానానికి యోగ్యునివి కాలేదన్నాడు. చివరికి ఇంతకంటే ‘నా’ అన్నది ఎవ్వరు వదలలేరని, మాకు బహుమానం ఇచ్చే ఉద్దేశ్యం లేక ఈ విధంగా అంటున్నారనే భావం నా మనస్సులో ఏర్పడింది. అప్పుడు స్వామివారు నా స్థితిని తెలుపుటకని తిరుపతి నుండి శ్రీశ్రీశ్రీ హయగ్రీవస్వామివారిని గురువుగా మా ఇంటికి పంపి నా అంతరంగ స్థితిని తెలుసుకునే విధంగా చేసారు. అప్పుడు ‘నా’ అన్నది నేను వదలలేదని స్పష్టంగా తెలిసిపోయింది. ఆ రోజు నుండి నేటి వరకు నేను మళ్ళీ బహుమానమును అడుగలేదు. మరియు మీ కృప ఉంటేనె ‘నా’ అన్నది వదులుట సాధ్యమని, లేని పక్షంలో నా వల్ల కాదని ఎన్నోసార్లు చెప్పాను.

సాధన ఏ విధంగా చేయాలని నేనడిగిన ప్రశ్నకు, వందమందిలో ఉన్న ఒక సాధువు వెల్లకిలా పడుకొని, తన ముఖముపై బట్ట కప్పుకుని, మట్టిని కొప్పెరలా ముఖముపై పర్చుకొని, శ్వాస మరియు ఆహారం కోసం ప్రత్యేకమైన పైపులు ఏర్పాటు చేసుకొని ఏ విధంగా సాధన చేయుచు జీవించునో ఆ విధమైన జీవితమును గడపమన్నాడు. అంటే జనాల మధ్యన ఉన్నప్పటికీ, వారి మాటలకు ప్రభావితుడ్ని కాక, సదా శ్రీ వేంకటేశ్వరున్ని స్మరిస్తూ గడపమన్నారు. వీలైనంత వరకు ఏకాంత జీవనము గడపమన్నారు.

హరిసేవ చేయుట అత్యంత కఠినము, వెతికితే మూడు కాళ్ళ కుందేలును సహితము సాధించవచ్చునేమో గాని, హరి సేవను చేయుట అంతకంటే కష్టమని స్వయంగా అన్నమాచార్యులు అన్న మాటలివి. ఇలాంటి హరిసేవను మేము ఎంతటి కష్టమును ఎదుర్కొంటు చేయుచున్నామనే దానిని ఒక లీల ద్వారా చూపి మేము చెందే తపనను చూపెట్టాడు.

ఎంతటి స్వామివారి అనుగ్రహానికి పరవశించి, స్వామి ఋణం తీర్చుకొను నిమిత్తమై జీవితం మొత్తం అంకితం చేసి సేవ చేయుచున్నానో, ఇలాంటి అనుగ్రహాలు 14 అనుగ్రహించినట్లు చెప్పారు. ఈ మాట జూన్ 2008 న చెప్పారు. ఆ తరువాత పొందినవి అదనం అన్నమాట.

2008 లో నా భార్య సురేఖ తన బంగారాన్ని కొంత వెచ్చించి ‘నమో వేంకటేశాయ’ రథంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరుని నాలుగు మూర్తులకు బంగారు తాపడం చేయించింది. దీనికి పరవశించిన శ్రీవారు ఈ సంవత్సరపు రథయాత్రలో ఆమెను ప్రత్యేకంగా అనుగ్రహించాడు. సురేఖ ఎంతో ఆనందించింది.

అక్టోబర్ 2008 లో మా అమ్మ చనిపోవుటకు ఒకరోజు ముందు మా అమ్మ చనిపోవుచున్నదని గ్రహించి, ఆమె ప్రసాదించిన ఈ జీవితమునకు కృతజ్ఞతలు తెలిపే నిమిత్తమని ఆ రోజు వరకు నేను ఆర్జించిన మొత్తం పుణ్యంలో 3 వ వంతు ఆమె అకౌంటుకు ధారపోసి, మా అమ్మకు వైకుంఠాన్ని ప్రసాదించమని శ్రీ వేంకటేశ్వరుణ్ణి వేడుకున్నాను. స్వామివారు కూడా అనాదిగా వచ్చుచున్న మా ఇంటి శైవ సాంప్రదాయం ప్రకారం కాకుండా, వైష్ణవ సాంప్రదాయము ప్రకారం, ఆమెకు అపర కర్మలు నిర్వహించుమని చెప్పుచు, నా ప్రార్థనను స్వీకరించినట్లు సూచాయగా తెలిపారు.

మా తల్లి చనిపోయిన బాధలో స్వామివారి సేవకు కొంత అవరోధము కలిగింది. దీనిని గమనించిన శ్రీవారు ఆయన స్వయంగా మా ఇంటికి వచ్చి నా భార్యతో “నన్ను మరిచారా” అని అంటూ తిరిగి తన సేవలో నియమించుకున్నారు.

స్వామివారు ఈ విశ్వంలో ప్రతి దేశములో కలడు. అమెరికాలో కూడా ఇండియాలాగ నదులు, దేవాలయాలు, భక్తులు ఉండి పూజలు చేసుకుందురు, కాకుంటే విధి, విధానాలలో కొంత వ్యత్యాసముందునని సూచించాడు.

## స్వామివారి స్పర్శ సుఖము :

13-01-2009 : ఒక భక్తుడు, భగవంతుణ్ణి ఎన్ని రకాలుగా వాడుకోవాలో నేను అన్ని రకాలుగా వాడుకున్నాను. ఒక రకంగా ఆయనతో ఎన్నో ప్రయోగాలు (ఎక్స్పరిమెంట్స్) చేసాను. ఒకానొక సందర్భములో స్వామివారి స్పర్శ సుఖమును అనుభవించాలనిపించింది. బలి చక్రవర్తి తలపై త్రివిక్రముడు కాలుపెట్టినప్పుడు, ఆ స్పర్శ సుఖమును ఆయన ఏ విధంగా అనుభవించాడో అలాంటి స్పర్శ సుఖమును నాకు కల్పించుమని ప్రాధేయపడ్డప్పుడు స్వామివారు అదే విధంగా అనుగ్రహించారు. నేను ఎంతగా పరవశుణ్ణి అయినానంటే ఈ లోకంలో నా కంటే అదృష్టవంతుడు మరొక్కడు లేరనుకున్నాను. స్వామివారికి శతకోటి కృతజ్ఞతలను తెలుపుకున్నాను. అప్పుడు ఈ విశ్వంలో ఎక్కడ చూచినా స్వామివారే కనబడ్డారు.

19-06-2009 : మా మొదటి అమెరికా ప్రయాణానికి స్వామివారిని అనుమతి అడిగాను. అప్పుడు సౌకర్యవంతమైన జీవితమునకు, వస్తువులకు అలవాటు పడకుమని మరీ మరీ చెప్పారు. అమెరికాలో నాకు ఎన్నో ముఖ్య విషయములు బోధించారు. ఒకసారి తన పాదాలను ప్రత్యేకంగా తయారు చేసి, వాటి వద్ద మేళతాళాలతో, శ్రావ్యమైన సంగీతముతో భజనలు, పూజలు చేసేవారిని అత్యంత ఇష్టులుగ అనుగ్రహించుదునన్నారు. నన్ను దీనిని ఏర్పాటు చేయవలసిందిగా దిశా నిర్దేశం చేశాడు. ప్రపంచములో తానే అధికుడునని, పెద్దవాడినని, బ్రహ్మకడిగిన పాదమును చూపుచు హితబోధ చేసాడు.

మేము సం॥ 2009 నుండి సం॥ 2022 వరకు 15 సార్లు అమెరికా వెళ్ళి ఉంటాము. అమెరికాలో ఉన్నప్పుడు స్వామి సేవకు దూరమైన కారణంగ, స్వామిపై ఆత్రుత ఎక్కువుంటుంది. బహుశా ఇదే కారణంగ ముఖ్యమైన విషయములను నేను అమెరికాలో ఉన్నప్పుడే చెప్పారు. మరియు ప్రతిసారి నీవు సౌకర్యవంతమైన, సుఖవంతమైన జీవితానికి అలవాటు పడకూడదని పదే పదే సూచించేవారు.

## హరినామ క్షేత్ర భావన :

సంవత్సరం 2009 లో హైదరాబాద్ నుండి తిరుపతి రథయాత్ర సమయాన, గుంటూరు లోని "శ్రీరామనామ క్షేత్రం" వారు మాకు ఒక రాత్రి బస ఏర్పాటు చేశారు. ఆ క్షేత్రంలో అడుగు పెట్టగానే అందులో జరుగు అఖండ రామనామ కీర్తనలను విని పరవశించిపోయాను. వెంటనే ఆ సంస్థను ఏర్పాటు చేసిన వ్యక్తికి సాష్టాంగ దండప్రణామం చేశాను. వెనువెంటనే నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరునికి మరో సాష్టాంగ ప్రణామం చేసి ఈ సేవను నాకు ప్రసాదించమని, తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించి, మీ యొక్క అఖండ హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయుట నాకు ఇష్టమని, దీనిని ప్రసాదించమని నా ఒళ్ళు గగుర్పాటు చెందగ, కళ్ళ నుండి నీరు కారుచుండగ వేడుకున్నాను. ఈ విధంగా మొదటిసారి నా మనస్సులో ఈ భావన కలిగింది.

2009 వరకు ఆర్థికంగా ఎదుగుటకు నేను ప్రయత్నిస్తున్నాను. కాని శ్రీ వేంకటేశ్వరుడు నన్ను పై నుండి క్రిందికి లాగాడు. సం॥ 2011 నుండి మాత్రం నాలో మార్పు వచ్చి, కొంతవరకు మెరుగైన దశలో నిలకడగ ఉన్నాను. ఇప్పుడు నాలో శ్రీ భరత మహారాజు యొక్క భక్తి బీజమును నాటాడు. ఇది భవిష్యత్‌లో ఒకప్పుడు చిగురిస్తుంది.

## భజగోవిందం :

నా భాగ్యవశాత్తు సం॥ 2000 నుండి ప్రతి వైకుంఠ ఏకాదశి మరియు తొలి ఏకాదశి రోజులలో తప్పక స్వామివారి అనుగ్రహమును పొందేవాడిని. ఈవిధంగా ప్రతిసారి జరుగుటచే దీని వెనుక ఏదో మర్మమున్నదని భావించాను. అన్నట్లుగనే సం॥ 2007-2009 లో శ్రీమాన్ కె.వి.రమణాచారిగారు టిటిడి ఈఓగా ఉన్నప్పుడు 'భజగోవిందం' అనే ఒక భజన కార్యక్రమమును తిరుపతిలో ఏర్పాటు చేసారు. మరియు దీనిని ప్రతి వైకుంఠ ఏకాదశి మరియు తొలి ఏకాదశి పర్వదినాలలో హైదరాబాదులో ఏర్పాటు చేయవలసిందిగ సం॥ 2009 లో నాతో చెప్పారు. ఇది స్వామివారి ఆజ్ఞగా భావించి సం॥ 2009 నుండి ప్రతి వైకుంఠ ఏకాదశి మరియు తొలి ఏకాదశి రోజులలో హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేయుటను ప్రారంభించాము.

ఇంజనీరింగు పరీక్షలు దగ్గరికి వచ్చుచున్నవి. నేను మాత్రం ఏమీ చదువలేదు. దిగులుతో ఉన్నాను. నాతో చదివిన ఇంజనీరింగు మిత్రులను చూపి, వారు బొజ్జలు పెంచి ఉన్నారు. నీవు సన్నగ



ఉన్నావు. చూడు వారి వారి రంగములో వారు ఎదిగారు. నీవు నీ ఆధ్యాత్మిక రంగములో ఎదగవలసి ఉందని దిశా నిర్దేశం చేసారు. భౌతిక రూపులను ఆధ్యాత్మిక ఎదుగుదలతో పోల్చుచు దిశా – నిర్దేశం చేసారు.

అక్టోబర్ 2011న తిరుపతిలో స్థూపం నిండినదని, నీ ఒక సంకల్పం పూర్తయినదని సూచించారు. చక్కగ సేవ చేయుచున్నట్లు సూచించారు. మరో లీలలో నా స్వామిని ఎంతో ఉన్నతుడుగ ఊహించుకున్నాను. స్వామివారిని త్రివిక్రముడుగ, బ్రహ్మ కడిగిన పాదమును నిర్మించాలనే కోరిక కలిగింది. కాని నాకు తగిన స్తోమత లేదని ఊరుకున్నాను.

డిసెంబర్ 2011 : నా భార్య సురేఖ, మా పిల్లలు తన మాట వినని కారణంగా విసుగెత్తిపోయి, స్వామివారిని సంతోషాన్ని ప్రసాదించమని వేడుకున్నది. అన్నట్లుగనే మా పెండ్లైనప్పటి నుండి జరిగిన ఆనందకర సంఘటనలను చూపి పరవశింపచేసాడు.

అన్నీ కోల్పోయిన వేళలో కూడా అఖండమైన భక్తి శ్రద్ధలతో స్వామి సేవ చేయమన్నాడు. అన్యమతస్తుల మధ్యన నివసించు హరిదాసు జీవితము గడుపమన్నాడు. తోటి మనుషుల ఆదరణతో సంబంధంలేకుండ, ఎంతో ఆనందంగ, ప్రతిక్షణం శ్రీవేంకటేశ్వరుణ్ణి స్మరించుచు గడపమన్నారు. నీ పని నీవు చేసుకుపొమ్మన్నారు.

## పద్మపీఠం :

మార్చి – 2012 : హైదరాబాద్‌లో ఉన్న పెద్ద పెద్ద బిల్డర్స్ సరసన నేను ఉండేవాడిని. కాని నా స్వామి ఆజ్ఞచే ఎదగలేకపోయాననే చింత కలిగింది. వెంటనే నీవు 'పద్మపీఠం' అనే బిల్డింగ్‌ను నిర్మించుచున్నావని, ఆ పీఠం రాబోవు రోజులలో శ్రీ వేంకటేశ్వరునికి నిలయం కాగలదని సూచించాడు. స్వామివారు చూపిన ఎన్నో లీలల సారాన్ని మొదట్లో గ్రహించలేదు. సం॥ 2020 తరువాత, నేను కొంత యోగ్యతను సాధించిన తరువాతనే చాలా లీలలను అర్థం చేసుకున్నాను. తరువాత అర్థం చేసుకున్న వాటిలో ఇది ఒకటి.

ఏప్రిల్ – 2012 : నన్ను ఆర్థికంగా దిగజార్చి తన వద్దకు చేర్చుకొన్నందులకు స్వామివారు ఎగిరి గంతేసినంత సంతోషించారు. మరియు నన్ను ఎలాంటి వ్యామోహానికి గురి కాకూడదని పదే పదే సూచించారు.

సం॥ 2012 నుండి శ్రీ వేంకటేశ్వరుడు మరో అడుగు ముందుకు వేశారు. సం॥ 2002లో, నా కుటుంబ పోషణార్థమే వ్యాపారము చేయుటకు అనుమతించారు. ఇప్పుడు దానిని కూడా మానమని, పూర్తి సమయమును స్వామి సేవలో గడపమని, మిగిలిన మొత్తం విషయాలు తానే చూచుకొనునట్లు సందేశం ఇచ్చారు. జామచెట్టుకు బొప్పాయి కాయల సైజు కలిగిన జామ కాయలను కాయిస్తానన్నారు. నన్ను ఇంటినుండి బయటకు వెళ్ళక సాధన చేయమన్నారు.

ఒకసారి మా రథయాత్రకు ఏర్పాట్లు జరుగు సమయమున తలతిక్క గలిగిన ఒక క్రిస్టియన్ ఫోన్ చేసి నీవు రథయాత్ర లాంటి చాలా సేవలు చేయుచున్నావు. ఇంతకు స్వర్గం ఉన్నదా? అంటూ మాట్లాడాడు. ఒక రకంగా నన్ను ఆ సమాజంలోకి ఆహ్వానించాడు. ఆ సమయాన ఏదో ఒకటి మాట్లాడి ఫోన్ పెట్టేశాను. సరైన జవాబు ఇవ్వలేదని బాధపడ్డాను. దీనిని గమనించిన శ్రీ వేంకటేశ్వరుడు ఇలా అన్నాడు. "నీవు గోవిందుని చూపించగలిగితే నీవన్నట్లు చేస్తాననకపోయావా?" అని అన్నారు.

స్వామివారు ఆశించినంత కాకపోయినా, నా ఆధ్యాత్మిక స్థితి కొంత మెరుగైందని స్వామివారు కల్పించిన ఈ క్రింది లీలలద్వారా తెలిసింది.

ఒకరోజు మాటల సందర్భముగా, నేను సంపూర్ణంగా శ్రీవేంకటేశ్వరునికి అంకితమైపోయానని, నా మిత్రులతో అన్నాను. దీనికి పరవశించిన స్వామివారు ఆ రాత్రి తన దివ్య దర్శన భాగ్యాన్ని కలుగచేసి ఆనందింపచేసారు.

గుంటూరు ప్రాంతమున గల ఒక భక్తురాలు, తనకు భాగవతులకు భోజనము పెట్టాలనే కోరిక ఉన్నదని, భాగవతులను పంపి తన కోరికను తీర్చమని స్వామివారిని వేడుకొంది. అప్పుడు ఆమె కలలో కొంతమందిని చూపి వీరికి భోజనము పెట్టమన్నాడు. కొంతకాలం తర్వాత మా రథయాత్ర ఆ ప్రాంతములో తిరుగుటను చూచి ఆత్రుతతో వారు మమ్మల్ని రాత్రి భోజనానికి రమ్మని ఫోన్ ద్వారా ఆహ్వానించారు. భోజనానంతరము శ్రీ వేంకటేశ్వరుడు చూపింది నన్నేనని, నా రూపు, వేషధారణ తనకు ఇంకా గుర్తుందని, తన కళ్ళలో ఆనందబాష్పాలు తిరుగుతుండగా చెప్పి ఆనందించింది.

ఒకసారి మా రథయాత్రను కర్నూలులో పోలీసువారు అడ్డగించారు. తిరగనివ్వలేదు. ఈ విషయాన్ని స్వామివారికి అత్యంత తొందరగ తెలపాలని భావిస్తూ పడుకున్నాను. ఆ రాత్రి కలలో కొన్ని వేల మంది భక్తులు, తమ విన్నపాలను స్వామివారికి విన్నవించ వేచి చూస్తున్నప్పటికీ, ఎవ్వరూ అడ్డగించని, అంతరంగికులు వెళ్ళే మార్గంలో స్వామివారి వద్దకు వెళ్ళాను. అంటే నేను స్వామివారి అంతరంగికుణ్ణని అర్థం.

అయినప్పటికి, నాకు ఇప్పటివరకు స్వామిపట్ల సమర్పణ స్థితి సగము మాత్రమే పెరిగిందని సూచించాడు. ఇంకా చాలా ఎదగవలసిందని దీని భావం. ఇదే సమయంలో నీవు వ్యాపారం చేసినచో దాని ఫలితమును నీకు దక్కనివ్వనని, పూర్తిగా మానివేయమని, సాధన చేయమని ఆదేశించారు.

15-12-2012 : సం॥ 2000 ప్రాంతములో శ్రీమహాలక్ష్మీ అనుగ్రహము లభించింది. కాని ఆ తరువాత రోజులలో ఆమె అనుగ్రహము శ్రీ గోదాదేవి రూపంలో మాత్రమే లభించేది. ఒక సందర్భములో నేను 'భజగోవిందం' మరియు ఇతర కార్యక్రమాలను చేయుటలోని ముఖ్య ఉద్దేశ్యమును ఒక తమిళ పాశురమును పాడి తెలిపింది. దాని అర్థం నేను 'గోవిందుని పొందుట'కని అన్నది.

## జన్మ జన్మల సేవను ప్రసాదించుట :

17-01-2013 : ఈ రోజు స్వామివారు ఒక మహత్తరమైన వరమును ప్రసాదించారు. నేను ఏ రోజు స్వామివారిని మోక్షం కోరలేదు. ఎన్నో జన్మలు మానవునిగా జన్మనిచ్చి, మీ సేవాభాగ్యాన్ని ప్రసాదించమని పదే పదే వేడుకున్నాను. అన్నట్లుగనే ఆ వరం ఈ రోజు ప్రసాదించారు. పూర్వం అల్పాయుష్కుడైన మార్కండేయుణ్ణి ఏ విధంగా పూర్ణాయుష్కునిగ చేసాడో నిన్ను కూడా ఆ విధంగా అనుగ్రహించుదునన్నారు. అంటే ఎన్నో జన్మలు మానవునిగ జన్మనిచ్చి, తన సేవాభాగ్యమును ప్రసాదించునన్నమాట. ఇలాంటి చాలా అనుభూతులు గతంలో అర్థం కాలేదు. కాని ఈ మధ్యన వాని అర్థములు తెలుస్తున్నవి. దీనిని మా తోటబావిని ఉపయోగించి బోధించారు కావున నేను స్వామి సూచించినట్లు హరినామ క్షేత్రమును ఏర్పాటు చేస్తేనే ఈ వరం లభించునని స్వయముగా నేను భావించుకున్నాను.

స్వామివారు నన్ను తన వద్దకు చేర్చుకొనుటకు ఆరోగ్య సమస్యలను కల్పించేవారు. దీనిని గమనించక, నేను చాలా రోజుల నుండి డయాబెటిక్ కావడం వల్ల దాని ద్వారా 'నీరోపతి', మోకాళ్లనొప్పులు లాంటివి వచ్చాయని భావించాను. చాలా బాధపడ్డాను. రకరకాల మందులను వాడాను. చివరికి మీరు చెప్పినట్లు వింటాను తగ్గించమని వేడుకున్న తరువాత స్వామి కరుణించారు. జబ్బులు చాలా తగ్గినవి.

31-08-2013 : 11వ జప సమర్పణను స్వీకరించారని చెప్పుటకు మా తండ్రిని చూపమన్నాను. ఆ రాత్రి, చనిపోవుటకు 20 ఏళ్ళ ముందట ఉన్న రూపంగా మా తండ్రిని నాకు చూపాడు. మరియు 'నా' అన్నది వదలమని, ఉన్నంతలోనే తృప్తి చెందమని మా తండ్రి నాకు హితబోధ చేసాడు. మరో లీలలో మా ఊరిలోని తోటబావి వద్ద కల భూములు విలువ కలవిగ మారునని, అక్కడ బహిర్భూమికి వెళ్ళుటకు స్థలం దొరకక ఇబ్బందిగ ఉండునని అన్నాడు. ఒక సందర్భంలో గంగ, తన యొక్క ఒక పాయను ఈ స్థలానికి దగ్గరగ తెచ్చునని అన్నారు. తిరుమలలో వైఖానస ఆగమ పండితులు శ్రీమాన్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు ఎవరినైతే పూజించుదురో వారు నీ సొంతం కాబోతున్నారని సూచనలిచ్చారు.


05-12-2013 : మా అమ్మకు వైకుంఠం ప్రాప్తించిందని తెలుపుటకు, నేను ఒక షరతును విధించాను. దాని ప్రకారం, మా అమ్మ వైకుంఠంలో శ్రీమహాలక్ష్మి అమ్మతోపాటు ఉంటుంది కాబట్టి, ఆ ఇద్దరిని నా వద్దకు పంపి, నా ఒకే చూపులో ఇద్దరిని దర్శించేటట్లు అనుగ్రహించమన్నాను. స్వామివారు అదేవిధంగా చేసి నన్ను పరమానందభరితుణ్ణి చేసారు.

గతంలో 'శ్రీ వేంకటేశం' మాసపత్రికను అత్యంత కష్టసమయంలోనైనా విడువక కొనసాగించమన్నాడు. ఎన్నో క్రొత్త విషయాలు సేకరించి ప్రచురణార్థం పెట్టుకుని, ఇవి బాగున్నవా ప్రభూ! అంటూ అడిగాను. దానికి ఎంతో సంతోషించి, రాబోవు నా పుట్టిన రోజుకు స్వామి ప్రసాదమును పంపమని తన అనుచరులకు ఆజ్ఞ ఇచ్చాడు. అనుకున్నట్లుగానే తేది 08-07-2014 తొలి ఏకాదశి రోజు, నేను తిరుపతికి పోయి స్వామి ప్రసాదం తినడం జరిగింది.

నా భార్య సురేఖకు ఒక అనుమానం వచ్చింది. మా వయస్సు మళ్ళిన తరువాత స్వామివారి సేవను ఎవరు కొనసాగించుదురు అనే ప్రశ్నకు 'ఇది కొనసాగుతుంది' మీ స్థానంలో ఇతరులు రాగలరని సూచించాడు.

23-11-2014 : రాబోవు హరినామ క్షేత్రములో తాను భక్తులను ఉద్ధరించుదునని, భక్తులు వారి వారి పనులను వదలి తన వద్దకు వచ్చే విధంగా, సమ్మోహితులను చేయుదునని చూపాడు. నాపై ఆ సమ్మోహన శక్తిని ప్రయోగించాడు. దీనితో నేను మరింత మారిపోయాను. లౌకిక విషయాల పట్ల ఆసక్తి మరింత తగ్గింది. వ్యాపారాన్ని పూర్తిగ మానివేసాను.

మా తల్లి గారితో మా కుటుంబం..



## మా తండ్రి ఆజ్ఞాపించుట :

15-12-2014 : ఈ అనుభూతి అత్యంత ముఖ్యమైనది. హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయాలని అనుకుంటున్న సమయాన వచ్చింది. సం॥ 1990 లో స్వర్గస్తులైన మా తండ్రిని నా వద్దకు పంపి, నేను హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయవలసిందిగ నాకు చెప్పించాడు. అప్పుడే నీ ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు సంతోషించునని, మరియు నేను ఆయనకు కొడుకునైనందున తాను తృప్తి చెందునని కూడ మా తండ్రి నాతో అన్నాడు. వెంటనే పూర్వం ''దశరథుని మాటను శ్రీరాముడు ఏ విధంగా పాటించాడో నీవు ఆ విధంగా మీ తండ్రి మాటను పాటించు'' అనే భావనను నా హృదయంలో శ్రీ వేంకటేశ్వరుడు కలలోనే కల్పించాడు.

జనవరి 2016 : ఈ జన్మలో నేను స్వామివారి ఎన్నో అనుగ్రహాలకు పాత్రుడినయ్యాను. దీనికి కారణం ఈ జన్మను ప్రసాదించిన మా అమ్మ అని భావించాను. కాని ఇప్పుడు ఆమె లేదు, చనిపోయింది. ఆమె బ్రతికి ఉన్నప్పుడు కృతజ్ఞతలను




తెలుపుకోలేకపోయాను. కావున ఒకసారి మా అమ్మను నా వద్దకు పంపి నా కోరికను తీర్చుమని ప్రార్థించాను. అనుకున్నట్లుగానే మా అమ్మను ఆమె చనిపోవుటకు 20 సం॥ల ముందట ఉన్న రూపంతో నా ముందు నిలిపాడు. అత్యంత పరవశంతో ఆమె కాళ్ళను, చేతులను పట్టుకొని ముద్దాడి నాకు ఇంతటి జన్మను ప్రసాదించినందులకు కృతజ్ఞతలను తెలుపుకున్నాను.

తేది 05-02-2016 నాడు తిరుమలలో శ్రీ స్వామివారి (వస్త్రాలంకరణ సేవను) అభిషేకమును చేసాము. కాని స్వామివారిని నా తనివితీర దగ్గరనుండి చూడలేదని బాధపడ్డాను. అందుకని తేది 07-02-2016 హైదరాబాద్‌లో నా ముఖములో ముఖము పెట్టి అత్యంత దగ్గరగ చూడు చూడు అంటూ చూపెట్టాడు ఆ స్వామి.

07-04-2017:ఒక స్వామీజీచే ఒక జపమాల బహూకరించి, ''శ్రీనివాస గోవింద శ్రీ వేంకటేశ గోవింద'' అనే మహా మంత్రమును అఖండ హరినామ స్మరణ చేయుమని సూచించాడు.

28-07-2017 : సం॥ 2018 తరువాత 'శ్రీవేంకటేశం' మాసపత్రికను మానేద్దాం అనుకున్నాను. కాని శ్రీ వేంకటేశ్వరుడు మాత్రం ఇంకా కొనసాగించమని తీవ్రంగా హెచ్చరించాడు.

26-04-2018 : నన్ను నేను ఆత్మ విమర్శ చేసుకున్నాను. ఈ లోకంలో అంతా మిథ్య అని, శ్రీవేంకటేశ్వరుడు ఒక్కరే నా వాడని, ఆ విధంగానే జీవించాలని అనుకున్నాము. రథయాత్ర సం॥ 2020 వరకు మరియు జప సమర్పణ జీవితాంతము కొనసాగించాలని నిర్ణయం చేసుకున్నాము.

06-09-2018 : ఈ రోజు స్వామివారికి 16 వ 7 కోట్ల జపసమర్పణ కావించాము. మొత్తం 16 సం॥ల జప సమర్పణ, రథయాత్ర, 'శ్రీవేంకటేశం' పత్రిక మొత్తం ఫలితం మీకు చెందాలని శ్రీవారికి ధారపోశాను. మరియు ఆ ఫలితంచే బొట్టు పెట్టి, ఇంటికి ఆహ్వానించాను. కాని ఈనాటి కలలో నీవు ఇంకా పరీక్ష పాస్ కాలేదని చెప్పాడు.


06-07-2019 : ఇది సురేఖకు వచ్చిన కల. ఒక పెద్ద పాము, దానికి ఇరుప్రక్కల వేల సంఖ్యలో పాము పిల్లలు కలవు. అంటే బహుశా, స్వామి కృప విస్తరించుచున్నదని భావం కావచ్చు.

03-04-2019 : స్వామి సూచించినట్లు తిరుపతి నుండి శ్రీ హయగ్రీవ స్వామివారి విగ్రహమును తెచ్చి, గురువుగ భావించుచు, ఇంటిలో పూజ చేయడం ప్రారంభించాము. ఈ రోజు ఒక చెరువులో ఒక గట్టు నుండి మరో గట్టుకు ఈదుటను చూపెట్టాడు. అంటే గురుదేవుల కృపతో ఈ జీవితంలో సాధించవలసిన లక్ష్యమును సాధించగలనని అర్థం.

29-12-2019 : సురేఖను ఉన్నట్లుండి తిరుపతికి తీసుకెళ్లి తన దర్శనము చేయించి తిరిగి పంపాడు.

07-03-2020 – ఒక భావన: 01-07-20 తొలి ఏకాదశి వరకు నా వయస్సు 60 అవుతుంది. రథయాత్రను నిలుపుదునని, స్వామి లీల ఏమైన ఉంటే తప్ప ఇది జరగదని అనుకున్నాము. అప్పుడు స్వామివారి నుండి ఈ విధమైన సందేశం వచ్చింది. నీ ఇద్దరి పుత్రులను చదివించి యోగ్యులను చేసి స్వామివారు సూచించిన అమ్మాయిలతో పెండ్లిళ్ళు కూడా జరిపించావు. బాధ్యతలను తీర్చావు కాబట్టి ఇప్పటి నుండి మీ మనస్సును ఎప్పుడూ భగవంతుడు మెచ్చే విధంగా ఉంచమనే సందేశమును పొందాను.





## శ్రీ శ్రీనివాస కళ్యాణాలు :

01-07-2020 : తొలి ఏకాదశి 2020 నాటికి నా వయస్సు 60. అప్పటి కోవిడ్-19 కారణంగా, భజగోవిందంను ఏర్పాటు చేయక, ఏకాంతంగ మా ఇంటిలో కేవలం 8 మంది సమక్షంలో శ్రీనివాస కళ్యాణమును జరిపించాము. ఇంత పెద్ద స్వామికి ఏకాంతంగా సేవ చేయుట సహించలేక, చిన్నతనంగ భావించి బాధపడ్డాను. ప్రతీకారేచ్ఛతో, వెంటనే స్వామివారికి భక్తులు భాగస్వాములుగా ఎన్నో కళ్యాణాలను, వేలమంది సమక్షములో జరిపించాలనే కోరిక కలిగింది. ఈ సేవను ప్రసాదించమని దీనంగా వేడుకున్నాను. స్వామివారు ప్రసాదించారు.

19-07-2020 : కళ్యాణాల విధి విధానాలను వ్రాసుకున్నాము. మొత్తం 111 ఉచిత శ్రీనివాస కళ్యాణాలను ఆసక్తి గల భక్తుల వద్ద నిర్వహించాలి. ఈ కార్యక్రమము ద్వారా ఆసక్తి గల అందరికీ స్వామి కృప లభించే విధంగా, వీలైనంత ఎక్కువ మందికి లభించే విధంగా చేయమన్నారు. మరియు నేను జన్మించిన మా అమ్మమ్మ గ్రామము అప్పనపల్లిలో, మా సొంత గ్రామము చిన్న గుండవెల్లిలో తప్పక నిర్వహించమన్నారు. కేవలం మొదటి కళ్యాణం మాత్రమే నేను సంపూర్ణ ఆర్థిక భారాన్ని భరించి చేయాలి, మిగతా కళ్యాణాలు మాత్రం, నేను భాగస్వామిగ ఉంటూ భక్తులచే చేయించాలి. అంటే కళ్యాణపు ఖర్చు నేను మరియు నిర్వాహకులు కలిపి భరించాలి. కళ్యాణం శాస్త్రోక్తంగా ఎలాంటి తప్పులు లేకుండ, లాజహోమంతో పాటు జరగాలి. నిర్వాహకులను ప్రోత్సహించుచు, వారి వెనుక ఉండి ఎలాంటి తప్పులు లేకుండ జరిపించే బాధ్యత నాది. ఇది ప్రధాన నియమం. ఒక సం॥లో 7 కళ్యాణాలు కంటే తక్కువ కాకుండా నిర్వహించాలి. సం॥లో జరిపినన్ని కళ్యాణాలు 111 సంఖ్యలో లెక్కించబడును. ఈ నియమాలను ఏర్పరచుకొని కళ్యాణాలను మొదలు పెట్టాను. శ్రీ వేంకటేశ్వరుడు కూడా ఈ నియమాలను ఆమోదించుచు, నన్ను ప్రోత్సహించాడు. నేను ఒక్కరోజు కూడ స్వామి ఋణ విముక్తుడనై ఉండకూడదని భావించి, దసరా-2020 నుండి ఈ కళ్యాణాల కార్యక్రమమును ప్రారంభించుచున్నట్లు స్వామి వారితో విన్నవించాను. అప్పుడు కోవిడ్ -19 లాక్‌డౌన్ వలన ఏ పని జరుగక మొదటి సం॥లోనే నేను ఓడిపోతాననుకున్నాను. అంటే దసరా - 2021 వరకు 7 కళ్యాణాలు చేయలేనని భయపడ్డాను. కాని శ్రీ వేంకటేశ్వరుడు మాత్రం, "నీవు ఈ కళ్యాణాల కొరకు ఏర్పాటు చేయుచున్న విగ్రహాలను, సింహాసనాలను సేకరించు" ఆ తరువాత ఆరంభించుటకు పరిస్థితిని కల్పించుదునని మాట ఇచ్చాడు. నా కంటే వారికే తొందరెక్కువ ఉన్నదని సూచించాడు. మరో సందర్భములో నా కోరిక మేర 'శ్రీ ఆండాళ్' మాత కనబడి తాను కళ్యాణాలకు సిద్ధం అని, నిర్వహించు బాధ్యత నీదేనని అన్నది.

ఒక సందర్భములో మీరు ఈ కళ్యాణాలను స్వయంగా కోరుకున్నట్లైతే, ఒక భక్తుని కలలో ఈ శ్రీవారి ఉచిత కళ్యాణ ఉత్సవ

కలను చూపి, అందులో నన్ను చూపించి, వారు నాతో ఇలా కల కన్నామని, నన్ను చూచామని చెప్పాలని, అప్పుడు ఇది శ్రీవారే స్వయంగా చేయించుకున్నటుల నేను భావించి సంతోషించుదునని అన్నాను. అది అట్లే జరిగింది. శ్రీవేంకటేశ్వరుడు ఈ కళ్యాణాలను తిరుమల సాంప్రదాయమైన వైఖానసాగమోక్తంగ జరిపించమన్నారు.

తేది 06-09-2020 గోకులాష్టమి రోజు కోవిడ్-19 వలన రథయాత్ర నిర్వహించకనే 18వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ జరిగింది.

మరోప్రక్క నాలో 'శ్రీవేంకటేశం' మాసపత్రికపై మరోసారి నిరాశ ఎక్కువైంది. అసలు ఈ పత్రిక నా ద్వారా ఎందుకు నడిపించుచున్నారు, దీని ద్వారా ఏమిటి లాభం అని కూడా ఆలోచించాను. ఈ మధ్యన దీనిని చదువు వారు చాలా తగ్గారు. కాబట్టి పత్రిక నడుపుటలో ఆసక్తి తగ్గింది.

ఒక సందర్భంలో 'నా' అన్నది నశింపచేసుకుని జీవిస్తున్న, 95 సంవత్సరాల వయస్సు కలిగిన 'యాదమాత' అనే స్వామివారి భక్తురాలితోసంభాషించు సమయాన స్వామివారు నన్ను 'నా' అన్నది వదిలించుకోమన్నారు, కాని సాధ్యం కావట్లేదని అన్నాను. అసలు ఇది ఎందుకన్నారో నాకు ఇంతవరకు తెలియదన్నాను. అప్పుడామె "ఏ విధంగానైతే పశువును త్రాడుతో గుంజకు కట్టేస్తారో ఆవిధంగా మనస్సును కట్టేయమన్నది. మరియు దీనిద్వారా భగవంతునికి మరింత దగ్గరవుతాము". అంతే అని నిరుత్సాహంగానే అన్నది. వెంటనే శ్రీవేంకటేశ్వరుడు ఈ రోజు రాత్రి లీలలో నీవు 'నా' అన్నది వదిలితే త్వరగా లక్ష్యాన్ని చేరేవాడివని 'నా' అన్నది వదలనందున ఎక్కువ కష్టపడుచున్నావని చెప్పుచు, నీవు లక్ష్యాన్ని చేరుకోగలవనే విశ్వాసాన్ని వ్యక్తపరిచాడు. ఆ లీల ఈ విధంగా ఉంది.

లీల : లక్ష్యం కాశీ చేరుట : త్వరగా చేరుటకు స్వామివారు ఒక హెలికాప్టరును ఏర్పాటు చేశారు. కాని నేను ఆ హెలికాప్టరు తోకను రెండు చేతులతో పట్టుకుని గాలిలో వ్రేలాడుతు ప్రయాణించవలసి ఉంది. రెండు చేతులతో తోకను పట్టుకున్నాను. ఇంతలో కాశీ వెళ్ళుటకు రెండు గంటల సమయం పడుతుంది. ఈ మధ్యన చేతులు నొప్పి పెట్టి, వదిలేస్తే ఎలా? అనే అనుమానం వచ్చింది. చివరికి ఏమైన సరేనని చేతులు పట్టు విప్పి మరోసారి గట్టిగా పట్టుకోబోయాను. ఇంతలో హెలికాప్టరు లేచిపోయింది. దీనికి చాల చింతించిన నేను క్షణం ఆలస్యం చేయకుండ కాశీ వైపు ప్రయాణం సాగించాను. నదిని దాటుటకు తిరుక్కుంటూ వెళితే ఆలస్యమవుతుందని, ఈదుచు ఆవలి వైపు వెళ్ళాను. కాశీకి వెళ్ళు బస్సు ఆలస్యమును తట్టుకోలేక ఆ దారిన కొంత దూరమైన వెళ్ళు వాహనాలను ఎక్కి వెళ్ళుచున్నాను. క్షణం విరామం తీసుకొనుటను సహించక ప్రయాణించుచున్నాను. తెలిసినవారు "ఇది మధ్యరాత్రి. తెల్లారేవరకు విశ్రమించి వెళ్ళమని" చెప్పినా వినలేదు. వాహనములు లేనిచోట పరుగిడుచున్నాను. చివరికి దగ్గరగా ఉండు అడ్డదారిలో వ్యవసాయ భూముల గుండా, గుట్టల గుండా ప్రయాణించి కాశీ చేరుకున్నాను. ఈవిధంగా నేను 'నా' అన్నది వదలనప్పటికీ తపన, పట్టుదల ఉన్నవి కావున కష్టపడి లక్ష్యాన్ని చేరుకోగలవని సూచించాడు. మరోసారి నీవు లక్ష్యాన్ని చేరే వరకు ఏదో ఒక సేవ రూపములో స్వామిని స్మరిస్తూ, భక్తులచే స్మరింపచేయుచు జీవించాల్సిందే అంటూ దిశా నిర్దేశం చేసాడు.



## అనుభూతులను చదువమని కోరుట :

గత రెండు రోజుల నుండి నీ గత అనుభూతులను చదువమని చెప్పుచున్నప్పటికి, మనస్సు నిలకడగ లేక రేపుమాపు అంటు పొడిగించాను. కాని తేది 27-11-2020 మాత్రం అత్యంత తీవ్రస్థాయిలో హెచ్చరించాడు. నీకు చెప్పితే వినబడుట లేదా అంటూ ఘాటుగా మాట్లాడాడు. భయపడిపోయాను. మరో ప్రక్క ముసి ముసిగ నవ్వుకున్నాను. మీరు నా ప్రభు, నేను మీ సేవకుడిని, నాపై మీకు అధికారముంది, కాబట్టి కోప్పడ్డారని, భర్త భార్యను కోపించినప్పుడు, ఆమె ఎలాగ లోలోన నవ్వుకుంటదో అలా నవ్వుకున్నాను. తరువాత నా గత అనుభూతులు వ్రాసిన 6 పుస్తకములను వెతికాను. అవి దొరకలేదు. ఆ పుస్తకాలు నా ఆస్తి అని అవి నాకు ఎంతో విలువైనవని, తిరిగి ప్రసాదించమని, ప్రతిగా మీరు చెప్పినట్లు జీవితాంతం సేవ చేస్తానని, 'శ్రీవేంకటేశం' మాసపత్రికను మీరు చాలు అనేవరకు నిర్వహించుదునని రకరకాలుగా వేడుకున్నాను. చివరికి తేది 18-08-2009 నుండి 25-02-2011 మధ్య పొందిన అనుభూతులు తప్ప కొన్ని జిరాక్స్ రూపములో మరికొన్ని ఒరిజినల్స్ గ లభించినవి. అనుభూతులను చదువుట ప్రారంభించాను.

తేది: 11-12-2020 రోజున మొత్తం 18 సం॥ల సేవాఫలమును ధారపోసి స్వామివారికి మళ్ళీ బొట్టు పెట్టాను. కాని ఎలాంటి లాభం లేకపోయింది. చివరికి గత అనుభూతులను చదివే క్రమములో, మొత్తం జప సమర్పణ కాలములో 2 సార్లు తప్పు జరిగినట్లు గమనించాను. స్వామివారితో ఒప్పందం ప్రకారం కేవలం ఒక తప్పుకే పరిమితి, రెండవ తప్పు, నేను తప్పు చేయనప్పటికి విధి వక్రీకరించి జరిగింది కాబట్టి ఓడిపోయాను.

నిజానికి జప సమర్పణ సం॥ 2002 నుండి 2018 వరకే, సం॥ 2003లో మొదటి జప సమర్పణలో 70 వేల మంది భక్తులు భాగస్వాములు కాకుండనే సమర్పించాము. కాని మొదటి తప్పు కాబట్టి, స్వామివారు క్షమించి స్వీకరించారు. మరియు ఇలాంటి తప్పులను అధిగమించుటకు, 'నమో వేంకటేశాయ' రథమును తయారుచేసి త్రిప్పమన్నారు. దీనితో ప్రతి సం॥ము 70 వేల కంటే ఎక్కువ మందిని భాగస్వాములుగ చేర్చాము. నిజానికి ప్రతి సంవత్సరము సమర్పించే 7 కోట్ల జపములో 70 వేల మందిని భాగస్వాములుగ చేర్చుటనే ముఖ్య విషయము కాదు. దీనితో పాటు, స్వామివారికి కాని వారి భక్తులకు కాని మా వల్ల ఎలాంటి పొరపాటు జరగకుండా చూచుకునేవారిమి. స్వామిసేవలో అడుగడుగునా ఆటంకాలు ఎదురయ్యేవి. వీటిని సమర్థవంతముగా చేయాలనే తపనచే స్వామివారిని దీనాతి దీనంగా వేడుకునేది.

## పందెంలో ఓడిపోవుట :

గతంలో మా అమ్మకు నా 3 వ వంతు పుణ్యం ధారపోయుటలో 2 సం॥ల జప ఫలితము కోల్పోయాను. ఫలితంగా 16 సం॥లు నిండుటకు సం॥ 2020 వరకు జప సమర్పణ కావించాలి. కాని సం॥ 2020లో కోవిడ్ -19 కారణంగా రథయాత్ర చేయకనే 70 వేలమంది భక్తులు భాగస్వాములు కాకుండగనే 7 కోట్ల జపసమర్పణ చేసాము. ఫలితముగా రెండవ తప్పు జరిగి ఓడిపోయాను. అనుభూతులను చదివే క్రమములో తేది: 16-12-2020రోజున నేను ఈ సంకల్పములో ఓడిపోయానని గ్రహించాను. నా కోసం స్వామివారి కష్టమును చూచి చలించిపోయాను. నేను ఒక అయోగ్యుడైన సేవకునిగ కుమిలిపోయాను. శ్రీవేంకటేశ్వరుని కీర్తికి కళంకం తెచ్చేవాడిగ భావించుకున్నాను. దుఃఖించాను. జీవితంపై విరక్తి కలిగింది. అపరాధభావంతో తల దించుకున్నాను. నేను సరిగ పని చేయనందులకు స్వామివారికి నాపై కోపం వచ్చిందని, దానిని శాంతింప చేసి తిరిగి ప్రసన్నుణ్ణి చేసుకొనుటకు, రకరకాలుగ ప్రయత్నించుచు దుఃఖిస్తున్నాను. ఒకరోజు మీకు నాపై ఇష్టం ఉంటే సం॥ 2000-2003 వరకు నాకు ప్రసాదించిన ఆనంద స్థితిని తిరిగి ప్రసాదించమని కోరాను. అప్పుడు స్వామిని స్మరించినంతనే, నా కళ్ళనుండి ఆనంద బాష్పాలు రాలేవి. మైమరచిపోయేవాడిని. ఈ స్థితిని తిరిగి ప్రసాదించమన్నాను. వెంటనే స్వామివారు, 24 గంటలలోపే ఇలా ప్రసాదించారు :- "శ్రీవేంకటేశం" మాసపత్రికలో ప్రచురణార్థం శ్రీమాన్ రాళ్ళబండి శ్రీనివాసన్ గారు పంపిన 'రామాయణం రత్నాకరం' అనే ఆర్టికల్ ను చదువుచున్నాను. అది భరతుడు అడవిలో ఉన్న శ్రీరాముణ్ణి చేరే ఘట్టమును చదువుచున్నాను. నా మనస్సులో స్వామిపట్ల ప్రేమభావం ఉప్పొంగింది. భరతుడు శ్రీరాముణ్ణి చూచి 'అన్నా' అని సంబోధించాడు. కాని నేను మాత్రం " ప్రభూ!" అంటూ స్వామివారిని గట్టిగా సంబోధించుచు రోమాంచితుడనై ఏడ్చాను. ఇది ఒకసారి కాదు, ఈనాడు ఈ ఘట్టం చదివే సమయాన మొత్తం నాలుగయిదు సార్లు నా కళ్ళనుండి ఆనంద బాష్పాలు రాలినవి. ఇలా నేను కోరినట్లు ప్రసాదించుట వలన మనస్సు తేలికైంది. తెల్లవారినుండి మళ్ళీ దుఃఖించుట మొదలుపెట్టాను. దుఃఖాన్ని ఆపుకోలేకపోవుచున్నాను. దీనిని గమనించిన శ్రీవేంకటేశ్వరుడు చివరికి నీవు భాగవతుల ఆశీర్వాద ఫలముచే గెలిచావన్నారు, దుఃఖించకుమన్నారు. అంటే భాగవతుల ఆశీర్వాదమనే గ్రేసు మార్కులచే గెలిచావని అర్థం.

## జప సమర్పణ ఫలితమును భాగవతులకు పంచుట :

ఇలా నాకు కేటాయించిన సేవలో ఇతరుల జోక్యాన్ని జీర్ణించుకోలేదు. పైగ నా గెలుపుకు భాగవతులే కారణమని భావించి సంపూర్ణ విజయమును వారికే చెందునట్లు అనుగ్రహించమని కోరి నాకు, నా వయస్సును దృష్టిలో పెట్టుకొని మరో అవకాశమును ప్రసాదించమని దీనంగ వేడుకున్నాను. అన్నట్లుగానే ఈ జప సమర్పణ ఫలితమును భాగవతులకు పంచి పెట్టినారు. నాకు శ్రీ శ్రీనివాస కళ్యాణములను రెండవ సేవగ ప్రసాదించారు.

నేను గత 18 సంవత్సరాలు ఎంతో శ్రమించి, అటు భగవంతునికి ఇటు భక్తులకు ఎలాంటి లోటు రానీయకుండ సేవ చేసినప్పటికి ఎలా ఓడిపోయాను, విధి ఎలా వక్రీకరించింది. అసలు ఇది శ్రీవేంకటేశ్వరుని లీలనే అనే నిజమును తెలుసుకున్న వెంటనే

నీవు 'భరతుణ్ణి' అనుసరించమంటూ పదే పదే సూచించాడు. అంటే ఎలాగైతే శ్రీ భరతుడు, శ్రీరాముని రాక కోసం 14 సం॥లు వేచి చూచాడో అదేవిధంగా నేను కూడ వీలైనంత వరకు 'నా' అన్నది నశింప చేసుకొని, శ్రీవేంకటేశ్వరుని కోసం రోజులు లెక్కిస్తూ వేచి ఉండమన్నారని భావించుకున్నాను. మరియు శ్రీనివాస కళ్యాణాలను రెండవ సేవగ ఆనందంగా స్వీకరించాను. అలా ప్రతి 7 కళ్యాణాలను ఒక మెట్టుగా భావించినచో మొత్తం 111 కళ్యాణాలు 16 మెట్లు కాగలవు. ఈ 16 మెట్లు ఎక్కి స్వామివారిని చేరుకోవలసి ఉంది. మరియు ఈ కళ్యాణాలు 3వ వంతు పూరించిన తరువాత 'తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ – నా దశ'' అనే శీర్షికతో మీ అనుభూతులను 'శ్రీ వేంకటేశం' మాసపత్రికలో, ఆన్‌లైన్‌లో ప్రచురించే భాగ్యమును ఇవ్వమని వేడుకున్నాను. (మార్చి –23 వరకు 41 కళ్యాణాలు పూరించాము. 3వ వంతు పూర్తయినాయి. కావున, ఏప్రిల్–23 నుండి అనుభూతుల ప్రచురణకు అనుమతించారు)

గతంలో చేసిన తప్పులను చేయకుండ, అత్యంత జాగ్రత్తగా, స్వామి ఆదేశానుసారం నడుచుకుంటు, సంకల్పం పూరించాలనుకున్నాను. దీనికి తగినట్లుగానే మాలో స్వామిపై తప్ప మరే ఇతర విషయాల పట్ల శ్రద్ధ లేకుండునట్లు తన లీలల ద్వారా చేశాడు.

## సంకల్ప సిద్ధే లక్ష్యంగ ఎదుగుట :

ఎన్నోసార్లు రథయాత్ర ప్రారంభ సందర్భముగా మా ఇంటికి వచ్చిన శ్రీశ్రీశ్రీ వ్రతధర్ నారాయణ రామానుజ జీయరు స్వామివారు ఎప్పటికి ఒక మాట చెప్పేరు.

**కౌన్ కహెతేహై భగవాన్ ఆతే నహీ, ద్రౌపదీకి తరహా బులాతే నహి**

**కౌన్ కహెతేహై భగవాన్ ఖాతే నహీ, శబరీకి తరహ ఖిలాతే నహి!**

అంటే మనము ఆర్తితో పిలిస్తే భగవంతుడు తప్పక మన ఇంటికి వచ్చునని దీనర్థం. ఈ మాట నా మనస్సులో మరీ మరీ గుర్తుకొచ్చింది.

ఒక సందర్భంలో నా కొడుకు ప్రవర్తన నన్ను తీవ్రంగా బాధించింది. ఎంతో కష్టపడి, పైసా పైసా కూడబెట్టి యోగ్యుణ్ణి చేసిన తరువాత నన్ను తిరస్కరించుటచే కుమిలి కుమిలి పోయాను. జీవితంలో శ్రీ వేంకటేశ్వరుడు తప్ప మరొకరు నావారు కారనుకున్నాను. వెంటనే శ్రీ వేంకటేశ్వరుడు కలగజేసుకొని 'లోకం నడిచే క్రమంలో నీవు ఇద్దరు పుత్రులకు జన్మనిచ్చినంత మాత్రాన వారు నీ వారు కారు, నీ మాట వినరు, లోబడి ఉండర'ని అన్నారు. 'తామరాకుపై నీటి బొట్టులాగ, అంటీ అంటనట్లు జీవితాన్ని గడుపుచు' నీ లక్ష్యం వైపు పయనించమన్నారు. పైగా దీనిని నా జీవితాంతం గుర్తుపెట్టుకొమ్మని పదే పదే చెప్పారు. దీని ద్వారా శ్రీ వేంకటేశ్వరునిపైన మరింత ప్రేమ ఏర్పడింది. నా మనస్సు చాల వరకు మారిపోయింది. స్వామి సేవలో డబ్బును మరింత ఆనందంగ ఖర్చు చేయాలనిపించింది. ఎలాగైన స్వామివారి సంకల్పసిద్ధే లక్ష్యంగా పని చేయాలనే ధృఢ సంకల్పం కలిగింది. తీవ్రంగా సాధన చేయసాగాను.



నేను స్వామి సేవలో ఓడిపోయి, తరువాత స్వామి సంకల్పసిద్ధే లక్ష్యంగా పెట్టుకొని, ఇతరములైన ఏ విషయాలపై మమకారమును త్యజించిన తరువాతనే, స్వామి కల్పించిన లీలల యొక్క అర్థమును సరైన విధంగా అర్థం చేసుకునే జ్ఞానం కలిగింది. స్వామివారు కూడా ఈ స్థితిని పొందిన తరువాతనే తన ఉద్దేశ్యమును, సంకల్పమును తెలిపారు.

ఎలాగైన స్వామి సంకల్పాన్ని నెరవేర్చాలనే పట్టుదల నాలో తారాస్థాయికి చేరింది. తీవ్రంగా సాధన చేయసాగాను. శ్రీవేంకటేశ్వరుడు ఎన్నోసార్లు మెచ్చుకున్నారు. ఒక సందర్భములో ''నీవు పూజ గదినే పడక గదిగా చేసుకొని జీవిస్తున్నావు'' అంటూ చమత్కరించారు.

స్వామి సంకల్పం నెరవేర్చాలనే నా ఆత్రుతకు స్వామి కరుణించి, మెచ్చి ఒక లీలలో పాడైన సంగీత వాయిద్యాన్ని బాగు చేయుట, మరో లీలలో మా గ్రామంలో భజన నేర్చుకొనువారు 'వినా వేంకటేశం ననాథో ననాథ' అంటూ నేర్చుకొనుటను చూపుచు నీవు హరినామ క్షేత్రమును సాధించగలవనే విశ్వాసాన్ని కలుగజేసాడు. చివరికి నేను సంతోషంతో మీ 'హరినామ క్షేత్రం' ఎక్కడ ఏర్పాటు చేయమంటారో సూచించమని తీవ్రంగా వేడుకున్నాను. మీరు తిరుమలలో మాదిరిగా భక్తులను ఆకర్షించాలని, వారిని తగిన విధంగా అనుగ్రహించాలని అప్పుడే ఇది సాధ్యం అని కూడా విన్నవించాను. 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకు మీకు ఇష్టమైన ప్రాంతమును తెలపమని పదే పదే వేడుకున్నాను. శ్రీవేంకటేశ్వరుడు కూడ అడుగడుగున నన్ను ప్రోత్సహించుచు సరైన దారిలో తీసుకెళ్ళుచున్నాడు. చివరికి తొలి ఏకాదశి తేది 20–07–2021 రోజున కళ్యాణాల కార్యక్రమము ప్రారంభమైంది. ఇప్పుడు రెండవ సేవగ శ్రీనివాస కళ్యాణాలు చేయుచు, హరినామ క్షేత్రం సాధన కొరకు ప్రయత్నించుచున్నాను.

## సురేఖను అనుగ్రహించుట :

ఈ మొత్తం విషయమును శ్రీ వేంకటేశ్వరుడు నా భార్య సురేఖకు ఒక కల ద్వారా ఒక ఆటగ చూపాడు.

కల: ఉండుటకు మాకు ఒక మంచి ఇల్లు ఉండగనే ఒక క్రొత్త ఇల్లు నిర్మించి, ముహూర్తం పెట్టి దాని లోనికి మారుదామని సురేఖను బలవంతపెట్టానట. బలవంతాన ఆమె ఒప్పుకొని అన్ని సిద్ధం చేసింది. రేపే గృహప్రవేశం, ఇంతలో నేను ఇది వద్దని, మరో ఇల్లు నిర్మించుటకు ముహూర్తం కూడా పెట్టానట. దీనితో సురేఖకు ఏమీ తోచలేదట. పైగా ఇదే ఆఖరుది ఒప్పుకొమ్మని బలవంత పెట్టానట. నా మాట ప్రకారం ఆమె సరే అని ఒప్పుకున్నదట. ఇది ఆట. అంటే మాకు ముందే స్వామి జప సమర్పణ సేవ ఉన్నది. ఇప్పుడు శ్రీనివాస కళ్యాణాలు అనే సేవలోనికి మారుచున్నాము. వెనువెంటనే హరినామక్షేత్రం అనే మరో సేవను ప్రారంభించుచున్నానని దీని అర్థం.

శ్రీ వేంకటేశ్వరుడు నన్ను ప్రధానంగ ఎన్నుకొని, నా భార్యను నేను చెప్పినట్టు వినే విధంగా కట్టడి చేసినప్పటికి, ఆమెకు కూడా ఎన్నో అనుభూతులను కల్పించి సంతోషపరిచాడు. మా ఆస్తి హరించిపోవు సందర్భములో తనకు ఎన్నోసార్లు కనబడి నేనున్నాననే విశ్వాసమును కల్పించాడు. తన మానసిక స్థితి ననుసరించి ప్రోత్సహించేవాడు. మా ఇద్దరు పిల్లలు అమెరికా చదువుల నిమిత్తం వెళ్ళుచున్నప్పుడు "నీవు చింతించకు, వారి బాధ్యత నాది" అని చెప్పి సంతోషాన్ని కలిగించాడు. రథయాత్రలో నేను బయటి ప్రాంతాలకు వెళ్ళినప్పుడు "ఒంటరివని భయపడకు, మీ ఇంటి గుమ్మం ముందు కావలి"గ ఉన్నానని చూపాడు. రథయాత్ర తరువాత స్వామివారి బట్టలు ఉతికి తిరిగి మడత చేసి పెట్టుట సురేఖ వంతు. ఇలా చేయుట ఆలస్యమైనప్పుడు, స్వామి బట్టల వద్ద పాము పడగ విప్పి కనబడుచు ఆమెకు గుర్తు చేయును. కళ్యాణాల కార్యక్రమమును ప్రారంభించినప్పుడు తనకు స్టేజిపై అన్ని వస్తువులను సదిరే బాధ్యతను అప్పగించాడు. చివరికి నా మానసిక స్థితికి అనుగుణంగ ఉండే విధంగా చేసాడు.

### జాగ్రత్తగ సేవ చేయుమనుట :

తేది: 05-10-2021 ఒక మహత్తరమైన అనుభూతిని కలిగించాడు. ధ్వజస్థంభం కలిగి, అసంపూర్తిగ ఉన్న ఒక ఊరిలోని మా ఇంటిలో నేను నివసించుచున్నాను. దానికి ముందు వెనకాల రెండు డోర్లు కలవు. మా ఇంటి నుండి వెళ్ళిన తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు, మలయప్ప స్వామి, తన దేవేరులతో కలిసి, ఆ ఊరిలోనికి ఊరేగింపు నిమిత్తమై వెళ్ళి, తిరిగి మా ఇంటికి వెనక రోడ్డు నుండి, మేళతాళాలతో వచ్చుచున్నారు. ఊరేగింపు చివరి దశ కాబట్టి ఆకాశాన్నంటే శబ్దంతో వాయించుచున్నారు. ఈ ఊరేగింపు మా 'శ్రీవేంకటేశం' మాసపత్రిక గౌరవ సంపాదకురాలైన డా॥ పులిగడ్డ విజయలక్ష్మి గారి నాయకత్వంలో జరుగుచున్నది. కాబట్టి తప్పక మా ఇంటికి తిరిగి రాగలరని అభిప్రాయమేర్పడ్డది. అయినా భగవంతుడు స్వతంత్రుడు. మా ఇంటికి రావచ్చు, రాకపోవచ్చు



అనే భావన కలిగింది. ఇంతలో నేను వెనక డోర్ నుండి ముందు డోర్ వద్దకు, స్వామిని ఆహ్వానించుటకు వచ్చేలోపల, స్వామివారు మా ఇంటి చుట్టు తిరిగి వెళ్ళిపోయారు. శ్రీశ్రీశ్రీ జీయర్ స్వామివారి ఆశ్రమములో కొంత పని ఉంది. దాని తరువాత వచ్చెదననే విషయాన్ని తన భక్తుల ద్వారా చెరవిడిచి వెళ్ళారు. ఇది కల. దీని అర్థం ఏంటంటే కొంత కాలము తరువాత నేను హరినామక్షేత్రమును పూర్తి చేసిన తరువాత వస్తానన్నారు. మరియు నేను ఏమాత్రం ఆదమరిచి ప్రవర్తించినచో రాకపోవచ్చు కూడ అని అర్థం. కాబట్టి అత్యంత శ్రద్ధతో కష్టించి దీనిని సాధించాలి.

మార్చి 2022న మా 'శ్రీవేంకటేశం' మాసపత్రిక యొక్క మొత్తం 16 సం॥ల ఫలమును స్వామి వారికి ధారపోసినప్పుడు, కొన్ని వందల టన్నుల పువ్వులతో, టన్నుల కొలది ప్రసాదాలతో చేసిన పూజలాగ స్వీకరించి ఆనందాన్ని కలిగించాడు.

అత్యంత కఠిన నియమాలతో సంకల్పసిద్ధే ధ్యేయంగా శ్రీ వేంకటేశ్వరుని మెప్పు పొందుటే లక్ష్యంగా జీవించుచున్నాను. ఎలాగైన హరినామక్షేత్ర స్థలమును చూపమని పదే పదే ప్రార్థించుచు కళ్యాణాల సేవ జరుగుచున్నది. చివరికి మార్చి 22న మీరు ఎన్నో సం॥ల నుండి చేయు పూజల ఫలితమును పొందబోవు రోజు ఆసన్నమౌతున్నదని తెలిపారు.

### విజయం సాధించుట :

కోవిడ్-19 మూడవ వేవ్ కారణంగా కళ్యాణాల కార్యక్రమమునకు విరామం ఇచ్చి తేది 05-04-2022 నాడు రెండున్నర నెలల కోసం, శ్రీవేంకటేశ్వరుని అనుమతితో, మా పిల్లల వద్దకు అమెరికా వెళ్ళాము. ఇలా నేను అమెరికాలో ఉన్నప్పుడు తేది 16-04-2022 ఉదయం నేను విజయం సాధించానని చెప్పాడు. హరినామక్షేత్రమును చిన్నగుండవెల్లి లోని మా తోటబావి వద్ద ఏర్పాటు చేయమనే విధంగా సూచించారు. ఆ కల ఈ విధంగా ఉంది.

ఆ రాత్రి, మా ఊరిలోని మా తోట బావి వద్ద హరినామక్షేత్రం ఏర్పాటుకు అవకాశం ఇవ్వమని, అత్యంత ఆర్తితో నా కళ్ళనుండి నీళ్లు జాలువారగ వేడుకున్నాను. ఇన్ని రోజులు ఈ ఆలోచన రానందుకు సిగ్గుపడ్డాను కూడ. కల! ఎన్నో పర్యాయాలు ఓడుచు వస్తున్న ఒక ఎన్నికలో ఎంఎల్ఏ/ఎంపిగా గెలిచాను. సి.యం. కెసీఆర్ పిలువగ వెళ్లి ప్రమాణస్వీకారం గురించి

మాట్లాడాము. రేపు సిద్ధిపేట కార్యకర్తలు వచ్చుచున్నారని, వారి సమక్షములో పెట్టుకుందామన్నారు. విజయం సాధించినందులకు అభినందించారు. ఇది కల. వెంటనే నేను కనీసము 7 ఎకరముల స్థలములో మీ హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయుదునని, ఈ అవకాశం ప్రసాదించినందులకు స్వామివారికి ధన్యవాదములు తెలిపాను. మరియు ఈ హరినామ క్షేత్రం ఏవిధంగ, ఏ ఆకారంగ ఉండాలని ఆలోచించుచున్నాను.

ఒకరోజు, ఈ విషయంపై ఏ మాత్రం చచ్చి పడి ఉండక, అశ్రద్ధ చేయక నా అమెరికా స్టేను పొడిగించక వచ్చి కళ్యాణాల కార్యక్రమమును చూచుకొమ్మన్నారు.

కోవిడ్-19 కారణంగా గత రెండు సం॥ల నుండి మేము హైదరాబాదులో, మా పిల్లలు అమెరికాలో వేరు వేరుగ ఉన్నాము. ఇప్పుడు అందరము కలిసి ఉన్న కారణంగ నా భార్య సురేఖ చాల ఆనందంగ మరిన్ని రోజులు ఉండాలనే కోరికతో ఉన్నది. కాని శ్రీవేంకటేశ్వరుడు మాత్రం 'నీవు కొడుకులు, కోడళ్ళ అందరిమధ్య ఉన్నానని మురువవద్దని, నీవు ఏకాకివని, నీకు తోడు శ్రీ వేంకటేశ్వరుడు మాత్రమే' అని తెలిపి అమెరికా స్టేను పొడిగించక హైదరాబాద్ రమ్మన్నారు. మరియు నీవు హైదరాబాద్ రాక పిల్లలపై మోజుతో మరింత ఆలస్యం చేసినచో వారికి నీపై కనిపించని విరక్తి కలుగునని సురేఖతో మరో లీలలో స్పష్టంగా చెప్పాడు. ఆ లీల ఈ విధంగా ఉంది. మా హైదరాబాద్‌లోని పనిమనిషి, అమెరికాలోని కిచెన్‌లో మంచి కూరగాయలపై, ఎవ్వరూ చూడటం లేదని, ఉప్పునీరు పోసి, వాటిని వక్కిపోయే విధంగా చేసి బయట పడేస్తుందట.కాని దీనిని ప్రక్కనున్న సురేఖ జాగ్రత్తగా గమనించింది. దీనర్థం నీ వారికి మీపై విరక్తి కలుగుతుందని, వెంటనే హైదరాబాద్ రావాలని స్వామివారి ఆజ్ఞ.

21-05-2022 : శ్రవణా నక్షత్రం రోజు తనకు తిరుమల ఆలయం ప్రతి రూపమునే నిర్మించమని, వీలు కాని పక్షంలో రెండవ ప్రాకారం వరకైన నిర్మించి, హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయమని ఆజ్ఞాపించారు.

27-07-2022 : నేను యం.టెక్‌లో పాస్ అగుటకు స్వామివారు మెచ్చే విధంగా ప్రయత్నించుచున్నట్లు, దృఢ నిశ్చయముతో ఉన్నట్లు చూపాడు. లీల : ఒకరోజు నేను కాలేజికి వెళ్ళేసరికి సమయం దాటిన కారణంగ, తరగతి ముందు, లోనికి పోకుండ గేటు వేశారు. దీనిని సహించలేని నేను, కాలేజి బిల్డింగ్ ఎక్కి త్రాడు సహాయముచే క్రిందికి దిగి, బయటినుండి వ్రేలాడుచు తరగతి గది కిటికి వద్దకు వచ్చి పాఠాలు వినుచున్నాను. నేను లేనప్పటి పాఠమును మిత్రుల ద్వార తెలుసుకుంటున్నాను. ఇంతటి తపన కలిగి ఉన్నానని సూచించారు. ఇంకో లీలలో, గత కొన్ని రోజుల నుండి నా మార్గమునకు అడ్డుగ ఉన్న ఒక శక్తిని స్వామివారి కృపచే ప్రక్కకు పడేసినట్లు చూపాడు. మరో లీలలో నేను సౌకర్యవంతమైన జీవితాన్ని అసహ్యించుకునే స్థితికి వచ్చావని చూపాడు.

## స్వామి సేవ అందరిది :

తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి, తిరుమల నుండి చిన్నగుండవెల్లిలోని హరినామ క్షేత్రమునకు తెచ్చుటలో నేను ప్రధాన పాత్రను పోషించుచున్నప్పటికీ, ఇందులో మా తల్లితండ్రులు, భార్యాబిడ్డలు, వంశస్థులు, గ్రామస్థులు, ఆ ప్రాంత ప్రజలు మరియు శ్రీవేంకటేశ్వరుని అఖండ భక్తజనము వారి వారి పాత్రను సమయానుసారము నిర్వహిస్తారని స్వామివారు సూచించారు. ఈ సేవ నాకు మా తల్లితండ్రుల నుండి సంక్రమించిందని చెప్పడానికి ఈ క్రింది లీలలు సూచించుచున్నవి.

1. హరినామక్షేత్రం ఏర్పాటు చేయు భూమి మా తండ్రి స్వార్జితం. నేను ఏకైక పుత్రుణ్ణైనప్పటికి, మా తండ్రి చనిపోవుటకు 15 సం॥ల ముందే 1976లో ఈ భూమిని నా పేరుపై అత్యంత ఉత్సాహంగ మార్పిడి చేశాడు.

2. ఊరిలోని మా ఇల్లు కూడ మా తల్లితండ్రుల స్వార్జితం. చిన్నప్పుడు చాల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాము. దరిద్రము మా ఇంట్లో నాట్యమాడేది. నేను ఎదిగిన తరువాత కసితో దీనిని అమ్మి మరో ఇల్లును 1999లో నిర్మించుకున్నాము. కాని స్వామి లీలలో ప్రతిసారి ఇదే ఇల్లు కనబడుతుంది.

3. మా తండ్రి సహకారము అడుగడుగున కనబడ్డది. నా తప్పులను ఎత్తి చూపుటకు, ముఖ్యంగ నాకు యోగ్యత సిద్ధించుటకు, చివరికి స్వామివారి హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయుమని స్వయంగ మా తండ్రి ఆజ్ఞాపించాడు. అప్పుడే ఒక తండ్రిగ తాను సంతోషించుదునన్నాడు.

4. భాగవతుల ఆశీర్వాద ఫలంచే విజయుణ్ణైన లీల కూడ, నేను 10 వ తరగతి లేక ఇంటర్ చదివే రోజులలో మా ఊరిలో తల్లితండ్రులతో కలిసి చేసిన శ్రీవారి కళ్యాణం లాంటి ఉత్సవానికి వచ్చిన భక్తులు తిరుపతి లడ్డూలను ప్రసాదంగా ఇచ్చారు.

5. స్వామివారి హరినామ క్షేత్రం ఏ స్థలములో ఏర్పాటు చేయాలనే ప్రశ్నకు జవాబు చెప్పే క్రమములో ''విజయము సాధించు సమయము ఆసన్నమైన''దని తెలిపే లీల కూడ మా ఊరిలో మా అమ్మ ఆధ్వర్యములో ఎన్నో సం॥ల నుండి జరుగు పూజల ఫలమును పొందబోవు సమయము ఆసన్నమైనదని సూచించాడు. ఆ పూజలకు వచ్చిన ప్రతి వ్యక్తి మా అమ్మ ఆహ్వానము మేరకే వచ్చారట. మొత్తం మా పాలివారు, ఊరివారే కలరు. అందులో నా భార్య ఉన్నప్పటికి, మా అమ్మదే ప్రధాన పాత్ర.

ఇలా ఎన్నో లీలలు మా ఊరును, మా పూర్వీకుల ఇల్లును, భూమిని లక్ష్యంగ చేసుకొని కొనసాగినవి. చివరికి శ్రీవేంకటేశ్వరుని అఖండ భక్తజనము భాగస్వాములు కావలెనన్న ఉద్దేశ్యముచే ఈ అనుభూతులను ప్రచురించమని శ్రీవేంకటేశ్వరుడు ఆజ్ఞాపించారు.

### తపనను పెంచుట :

చాల రోజుల నుండి స్వామి అనుభూతులను అనుభవించని

నేను చివరికి సమస్యలను సృష్టించి యైన మీ లీలలను ప్రసాదించమని వేడుకున్నాను. అన్నట్లుగానే ఒక భూ సమస్య సృష్టించబడ్డది. దానితో పోలీసు కేసు రిజిష్టర్ అయింది. మరోప్రక్క నా ఆరోగ్య సమస్య మొదలైంది. వాటితో, స్వామిని ప్రార్థించే తపనను పెంచాడు. వీటికి భయపడి స్వామివారిని రకరకాలుగా ప్రార్థించుట మొదలు పెట్టాను. చివరికి సమస్యలు ఉన్నప్పుడు ఏ విధంగా స్వామివారిని స్మరించుదునో అదే విధంగా మామూలు రోజులలో కూడా స్మరించుదుననే మాట ఇచ్చాను. నా జీవితాన్ని పొడిగించమని, పొడిగించిన జీవితం మీ సంకల్ప సాధనకే వాడుకుంటానని మాట ఇచ్చాను.

నా సాధన ద్వారా మిమ్ములను పొందే యోగ్యతను నేను పొందలేక పోయినప్పటికీ, మీ భక్తుల ఉద్ధరణ కోసమని హరినామ క్షేత్రమును ఏర్పాటు చేసే భాగ్యమును ఎలాగైన ప్రసాదించమని వేడుకున్నాను.

30-09-2022 : నా అనుభూతులను మాసపత్రికలో ధారావాహికగా ప్రచురించమనే సందేశంను పొందాను. వెంటనే ఈ అనుభూతుల ప్రచురణల ద్వార, భాగవతుల శక్తులను కూడకట్టుచు, వారి ఆశీర్వాదమును పొందుటకు అవకాశం ఇవ్వమని ప్రార్థించాను. నా శక్తికి భాగవతుల శక్తిని జత కలిపినచో తప్పక విజయం సాధించుదునని విశ్వసించాను. స్వామివారు ఆనందించి శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయరు స్వామివారిని, వారి శిష్య సమేతంగా పంపి దివ్య ప్రబంధ పారాయణం పఠించి, మంగళాశాసనం చేయించారు. మరియు మరణశయ్యపై నున్న వ్యక్తి నిజం మాత్రమే చెప్పినట్లు నన్ను కూడ నిజం చెప్పమన్నారు.

నన్ను మా ప్రాంతపు భక్తుల బృందానికి ప్రెసిడెంట్‌గా ఎన్నుకొని వారికి శ్రీ వేంకటేశ్వరుని కృపను అందించే భాధ్యత నీదే అంటూ ఆజ్ఞాపించాడు. మొదటి నుండి నేటి వరకు ప్రసాదించిన ప్రతి లీల కూడా నీలో కొంత కొంత మార్పును కలిగించుటకే అని కూడా చెప్పాడు.

నాకు హృద్రోగ సమస్యలను కల్పించి, జీవితంలో సాధించిన ఆస్తులు, అంతస్తులు నీ కుటుంబీకులు ఏవీ నీతో రావని, శ్రీ వేంకటేశ్వరుని సంకల్పం నెరవేర్చుటయే నీ జీవిత ధ్యేయంగా జీవించమని చెప్పాడు. నాకు రెండు స్టంట్స్ వేసి, జీవితాన్ని పొడిగించి, ఈ పొడిగించిన జీవితం స్వామి సంకల్పం సిద్ధింప చేయుటకే అని దిశా నిర్దేశం చేసాడు.

నన్ను భౌతికంగా మరింత సన్నగ చేసి, చూసిన ప్రతివారు ఎందుకు సన్నగైనావని అన్నప్పుడల్లా, నీవు ''ఎదగాలి'' అనే శ్రీ వేంకటేశ్వరుని మాటనే గుర్తుకు వచ్చే విధంగా చేసాడు. అంటే కావలసిన యోగ్యతను పొందుటకు మరింత సాధన చేయమని అర్థం.





## విజయము సాధించుటకు చిహ్నలు :

చివరికి జనవరి 2023 వైకుంఠ దర్శనానికని తిరుమల వెళ్ళినప్పుడు, మా అనుభూతుల ప్రచురణకు ఆశీర్వాదమును ఇచ్చారు. మరియు త్వరలో మా ఇంటికి వచ్చుచున్నట్లు కూడ తెలిపారు.

రెండు నెలల క్రింద కల్పించిన లీలలో స్వామివారు నాకు మంచి సౌకర్యవంతమైన బూట్లు కొనిచ్చారు. బహుశా దీని ప్రభావముచే తేది 25-02-2023 నుండి 01-03-2023 వరకు శ్రీరంగం, తంజావూరు, కుంభకోణం, చిదంబరం, కంచి, చెన్నై నగరములు తిరిగి అక్కడున్న ఆలయాలను, దివ్యదేశములను దర్శించి, శ్రీవేంకటేశ్వరుని సంకల్పాన్ని సాధించే విధంగా ఆశీర్వదించమని ప్రార్థించాను. అనుకున్నట్లే తేది 01-03-23 సాయంత్రం చివరిదైన చెన్నైలోని శ్రీ పార్థసారథి ఆలయాన్ని దర్శించి వెనుతిరుగునప్పుడు ''నీ కోరిక ప్రకారం ఆశీర్వాదం లభించినద''నే భావన కలిగింది.

రెండవ సంకల్పంగా శ్రీనివాస కళ్యాణాలను ప్రసాదించినప్పుడు భరతుణ్ణి అనుసరించమన్నారు. అంటే ప్రతి కళ్యాణము శ్రీ వేంకటేశ్వరుని వద్దకు చేరుటకు ఒక మెట్టుగ భావించి, స్వామిని ఎప్పుడు చేరుతామా అని, ప్రతిరోజు వేచి చూచుచు జీవించమన్నారు. ఏప్రిల్ 23 వరకు 43 కళ్యాణాలను పూరించాము. త్వరలో మిగిలిన వాటిని స్వామి కృపచే పూరించగలము. కాని శ్రీ భరతుని లాగ 'నా'' అన్నది నశింపజేసుకొని త్యాగబుద్ధి కలిగి అంతటి తపనను సాధించుట ఎంతో అవసరము.



### భరతుణ్ణి అనుసరించుమనుటలో ఆంతర్యం :

తేది 18-03-23, ఏకాదశి, శ్రవణా నక్షత్రం రోజు పొందిన మరో లీలలో ''శ్రీరాముని రాకకు ఒక్కరోజు ఆలస్యమును తట్టుకోలేని శ్రీ భరతుడు, శ్రీరాముడు అయోధ్యకు వచ్చిన తరువాత తిరిగి వెళ్ళిపోతానంటే, తట్టుకొనునా? ప్రాణ త్యాగానికి సిద్ధపడడా? ఇదే దిశా నిర్దేశం నాకు చేశాడని నేను భావించాను. శ్రీవేంకటేశ్వరుడు కరుణించి, నా వద్దకు వచ్చిన తరువాత తిరిగి తిరుమలకు పోతానంటే ప్రాణత్యాగం చేయుటకు సిద్ధం అనేటంత వ్యామోహాన్ని పెంచుకోవలసి ఉందని సూచించాడు. ఇదే శ్రీ భరతుణ్ణి అనుసరించమనటంలోని అసలైన అర్థం అనిపించింది. ఇలా స్వామిని ఈ క్షేత్రంలో స్థిర నివాసమేర్పరచుకొనుటకు వివశుణ్ణి చేయాలి.

## భాగవతుల ఆశీర్వాదం

స్వామి ఈ క్షేత్రములో శాశ్వత నివాసం ఏర్పరచుకొనుటకు తిరుమల నుండి ఇక్కడికి రావాలంటే నా ఒక్కరి శక్తి సామర్థ్యములు సరిపోవు కావున భాగవతుల శక్తిని, ఆశీర్వాదములను పొందమని శ్రీ వేంకటేశ్వరుని ఆజ్ఞ. కాబట్టి ఈ తిరుమల శ్రీవేంకటేశ్వరుని లీలలను చదివిన ప్రతి భక్తుడు, స్వామి యొక్క భక్తవత్సలతను తెలుసుకొంటు, శ్రీ వేంకటేశ్వరుని ఆశయ సాధనలో పాలు పంచుకొనుటకు కనీసం శ్రీ వేంకటేశ్వరుని మూడుసార్లు స్మరించి, సంకల్పం నెరవేరేటట్లు వయస్సు, లింగభేదం లేకుండ ఆశీర్వదించగలరని ప్రార్థన. శ్రీ వేంకటేశ్వరుడు ఇక్కడ స్థిర నివాసమేర్పరచుకొని మరో తిరుపతిని సృష్టించి భక్తులను అనుగ్రహించమని ప్రార్థనాపూర్వకంగానైన భాగస్వాములు కాగలరని మనవి.



# స్వామివారి లీలలు : ఒక పజిల్

శ్రీ వేంకటేశ్వరుని లీలలు చాలా విచిత్రంగా ఉంటాయి. స్వామివారి లీలలను అర్థం చేసుకొనుట మన ఆధ్యాత్మిక ఉన్నతికి నిదర్శనము. వచ్చే భాగములలో స్వామి వారి లీలలను ఒక్కొక్కటి ఉన్నదున్నట్లుగా వ్రాయుదును. భక్తులు చదివి వాటి భావాలను ఒక పజిల్‌లాగా విశ్లేషించుకోవాలి. మచ్చుకు, తేది 18-02-2023 నాడు పొందిన ఒక లీలను ఉన్నదున్నట్లుగ వ్రాస్తున్నాను. భక్తులు లీల మాత్రమే చదివి అర్థం తెలుసుకొనుటకు ప్రయత్నించండి. (భావం తరువాత చదవండి)

**కల:** ఈ రోజు ఉదయం నేను మంచంపై నుండి లేచుచున్నప్పుడు నా ప్రక్కన మా డ్రైవర్ కలీం కాలుమీద కాలువేసుకొని నా బెడ్‌పైన పడుకొని నా చేతిని తన చేతిలోనికి తీసుకుని ఆప్యాయంగా ఒత్తుచున్నాడు. ఇది కల. దీని అర్థమును మన విజ్ఞతనుపయోగించి విశ్లేషించాలి. ఇది శ్రీవేంకటేశ్వరుని పజిల్. దీని పూర్వాపరాలు తెలిసివుంటేనే ఈ లీలకు అర్థమును తెలుసుకోగలం. లేకుంటే చాలా కష్టం.

**భావం :** గత 20 సం॥ల నుండి కలీం మా వద్ద డ్రైవర్. ''నమో వేంకటేశాయ'' రథమును అతనే నడిపేవాడు. రథయాత్ర సమయాన ప్రతి స్వామి సేవకుడిని మాతో సమానంగా చూడమన్నారు. ఇది స్వామి ఆజ్ఞ. ఈ విషయమును రెండవ భాగపు అనుభూతుల ప్రచురణలో వ్రాయుట మరచిపోయాను. ఈ లీల ద్వారా స్వామి ఈ విషయాన్ని గుర్తు చేసాడు. ఇది అసలైన అర్థం.

ఇందులో నేను చాలా లీలలను వ్రాసాను. కాని అంతకు ముందటి పరిస్థితులను, వాటిని పొందుటకు ప్రేరేపించిన సందర్భాలను తెలుసుకున్నప్పుడే స్వామి లీలల ఆనందము కలుగుతుంది. కాబట్టి రాబోవు భాగాలలో చాలా వివరంగా ఒక్కొక్క లీల యొక్క పూర్వాపరాలను, అప్పటి పరిస్థితులను, నా మానసిక స్థితిని వ్రాయగలను. చదివి తమరు విశ్లేషించుచు ఆనందించగలరని ఆశించుచున్నాను.

**సమాప్తం**

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ.. నా దశ

ప్రతి నెల ప్రచురించు ఈ అనుభూతుల హార్డ్ కాపీ కోరు వారు
'శ్రీ వేంకటేశం' మాసపత్రికకు సూచించిన విధంగా చందాదారులుగా కాగలరు.
1 సం॥ చందా రూ. 250/–, 2 సం॥ చందా రూ. 500/–, 4 సం॥ చందా రూ. 1,000/–
జీవిత చందా రూ. 3,500/–, రాజ పోషకులు రూ. 5,116/–.
93482 12354 నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్ పే మరియు పేటీఎం ద్వారా
డబ్బు, మీ అడ్రస్ పంపగలరు.




శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవింద దాసు)
1-1-53, హబ్సిగూడ, హైదరాబాద్, ఫోన్ : 040-27175250

Email :
srivenkatesham@gmail.com
Visit :
www.srivenkatesham.org

# ముకుందమాల


భువనేశ్వరి మారేపల్లి (9550241921)

**"దివి వా భువి వా మమాస్తు వాసో**
**నరకే వా నరకాంతక ప్రకామం ।**
**అవధీరిత శారదారవిందౌ**
**చరణౌ తే మరణేపి చింతయామి ॥"**

నరకాసురుడిని సంహరించినవాడా! అని కీర్తిస్తూ నిన్నటి శ్లోకంలో వీటి యందు ఫలాపేక్ష లేదని తెలియజేశారు. ఈ శ్లోకంలో స్వర్గమందు కాని, భూమియందు కాని,చివరకు నరకమందు నివాసము వచ్చినా చింతలేదు. శరత్కాల కమలములు తిరస్కరించునట్టి నీ యొక్క దివ్య పాదములనే మరణకాలమునందు కూడా స్మరించాలని అంటున్నారు మన కులశేఖరాళ్వార్లు.

క్రిందటి శ్లోకంలో ధర్మార్థ కామములను కూడా వద్దన్నారు కదా? మరి ధర్మము చేయకపోతే స్వర్గాదులు లభించవు. అప్పుడు భూమి మీదనే నివాసం కలుగుతుంది, అలాగే ధనలోపం వల్ల చేసే పాపాల వలన నరకవాసము కలుగుతుంది కదా? అనే ప్రశ్నలకు సమాధానంగా ఆళ్వార్లు ఇలా చెప్పారు "దివి వా భువి వా మమాస్తు వాసో" నాకు ఈ లోకమా, ఆ లోకమా అనే వ్యవస్థ ఉంటే కదా? అన్ని ప్రదేశాలు సమానమే పరమాత్మ దివ్యచరణారవింద ద్వయమే పరమ పావన ప్రదేశము.

నరకాదుల గురించి నాకు చింత లేదు స్వామీ! ఎందుకు అంటావేమో? 'నరకేవా నరకాంతక ప్రకామం' బ్రహ్మాదులు ప్రార్థించారు అని రావణుని చంపావు. ఇంద్రాదులు



ప్రార్థించారని నరకాసురుడిని సంహరించావు. ఆ సంగతులన్నీ నాకు ముఖ్యం కావు. నేను జీవాత్మను, హీనుడను, ఏ స్థలంలో వసించినా అందువల్ల నాకు గౌరవం, అగౌరవం అనేవి పెరగవు తగ్గవు. నేను అధమాధముడిని. నిన్నే నమ్మి జీవించేవాడిని కనుక నేను నరకంలో పడితే నరకనాశకుడు అని బిరుదు కలిగిన నువ్వు సహించలేవు. కాబట్టి నా గురించి చింత నీకు తప్ప నాకు లేదు అని ఆళ్వార్ల అర్థం.

'ఆళవందార్లు తమ స్తోత్రరత్నంలో చాలా అందంగా సత్ ని వివరిస్తారు.

**"అభూతపూర్వం మమ భావి కిం వా**
**సర్వం సహే మే సహజం హి దుఃఖం ।**
**కింతు త్వదగ్రే శరణాగతానాం**
**పరాభవో నాథ న తే నురూపః" ।**

నాథా! నేను గతంలో అనేక హీనజన్మలు పొంది ఉన్నాను. నాకు కొత్తకాదు. సహజమే. అనన్య భావముతో తెలుస్తున్న నన్ను రక్షింపకపోతే శరణాగత వత్సలుడు, దీనబంధుడు, పరమదయాళుడు అనే నీ పేర్లకు కళంకం వస్తుందేమో అని దుఃఖిస్తున్నాను. అంతేకాని నన్ను రక్షించమని కోరడంలేదు అంటారు.

'పరమాత్మే రక్షకుడు అని నిశ్చల భక్తి శ్రద్ధలతో భజిస్తే ఆ భక్తులను యమదూతలు చూడరు, కలలోనైనా చూడరు అని భాగవతం తెలియచేస్తోంది'.

శ్రీమన్నారాయణుడి దివ్య చరణములే రక్షకము. వాటిని వర్ణించే శక్తి నాకు లేదంటూ, "అవధీరిత శరదారవిందౌ" అని స్వామి పాదముయొక్క కార్యము తెలుపుతున్నారు. శరద – అనేక సంవత్సరములుగా ఉండే ఆ – అధికమైన, అరవిందం – అంధకారమును, అవధీరిత – పోగొడతాయి. అందువల్లనే నీ దివ్య పాదముల చింతను అడుగుతున్నాను. స్వామి! నీ వ్రేలి నఖమే కోటిసూర్యోదయ ప్రకాశముగా ఉండును. ఇంక రెండు పాదాల పది నఖముల కాంతి చేరితే ఎలాంటి అజ్ఞానాంధకారమైన పోవలసిందే. అలాంటి ధ్యానమును సదాకలిగించుము, లేదంటే కనీసం మరణకాలము నందైన కలిగించండి చాలు. 'అంతకాలే చ మామేవ స్మరన్ముక్త్వా కళేబరం' అని గీతలో తెలియజేసినట్లు

అంతిమ స్మరణ యందైన పాద ద్వయాన్ని స్మరించమని, ఆళ్వార్లు స్వామి పాదారవిందంలో దాగి ఉన్న అమృతాన్ని అనుభవింపచేస్తున్నారు.

ఆ స్వామి 'నారాయణ' నామాన్ని ఒక్కసారి ఉచ్చరిస్తే చాలు, అన్ని దుఃఖాలను దూరం చేసి, సకల ఐశ్వర్యాలను ప్రసాదించి, పరమపదానికి చేరుస్తుంది. ఇందుకు ఓ చక్కని ఉదాహరణ అజామీళుని ఉదంతమే.

ఒకానొక సమయంలో కన్యాకుబ్జము అనబడే ఒక నగరం వుండేది. ఆ నగరంలో ఒక శ్రోత్రియుడయిన బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆయన త్రికాల సంధ్యావందనమును ఆచరించి వేదవేదాంగములను తాను పఠించి పదిమందికి వేదమును వివరణ చేస్తూ, పదిమందికి పురాణ ప్రవచనం చేస్తూ, దొరికిన దానితో అత్యంత సంతోషంతో జీవితమును గడపగలిగిన సమర్థుడు అయినవాడు. యాదృచ్ఛికముగా ఆయనకు ఐశ్వర్యము సమకూరింది. ఆయన మనస్సు మాత్రం సర్వకాలముల యందు భగవంతుని యందు రమించే స్థితిని కలిగివున్నవాడు. అటువంటి మహాపురుషుడికి ఒక కుమారుడు జన్మించాడు. అతని పేరు అజామీళుడు. ఆయనకు ఒక ఉత్తమమయిన సౌందర్యవతియైన కన్యను తెచ్చి వివాహం చేశారు. ఆయన శీలం ఎటువంటిది? పుట్టినపుడు గతంలో చేసిన సత్కర్మల వలన బ్రాహ్మణ కులమున జన్మించాడు. సత్కర్మ అంటే చేసిన పని. అజామీళునికి యజ్ఞోపవీతం వుంది. సంధ్యావందనం చేసి గాయత్రీమంత్రం జపించేవాడు. ఈవిధంగా అతడు జ్ఞానమును పొందినవాడు. శాంత లక్షణమును కలిగి ఉన్నాడు.

అజామీళుడు నిరంతరమూ తాను చేయవలసిన కర్తవ్యమును గూర్చి తాను ఆలోచించ గలిగినవాడు. తన ధర్మమును తాను నెరవేర్చినవాడు. తాను చదువుకున్నది అనుష్ఠాన పర్యంతము తీసుకు వచ్చాడు. ఎన్నో మంత్రముల సిద్ధిని పొందాడు. అతని శరీరము మంత్రపూరితమయింది. అంతగా దేవతానుగ్రహమును పొందాడు. అజామీళుడు సత్యభాషణా నియమమును పెట్టుకున్నాడు. ధర్మమును వదలలేదు. నిత్య నైమిత్తిక కర్మలను వదిలిపెట్టలేదు. ఈ విధంగా అజామీళుడు రాశీభూతమయిన బ్రాహ్మణ తేజస్సు కలిగినవాడు.

ఆయనను తండ్రిగారు ఒకరోజు పిలిచి రేపటి పూజకు దళములు, దర్భలు, పువ్వులు తీసుకు రావలసినది అని చెప్పారు. తండ్రిమాట ప్రకారం అడవికి వెళ్ళి పువ్వులు, సమిధలు కోసి సంతోషంగా ఇంటివైపుకి వచ్చేస్తున్నాడు. అంతలో అతనికి ఒక పొదలో ఏదో ధ్వని వినపడింది.

పొదవైపు చూశాడు. కల్లుకుండలు తెచ్చుకుని అక్కడ పెట్టుకుని చాలా హీనమయిన జన్మను పొందిన ఒక స్త్రీని, పురుషుణ్ణి శృంగార క్రీడయందు ఉండడం అజామీళుడు చూశాడు. ఆ దృశ్యం అతని మనస్సులో బాగా ముద్ర వేసింది. పదేపదే ఆ దృశ్యం అతనికి గుర్తుకు వస్తూ వుంది.

ఇంటికి వెళ్ళి దర్భలు తండ్రికి ఇచ్చి అసురసంధ్యవేళ సంధ్యావందనమునకు కూర్చున్నాడు. పొదలమాటున తనకన్ను దేనిమీద నిలబడిందో అది కనపడుతోంది. ఇంట ధర్మపత్నియై సుగుణాలరాశియై సౌందర్యవతియైన భార్య ఉన్నది. కానీ ఆయన కోర్కె వేరొక కులట యందు ప్రవేశించింది. ఆచార్య వాక్కులు గుర్తు తెచ్చుకుని అధిగమించాలని ప్రయత్నం చేశాడు. కానీ అతడు చూసిన సన్నివేశము వీటన్నింటిని తొలగ దోసినది. ఒకనాటి రాత్రి తన భార్యకు, తల్లికి, తండ్రికి తెలియకుండా ఆ హీనకుల సంజాత అయిన ఆ స్త్రీని చేరాడు. సంధ్యావందన భ్రష్టుడై రాత్రింబవళ్ళు అక్కడే ఉన్నాడు. తల్లిదండ్రులను ఎదిరించాడు. భార్యను విడిచి పెట్టేశాడు. తల్లిదండ్రులు వృద్ధులై పోయారు. వారి ధనమును దోచుకున్నాడు. ఆ కులట స్త్రీ యందు 9 మంది బిడ్డలను కన్నాడు.

అతడు చేసిన ఒకే ఒక మంచిపని – ఆవిడ కడుపున పుట్టిన ఆఖరు బిడ్డడికి 'నారాయణ' అని పేరు పెట్టడం. ఆఖరి పిల్లాడు అవడం మూలాన వాడిమీద మమకారం ఉండిపోయి వాడిని నారాయణ నారాయణ అంటూ తరచూ పిలుస్తూ ఉండేవాడు. ఆవిడ పిల్లల పోషణార్థమై డబ్బు సంపాదించుకు రమ్మనేది. అందుకుగాను దొంగతనములు చేయడం మొదలు పెట్టాడు. ఎంత వేదం చదువుకున్నాడో, ఎవడు నిత్య నైమిత్తికములను నెరపినాడో, ఎవడు శాంతుడై దాంతుడై సకల వేదములను చదివాడో, ఎవడు మంత్రసిద్ధులను పొందాడోఅటువంటి అజామీళుడుఈవేళఆరితేరిన దొంగయై అంతటి దొంగలేడని అనిపించుకున్నాడు.

కులాచారాన్ని ధర్మాన్ని వీడి జూదము, దొంగతనము, వ్యభిచారం, దుష్కార్యాలు వంటి పనులతో భ్రష్టు పట్టాడు. చిన్నకొడుకు నారాయణుడంటే అజామీళునికి చాలా ఇష్టం. కాలగమనంలో వృద్ధుడైన అజామీళుడు మంచాన పడ్డాడు. అతనిని కొడుకులంతా జాగ్రత్తగా చూసుకుంటున్నప్పటికీ, అజామీళుడు ప్రతి విషయానికి చిన్నకొడుకు నారాయణునినే పిలుస్తుండేవాడు. చివరకు అజామీళుడు తుదిశ్వాసను విడిచే సమయం ఆసన్నమవడంతో, అతడిని నరకానికి తీసుకెళ్ళడానికి యమభటులు వచ్చి నిలబడ్డారు. యమభటులను చూడగానే గజగజ వణికిపోయిన



అజామీళుడు భయకంపితుడై తన చిన్న కుమారుని "నారాయణా!" అని బిగ్గరగా పిలిచి ప్రాణాలను వదిలాడు.

అజామీళుడు ఎంతో పాపాత్ముడైనప్పటికీ అంత్యకాలంలో "నారాయణా!" అంటూ విష్ణు నామాన్ని స్మరించినందున అక్కడకు విష్ణుభటులు కూడ వచ్చి చేరారు. ఆ మరుక్షణమే యమభటులకు, విష్ణుభటులకు మధ్య పెద్ద వివాదమే చెలరేగింది. అజామీళుని ఎవరు తీసుకెళ్ళాలన్న విషయమై కీచులాట మొదలైంది.

యమభటులు, విష్ణుభక్తులతో, "అయ్యలారా! ఈ పండితుడు మహాపాపి. చెప్పలేనన్ని నీచపు పనులను చేశాడు. ఒక్కరోజైనా ఓ చిన్నపుణ్యకార్యమైనా చేసి ఎరుగడు. కనీసం పూజలు, పునస్కారాలు కూడా చేసి ఎరుగడు. అటువంటి వానికి ఎలా వైకుంఠప్రాప్తి కలుగుతుంది? అతన్ని వైకుంఠానికి తీసుకెళ్ళేందుకు మీరు రావడం విచిత్రంగా ఉంది" అని అన్నారు.

యమభటుల వాదనలను విన్న విష్ణుభటులు, "యమదూతలారా! ఎంతటి పాపాత్ములైనప్పటికీ, అంత్యకాలంలో నోరారా హరినామ స్మరణం చేసినట్లైతే, అప్పటి వరకు అతడు చేసిన పాపాలన్నీ పటాపంచలైపోతాయి. ఈ అజామీళుడు మిమ్ములను చూడగానే, తన కొడుకును పిలిచే క్రమంలో హరినామ స్మరణం చేశాడు. ఆ సంఘటన పట్ల ప్రసన్నుడైన శ్రీమహావిష్ణువు, అజామీళునికి పరమపదాన్ని అనుగ్రహించదలచి మమ్ములను పంపాడు. కనుక, మీరు అతనిని తీసుకెళ్ళడానికి కుదరదు. మీకా అధికారం లేదు. మా మాటల పట్ల నమ్మకం లేకపోతే, ఈ విషయమై మీ ప్రభువు యమధర్మరాజునే అడిగి తెలుసుకోండి" అని బదులు చెప్పారు.

ఈ విషయాన్ని యమభటులు, యమధర్మరాజుకు వినిపించడంతో సావధానంగా విన్నయముడు, విష్ణుతత్త్వాన్ని గురించి, విష్ణుభక్తిని తన భటులకు వివరించడమే కాక, ఇకపై విష్ణుభక్తుల జోలికి వెళ్ళవద్దని చెప్పాడు.

ఆ విధంగా ఒక్కసారి 'నారాయణా!' అంటూ విష్ణు నామమును ఉచ్చరించినందుకే అజామీళునికిపరమపద ప్రాప్తి కలిగింది. ఆ నామం అంతటి మహిమాన్వితమైనది.

శ్రీమద్భగవద్గీత (8వ అధ్యాయము, అక్షరపరబ్రహ్మయోగం) లో

**అంతకాలేచమామేవస్మరన్ముక్త్వాకళేబరమ్**
**యఃప్రయాతిసమద్భావంయాతినాస్త్యత్రసంశయః**

"ఎవరైతే నన్ను మరణకాల సమయమున భక్తితో స్మరిస్తూ వారి శరీరం విడిచిపెడతారో వారు నన్ను చేరుతారు" అని శ్రీకృష్ణపరమాత్ముడు అర్జునునికి వివరిస్తాడు. కానీ, ఆ సమయమున భగవన్నామ స్మరణ చేయడం అనుకున్నంత సులువేం కాదు, బతికినన్నాళ్లు భగవన్నామ స్మరణ చేయక, ఆయన గురించిన జ్ఞానాన్ని తెలుసుకోనలేక అజ్ఞానంలో ఉంటాము, వెంటనే ఒక్కసారే భగవన్నామ స్మరణ ఎలా వస్తుంది?

శ్రీమద్భగవద్గీతలో కృష్ణపరమాత్మ ఈ విధంగా" లక్షల్లో ఒకరికి నన్ను గురించిన జ్ఞానం ఉంటుంది ఆ ఒక్కడే నన్ను చేరగలడు" అని అర్జునుడికి వివరిస్తాడు.

అజామిళుడు ఒక సద్బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి పూర్వాశ్రమంలో స్వవర్ణ కర్మానుష్ఠానం చేసాడు కనుకనే, ఎంతగా పాపం చేసినా చివరికి తన కుమారునికి నారాయణ అని పేరు పెట్టాడు. ఇతః పూర్వం అతను చేసిన సాధన ఈ విధంగా ఉపయోగపడి విష్ణుదూతల ద్వారా మరోఅవకాశం పొందాడు.

ఇటువంటి కారణముల చేత అంతిమ స్మరణమే చాలు అని అంటున్నారు కులశేఖరులు. అంటే మానవుల కర్మానుసారంగా నరకమో, స్వర్గమో లేదా మరల మానవ జన్మతో భూలోకవాసమో ప్రాప్తించవచ్చు. ఏది లభించిన అభ్యంతరం లేదు కాని తనకి జీవించి వున్నప్పుడే కాకుండాచనిపోయేటప్పుడు కూడా నారాయణునిపై ధ్యాస ఉంటే చాలు అంటున్నారు.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

# గంగా పుష్కరాలు

– మావూరి విజయలక్ష్మి



**పుష్కరాలు హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం. ధార్మికులు, భక్తులు, సంప్రదాయవాదులు అందరూ ఆత్రంగా ఎదురుచూసే పర్వదినాలు పుష్కరాలు. అందులోను గంగానది పుష్కరాలు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఎందుకంటే నదులలలోకెల్లా అత్యంత ప్రధానమైనది, పరమ పవిత్రమైనది, సాక్షాత్తు శ్రీమహావిష్ణువు పాదాల నుంచి పుట్టిన పరమ పవిత్రమైన నదీమతల్లి గంగమ్మ.**

భారతీయులకు గంగానదితో అపరిమితమైన అనుబంధం ఉందని చెప్పాలి. హిందువులు గంగానదిని ఎంతో పవిత్రంగా పూజిస్తారు. ఒక రకంగా చెప్పాలంటే హిందూ మత విశ్వాసాలకు, స్వచ్ఛతకు గంగానది ప్రధాన సూచిక. అలాంటి గంగానదికి ఏప్రిల్ 22 నుండి పుష్కరాలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ సందర్భంగా పుష్కరాల గురించి, పుష్కరాలు ఎలా ఏర్పడ్డాయి? పుష్కర తేదీలు... ఎక్కడెక్కడ ఈ పుష్కర స్నానాలు చెయ్యచ్చు... పుష్కరాలు ఎన్ని రోజులు జరుగుతాయి? ఇలా పుష్కరాలకు, గంగమ్మ తల్లికి సంబంధించిన కొన్ని విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

సమస్త ప్రాణకోటి మనుగడకు ఆధారం జలం. (నీరు) జలం పుట్టిన తర్వాతే జీవకోటి ఉద్భవించింది. జలధారల వెంటే నాగరికత విస్తరించింది. అలాంటి జలాన్ని దేవతలుగా పూజించడం, ఆరాధించడం హిందూ సంప్రదాయం. నదీ స్నానాలు, కోనేటి స్నానాలు, సముద్ర స్నానాలు, మంగళ స్నానాలు ఇలా ప్రతి హిందూ సంప్రదాయం నీటితోనే ముడిపడి ఉంటుంది. దేవతారాధనలు, శుభకార్యాలే కాదు శ్రాద్ధకర్మలు, పిండప్రదానాలు, తర్పణాలు లాంటి పెద్దల కార్యక్రమాలు కూడా నీటితోనే ముడిపడి ఉంటాయి.

ముఖ్యంగా ఈ సంప్రదాయాల్లో నదీ స్నానానికి అత్యంత ప్రముఖమైన స్థానం ఉంది. ఆ నదీ స్నానాల్లో కూడా పుష్కర స్నానం పుణ్యప్రదమని హిందువుల విశ్వాసం. తైత్తరీయ ఉపనిషత్తు ప్రకారం బ్రహ్మ నుంచి ఆకాశం, ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి జలం, జలం నుంచి భూమి, భూమి నుంచి ఓషధులు, ఓషధుల నుండి అన్నం, అన్నం నుండి జీవుడు పుట్టాయని వివరిస్తుంది. ఇలా జీవరాశులకు ప్రధానమైన జలం ప్రాముఖ్యతను గుర్తు చేసేవే పుష్కరాలు. మరి ఈ సంవత్సరం ఏప్రిల్ 22 నుంచి గంగానది పుష్కరాలు ప్రారంభం కాబోతున్నాయి. ఏప్రిల్ 22 వ తేది నుండి 12 రోజులపాటు జరుగుతాయి.

పుష్కర సమయంలో నదీస్నానం సర్వపాపహరం అని హిందువుల నమ్మకం. అందులో పరమపావని అయిన గంగానది పుష్కరాలంటే ఒళ్ళంతా పులకరింతే. గంగానది పుట్టిన గంగోత్రి నుండి ఆ నది సముద్రంలో కలిసే ఏ ప్రదేశంలో స్నానం చేసినా పుణ్యప్రదమే. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు గంగమ్మ ప్రవహించే ఏ ప్రదేశంలో పుష్కరస్నానం చేసినా ఫలితం అందుతుంది. అయినా కూడా గంగానది అనగానే మన కళ్ళముందు మెదిలే కాశి, గంగా, యమున, సరస్వతి మూడు నదుల సంగమ స్థానమైన ప్రయాగ, హరిద్వార్, ఋషికేశ్ లలో గంగాస్నానం చేసి ముక్తి పొందాలని ప్రతి ఒక్కరు అనుకుంటారు. అక్కడ గంగా పుష్కర స్నానంతో పాటు ఆ పవిత్ర క్షేత్ర దర్శనం కూడా చేసుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆ క్షేత్రాలలో గంగాపుష్కర స్నానం చెయ్యడానికి భక్తులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తారు. ఇక పుష్కరుడు ఈ సంవత్సర కాలం గంగానదిలో ఉంటాడు. సంవత్సరంలో ఎప్పుడు ఇక్కడ స్నానమాచరించినా, ఏ పుణ్యకార్యం చేసినా పుణ్యప్రదమే. అయితే పుష్కర ప్రారంభకాలం అంటే ఆది పుష్కరకాలం ఏప్రిల్ 22 నుంచి 12 రోజులు ఆది పుష్కరాలు అంటారు. ఆ

సమయంలో స్నానం చేయడం మరింత ఫలితాన్ని ఇస్తుందని నమ్ముతారు. సంవత్సరమంతా పుష్కరుడు ఆ నదిలో ఉన్నప్పుడు సంవత్సరంలో ఎప్పుడు ఆ నదిలో స్నానం చేసినా ఆ పుణ్యఫలితం రావాలి కదా. మరి ప్రారంభంలోని 12 రోజులే ప్రత్యేకంగా పుష్కరాలు అని ప్రసిద్ధి చెందాయి అంటే ఈ ప్రారంభంలోని 12 రోజుల్లోనూ పూర్తిగా పుష్కరుడు ఆ నదిలో ఉంటాడు. తరువాత సంవత్సరమంతా మధ్యాహ్నం సమయంలో రెండు ముహూర్తాల కాలం మాత్రమే ఆ నదిలో ఉంటాడు. అందుకని ఆది పుష్కరాలు అంటే పుష్కరాల ప్రారంభ 12 రోజులకు అంత ప్రాధాన్యత. అలాగే అంత్య పుష్కరాలు అంటే సంవత్సరం చివరి 12 రోజులు కూడా పుష్కర స్నానం పుణ్యఫలితాన్నిస్తుందని చెప్తారు.

అయితే గంగమ్మలో ఎప్పుడు మునకేసినా కూడా ఆ పవిత్రత ఉంటుంది కదా. ప్రత్యేకంగా ఈ పుష్కర సమయంలో చేసే స్నానానికి ఎందుకింత ప్రాధాన్యత అన్న సందేహం మనకు వస్తుంది.పుష్కరకాలంలోఆనదిలోఅంటేఏనదికైతేపుష్కరాలు వస్తాయో ఆ నదికి పదివేల నదుల పవిత్రత ఏర్పడుతుందని మహాభారతంలోని అరణ్యపర్వం తెలియజేస్తోంది. దానికంటే ముఖ్యంగా పుష్కరకాలంలో అంటే ఆ సంవత్సరమంతా పుష్కరుడు ఆ నదిలో కొలువుదీరి ఉంటాడని పురాణ కథనాలు చెప్తున్నాయి. పుష్కరాల వేళ నదీస్నానం చేసి దేవతలకు, రుషులకు, పితృదేవతలకు తర్పణాలు విడిచిన వారికి పది అశ్వమేధ యాగాలు చేసిన పుణ్యఫలితం కలుగుతుందని నారదుడు ధర్మరాజుకు చెప్పినట్లుగా మహాభారతం చెప్తోంది. అందుకే పుష్కరాలలో పితృదేవతలకు విధిగా శ్రాద్ధం నిర్వహించాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఇదంతా విన్న తరువాత, నదిలో పుష్కరుడు ఉండడమేంటి, ఆ సమయంలో నదికి మరింత పవిత్రత ఏర్పడమేమిటి... అసలెవరీ పుష్కరుడు? అనే సందేహం వస్తుంది మనకు. మరి దీని గురించి పురాణ కథనాలేం చెప్తున్నాయంటే...

పూర్వకాలంలో పుష్కరుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. జనులందరూ జీవనదులలో పుణ్యస్నానాలు చెయ్యడం, ఆ నదీమతల్లులు వారి పాపాలను ప్రక్షాళన చెయ్యడం, తద్వారా నదులు కొంతవరకు తమ పవిత్రత కోల్పోవడం ఇవన్నీ చూసి, శివుని గూర్చి ఘోర తపస్సు చేసి స్వామి అనుగ్రహంతో పవిత్ర క్షేత్రంగా మారాడని పురాణ కథనం. స్వర్గంలో మందాకినీ నదిలో ఈ పుష్కర తీర్థం ఉందని, ఆ మందాకినీ నదిలోనే పుష్కరుడు ఉంటాడని కూడా పురాణ కథనాలు చెప్తున్నాయి. ఈ పుష్కరుడు సంవత్సరానికి ఒక నది చొప్పున 12 నదులలోనూ ప్రవేశిస్తాడని చెప్తారు. అలా ఆ నదికి వచ్చిన పుష్కరుడికి సప్తరుషులు ఆతిథ్యం ఇస్తారట.

ఈ పుష్కరునికి సంబంధించి మరో కథనం కూడా ఉంది. ఇది తుందిలుని కథ. తుందిలుడు ఈశ్వరుడి గురించి తపస్సు చేసి స్వామిని ప్రసన్నం చేసుకుంటాడు. ఏం వరం కావాలో కోరుకోమంటాడు శివుడు. తనకు ఈశ్వరునిలోనే స్థానం కావాలంటాడు తుందిలుడు. దాంతో శివుడు తన స్వరూపాల్లో ఒకటైన జలంలో అతనికి చోటు కల్పిస్తాడు. అలా సమస్త జీవులనూ పోషించే శక్తి తుందిలుడికి లభిస్తుంది. పోషించగలిగే శక్తిని సంస్కృతంలో పుష్కరం అంటారు. అలా తుందిలుడు కాస్తా పుష్కరుడు అయ్యాడు. ఇదిలా ఉంటే సృష్టి చెయ్యడానికి బ్రహ్మకు నీరు అవసరమవుతుంది. దాంతో పుష్కరుడిని తనకు ఇవ్వవలసిందిగా బ్రహ్మ ఈశ్వరుడిని అడుగుతాడు. అప్పుడు ఈశ్వరుడు పుష్కరుడిని బ్రహ్మక్ ఇస్తాడు. అలా పుష్కరుడు బ్రహ్మ కమండలంలోకి చేరతాడు. సృష్టి కార్యం పూర్తయ్యాక ప్రాణాధారం కోసం నీరు కావాలని గురువు బ్రహ్మను అడుగుతాడు. కాని పుష్కరుడు అక్కడినుంచి వెళ్ళడానికి ఇష్టపడడు. చివరికి బ్రహ్మ సూచన మేరకు బృహస్పతి, పుష్కరుడు ఒక ఒప్పందానికి వస్తారు. దాని ప్రకారం గురువు ఒక్కో రాశిలోకి ప్రవేశించే సమయంలో 12 రోజుల పాటు సంబంధిత నదిలో ఉంటానంటాడు పుష్కరుడు. మిగిలిన ఏడాదంతా మధ్యాహ్న సమంలో రెండు ముహూర్తాల కాలం పాటు అక్కడ ఉండాలన్న ఒప్పందం జరిగింది. గురువు అధిపతిగా ఉన్న నదికి దేవతలంతా పుష్కరుడితో కలిసి వస్తారు కాబట్టి నదీ స్నానం ఎంతో పుణ్యప్రదమని మన పురాణాలు పేర్కొంటున్నాయి.

ఇక ప్రత్యేకంగా ఏ నదికి ఎప్పుడు పుష్కరాలు వస్తాయి అన్నది మనకు ఎలా తెలుస్తుంది అన్న విషయానికి వస్తే... బృహస్పతి ఏడాదికి ఒక్క రాశి చొప్పున 12 రాశుల్లో సంచరిస్తుంటాడు. బృహస్పతి ఆయా రాశుల్లో చేరినప్పుడు ఆయా నదులకు పుష్కరాలు నిర్వహిస్తుంటారు. బృహస్పతి ఒక్కో రాశిలో ప్రవేశించినప్పుడు ఒక్కో నదికి పుష్కరంగా దేశంలోని 12 నదులు ఒక క్రమ పద్ధతిలో పుష్కరాలను శాస్త్రజ్ఞులు రూపొందించారు ఇలా.

గంగ, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణ, కావేరి, భీమరథి, తపతి, తుంగభద్ర, సింధు, ప్రాణహిత వంటి జీవనదులను పుష్కర నదులని పిలుస్తారు. ఒక్కోనదికి ఒక్కో రాశి అధిష్ఠానమై ఉంటుంది. పుష్కర సమయంలో ఆ నదిలో సకల దేవతలు కొలువై ఉంటారు. అందుకే ఆ సమయంలో నదిని చేరుకోవడం వల్ల ఆ దేవతలందరిని పూజించినట్లవుతుందని భక్తుల విశ్వాసం.

ధారావాహికం



వరాహ పురాణాంతర్గతం

# శ్రీ వేంకటాచల మాహాత్మ్యం

డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## 5. పడమటి దిక్కు అసురులతో యుద్ధం :

సుదర్శన మహారాజు మహాప్రతాపంతో దక్షిణ దిక్కును నిష్కంటకంగా చేసి, శాంతిని నెలకొల్పి ఆ దేశ రక్షణకై ధర్మాత్ముడైన ఒక రాజును నియమించి పశ్చిమ దిక్కుకు బయలుదేరాడు. అప్పుడు వేలకొలది భేరీ నినాదాలు మారుమ్రోగాయి. పతాకాలు, ధ్వజాలు అలంకరించిన ఏనుగులు, అశ్వాలు, మత్తేభాలు, గున్న ఏనుగులు, శస్త్రాలు–కవచాలు–ఆయుధాలతో యుద్ధానికి సన్నద్ధమైనాయి. ద్వీపాలలో పుట్టిన వాయువేగం గల వేలకొలది గుఱ్ఱాలు, కవచాలు, అస్త్ర శస్త్రాలతో బయలుదేరాయి.

నూరు గుఱ్ఱాలు, మూడువందల గుఱ్ఱాలు, వేయి గుఱ్ఱాలు ఒక్కొక్క గుంపుగా సర్వాయుధ సంపూర్ణులై, పతాకాలంకృతులై వెళ్ళారు. వందలు, వేలకొలది సిద్ధులు విమానాల వలె ప్రకాశిస్తున్న విచిత్ర రథాలలో బయలుదేరారు. ఖడ్గాలు, గండ్రగొడ్డళ్ళు ఎత్తి పట్టుకొని, కత్తులు, గదలు, శూలాలు చేతుల్లో ధరించి కాల్బలాతలు అట్టహాసాలు చేస్తూ బయలుదేరాయి. ఆ సేనా మధ్యంలో సుదర్శన మహారాజు సహస్ర భుజాలతో శోభిస్తూ ప్రకాశించాడు. ఆయన మండు వేసవిలో ప్రపంచాన్ని తపింప చేసే సహస్ర కిరణుడైన సూర్యుని వలె వెలుగొందాడు.

వేంకటాద్రికి సమీపంలో పడమటి దిక్కున ఒక అడవి ఉంది. అది పర్వతాలతో నిండి ఉంది. సింహాలు, పెద్దపులులు, తోడేళ్ళు, భల్లూకాలు ఆ అడవిలో తిరుగుతున్నాయి. ఏనుగులు, వరాహాలు, మహిషాలు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. పూర్వం పర్వతాకారుడైన కిరాతుడొకడు రాక్షసాంశతో జన్మించాడు. అతని పేరు కానన కర్త. అతడు రిపుఘ్నుని కొడుకు. చాలా బలవంతుడు. అతడు రుద్రుడి గురించి దీక్షతో తపస్సు చేయసాగాడు. సాహసి అయిన అతడు యక్షులు, రాక్షసులు, సిద్ధులు, మనుష్యులచే మరణం లేకుండా వరం కోరుతూ, పట్టుదలతో దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసిన శివుని ధ్యానించి, కత్తి తీసుకుని పూలతో అలంకరించిన తన శిరస్సును ఖండించుకున్నాడు. గంధాదులతో దాని నలంకరించి శివుడికి అర్పించడానికి సిద్ధం కాగా శివుని అనుగ్రహం వల్ల అతడు తిరిగి జీవించాడు. శివుడు అతడికి అభీష్ట వరప్రదానం చేశాడు.

కాననకర్త ఆ అడవిలో దుర్భేద్యమైన స్థావరాన్ని (దుర్గాన్ని) ఏర్పరచుకొని లక్షల సైన్యంతో కూడినవాడై వరదానం వల్ల వచ్చిన బలగర్వంతో లోకాలను పీడించసాగాడు. విప్రులు మొదలైన ప్రజలంతా అతనిచేత పీడితులై దుఃఖించారు. దురాత్ముడైన అతడు సుదర్శన మహారాజును సామాన్య రాజుగా భావించి ఆయనతో యుద్ధానికి బయలుదేరాడు. ఒక అక్షౌహిణీ సేనను వెంటబెట్టుకొని, ధనుర్బాణాలను, కవచం, ఖడ్గం, దండం మొదలైన ఆయుధాలను ధరించి శత్రుసేనలను సంహరించాలనే ఉత్సాహంతో ఆ వనకర్త రథాన్నధిరోహించి

ధనుస్సు నెక్కుపెట్టి సర్వశస్త్రాస్త్ర భూషితుడై యుద్ధానికి బయలుదేరాడు. అతని ముందు గుఱ్ఱాలు, ఏనుగులు, పదాతిదళం, రథికులు, అస్త్రశస్త్రాలు ధరించి వెళ్ళారు. ఆ ఉభయ సైన్యాలకు భయంకరమైన యుద్ధం జరిగింది.

శస్త్రాలు, అస్త్రాలు, వాడి బాణాలు, బాకులు, గండ్రగొడ్డళ్ళు, ఈటెలు, తోమరాలు, చక్రాలు, పరిఘలు, పట్టసాలు, శక్త్యాయుధాలు, శూలాలు, గజచర్మాలు, ఖడ్గాలు, శతఘ్నులు మొదలైన చిత్రవిచిత్ర ఆయుధాలతో పూర్వం దేవదానవ సంగ్రామం వలె ఆ ఉభయ సేనల మధ్య పరస్పరం భయంకరమైన యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో సుదర్శనుని భటులు కిరాతకులను వధించారు. ఆ కిరాతసేనల్లో కొందరు అనేక ఆయుధాలను, శూలాలను, ఇనుప సమ్మెటలను చేతపట్టి, గదలు, పట్టసములు, దండములు, ఆయసములు, ముసలములు, పరిఘలు, బాకులు, బల్లములు, ఈటెలు, పరశువులు, కవచములు ధరించి ధ్వజాలంకృతాలైన రథాల నధిరోహించి బయలుదేరారు. మరికొందరు బంగారు మాలలు ధరించి బహుముఖముల గాడిదలతో, వేగవంతాలైన గుఱ్ఱాలతో, మదించిన ఏనుగులతో వచ్చి సుదర్శన మహారాజు భటుల్ని కొందరిని హతమార్చారు.

సుదర్శనుని సేనలు వారిని భయంకరమైన గదలతో, పట్టసాలతో, ముద్గరాలతో, పరిఘలతో, త్రిశూలాలో యుద్ధంలో చీల్చి చెండాడారు. అవమానం వలన కలిగిన రోషంతో శత్రువులకు ప్రతిక్రియ చేశారు. బాణాలతో, శూలాలతో శత్రువుల శరీరాలను ఛిన్నాభిన్నం చేశారు. శత్రువులను పేరు పేరునా పిలిచి మధించారు. ఇరు సైన్యాలకు అద్భుతం, భయంకరమైన యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో కొందరు వనవాసులు నోట రక్తం కక్కారు. కొందరికి పార్శ్వాలు, మరికొందరికి హస్తాలు తెగినాయి. కొందరు పట్టసాలతో చూర్ణమయ్యారు. మరికొందరిని ప్రాసాలతో చీల్చివేశారు. పడిపోయిన ధ్వజాల క్రిందపడి, ఏనుగులు–గుఱ్ఱాలు–రథాల క్రిందపడి కొందరు మరణించారు. మరికొందరు అడవిలోనే చనిపోయారు. ఇంకొందరు సమ్మెట దెబ్బలకి నేలకొరిగారు.

కొందరు పరిఘలచే మథించబడి, బాకులచే పొడవబడి కొందరు వనవాసులు రక్తంతో తడిసి నేలకొరిగారు. కొందరు భయపడి పారిపోయారు. కొందర ప్రక్కన దాక్కున్నారు. కొందరి గుండెలను చీల్చివేశారు. కొందరిని త్రిశూలాలతో పొడిచారు. ఈ విధంగా పారిపోయిన సైన్యాన్ని చూచి వనకర్త క్రోధా తామ్రాక్షుడై మహాశూరుడైన జ్వాలాపాతునితో 'నీవు వెంటనే వెళ్ళి శత్రువులను వధించు' అని ఆజ్ఞాపించగా ప్రతాపవంతుడైన జ్వాలాపాతుడు కనకాంగద భూషితుడై రథాన్నధిరోహించి ధనుష్టంకారం చేశాడు. అప్పుడు సుదర్శన మహారాజు మహాక్రోధంతో బడబానలమంతటి పరాక్రమం గల బడబాముఖుడనే సేనాపతిని సృష్టించి, 'నీవు యుద్ధంలో శత్రుసైన్యాన్ని నిశ్శేషంగా సంహరించు'మని ఆజ్ఞాపించాడు.

అతడు వెంటనే రథాన్నధిరోహించి ధనుస్సులో బాణాన్ని సంధించి శత్రువులపై వదిలాడు. ఆ మహారథుడైన బడబానసుడు శత్రుసైన్యంపై వందలు, వేలు, లక్షలు బాణాలను వదిలాడు. రథాలను, గుఱ్ఱాలను పడగొట్టాడు. కాలయముని వలె అతడు ఒకే ఒక వాడిబాణంతో గజయూథాన్ని సంహరించాడు. బడబానలం ఒక్కక్షణంలో నీటిని పీల్చివేసేటట్లు ఆ బడబానసుడు శత్రుసైన్యాన్ని భస్మం చేశాడు. పరాక్రమవంతులలో అగ్రగణ్యుడైన సుదర్శనుడు రెండు నిముషాల్లో ఒక అక్షౌహిణీ సైన్యాన్ని యమలోకానికి పంపించాడు. లఘు విక్రమం గల కిరాతుడు తన బలమంతా నిశ్శేషంగా నశించటం చూసి దివ్యాస్త్రాన్ని సంధించి 'ఆగు, ఆగు' అంటూ రథం నుండి వేగంగా పరుగెత్తుకొని వచ్చాడు. అప్పుడు సుదర్శనుని మహాకోపం నుండి పుట్టిన బడబానసుడు విష్ణుచక్రంతో ఆ భయంకరుడైన వనచరుణ్ణి సంహరించాడు. ఆ కిరాతరాజు చనిపోగానే ఆ అడవి ప్రశాంతంగా, నిర్మలంగా ప్రకాశించింది.

సహస్ర కిరణుడైన సూర్యునివలె ప్రకాశిస్తున్న సుదర్శన మహారాజు పశ్చిమ ప్రాంతంలో దుష్టులను శిక్షించి, రాజ్యాన్ని నిష్కంటకం గావించి దుర్గాలను, పర్వత ప్రదేశాలను, వనాలను సుభిక్షం చేసి, ఆ ప్రదేశాలను ఏనుగులు, గుఱ్ఱాలచేత తొక్కించి, అన్ని దిక్కులలో రాచబాటల నేర్పరచి, అక్కడి ప్రజలంతా సుఖంగా ఉండేటట్లు చేసి, సత్యవాది, ధర్మాత్ముడైన వ్యక్తిని ఆ దేశ రక్షకునిగా నియమించి, అక్కడ ప్రజలందరిని వీడ్కొని, దుష్టచోరులను శిక్షించటానికి సైన్యసమేతుడై వెంటనే బయలుదేరాడు.

ఆ తరువాత సుదర్శనుడు సహస్రభుజుడై, సహస్రకిరణుడైన సూర్యుడు మంచును పోగొట్టటానికి ఉదయించినట్లు ఉత్తర దిక్కుకు బయలుదేరాడు. శ్రీవేంకటాచలపతి దివ్యాజ్ఞను పరిపాలించే సుదర్శన మహాప్రభువు ప్రతాప విక్రమోపేతుడు. ఆయనకు ముందుగా పదాతులు, గజాలు, అశ్వాలు, పర్వతాల వంటి రథాలు బయలుదేరాయి. అంతటా యుద్ధభేరీలో మ్రోగాయి. అప్పుడు మద్దెలలు, తప్పెట్లు, పుష్కరాలనే యుద్ధభేరీలను, బంగారు దుడ్డుగోలలతో గట్టిగా కొడుతూ మ్రోగించారు. లక్షలాది శంఖాలు పూరించారు. ఆ శంఖనాదం ఒక మహాఘోష వలె వినబడింది. మెరపుతీగ వలె, సూర్యుని వలె ప్రకాశించే ఖడ్గాలు, ఈటెలు, పట్టసాలు ఆ మహాసైన్యంలో మేఘాల మధ్యలో మెరపుల వలె మెరుస్తూ ఉన్నాయి.

## 6. భేరుండాసుర సుదర్శన సేనల యుద్ధం :

వేంకటాద్రికి ఉత్తరం వైపున భేరుండాసురుడనే ఒక మహా రాక్షసుడున్నాడు. వాడు పర్వతాకారుడు. దైత్యులలో ముఖ్యుడు. బలగర్వితుడు. పూర్వం బ్రహ్మదేవుడు అతనికి ఒక వరమిచ్చాడు. అతడు తన పరివారంతో అక్కడ నివాస మేర్పరచుకొని ఆ వేంకటాద్రిపైన, లేదా వేరే పర్వతంపైన, అడవిలో తపస్సు చేసుకునే వారికి విఘ్నాలు కలిగిస్తూ ప్రాణులకు భయంకరుడై గ్రామాల్లో, పట్టణాల్లో ఉన్న విప్రులను, మానవులందరినీ బాధిస్తూ ఉన్నాడు. అతనా ప్రాంతంలోని వారందరినీ బాగా పీడించాడు.

కాంభోజులు, యవనులు, ప్లేచ్ఛులు, సంకరజాతి వారు భేరుండాసురునితో చేరి బలగర్వితులై అక్కడున్న ప్రజలను హింసిస్తున్నారు. ఆ పాపాత్ములంతా కలిసి ముసలాయుధాలను ధరించి, భేరుండాసురుని ముందిడుకొని రథాలు, అశ్వాలు, గజాలతో కూడినవారై సుదర్శనరాజు యుద్ధానికి వచ్చాడని తెలుసుకొని యుద్ధానికి బయలుదేరారు. వారంతా గదలు, శక్త్యాయుధాలు, గండ్రగొడ్డళ్ళు, అంకుశాలు, పాశాలు, బంగారు ఒరలతో ఉన్న ఖడ్గాలను చేతపట్టి యుద్ధానికి బయలు దేరారు. వారిలో కొందరు చర్మాయుధాలు ధరించారు. కొందరు తోమరాలను, మరికొందరు త్రిశూలాలను, ఇంకొందరు శరచాపాలను ధరించారు. మహా బలసంపన్నులైన వారంతా అట్టహాసంగా జయ జయ ధ్వానాలు చేస్తుండగా కొందరు వాద్యాలను మ్రోగించారు. ఆ వాద్య ఘోష పెద్ద శబ్దంగా వినబడింది.

ఈ విధంగా యుద్ధ సన్నద్ధులై వచ్చి వారు గొప్ప యుద్ధం చేశారు. సుదర్శన భటులు, భేరుండుని భటుల మధ్య గొప్ప యుద్ధం జరిగింది. కిరాతుని సేనలోని రథికులు సుదర్శనుని భటుల్ని హతమార్చారు. కొందరికి శిరస్సులు తెగాయి. కొందరికి పాదాలు తెగాయి. కొందరి తలపాగాలు, కిరీటాలు పడిపోయాయి. మరికొందరిని గుండెలపై కొట్టారు. కొందరి కవచాలను ఛేదించారు. ఇంకొందరి తొడలు, చేతులు నరికారు. ఈవిధంగా ఆ దుర్మార్గుడైన భేరుండాసురుడు సుదర్శనుని సైన్యాన్నంతా నేలగూల్చాడు.

అప్పుడు సుదర్శన మహారాజు చనిపోయిన తన సూన్యాన్ని చూచి క్రోధతామ్రాక్షుడై కాలాంతకుడైన యముని వలె ప్రజ్వలించాడు. ఆయన ఈ విధంగా కోపించగా జగత్తంతా కలుషితమై దిక్కు తోచలేదు. ఆకాశంలో సూర్యచంద్రులు ప్రకాశించలేదు. నక్షత్రాలు వెలుగొందలేదు. ఆకాశం నుండి వేలకొలది ఉల్కలు పడ్డాయి. ధూళితో కూడిన వాయు ప్రభంజనం చాలా వేగంగా వీచింది. భూమండలమంతా కంపించింది. పర్వతాలు క్రుంగాయి. వృక్షాలు నేలకొరిగాయి. సముద్రాలన్నీ అల్లకల్లోలాలైనాయి. ఒక్క క్షణంలో ప్రకృతి అంతా తల్లక్రిందులైంది.

ఆ యుద్ధానికి వచ్చిన దైత్యులు, కిరాతులు, పుల్కసులు మొదలైన రాక్షసులు పాపోపహతులై దుఃఖించారు. అంతట ఆ సుదర్శనుని కోపాగ్ని నుండి మహాద్భుత శక్తి సంపన్నుడైన పురుషుడు ఉద్భవించాడు. అతడు చాపాన్ని, ఖడ్గాన్ని, బాణాన్ని ధరించి పింగళవర్ణంలో ఉన్నాడు. అతని పేరు పావక సంకాశుడు. అతడు సాక్షాత్తు అగ్నిహోత్రునివలె ఉన్నాడు. సుదర్శన మహారాజు అతనిని రాక్షసులను సంహరించమని ఆజ్ఞాపించాడు.

ఆ పావకుడు సర్వశాస్త్రాలను సమకూర్చుకుని యుద్ధరంగంలోకి దూకాడు. అతడు ప్రళయాగ్ని వలె, వెయ్యి సూర్యుల వలె ప్రకాశిస్తూ శత్రుసైన్యాలపై బాణవర్షాన్ని కురిపించాడు. ఆశ్చర్యకరమైన గాంధర్వాస్త్రాన్ని ప్రయోగించి దైత్యులను మోహింపచేస్తూ వారికి వినోదం కలిగించాడు. దానితో వారు మోహితులై ఆయుధాలన్నీ వదిలేసి శత్రుసైన్యాన్ని కూడా స్వజనంగా భావించి యుద్ధం చేయకుండా మిన్నకున్నారు.

అప్పుడా శత్రుయోధులు పావకుని చూచి అతడు తమ దైత్యవంశంలో పుట్టిన తండ్రిగా భావించి భూమిపై సాష్టాంగపడి నమస్కరించారు. అది చూచి దేవతలు, గంధర్వులు, సిద్ధులు, విద్యాధరులు మొదలైన వారంతా మిక్కిలి ఆశ్చర్యపడి 'బాగు బాగు' అన్నారు. పావకుడు మోహితులైన సైనికులను చంపటం మంచిది కాదని ఆ అస్త్రాన్ని ఉపసంహరించాడు. శత్రుసైనికులు మోహాన్ని వీడి శస్త్రాస్త్రాలను చేటబట్టారు. వారు ఖడ్గాలతో, గదలతో, పట్టసాలు మొదలైన ఆయుధాలతో భయంకరమైన యుద్ధం చేశారు.

అప్పుడు పావకుడు క్రౌంచాస్త్రాన్ని ప్రయోగించి ఆ యుద్ధోన్మత్తుల ముక్కు చెవులను ఛేదించమంటూ అస్త్రమంత్రాన్ని జపించాడు. వెంటనే వారందరి ముక్కు చెవులు తెగిపడ్డాయి. ఆ అవమానాన్ని చూసి శత్రుసైనికులు కోపంతో, ధైర్యంతో తిరిగి తలపడ్డారు. అప్పుడు సర్వాస్త్ర విశారదుడైన పావక సంకాశుడు బాకులతో శత్రువులందరి శిరస్సులను ఛేదించేశాడు. వారందరి చేతులు తెగిపడ్డాయి. వారు శత్రుసైన్యంపై పడి వారిని మ్రింగడానికి ప్రయత్నించారు. అది చూసి పావకుడు అందరూ ఆశ్చర్యపడేటట్లుగా పైశాచాస్త్రాన్ని మంత్రపూర్వకంగా ప్రయోగించాడు. ఆ అస్త్రశక్తి వలన శత్రుసైనికులలోని ప్లేచ్ఛులు, దైత్యులు మొదలైన వారంతా పిశాచాలు, భూతాలు పట్టిన వారివలె బుద్ధిహీనులై ఒళ్ళు మరచి తమలో తామే ఒకరినొకరు భక్షిస్తూ నశించారు.

తన సైన్యం యుద్ధభూమిలో నిశ్శేషంగా మరణించడం చూసి భేరుండాసురుడు కోపోద్రిక్తుడై పరమ భయంకరమైన శూలాన్ని

చేతపట్టి యుద్ధభూమిలో పావకుని పైకి లంఘించాడు. అప్పుడు మూడు యోజనాల వరకు భూమి కంపించింది. పావకుడు వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించాడు. వాయువు గడ్డిపరకను తోసేసినట్లు ఆ వాయవ్యస్త్రం పర్వతాకారుడైన ఆ రాక్షసుని గిరగిర తిప్పి వేంకటాద్రికి పది యోజనాల దూరంలో ఆకాశానికి ఎత్తి భూమిపై పడేసింది. పరమాద్భుతమైన ఆ వాయవ్యాస్త్ర శక్తికి పర్వతాకారుడైన భేరుండాసురుడు పండిన గుమ్మడిపండు వలె ముక్కలు ముక్కలై పోయాడు.

ఈ విధంగా సుదర్శనుడు ఆ దైత్యుని సంహరించి ఆ ప్రదేశాన్ని నిష్కంటకం చేసి వనదుర్గాలన్నటిని పడగొట్టి వేంకటాద్రిలో ప్రజలు సుఖంగా ఉండేటట్లు చేశాడు. అప్పుడు దేవతలు, గంధర్వులు ఆకాశం నుండి పుష్పవృష్టి కురిపించారు. 'బాగు బాగు' అని ఆ సుదర్శనుని అనేక విధాల స్తుతించారు. 'ప్రభూ! మీ వల్ల జనపదాలన్నీ ప్రకాశవంతంగా ఉన్నాయి. మీరిక వేంకటేశుని సన్నిధికి వెళ్ళండి' అని చెప్పి దేవతలంతా సంతోషంతో స్వర్గానికి వెళ్ళారు.

సుదర్శనుడు తన సైన్యంలో చనిపోయినవారిని వేంకటేశుని ఆజ్ఞతో తిరిగి బ్రతికించి స్వస్థుల్ని చేశాడు. సకాలంలో వర్షాలు కురిశాయి. వృక్షాలు ఫలించాయి. పంటలు బాగా పండాయి. ప్రజలంతా ఆరోగ్యంగా ఉన్నారు. దుష్టుల బాధ కొంచెం కూడా లేదు. ఇది వైకుంఠమా? మరొక స్వర్గమా? అని వారంతా అనుకొన్నారు. దేవతలు కూడా ఆ వేంకటాద్రిలో పుట్టాలని కోరుకున్నారు. ప్రతాపశాలియైన సుదర్శనుడు సహస్రభుజ శోభితుడై వేంకటేశుని ఆజ్ఞను నెరవేర్చి జయ మంగళ ధ్వానాలతో దేవతలు పుష్పవర్షం కురిపిస్తుండగా సర్వసైన్యాలతో కూడి సర్వాభరణ భూషితుడై ఆ వేంకటేశ్వరుని దివ్య మంగళకరమైన దివ్య విమానంలో ప్రవేశించాడు.

**(సశేషం)**

# "మీ ప్రశ్న మా సమాధానం"

జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు. – ఎడిటర్, శ్రీవేంకటేశం

నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు

**ప్రశ్న – భావన, ఫలితాల గురించి చెప్పండి. భగవంతుడు ప్రతి ఒక్కరి కోరిక ఎలా తీరుస్తాడు? - రామ్ కిషోర్, పాతనగరం, హైదరాబాద్**

జవాబు – మతాలు, ఆరాధనలు వేరైనా, భక్తిలో, భగవంతుని యందు సర్వులూ సమానమే. దేవుడు ఒక్కడే. దేవతలు వేరు వేరు. ఏ వ్యక్తి ఏ భావనతో భజనలు, పూజలు చేస్తాడో, ఆ భావం ఎంత ఏకోన్ముఖంగా, ఏకాగ్రంగా, ప్రబలంగా ఉంటుందో దాన్ని బట్టే మరి ఫలితం ఉంటుంది. సాధారణంగా మనుష్యుల భావన లేదా విశ్వాసం అనేది ఏదో ఒక మాధ్యమం ద్వారా ఉత్పన్నమౌతుంది. ఒకరికి రాముడి ద్వారా, మరొకరికి లక్ష్మీమాత ద్వారా, ఇంకొకరికి అల్లా ద్వారా, మరొకరికి ఏసుక్రీస్తు ద్వారా ఈ భావన జనిస్తుంది. వారి వారి భావనను బట్టి ఆ భగవంతుడు కూడా వారిని అదేవిధంగా స్వీకరించి కరుణిస్తాడు. వారి మనోవాంఛలు తీరేట్లు చేస్తాడు. ఇది పెద్దలు చెప్పిన మాట.

**ప్రశ్న – జీవించి ఉండగానే జీవన్ముక్తులు ఎలా అవుతారు? అలా ఎవరు భావించబడుతారు? -నరేష్ బాల, కవాడిగూడ, హైదరాబాద్.**

జవాబు – ఎవరైతే సత్సంగం, సద్గురుకృప మరియు సాధనల ద్వారా జ్ఞానం పొంది – అనగా కర్తవ్య కర్మలు చేస్తూ తన 'వ్యక్తిభావన' నుండి 'బ్రహ్మభావన'లోకి వెళతారో, తాము నిరాకార శుద్ధ చైతన్య బ్రహ్మలోని అంశమని గ్రహించి ఆ బ్రహ్మ భావనలో నిలుస్తారో వారే జీవన్ముక్తులు. బంధాల కతీతంగా ఉండేవాడే జీవన్ముక్తుడు.

**ప్రశ్న – ఏదైనా సద్గ్రంథం, పురాణం చదవగానే లేదా వినగానే పుణ్యం వచ్చేస్తుందా? -ఆహ్లాద్, బోడుప్పల్**

జవాబు – రాదు. పఠనం ద్వారా, లేదా శ్రవణం ద్వారా మనకు ఒక విషయం పట్ల అవగాహన ఏర్పడుతుంది. అయితే అలా అవగాహన ఏర్పడిన తరువాత గురి కలిగాక, అలా విన్నదానిని, చదివిన దానిని ఆచరణలో పెట్టినప్పుడే పుణ్యమూ, పురుషార్థమూ లభిస్తాయి. టన్నుల ఉపదేశాల కన్నా ఒక ఔన్స్ ఆచరణ గొప్పదన్న సూక్తి మీకు తెలిసే ఉంటుంది. తీపి ఎక్కువ తినడం మానెయ్యి ఒక బాలుడికి ఉపదేశం చెయ్యడానికి ముందు రామకృష్ణ పరమహంస ముందు తను చదివినది విన్నది – తీపి ఎక్కువ తినడం వల్ల అనర్థాలు – తను ఆచరణలో పెట్టిన తర్వాతే, తాను చక్కగా ఆచరించిన తర్వాతే ఉపదేశించాడట. కాబట్టి తెలుసుకున్నదాన్ని శ్రద్ధగా, సాధనతో ఆచరించినప్పుడే జ్ఞానం లేదా పుణ్యం లభిస్తుంది. ప్రయత్నంతో సాధ్యపడనిది ఏదీ ఉండదు.

# శ్రీకృష్ణావతార విశేషము

– విద్వాన్ వల్లూరి చిన్నయ్య

## శ్రీమదాంధ్ర భాగవతం దశమస్కంధం పూర్వభాగం



మహాభయంకరము, ఎండమావులతో, మెరుపుతీగెలతో సమానము అయిన ప్రాపంచిక భోగకామాన్ని వదిలించి అమోఘము అద్వితీయము అనితర సాధ్యము అవ్యయానంద దాయకము అయిన శ్రీ కంజాక్షుడగు హరి పాదపద్మ సేవా భాగ్య కామాన్ని కలిగించే మహత్తర మహోత్తమ తత్వామృత సారసంజనితమగు శ్రీమదాంధ్ర మహాభాగవతం దశమ స్కంధం పూర్వభాగం ఆధారంగా రచింపబడిన శ్రీకృష్ణావతార విశేషం అనే వ్యాసమిది.

ధరణీమణియందు ధర్మసంస్థాపనార్థం దశావతార మూర్తి యగు శ్రీ శౌరి ఉద్భవించి శాంతి సంస్థాపనం చేశాడు. ద్వాపర యుగంలో శ్రీకృష్ణమూర్తిగా దేవకీదేవి పవిత్రగర్భం నుంచి పుట్టినాడు. ఆ మహామహుడు మాతృగర్భం నుంచి అవతారం దాల్చేటప్పుడు కలిగిన శుభ సూచనలు అత్యద్భుతాలు. అమలోదాత్త విశేషాలు. అమృతానంద దాయకాలు. సప్త సముద్రాలు సంతసంతో ఉప్పొంగాయి. మేఘాలు ఆనందంతో ఘనంగా గర్జించాయి. ఆకసం గణనీయమైన గ్రహాలతోను నక్షత్రాలతోను పరమోన్నతంగా ప్రకాశించింది. దిక్కులు దేదీప్యమైన కాంతులతో విరాజిల్లాయి. చల్లనిగాలి కమనీయమైన కమ్మని సువాసనలతో మెల్ల మెల్లగా వీచింది. ఋషీశ్వరుల హోమకుండాలలో అగ్నిదేవుడు ఆనందంతో ప్రజ్వరిల్లాడు. కొలనులు తామర పువ్వులతోను, అందులో తిరుగాడే తుమ్మెదల ఝుంకారాలతోను కళావంతమయ్యాయి. నదీమతల్లులు నిర్మలమైన నీటితో నిండుగా దండిగా ప్రవహించాయి. భూమాత ఆనందానికి మేర లేదు. పక్షుల కిలకిలారావాలు అక్షయంగా అతిశయించాయి. నగరాలు గ్రామాలు నయనానందాన్ని ప్రకటించాయి. దివ్యమైన సద్భావాలు గల మహిళామని యగు ఆ దేవకీ



అమలోదాత్త శుభసమయంలో దేవకీదేవి కృష్ణుణ్ణి కన్నది. దుష్టశిక్షకుడగు కృష్ణుని ఉద్భవంతో అతణ్ణి ఆశ్రయించే సదాచార సంపన్నుల ఆస్థానంలో ఆనందం వెల్లివిరిసింది. గ్రహాలు తారలు శుభస్థానాల్లో శోభించాయి.

మాత దేవదేవుడైన వాసుదేవుణ్ణి ప్రసవించే సందర్భంలో సర్వదేవతలు సర్వోత్తమంగా పుష్పాల వర్షాన్ని కురిపించారు.

**కం. పాడిరి గంధర్వోత్తము**
**లాడిరి రంభాది కాంతలానందమునం**
**గూడిరి సిద్ధులు భయముల**
**వీడిరి చరణులు మొరసె వేల్పుల భేరుల్**

**పై పద్యం ఆంధ్ర మహాభాగవతం దశమస్కంధం పూర్వభాగం 107వ పద్యం**

కృష్ణపరమాత్మ జనన సమయంలో శ్రవణానందకరంగా గానం చేశారు. రంభాది అప్సరసలు నవరస భరితంగా నాట్యం చేశారు. సిద్ధులందరు ఒకచోట చేరి ఆనందాన్ని అనుభవించారు. చారణులు భయానిన పోగొట్టుకున్నారు. దేవతలు ఉత్సాహభరితంగా భేరీలు మ్రోగించారు. ఇలాంటి అమలోదాత్త శుభసమయంలో దేవకీదేవి కృష్ణుణ్ణి కన్నది. దుష్టశిక్షకుడగు కృష్ణుని ఉద్భవంతో అతణ్ణి ఆశ్రయించే సదాచార సంపన్నుల ఆస్థానంలో ఆనందం వెల్లివిరిసింది. గ్రహాలు తారలు శుభస్థానాల్లో శోభించాయి.

**కం. వెన్నుని నతిప్రసన్నుని**
**గ్రన్నన గని మెఱుఁగుఁబోఁడి గడు నొప్పారెం**
**బున్నమి నాఁడు కళానిధిఁ**
**గన్న మహేంద్రాశ చెలువు గలిగి నరేంద్రా! 10-110**

పరమాత్ముని గన్న సౌశీల్య సౌభాగ్య అయిన దేవకీమాత శరీరం మెఱుపు తీగవలె మిక్కిలి ప్రకాశవంతమైంది. పున్నమినాడు పదహారు కళలతో నిండిన చంద్రుని ప్రసవించిన తూర్పుదిక్కు వలె ఆమె ప్రకాశించింది. దానవాంతకుడగు కృష్ణుడు మాత్రం చిరునవ్వులు చిందిస్తూ సర్వసుకళామయమూర్తిగా ఉన్నాడు.

ఆ సుందర వదనారవిందుణ్ని తండ్రి యగు వసుదేవుడు కన్నారా కాంచాడు. భవహరుడగు ఆ బాలుడు ఆయనకు సామాన్య బిడ్డడుగా కాక, భువన మోహనాకారుడైన విశ్వరూపుడుగా దర్శన భాగ్యాన్ని కలిగించాడు. ఆ పిల్లవాడు మేఘవర్ణంతో మెరిసిపోతున్నాడు. నాలుగు హస్తాలు కలిగి ఉన్నాడు. ఆ బాహువులలో గద, శంఖం, చక్రం, పద్మం పరమోత్తమంగా ప్రకాశిస్తున్నాయి. తామరరేకుల వంటి నేత్రాలు, సువిశాలమైన వక్షస్థలము, కంఠమందు కౌస్తుభ మణికాంతులు చిమ్ముతున్నాయి. ముద్దులు గొలిపే మొలత్రాడు, కమనీయమైన కంకణాలు కరములందు కాంతులను వెదజల్లుతున్నాయి. శ్రీవత్సమనే పుట్టుమచ్చ ఎదపై ముదము గూర్చుతూ ఉంది. చెవులకున్న చెవిపోగులు తమ కమనీయ కాంతులతో ముంగురులను ప్రకాశింప చేయుచున్నవి. మానితమైన మణులు వైడూర్యాలచే పొదగబడిన కిరీటం ధగద్ధగాయ మానంగా వెలిగిపోతూ ఉంది. వసుధలో వరణీయమైన గుణాలన్నీ అతణ్ణి వరించాయి. అతడు భక్తులను కంటికి రెప్పగా కాచేవాడుగా ఉన్నాడు. ఆ బిడ్డడు బాలుడయినా సలక్షణాలతో సర్వేశుడుగా పూర్ణచంద్రుని కాంతులు విరజిమ్ముతూ ఉన్నాడు.

అలాంటి పరదేవతామూర్తి విశ్వానికి విస్ఫూర్తి అయిన ఆ అలౌకికాత్మానందుణ్ణి తండ్రి అగు వసుదేవుడు పదే పదే దర్శించి పులకించిపోయాడు. ఉప్పొంగిపోయాడు. అమితంగా ఆశ్చర్యపోయాడు.



# దుర్యోధనుడి దుర్బుద్ధి

- కౌతా నిర్మల

ధర్మరాజును దుర్యోధనుడు జూదం ఆడటానికి ఆహ్వానించడంతో, అతని ఆహ్వానాన్ని కాదనలేక, తనకు జూదం పట్ల ఆసక్తి ఉండటంతో జూదం ఆడాడు ధర్మరాజు. ఆ జూదంలో శకుని పన్నాగం వల్ల ధర్మరాజు జూదంలో ఓడిపోయి, పన్నెండు సంవత్సరాలు వనవాసం చేయాల్సి వచ్చింది. తన ఓటమిని స్వీకరించి ధర్మరాజు తన సోదరులతో కలిసి ద్రౌపదిని వెంటబెట్టుకుని వనవాసం చేయటానికి బయలుదేరాడు. అప్పుడు కొంతమంది విప్రులు కూడా వారితో వనవాసానికి బయలుదేరారు. బ్రాహ్మణులు తమతోపాటు రావటానికి ధర్మరాజు నిరాకరించాడు. తాము అడవిలో లభించే కందమూలాలు తింటూ జీవించవలసి వస్తుందనీ, అడవిలో దుర్భరమయిన జీవితాన్ని గడపవలసి వస్తుందనీ, అడవిలోని క్రూరమృగాల వల్ల ప్రాణాపాయ స్థితి ఏర్పడవచ్చనీ, అందువల్ల రాజ్యానికి తిరిగి వెళ్ళిపొమ్మని చెప్పాడు. ఆ విప్రవర్యులు ధర్మరాజు మాటలను పాటించకుండా వారినే అనుసరించసాగారు. అప్పుడు ధర్మరాజు తమకూ, తమవెంట వచ్చే బ్రాహ్మణులకు అన్నపానాదులు అడవిలో ఏవిధంగా సమకూర్చగలమని ఆ విషయాన్ని, తమ సంకట పరిస్థితినీ, సందిగ్ధాన్ని ధౌమ్య మహర్షికి విన్నవించుకున్నాడు. ధౌమ్య మహర్షి కొంత సమయం ఆలోచించి, సూర్యభగవానుని పూజించి, ఉపాసించి, ఆయన అనుగ్రహం కలుగుతుందనీ, ధర్మరాజు సమస్యకు పరిష్కారం లభిస్తుందనీ, ఆ క్లిష్ట పరిస్థితి కలిగిపోతుందనీ ధర్మరాజుకు సలహా ఇచ్చాడు. ధౌమ్య మహర్షి సూచన ప్రకారంగా ఎంతో భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో సూర్యభగవానుని ఉపాసించాడు ధర్మరాజు. అతని భక్తికి సంతసించి ప్రసన్నుడయిన సూర్యభగవానుడు అతని ఎదుట ప్రత్యక్షమయ్యాడు. ఆయనకు నమస్కరించి తన పరిస్థితిని చెప్పుకున్నాడు ధర్మరాజు. వెంటనే ఆదిత్యుడు ధర్మరాజుకు రాగి అక్షయ పాత్రను ప్రసాదించాడు.

''వారు వనవాసం చేసినంతకాలం వారందరికీ ఆ అక్షయపాత్ర అన్నపానాదులను సమకూరుస్తుందనీ, అధైర్యపడవద్దనీ' వారికి ధైర్యాన్ని చెప్పాడు సూర్యభగవానుడు. 'ఈ అక్షయపాత్ర వల్ల ద్రౌపది ఎంతమందికి ఆహారం సమకూర్చాలన్నా, వారందరికీ కాదనకుండా భోజనం పెట్టగలుగుతుందనీ, చివరగా ద్రౌపది భోజనం చేసిన తర్వాత, ఆ అక్షయపాత్రలో ఆహారాన్ని సమకూర్చే శక్తి తొలగిపోతుందనీ' సూర్యుడు ధర్మరాజుతో చెప్పాడు.

ఆ అక్షయపాత్రతో ద్రౌపది తమతో వచ్చిన బ్రాహ్మణులకు, అతిథులకు భోజనాలు సమకూర్చేది. వారి భోజనం అయిన


తర్వాత, పంచపాండవులు భోజనం చేసేవారు. చివరిగా ద్రౌపది భోజనం పూర్తికాగానే ఆ అక్షయపాత్ర శక్తి, మహిమ తగ్గిపోయేది.

పాండవులకు సూర్యుని ద్వారా అక్షయపాత్ర లభించిందన్న విషయం దుర్యోధనుడికి తెలిసింది. ఆ వార్త తెలిసినప్పటినుండి దుర్యోధనునిలో అసహనం, అసూయ, క్రోధం పెరిగాయి. వారిని ఎలాగైనా అవమానించాలని నిర్ణయించుకున్నాడు. ఒకసారి దుర్యోధనుడు ఒక యాగం చేశాడు. ఆ యాగానికి దూర్వాస మహర్షి తన శిష్యులతో కలిసి వచ్చాడు. దూర్వాస మహామునికి, అతని శిష్యులకు అమిత మర్యాదలు చేశాడు దుర్యోధనుడు. అతని ఆతిథ్యానికి మర్యాదలకి మెచ్చిన దూర్వాసుడు ఏదైనా వరం కోరుకోమని చెప్పాడు. ఆ వరాన్ని తన సుఖం కోసం కాక, పాండవులను కష్టపెట్టడానికీ, వారు అవమానం పాలవటానికీ, వారి అప్రతిష్టపాలు చేయటానికీ ఉపయోగించుకోవాలనుకున్నాడు దుష్టబుద్ధితో దుర్యోధనుడు. వనవాసం గడుపుతున్న పాండవులు తనలాగా ఆ మహర్షికీ, శిష్యులకీ సకల మర్యాదలు చేయడం, తృప్తి తీరా విందుభోజనం పెట్టడం అసంభవమని తలచాడు దుర్యోధనుడు.

పాండవుల వద్దకి దుర్వాసునీ, అతని శిష్యులనూ వారికి ద్రౌపది ఆహారాన్ని సమకూర్చలేని సమయంలో పంపించినట్లయితే దూర్వాసునికి వారు ఆతిథ్యం, భోజనాలు సమకూర్చలేకపోవడంతో ఆ మహర్షి శాపానికి వారు గురవుతారని భావించాడు దుర్యోధనుడు. ''మహర్షీ, తాము తమ శిష్యుల సమేతంగా మా సోదరులైన పాండవుల వద్దకు వెళ్ళండి. ద్రౌపది భోజనం ముగిసిన తర్వాత, తీరిగ్గా ఉన్న సమయంలో వారి వద్దకు వెళ్ళండి. ఈ వరాన్నే నేను మీ నుంచి కోరుకుంటున్నాను'' అన్నాడు దుర్యోధనుడు.

దుర్యోధనుని మనస్సులోని దుర్బుద్ధిని తెలియని దూర్వాస మహర్షి తన పదివేల మంది శిష్యులను వెంటపెట్టుకుని పాండవుల వద్దకు వెళ్ళాడు. దూర్వాస మహర్షికి నమస్కరించి సగౌరవంగా ఆహ్వానించాడు ధర్మరాజు. తమకు, తమ శిష్యులకు భోజనం ఏర్పాటు చేయమని కోరాడు. తాము నదీ స్నానానికి వెళ్ళి వస్తామని శిష్యులతో కలిసి వెళ్ళిపోయాడా మహర్షి.

అతిథిగా ఇంటికి వచ్చిన మహర్షి కోరికను కాదనలేక అందుకు అంగీకరించక తప్పలేదు పాండవులకు. కానీ, మనస్సులో ఈ గండం గడిచేదెలా అని మథనపడసాగారు ఆ అన్నదమ్ములు. అక్షయపాత్ర శక్తి ద్రౌపది భోజనం చేయడంతో ముగిసిపోయింది. ద్రౌపది నిస్సహాయ స్థితిలో తమను ఆదుకోమంటూ శ్రీకృష్ణ భగవానుని ప్రార్థించింది.



ద్రౌపది ప్రార్థన విన్న కృష్ణుడు ఆమె కోరికను మన్నించి, పాండవుల వద్దకు వచ్చాడు.

'తనకు చాలా ఆకలిగా ఉందని, భోజనం ఏర్పాటు చేయమని' ద్రౌపదిని అడిగాడు శ్రీకృష్ణుడు.

ఆ మాటలు విన్న ద్రౌపది కలవరపడుతూ 'తాను భోజనం చేయగానే అక్షయ పాత్ర మహిమ చూపదని చెబుతూ, 'దూర్వాస మహర్షి ఆయన శిష్యులూ తమ ఆతిథ్యం స్వీకరించాలని వచ్చారని, తమకు సంకట పరిస్థితి ఏర్పడిందనీ, ఈ పరిస్థితిలో తాను అంతమందికి ఎలా భోజనం పెట్టగలననీ' కన్నీళ్ళతో శ్రీకృష్ణుని ముందు వాపోయింది.

అప్పుడు కృష్ణుడు ఆ అక్షయపాత్రను తనకు చూపించమని అడిగాడు. ద్రౌపది ఆ పాత్రను తెచ్చి కృష్ణునికి ఇచ్చింది.

కృష్ణుడు ఆ పాత్రను పరిశీలించి చూడగా పాత్ర అడుగున ఓ మూల ఓ మెతుకు, ఆహార పదార్థం అంటుకుని కనిపించాయి. ఆ మెతుకును ఆ పదార్థంతో కలిపి నోట్లో పెట్టుకున్నాడు. ఆ తర్వాత నదీస్నానం ముగించుకు వచ్చిన దూర్వాసమహాముని, శిష్యులతో భీముని భోజనానికి ఆహ్వానించమని చెప్పాడు. వారందరికీ తమ ఆకలి తీరిపోయినట్లుగా, ఆహారం తీసుకున్నట్లుగా భుక్తాయాసం కలిగింది.

దూర్వాసుడు తమకు ఆకలి లేనట్లుగా చెప్పి వారంతా మరో ప్రాంతానికి వెళ్ళిపోయారు. ఈ విధంగా శ్రీకృష్ణుని అనుగ్రహంతో పాండవులు దూర్వాస మహాముని ఆగ్రహానికి, శాపానికి గురి కాకుండా తప్పించుకున్నారు. దుర్యోధనుని దుర్బుద్ధి నెరవేరకుండా అతని ప్రయత్నం విఫలమయింది.



# బుద్ధ పౌర్ణమి

– జి.వి.ఎస్.రెడ్డి

**ప్రపంచ వ్యాప్తంగా బౌద్ధులందరూ వైశాఖమాస పౌర్ణమి రోజున జరుపుకునే పండుగ బుద్ధపౌర్ణమి. 2023లో మే నెల 5వ తేదీన ఈ పండుగను ప్రపంచవ్యాప్తంగా బౌద్ధమతస్థులు సంతోషంగా జరుపుకోవడం ఆనవాయితీ. ఈ ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మహాబోధకుడు గౌతమబుద్ధుడు.**

అహింసే పరమ ధర్మమని బోధించిన మహనీయుడు గౌతమబుద్ధుడు. కోరికలను జయించమన్నాడు అవి దుఃఖానికి మూలమని. బుద్ధుడు జన్మించిన వైశాఖ శుద్ధపూర్ణిమను బుద్ధపూర్ణిమగా జరుపుకుంటారు. నేటికి 2500 సంవత్సరాల క్రితం ధర్మం పేరిట జంతుబలులు జరిగేవి. అపుడు జీవహత్య నిలుపుటకు మాయాదేవి గర్భమున భగవానుడు బుద్ధునిగా అవతరించాడు. బుద్ధుడు పుట్టగానే ఏడడుగులు నడిచి ఇది నా కడపటి జన్మ అని ఏడుసార్లు పలికినట్లు కొన్ని బుద్ధుని గురించి తెలిపే పుస్తకాలలో తెలుపబడినట్లు తెలుస్తుంది. అపుడు జ్యోతిష్కులు ఈ బాలుడు ప్రపంచాన్ని శాసించే చక్రవర్తి గాని, లేదా గొప్ప సన్యాసి గాని కాగలడని చెప్పారు తండ్రి రాజయిన శుద్ధోదనుడు కుమారుణ్ణి రాజుగానే చూడాలన్న ఉద్దేశంతో సిద్ధార్థుని రాజ ప్రాకారం లోపల రోగములు, దుఃఖములు, మాత్సర్యం ఏమీ తెలియనివ్వకుండా పెంచెను. యశోధరతో వివాహము జరిగిన తర్వాత రాహులుడు అనే పుత్రుడు జన్మించాడు. ఒకరోజు తండ్రి అనుమతితో పట్టణములోకి వెళ్ళి రోగిని, శవాన్ని, ముసలివాణ్ణి చూసిన తర్వాత సిద్ధార్థుడు ఆలోచనలో నిమగ్నుడై మనిషి జీవితము ఇంతేనా అని భావించి, ఈ దుఃఖానికి కారణం తెలుసుకోవడానికి, ఇహాన్ని త్యజించి, పరాన్ని తెలుసుకోవడానికి అడవులకు వెళ్ళిపోయాడు. 6 ఏండ్లు నియమ నిష్ఠలతో తపస్సు చేశాడు. అందువల్ల శరీరం శుష్కించడం తప్ప గౌతముని సమస్యలకు పరిష్కారం దొరకలేదు. మనశ్శాంతి లభించలేదు.

కృశించి, శల్యవంతుడై గౌతముడు ఒక చెట్టు క్రింద పడివుండగా సుజాత అనే గొల్ల స్త్రీ గౌతముని నోట్లో పాలు పోసి బ్రతికించింది. సుజాత మాతృహృదయం గౌతముణ్ణి మృత్యుముఖం నుండి మాత్రమే కాక అందుకు దారి చూపే వైరాగ్యంలోంచి కూడా వెనుకకు మళ్ళించింది. ఆ తర్వాత గయలోని ఒక రావిచెట్టు క్రింద కూర్చుని ఆలోచనలో పడగా గౌతమునికి జ్ఞానోదయమైంది. నాటినుండి గౌతముడు బుద్ధుడైనాడు (అనగా అన్నీ తెలిసినవాడు).

వర్ణవ్యవస్థను బుద్ధుడు ఖండించాడు. జన్మ ప్రధానం కాదని, గుణము మాత్రమే ప్రధానమని, తాము అగ్రవర్ణపు వారమని విర్రవీగుట బ్రాహ్మణులకు తగదని ఎన్నో సందర్భాలలో బోధించాడు.

**సర్వం దుఃఖం, దుఃఖం**

**సర్వం కష్టం, కష్టం**

**సర్వం క్షణికం, క్షణికం**

ఈ వాక్యాలను గౌతముడు తరచూ వాడాడు. బౌద్ధ ధర్మ మూల సూరతాలుగా కూడా ఇవి పరిగణించబడుతున్నయి. గౌతముడు ఉపదేశించిన నాలుగు ఆర్య సూత్రాలు :

1. జీవితమంతా దుఃఖమయం
2. ఈ దుఃఖానికి కారణమున్నది
3. ఈ దుఃఖాన్ని నిరోధించవచ్చు
4. దుఃఖ నిరోధ మార్గం అదే అష్టాంగ మార్గాన్ని అనుసరించాలి

1.సరియైన క్రియ 2. సరియైన మాట

3.సరియైన ఆలోచన 4. సరియైన దృష్టి

5.సరియైన జీవనం 6. సరియైన శ్రమ

7.సరియైన ధ్యానం 8. సరియైన నిర్ణయం

ఈ ఎనిమిది సూత్రాలను అష్టాంగమార్గం అంటారు. బుద్ధుని ప్రథమ ప్రసంగాన్ని ధర్మచక్ర ప్రవర్తన అని పిలుస్తారు. వీరు బుద్ధుని ప్రథమ శిష్యులు. వీరికి బుద్ధుడు చేసిన బోధ ఇది. ఆత్మ, పరమాత్మ, పునర్జన్మ మొదలైన అంతులేని సమస్యలను చర్చిస్తూ జీవితం వృథా చేయవద్దు. మీ చిత్త సంక్షోభానికి మూలం ప్రపంచమంతా ఆవరించిన దుఃఖం. ఈ దుఃఖానికి కారణం కోరిక. కోరికను జయించుటకు ఎనిమిది నీతి సూత్రాలను అవలంబించాలి. ఈ మార్గాన్ని అవలంబిస్తే మీకు ఈ జన్మలోనే శాశ్వత మనశ్శాంతి – నిర్యాణము లభిస్తుంది.

**ఆనాటి సమాజం**

గంగాయమునాతీరంలోఅసంఖ్యాకమైనరాజ్యాలుండేవి. వీటిలో విచ్చలి, శాక్యగణాలు ముఖ్యమైనవి. వీరిలో గణసభ్యులు కాని వారికి ఎట్టి హక్కులు లేవు. గ్రీసులోని నగర రాజ్యాలలోని ప్రజాస్వామ్యం వంటివి వీనిలో ఉండేవి. అట్టి గణ సత్తాక శాక్యవంశంలో జనించిన గౌతముడు ఆ ప్రజాస్వామ్య భావాలను స్వీకరించాడు. మగధరాజైన బింబిసారుడు, కోసలరాజైన ప్రసేనజిత్తు ఇద్దరూ నిరంకుశులు. అయినా బుద్ధుని సిద్ధాంతాలకు ఆకర్షింపబడ్డారు. కోట్లకు పడగలెత్తిన వైశ్యులు, అనాథ పిండకుడు, యాసుడు మొదలైన వారున్నారు. వర్తకులు, భూస్వాముల వద్ద, రాజుల వద్ద వేలసంఖ్యలో బానిసలుండేవారు. ఆర్థిక వ్యవస్థలో బుద్ధుడు బోధించిన సమానత్వం, స్వేచ్ఛ, ప్రేమ, శాంతి సిద్ధాంతము అభ్యుదయకర పాత్ర వహించింది. ఏదీ శాశ్వతం కాదు. మారుతుందన్న బోధ, పౌర సమాజం నశించి, క్రొత్త సమాజం పుట్టక తప్పదు.

సమాజంలో అట్టడుగులో ఉన్న వ్యక్తులతో మొదలుపెట్టి ధనికులు, వైశ్యులు, రాజులు బౌద్ధమతాన్ని ఆదరించారు. బహుజన హితాయ, బహుజన సుఖాయ అను సందేశం అన్ని వర్గాల వారిని ఆకర్షించింది.

గౌతముడు భారతదేశంలో ఉద్భవించిన మహాపురుషులలో అగ్రగణ్యుడు. గౌతముని బోధనలలో వినయం, సౌశీల్యం, అణకువ అడుగడుగునా వ్యక్తమవుతూ ఉంటాయి. ఏ ఒక్కదానిని, చివరకు తన బోధనలను సైతం గుడ్డిగా అనుసరించవద్దని బుద్ధుడు పదే పదే తన శిష్యులకు హెచ్చరించాడు. బోధలు చూపగలిగింది బాట మాత్రమే. ఎవరి సత్యసిద్ధి కోసం వారే శ్రమించాలి అని ఒక సందర్భంలో బుద్ధుడు తెలియజేశాడు.

అన్ని విషయాలకు తాను సమాధానం చెప్పగలనని గౌతముడు అనలేదు. తనకు తెలిసిన విషయాలేవో చెబుతున్నానని, మిగతా విషయాలకు సమాధానాలు కాలగర్భంలో ఇమిడి ఉన్నాయని ఆయన ఒక సందర్భంలో చెప్పాడు. ఏవైతే బోధపడలేదో, వాటిని అలాగే బోధపడనట్లు ఉండనిమ్ము. ఏవైతే తెలిసినవో వాటిని స్వీకరించుము.

బుద్ధుడు మరణించిన మరుక్షణమే బౌద్ధంలో విభేదాలు ఏర్పడ్డాయి. వీటిలో కొన్ని ఆచారపరమైనవి. కొన్ని మతపరమైనవి. కొన్ని తాత్వికమైనవి. బుద్ధుని బోధనలను వాకోవాక్యంగా గ్రంథస్థం చేసింది. సూత్రపీటకం, భిక్షువుల జీవిత విధానానికి సంబంధించి తథాగతుడు రచించిన నియమ నిబంధనలు వినయ పీటకం.

**బుద్ధం శరణం గచ్ఛామి**

**ధర్మం శరణం గచ్ఛామి**

**సంఘం శరణం గచ్ఛామి**

# తిరుమల సర్వస్వం

– పల్లపోతు వాణిశ్రీ



గత సంచిక తరువాయి

## ప్రకృతి సోయగం

దట్టమైన అడవులతో కూడుకున్న ఈ పర్వత మార్గం ముగ్ధమనోహరమైన ప్రకృతి దృశ్యాలకు ఆలవాలం. మార్గానికి ఇరుప్రక్కలా పచ్చతివాచీ పరిచినట్లుంటుంది. అల్లంత దూరాన ఉన్న లోయల కావల పచ్చదనం అంతగా లేకుండా నునుపుగా కనిపించే బండరాతి పర్వత శిఖరాలపై ప్రతిబింబించే సూర్యకాంతి, తెల్లని మంచుతో కప్పబడి ఉన్న హిమవత్పర్వత శిఖరాల శోభను తలపిస్తుంది. శేషాచల అడవుల్లో విరివిగా పెరిగే ఔషధ మొక్కల పైనుండి వీచే పిల్లతెమ్మెరలు స్వేదంతో కూడిన శరీరంపై మెల్లమెల్లగా వీస్తుంటే, అలసట అటకెక్కిపోతుంది. దట్టమైన వృక్షాల ఆకుల మధ్యభాగంలోని సన్నని రంధ్రాల ద్వారా చొచ్చుకువస్తున్న సూర్యకిరణాలు, జోరువానలో ఏటవాలుగా కురిసే వాడి అయిన వర్షపు జల్లులను తలపిస్తాయి. వర్షరుతువులో అయితే, లెక్కకు మిక్కిలిగా ఉన్న చిన్నా–పెద్దా జలపాతాలు, పిల్లకాలువలు కూడా కనువిందు చేస్తాయి.

అక్కడక్కడా హోరుగాలుల అలజడి, దూరంగా పారుతున్న నీటి ఒరవడి, ఎండుటాకుల సవ్వడి, పక్షుల కిలకిలా రావాలు, గండు తుమ్మెదల ఝుంకారాలు, భక్తుల గోవిందనామ స్మరణలు పర్వతసానువుల్లో ప్రతిధ్వనిస్తూ లౌడ్ స్పీకర్ల ద్వారా దాదాపు మార్గమంతా వినవచ్చే అన్నమయ్య కీర్తనలు కలగలిసి పోయి భక్తులకు అనిర్వచనీయమైన, ఆధ్యాత్మిక తత్వంతో కూడిన శ్రవణానందం కలగజేస్తాయి.

**వృక్ష-జంతుజాలాలు**

శేషాచల పర్వతాలు జీవ వైవిధ్యానికి ఆటపట్లు. ఈ దట్టమైన అడవుల్లో దాదాపు 50–60 సంవత్సరాల క్రితం వరకు, దక్షిణ భారత దేశంలోనే అత్యధికమైన జంతుజాతులు నివసించేవి. అయితే జనసాంద్రత పెరడగంతోనూ, పలు అభివృద్ధి కార్యక్రమాలు చోటు చేసుకోవడం వల్లనూ జంతుజాతులు అంతరించిపోతున్నాయి. ఇప్పుడు మనకు సాధారణంగా కనిపించే వన్యప్రాణులలో పిల్లకోతిని కడుపుకు కరుచుకుని, జంకు గొంకు లేకుండా ఛెంగు ఛెంగున గంతులేసే వానరాలు, నల్లటి ముఖాలు, పొడుగాటి తోకలు కలిగి చెట్లకొమ్మలపైనుండి చోద్యం చూస్తున్న కొండముచ్చులు, చారడేసి కళ్ళు, వంకర్లు తిరిగిన కొమ్ములతో బిరబిరా పరుగులు తీసే లేళ్ళు, ఆహారం కోస్తూ ఆర్రులు చాస్తూ, అమాయకత్వం పోత పోసినట్లుండే నేత్రాలతో ఉన్న దుప్పులు, అత్యంత అరుదుగా కలుగుల్లోకి ఆత్రుతగా పరుగులు తీసే సరీసృపాలు, చిరు కోరలతో

చిర్రుబుర్రులాడుతున్న అడవిపందులు, రంగు రంగుల సీతాకోకచిలుకలు, మార్గమంతా సందడి చేసే అడవి పిచ్చుకలు పరుగులలో పోటీపడుతున్న ఉడుతలు, ముదురు గోధుమరంగుతో ఉన్న పొడవాటి శరీరం కలిగి, చెట్ల కొమ్మల అంచులలో సయ్యాటలాడుతున్న బెట్లుడతలు ముఖ్యమైనవి. అటవీశాఖ సిబ్బంది కళ్ళు కప్పి – చిరుతలు, ఎలుగుబంట్లు, ఏనుగులు కూడా – చాలా అరుదుగా, మెట్లమార్గంపై సందడి చేస్తుంటాయి. అయితే అనుభవం, నైపుణ్యం కలిగిన అటవీశాఖ సిబ్బంది ముందుజాగ్రత్త చర్యలతో ఇంతవరకు ప్రాణనష్టం కలిగిన దాఖలాలు దాదాపుగా లేవనే చెప్పాలి.

అలాగే అసంఖ్యాకమైన వృక్షజాతులకు కూడా సప్తగిరులు ఆలవాలాలు. ఈ మార్గంలో కనిపించే వాటిలో – వేప, మద్ది, రావి, జువ్వి, మర్రి, తంగేడు, దేవదారు, అశోక, బ్రహ్మ జెముడు, తుమ్మ మొదలైన వృక్షరాజాలు, పున్నాగ, కదంబ, మోదుగ, గన్నేరు, సంపంగి, చామంతి, మందార, జాజి, గులాబి మొదలైన పూలచెట్లూ, సీతాఫలం, మామిడి, జామ, సపోటా, మునగ, పనస మొదలగు ఫలవృక్షాలు, వృక్షకాండాలకు చుట్టుకొని ఉన్న మాలతీలతలు, సన్నజాజి తీగెలు – ముఖ్యమైనవి. వీటిలో అడవులలో సహజసిద్ధంగా పెరిగే వృక్షాలతో పాటు ఉద్యానవన శాఖ సిబ్బంది శ్రద్ధగా పెంచే పలురకాల ఫల, పుష్ప జాతులు కూడా మిళితమై ఉన్నాయి.

### అలిపిరి అంటే?

తిరుమలకు మెట్లదారి మరియు కొండపైకి వాహనాలు వెళ్ళే ఘాట్ రోడ్డు రెండూ ఒకే ప్రదేశంలో అంజలి ఘటిస్తూ సమున్నతంగా నిల్చుని ఉన్న గరుత్మంతుని విగ్రహం వద్ద ఆరంభం అవుతాయి. ఆ ప్రదేశాన్నే ''అలిపిరి''గా పిలుస్తారు. దానికా పేరు రావడం వెనుక అనేక కథనాలున్నాయి.

* ''ఆదిపడి'' అనే తమిళ పదబంధంలో – ''ఆది'' అనే పదానికి ''మొట్టమొదట'' అని, ''పడి'' అనే పదానికి ''గట్టు'' లేదా ''ద్వారము'' అని అర్థం. తిరుమల కొండకు చేరుకునే మొట్టమొదటి ''మెట్టు'' ఇక్కడే ఉంటుంది కాబట్టి ఈ ప్రదేశానికి ''ఆదిపడి'' అనే నామ ఏర్పడి, అదే కాలక్రమంలో ''అలిపిరి''గా ఆంధ్రీకరింపబడింది.

* మరో కథనం ప్రకారం, తిరుమలకు ఉన్నట్లుగా చెప్పబడే అనేక మార్గాల్లో, చారిత్రకాధారాలు లభ్యమైనంత వరకూ, ఇదే ప్రప్రథమ మార్గం. అందువల్లనే దీనిని ''ఆదిపడి'' లేదా ''అలిపిరి'' అని పిలుస్తారు.

* ఈ ప్రదేశంలో శ్రీవైష్ణవులు పరమ పవిత్రంగా భావించే, శాఖోపశాఖలు కలిగిన ''చింతచెట్టు'' ఉండేది. చింతచెట్టు తొర్రలో నుండే తమిళుల ఆరాధ్య దైవమైన నమ్మాళ్వారుల వారు ఉపదేశం చేశారని ప్రతీతి. తమిళంలో – చింతచెట్టును ''పులి''గానూ (చింతపండుతో చేసే పులిహోరను గుర్తుకు తెచ్చుకుందాం), పర్వతపాదాన్ని ''అడివారం''గానూ వ్యవహరిస్తారు. అందువల్ల పర్వత ప్రారంభంలో ఉండే ఈ చింతచెట్టును ''అడివారపు పులి'' లేదా ''అడిపులి''గా పిలిచేవారు. అదే, కాలక్రమాన ''అలిపిరి''గా రూపాంతరం చెందింది.

* ''అలిపిరి'' అంటే ''సూక్ష్మరూపం కలిగిన'' అనే మరో అర్థం వస్తుంది. ఇక్కడ శ్రీనివాసుడు ''సూక్ష్మరూపధారి''గా కొలువై ఉంటాడనే నమ్మకం ఉండటం చేత, ఆ ప్రదేశానికి ''అలిపిరి'' అనే పేరు వచ్చింది.

### నాటి "అలీఫిరే"నే ఈనాటి అలిపిరి

'అలిపిరి'కి ఆ పేరు రావడం వెనక, ఒక అజ్ఞాత భక్తుడు విరచించిన 'వేంకటాచల విహారశతకము' అనే గ్రంథంలో మరో కథనం కూడా ఉంది. దాని ప్రకారం 17వ శతాబ్దం ద్వితీయార్థంలో, ఢిల్లీలో మొగల్ చక్రవర్తుల పరిపాలన నడుస్తోంది. దక్షిణాన శ్రీకృష్ణదేవరాయల అనంతరం జరిగిన రాక్షసితంగడి, తళ్ళికోట యుద్ధాల తరువాత విజయనగర రాజుల ప్రాబల్యం క్షీణించడంతో, మొగలు చక్రవర్తులకు సామంతునిగా ఉన్న నిజాం నవాబు రాయలసీమ ప్రాంతాన్ని ఆక్రమించి, హిందూ దేవాలయాలపై అత్యాచారాలు చేయసాగాడు. ఈ శతాబ్దపు చివరి దశకంలో ఢిల్లీకి ఆజ్ఞాబద్ధుడైన నిజాం నవాబు ''ఆలీ'' అనబడే కరుడుకట్టిన మహమ్మదీయ ఛాందసవాది ఆధ్వర్యంలో తన అపరిమిత సైన్యాన్ని తిరుమల దేవాలయంపై దండయాత్రకు పంపాడు. హైందవమతానికి ఆయువుపట్టైన శ్రీవేంకటేశ్వరుని ఆలయాన్ని ధ్వంసం చేయడం ద్వారా హిందూమతాన్ని నిర్వీర్యం గావించి, ఇస్లాం మతాన్ని వ్యాప్తి చేయడమే కాకుండా, అంతకుముందు శ్రీకృష్ణదేవరాయలు వారు స్వామివారికి సమర్పించిన అమూల్య ఆభరణాలను తస్కరించటం కూడా ఈ దండయాత్ర లక్ష్యం. నవాబు ఆదేశం మేరకు తిరుపతి చేరుకున్న ఆలీ సైన్యానికి పట్టణ ప్రజలందరూ ఎదురై తమ ఊరిలోని స్త్రీలందరి వద్దనున్న బంగారు ఆభరణాలు స్వీకరించి తిరిగి వెళ్ళిపొమ్మని, స్వామివారి జోలికి వెళ్ళవద్దని అభ్యర్థించారు. తాళిబొట్లతో సహా అందరి ఆభరణాలను చేజిక్కించుకున్న విశ్వాసఘాతకుడైన ఆలీ ఒప్పందాన్ని ధిక్కరించి, ముందుగా రచించుకున్న పథకం ప్రకారం తిరుమలపై దండయాత్రకు ఉపక్రమించాడు. శేషాచల పర్వతపాదం వద్ద, అంటే

సరిగ్గా ఇప్పుడు ''అలిపిరి''గా పిలువబడే ప్రాంతంలో ఆలీకి ఊహించని ప్రతిఘటన ఎదురైంది. వరాహరూపంలో సాక్షాత్కరించిన స్వామివారు ఆలీ సైన్యాన్ని నిలువరించారు. అయినా ఆ ముష్కరులు వెనుకకు తగ్గకపోవడంతో, శ్రీవారి ఆగ్రహం వల్ల ఆలీ దృష్టివిహీనుడయ్యాడు. గాఢాంధకారంలో అలమటిస్తూ, దిక్కుతోచక విలపిస్తున్న ఆలీకి తక్షణమే వెనుదిరగవలసిందిగా స్వామివారి హెచ్చరిక వినబడింది. కనువిప్పు కలిగిన ఆలీ వెంటనే శ్రీవారిని క్షమాభిక్ష అర్థించి నేత్రదానం చేయమని వేడుకున్నాడు. శాంతించిన స్వామివారి ఆదేశానుసారం అక్కడినుండి ''బ్రతుకుజీవుడా'' అనుకుంటూ ఆలీ నిష్క్రమించడంతో – అక్కడున్న సిపాయిలందరూ, మహమ్మదీయ మతస్తులతో సహా అంతులేని ఉద్వేగానికి లోనై ''ఆలీఫిరే'' అంటూ నినాదాలు చేశారు. ఈ ఉత్తరభారత పదబంధానికి ''ఆలీ తోక ముడిచాడు'' అని అర్థం. ఈ ఉదంతాన్ని పరిసర ప్రాంతాలలోని సంస్థానాధీశులందరూ సంబరంగా జరుపుకుని ''ఆలీఫిరే'' అంటూ దండోరా వేయించారు. సాక్షాత్తు స్వామివారు సాక్షాత్కరించిన ఈ ప్రాంతానికి, తండోపతండాలుగా భక్తులు తీర్థయాత్రలకు తరలి వెళ్ళేవారు. ''ఆలిఫిరే'' అన్న నానుడి తదనంతర కాలంలో ఆంధ్రీకరించబడి ''అలిపిరి''గా స్థిరమైంది.

ఎలా వచ్చినప్పటికీ వీనసొంపైన అలిపిరి పేరు వినగానే ముప్పిరిగొనే ఆధ్యాత్మిక భావోద్వేగంతో మనసు–తనువు పులకరించిపోతాయి.

**అలిపిరి మార్గం – చారిత్రక, పౌరాణిక విశేషాలు**

మనం ఇంతకుముందు చెప్పుకున్నట్లుగా, ఈ మార్గం తిరుపతి పట్టణ శివార్లలో ముకుళిత హస్తాలలో ఉన్న గరుత్మంతుని విగ్రహం సమీపం నుంచి ప్రారంభమవుతుంది. ఈ ప్రాంతంలో రహదారికి అవతలి వైపు నుండి చూస్తే సుదూరంగా, రెండు పర్వత శిఖరాల మధ్యన శ్వేతవర్ణంలో తళుకులీనుతున్న గాలిగోపురం దర్శనమిస్తుంది. రాత్రివేళల్లో విద్యుద్దీప కాంతులతో ఈ గోపురం మరింత శోభాయమానంగా గోచరిస్తుంది.

అక్కడే ఉన్న తి.తి.దే కార్యాలయంలో మన సామాన్లను, పాదరక్షలను జమ చేసి టోకెన్లు పొందుతాం. ఆ ప్రక్కనే ఉన్న అండర్ బ్రిడ్జి ద్వారా కొన్ని అడుగులు వేయగానే అలిపిరి మార్గానికి మొట్టమొదటి మెట్టు కనబడుతుంది. అక్కడే భక్తిశ్రద్ధలతో టెంకాయ, కర్పూరహారతి సమర్పించుకుని భక్తులు నడకయాత్ర ప్రారంభిస్తారు. కొందరైతే పరమ పవిత్రంగా భావించబడే ఈ సోపానానికి సాష్టాంగ నమస్కారం కూడా చేస్తారు. అక్కడి నుండి మరికొద్ది అడుగుల దూరంలో తిరుమలకు వెళ్ళే వాహన మార్గాన్ని దాటగానే, బాటకు ఇరుప్రక్కలా పొడవాటి విశ్రాంతి మండపాలు కనిపిస్తాయి.

**విశ్రాంతి మండపాలు**

విశ్రాంతి మండపాల నుండి బయలుదేరగానే మనకు ఎడమప్రక్కగా ''శ్రీవారి పాదమండపం'' దర్శనమిస్తుంది. 1628వ సంవత్సరంలో నిర్మింపబడిన ఈ ఆలయాన్ని ''పడాల మంటపం'' అని కూడా పిలుస్తారు. ఈ ఆలయానికి సంబంధించి రెండు ఆసక్తికరమైన కథనాలున్నాయి.

* మొదటిది : శ్రీకాళహస్తి ప్రాంతంలో, శ్రీవేంకటేశ్వరుని భక్తులైన ఒక హరిజన కుటుంబం, అలాగే కాంచీపురం నందుండే మరో హరిజన కుటుంబం ప్రతి శ్రావణ శనివారం నాడు ఉపవాసముండి శ్రీవారికి పిండి తళిగలు నైవేద్యంగా సమర్పించేవారు. ఒక కుటుంబం సమర్పించే పిండిముద్దపై స్వామివారి కుడిపాదం, మరో కుటుంబం సమర్పించుకునే పిండిముద్దపై ఎడమపాదం యొక్క ముద్రలు పడేవి. వాటి కొలతలను బట్టి ఇరువురు హరిజన భక్తులు కుడి–ఎడమ పాదరక్షలను తోలుతో అందంగా తయారు చేసి వాటిని శిరస్సుపై నుంచుకొని ఈ మందిరానికి చేరుకునేవారు. ఆశ్చర్యకరంగా ఈ రెండు జోళ్ళు ఒకరికి తెలియకుండా మరొకరు తయారు చేసినప్పటికీ, ఒకదానికొకటి సరిజోడుగా నుండేవి. స్వామివారు వ్యాహ్యాళికి, వేటకు, తిరుచానూరులో ఉన్న పద్మావతీ అమ్మవారిని కలవటానికి కొండ దిగినప్పుడల్లా ఆ చెప్పులు ధరించి కొండ కోనల్లో తిరగటం వల్ల అవి త్వరగా అరిగిపోయేవి. సగం అరిగిపోయిన ఆ పాదరక్షలకు గుర్తుగా, ఈ ఆలయంలో ఇప్పుడు కూడా లోహంతో తయారు చేయబడిన అనేక పాదరక్షలను మనం దర్శించుకోవచ్చు. ఈ లోహపు పాదాలను భక్తుల శిరస్సుపై తాకించి శఠారిగా ఇచ్చే సాంప్రదాయం ఈ ఆలయంలో నేటికీ ఉంది.

* మరో కథనం ప్రకారం : శ్రీవారి పరమభక్తుడైన తిరుమలనంబి ప్రతిరోజు తిరుమల కొండపై నుండి క్రిందకు వచ్చి ఈ ప్రాంతంలో ఉన్న ఒక చింతచెట్టు క్రింద ఒక సంవత్సరం పాటు ఉదయపు వేళల్లో భగవద్రామానుజులు వారికి రామాయణ రహస్యాలను బోధించేవాడు. మధ్యాహ్నానికి తిరిగి తిరుమలకు చేరుకొని స్వామివారి పాదాలను దర్శించుకొనేవాడు. ఒకరోజు కాలయాపన కావడం వల్ల శ్రీవారిని మధ్యాహ్న సమయంలో దర్శించుకోలేకపోయిన తిరుమలనంబి చింతను తీరుస్తూ

ఆ రామాయణ పారాయణం జరిగే చోటనే శ్రీవారు తన శిలాపాదాలను సాక్షాత్కరింపచేశారు. క్రమంగా ఆ ప్రదేశంలో ఒక మందిరం నిర్మింపబడి వెయ్యేళ్ళుగా ఆ పాదాలు పూజలనందుకుంటున్నాయి. 2001వ సంవత్సరంలో ఈ మందిరం నందు స్వామివారి విగ్రహం కూడా ప్రతిష్ఠింపబడింది.

మొదటి కథనం అనూచానంగా వస్తున్నది కాగా, శ్రీవారి పాదపమంటపం ముందున్న తి.తి.దే వారి సమాచారపటం రెండవ కథనాన్ని బలపరుస్తోంది.

అయితే కొన్ని గ్రంథాలు మాత్రం తిరుమలనంబి దర్శనార్థం వెలయింపబడిన శ్రీవారి శిలాపాదాలను 'శ్రీపాదాలు'గా ఉటంకిస్తూ, అవి అలిపిరి మార్గంలోనే మరికొన్ని మెట్లు ఎక్కిన తర్వాత ఉన్నట్లుగా చెప్పబడుతోంది. కాని అందుకు తగ్గ చారిత్రక ఆధారాలు లేవు. ఏ కథనం నిజమైనప్పటికీ ఈ పవిత్ర పాదాలను దర్శించినంతమాత్రాన పాపాలు పటాపంచలవుతాయని అనాదిగా భక్తులు విశ్వసిస్తున్నారు.

### లక్ష్మీనారాయణస్వామి దేవాలయం

సరిగ్గా శ్రీవారి పాదమండపానికి ఎదురుగా, 16వ శతాబ్దంలో శ్రీనరసింహరాయల వారిచే నిర్మితమైన లక్ష్మీనారాయణస్వామి ఆలయాన్ని దర్శించుకోవచ్చు. ఈ ఆలయాన్ని అన్నమాచార్యులవారు "అలగిరి సింగని" ఆలయంగా వర్ణించాడు. దానినిబట్టి ఒకప్పుడు ఇది "లక్ష్మీనరసింహస్వామి" ఆలయమని, ఏవో తెలియని కారణాల వల్ల ఇది లక్ష్మీనారాయణస్వామి ఆలయంగా పరిణామం చెందిందని చెబుతారు. ఏది ఏమైనా – నారాయణుడు, నారసింహుడు ఇద్దరూ అభిన్నులు. స్వామివారిని ఏ రూపంలో సేవించుకున్నా ముక్తిమార్గం లభిస్తుంది.

### మాలదాసరి

పై రెండు ఆలయాల నడుమన ఉన్న కాలిబాటలో ముందుకు సాగితే కొద్దిదూరంలో రహదారి మధ్యగా సాష్టాంగ నమస్కారం చేస్తున్న శ్రీవారి మహాభక్తుడు మాలదాసరి శిలావిగ్రహం దర్శనమిస్తుంది. ఈ విగ్రహానికి పూలమాలలు వేసి, పూజలు చేసి ముందుకు సాగుతారు. ఈ విగ్రహం ప్రక్కనే రాతిపలకపై చెక్కబడి ఉన్న మరో ముగ్గురు భక్తుల విగ్రహాలు కూడా కానవస్తాయి. బహుశా వీరు మాలదాసరి కుటుంబ సభ్యులు కావచ్చు. హరిజనునిగా జన్మించి వైష్ణవ సాంప్రదాయం అవలంబించి భగవత్ సాక్షాత్కారాన్ని పొందిన మహనీయుడు ఈ మాలదాసరి. ఈతని చరిత్రను శ్రీకృష్ణదేవరాయలు తన "ఆముక్తమాల్యద'8లో గ్రంథస్థం కావించాడు.

తరువాతి కాలంలో మాలదాసరిని అనుసరించి ఎందరో హరిజనులు వైష్ణవంలోకి ప్రవేశించారు. ఈ దాసుల గురించి "దాస సాహిత్య ప్రాజెక్ట్" అనే ప్రకరణంలో ముమ్ముందు తెలుసుకుందాం.

### అలిపిరి మార్గం – చారిత్రక నేపథ్యం

ఈమార్గాన్ని 17వ శతాబ్దపు ప్రథమార్థంలో "మట్లకుమార అనంతరాజు" నిర్మించినట్లుగా చారిత్రక ఆధారాలున్నాయి. పలువురికి ఉపయోగకరమైన, కష్టసాధ్యమైన మెట్లదారి నిర్మించడంతో ఈయన "మెట్లకుమార"గా, తదనంతర కాలంలో "మట్లకుమార"గా ప్రసిద్ధికెక్కినట్లు చెబుతారు. మరో కథనం ప్రకారం ఈ మహారాజు ఆ సమయంలో రాయలసీమ ప్రాంతాన్ని పరిపాలించిన "మట్లీ" వంశస్తుడు కావడం చేత "మట్లకుమారునిగా" ప్రసిద్ధి గాంచాడు.

"అలిపిరి" నుండి మార్గమధ్యంలో నుండే గాలిగోపురం వరకు ఉన్న మెట్లమార్గాన్ని మాత్రమే ఈ రాజు నిర్మించాడు. ఈ మార్గం గాలిగోపురం నుండి కొండపై వరకు అంతకు ముందే ఉన్నట్టి సోపానమార్గంలో కలిసిపోతుంది. తత్పూర్వం కపిలతీర్థం నుంచి వచ్చే మరో సోపానమార్గం గాలిగోపురం ద్వారా తిరుమల కొండకు చేరుకునేది. అనంతరాజు కట్టించిన అలిపిరి నుండి గాలిగోపురం చేరుకునే మార్గం దగ్గరగా ఉండడంతో ఇదే ప్రాచుర్యం పొంది కాలక్రమేణా గాలిగోపురం నుండి కపిలేశ్వర ఆలయానికి వెళ్ళే సోపానమార్గం శిథిలమైపోయింది.

మాలదాసరికి నమస్కరించుకుని ఏడెనిమిది మెట్లెక్కగానే మనకు ఏడు అంతస్తులు, ఎనిమిది ద్వారబంధాలతో కూడుకున్న, సమున్నతమైన రాజగోపురం లేదా మహాద్వార గోపురం లేదా ప్రథమ గోపురం కనబడుతుంది. ఈ గోపురాన్ని 16వ శతాబ్దంలో విజయనగర రాజైన నరసింహరాజు నిర్మించాడు. 1928వ సంవత్సరంలో దీనిపై పిడుగుపడి ద్వారమండపం మాత్రం మిగిలి గోపురం అంతా ధ్వంసమైపోయింది. ఆ కారణంగా స్థానికులు దీనిని మొండిగోపురంగా పిలుస్తారు. 1982వ సంవత్సరంలో తి.తి.దే వారు చారిత్రక ఆనవాళ్ళకు భంగం కలగని రీతిలో ఈ గోపురాన్ని పునరుద్ధరించారు. సమున్నతంగా, సర్వాంగసుందరంగా గోచరించే ఈ గోపుర శోభకు అచ్చెరువొందుతూ అలనాటి శిల్పకళాకారులకు జేజేలు పలుకుతూ ముందుకు సాగుదాం.

**(ఇంకా ఉంది)**

# చ్యవన మహర్షి




భృగుమహర్షి భార్య పులోమ అగ్నిహోత్రం సిద్ధం చెయ్యడం, హోమానికి కావలసిన సామాన్లు ఏర్పాట్లు చేయడం చేస్తూ ఉండేది భర్తకి. ఆమె గర్భవతి. తనకు పుట్టబోయే కొడుకు గొప్ప బ్రహ్మర్షి కావాలని కోరుకునేది.

ఒకనాడు భృగుమహర్షి స్నానానికి వెడుతూ అగ్నిహోత్రం తయారు చెయ్యమని భార్యకు చెప్పాడు. అగ్నిహోత్రం వెలుగుతుండగా పులోముడనే రాక్షసుడు పులోమని చూపించి ఈవిడ ఎవరు? అని అగ్నిదేవుణ్ణి అడిగాడు పులోమ అయితే ఎత్తుకుపోవాలనే ఉద్దేశ్యంతో. అగ్ని నిజం చెప్పకపోతే పాపం వస్తుందనీ, చెప్తే మహర్షికి కోపం వస్తుందనీ ఎటూ కాకుండా ఆవిడ భృగుమహర్షి భార్య అని చెప్పాడు. పులోముడు వెంటనే పంది రూపంలో ఆమెని ఎత్తుకుపోతుండగా పులోమ కడుపులో ఉన్న పిల్లవాడు క్రింద పడిపోయాడు. అలా పడిపోవడం వల్ల ఆ పిల్లవాడికి ‘‘చ్యవనుడు’’ అనే పేరు వచ్చింది. ఆ పిల్లవాడి తేజస్సు చూడగానే రాక్షసుడు భస్మం అయిపోయాడు.

జరిగిందంతా విని భృగుమహర్షి అగ్నిహోత్రుణ్ణి అతిక్రూరుడు, సర్వభక్షకుడు అంటే కనిపించిందల్లా తినేసేవాడుగా అయిపొమ్మని శపించాడు. దేవతలందరూ భృగుమహర్షిని బ్రతిమాలి శాపం ఉపసంహరించుకునేలా చేశారు.

చ్యవనుడికి ఉపనయనం చేసి తపస్సు చేసుకునేందుకు పంపించాడు భృగుమహర్షి. చ్యవనుడు కొన్నివేల సంవత్సరాలు తపస్సు చేశాడు. అతని చుట్టూ పుట్టలు వెలసి అతడు ముసలివాడయిపోయాడు.

ఒకసారి సంయాతి రాజు భార్యనీ, కూతుర్నీ, సైన్యాన్నీ తీసుకుని ఆ ప్రదేశానికి వచ్చాడు. అతని కూతురు సుకన్య చాలా అందంగా ఉంది. అక్కడ తిరుగుతూ పుట్ట దగ్గర రెండు కళ్ళు మెరుస్తూ ఉంటే ఆ కళ్ళని పొడిచింది. ఆ కళ్ళు చ్యవనుడివి. చ్యవనుడికి కోపం వచ్చి సంయాతి సైన్యానికి మలమూత్రాలు బయటికి రాకుండా శపించాడు. రాజు భయపడి మహర్షి కాళ్ళమీద పడి తన కూతురు చేసిన తప్పుకి క్షమించమని కోరాడు.

భవిష్యత్తు తెలిసినవాడు కనుక చ్యవనుడు సుకన్యను తనకిచ్చి పెళ్ళి చెయ్యమని రాజునడిగాడు. రాజు సుకన్యని పిలిచి చ్యవన మహర్షిని పెళ్ళి చేసుకుంటావా? అనగానే సుకన్య అంతటి గొప్ప మహర్షి తన భర్తగా రావడం గొప్ప అదృష్టమని ఈ పెళ్ళి తనకిష్టమే అంది. సంయాతి రాజు వాళ్ళిద్దరికీ పెళ్ళి జరిపించాడు. భర్త ముసలివాయినా సుకన్య చ్యవన మహర్షిని దేవుడుగా అనుకుని సపర్యలు చేస్తూ శరీరం తుచ్ఛమైందనీ, ఆత్మానందమే ముఖ్యమైనదనీ తెలుసుకుంది.

ఇదిలా ఉండగా అశ్వినీ కుమారులు సుకన్య అందాన్ని చూసి సుకన్య ఒంటరిగా ఉన్నప్పుడు, ఈ ముసలి మొగుడుతో ఏముంటావు? నీ అందం అంతా అడవి గాచిన వెన్నెల అయిపోతోంది, మాలో ఒకడిని కోరుకో అన్నారు. సుకన్య భర్తకి చెప్పి అతడు చెప్పమన్నట్లుగా నాకు నవ యౌవనం ఉన్నవాడిని ఇమ్మని అడిగింది. వాళ్ళు దగ్గరే ఉన్న ఒక కొలనులో స్నానం చేసి నవ యౌవనంతో వచ్చారు. చ్యవనుడు కూడా వాళ్ళతో ఆ కొలనులోనే స్నానం చేసి యౌవనంతో వచ్చాడు. సుకన్య చ్యవనుణ్ణి కోరుకుంది. అశ్వినీకుమారులు సుకన్యతో నీ పాతివ్రత్యం పరీక్షించాలని ఇలా చేశామని చెప్పి వెళ్ళిపోయారు.

సంయాతి రాజు తన అల్లుడి ముసలితనం పోయిందని తెలిసి చూడడానికి సపరివారంగా వచ్చి కూతుర్ని అల్లుణ్ణి తన ఇంటికి తీసుకుపోయాడు. చ్యవనుడు మామగారి అభివృద్ధికి ఒక యజ్ఞం చేయిస్తానని చెప్పాడు.


మంచి ముహూర్తం చూచి చ్యవనుడు మామగారితో యజ్ఞం చేయించటం మొదలుపెట్టాడు. అశ్వినీ దేవతలకు ఇచ్చిన మాట ప్రకారం సోమపానమిస్తుంటే ఇంద్రుడు అడ్డుపడ్డాడు. చ్యవనుడు ఇంద్రుణ్ణి పట్టించుకోకుండా అశ్వినీ దేవతలతో సోమపానం చేయించాడు.

ఇంద్రుడు చ్యవనుణ్ణి చంపటానికి వజ్రాయుధం తీస్తుంటే అతని చెయ్యి అలాగే ఉండిపోయేలా చేసి అగ్ని నుంచి ఒక రాక్షసుణ్ణి పుట్టించాడు చ్యవనుడు.

ఆ రాక్షసుడి చేతులు పదివేల ఆమడల పొడుగు, పెద్ద పెద్ద

కోరలు, సూర్యుడు, చంద్రుడు ఎంత ఉంటారో అంతంత పెద్ద పెద్ద కళ్ళు, భయంకరమైన అగ్నిలాంటి ఎర్రని నోరు, భూమిని ఆకాశాన్ని కూడా అంటుకుపోతున్నంత శరీరంతో ఉన్నాడు. ఒక్కసారిగా నోరు తెరిచి ఇంద్రుణ్ణి మింగబోయాడు. వెంటనే ఇంద్రుడు చ్యవన మహర్షి కాళ్ళమీద పడి క్షమాపణ అడిగాడు. ఆ రాక్షసుని మద్యం తాగే వాళ్ళోనూ, జంతువుల్లోనూ ఉండమని పంపేసి, ఆ యజ్ఞం పూర్తి చేశాడు చ్యవన మహర్షి. ఆ యజ్ఞం చేసిన ప్రదేశానికి 'అర్చీకపర్వతం' అని పేరు.

ఇంద్రుడు చ్యవనుడి మీద కోపంతో ఒక పర్వతాన్ని విసిరాడు. ఇంద్రుడికి ఎప్పుడూ అహంకారం, గర్వం. పాపం ఒకసారి దెబ్బతిన్నా తగ్గలేదు. చ్యవనుడు వెంటనే కమండలంలో నుండి నీరు తీసి ఆ పర్వతం మీద చల్లాడు. అది తిరిగి ఇంద్రుడి మీదికి వెళ్ళింది. ఇంద్రుడు భయంతో కళ్ళు తిరిగి పడిపోయాడు. పాపం అని చ్యవనుడే మళ్ళీ ఇంద్రుడి మొహం మీద నీళ్ళు చల్లి లేపితే ఇంద్రుడు సిగ్గుతో మహర్షి జోలికి పోకూడదని వెళ్ళిపోయాడు.



చ్యవన మహర్షి సుకన్యతో నేను ముసలివాణ్ణి అయినా అసహ్యించుకోకుండా నాకు సేవలు చేశావు. నీకు ముగ్గురు పిల్లల్ని అనుగ్రహిస్తున్నాను అన్నాడు. ఆ ముగ్గురి పేర్లు దధీతి, ప్రమతి, ఆప్రవానుడు మహా తపస్సంపన్నులయిన మహర్షులు మంచి ప్రవర్తన కలిగిన సంతానం కోసమే కదా సంసారం చేస్తారు.

కొంతకాలం తరువాత చ్యవనుడు గంగా యమున సంగమంలో నీటిలో మునిగి తపస్సు చేస్తుండగా, అందులో ఉన్న జంతువులు ఆయన చుట్టూ తిరుగుతూ ఉన్నాయి. కాని ఏ హానీ చెయ్యలేదు. అక్కడి నీళ్ళు కూడా చ్యవన మహర్షికి ప్రదక్షిణం చేస్తున్నాయి. ఇలా పన్నెండు సంవత్సరాలు తపస్సు చేశాడు.

ఒకసారి జాలరులు అంటే చేపలు పట్టే వాళ్ళు వల విసిరి లాగి వలలో చిక్కుకున్న చ్యవన మహర్షిని చూసి భయపడిపోయారు. చ్యవనుడు ఫరవాలేదు, మీ కులవృత్తి మీరు చేసుకోవడంలో తప్పులేదు చేసుకోండి అన్నాడు. కాని వాళ్ళు భయంలో నహుష మహారాజుకి విషయం చెప్పారు. వెంటనే వాళ్ళని క్షమించమని చ్యవనుడిని అడిగాడు నహుషుడు.

వాళ్ళ తప్పులేదు తనకి ధర కట్టి వాళ్ళకి ఇచ్చి వాళ్ళని పంపించెయ్యమన్నాడు మహర్షి. నహుషుడు అర్థరాజ్యం ఇస్తానన్నాడు. తన ధరకి చాలదన్నాడు మహర్షి. అయితే పూర్తి రాజ్యం ఇచ్చేస్తానన్నాడు నహుషుడు. అది కూడా తనకి తగిన ధర కాదని చ్యవన మహర్షి రాజుకి చెప్పాడు.

ఈలోగా కవిజాతుడనే ముని వచ్చి గోవయితే బ్రాహ్మణులతో సమానం కాబట్టి ఒక గోవునిమ్మని చెప్పాడు. నహుషుడు గోవు యొక్క గొప్పతనాన్ని చ్యవన మహర్షి వల్ల తెలుసుకుని ఒక గోవును తెచ్చి జాలరులకిచ్చాడు. వాళ్ళు ఆ గోవును చ్యవన మహర్షికి ఇచ్చి నమస్కారం చేశారు. వాళ్ళకి స్వర్గలోప్రాప్తి, నహుషుడికి ఇంద్రపదవి వచ్చేటట్లుగా మహర్షి ఆశీర్వదించాడు.

మునులు, దేవతలతో కలిసి కూర్చుని ఉన్న సమయంలో భృగు కుశిక వంశాల్లో బ్రాహ్మణ క్షత్రియ సంకరం వస్తుందని చెప్పాడు బ్రహ్మ. చ్యవన మహర్షి అది విని కుశిక వంశాన్ని నాశనం చేస్తే ఇంక ఆ రెండింటి మధ్య గొడవలేమీ ఉండవు కదా అనుకుని కుశిక రాజుని పరీక్షిద్దామని వెళ్ళాడు. ఎన్ని రకాలుగా పరీక్షిద్దామనుకున్నా కుశికరాజు లొంగలేదు. ఆ రాజు భక్తికి వినయానికి మెచ్చుకుని నీ వంశంలో బ్రహ్మర్షి పుడతాడు అని చెప్పి ఆశీర్వదించాడు చ్యవనుడు. ఆయనే విశ్వామిత్రుడు.

చ్యవన మహర్షి నర్మదా నదిలో స్నానం చేస్తుండగా ఒక పెద్ద పాము పాతాళ లోకానికి లాక్కుపోయింది. అక్కడ నాగకన్యలు ఆయనకి భక్తితో సేవలు చేశారు. పాతాళ రాజయిన ప్రహ్లాదుడు ఆ చ్యవన మహర్షిని చూసి ఇంద్రుడు నన్ను చంపి రమ్మని పంపించాడేమో అని అనుమానించాడు. కానీ చ్యవన మహర్షిని చూశాక, నమస్కారం చేసి మహాత్మా! మీరు చాలా నదుల్లో స్నానం చేసి ఉంటారు. ఏయే నదుల్లో స్నానం చేస్తే పుణ్యమో చెప్పండని అడిగాడు.

చ్యవన మహర్షి రాజా! నువ్వు విష్ణుభక్తుడివి. నువ్వడిగితే నేను చెప్పకుండా ఎలా ఉంటాను వినమని చెప్పడం మొదలుపెట్టాడు. మనసు పవిత్రంగా లేకుండా ఏ నది స్నానం చేసినా ఉపయోగం ఉండదు. అలా చెయ్యడం వల్ల పాపమే కాని పుణ్యం రాదు. అసలు ఈ తీర్థయాత్రల కంటే సత్యం, భూతదయ, శుచిత్వం కలిగి ఉండటం ముఖ్యం. ఇవన్నీ ఉంటే వాళ్ళ పాదాల క్రిందకి అన్ని తీర్థాలు అవే వస్తాయి. ముఖ్యమైనవి మూడు ఉన్నాయి. అవి నైమిశం, చక్రతీర్థం, పుష్కరం. ఈ మూడు భూలోకంలో పవిత్రమైన తీర్థాలని చెప్పాడు చ్యవన మహర్షి. ప్రహ్లాదుడు అన్నీ విని చ్యవన మహర్షిని ఆశ్రమానికి పంపించాడు.

# శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు

**– దేవులపల్లి పద్మజ**



**అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం ।**
**శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥**

భగవదాంశ సంభూతులు, నిర్వికారులు, నిర్మోహక నిరంజనులు, వేద శాస్త్ర జ్ఞాన విశారదులు, లోక కల్యాణ గుణోపేతులు, నడిచే దైవ నామాంకితులు అయిన శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామివారికి శతకోటి ప్రణామములు. ఎవరి నామ స్మరణ మాత్రమున సకల మనోవికారములు అంతరించి, వైరాగ్య భావనలు జీవం పోసుకుంటాయో, ఎవరి ధ్యాన మాత్రమున సకల దేవతల అనుగ్రహం సిద్ధిస్తుందో, ఎవరి కరుణాకటాక్ష వీక్షణముల వలన పరబ్రహ్మ సిద్ధి కలుగుతుందో వారే జగద్గురువులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామివారు. లోకోద్ధరణకై పరమాత్ముడు తన విభూతులతో జగద్గురువులను సృజన చేస్తాడు. లోకంలో అణగారి పోతున్న ధర్మాన్ని పునరుద్ధరించటానికి వారి మాధ్యమంగా అవతారం ధరిస్తాడు. కలియుగంలో పరమాత్ముని దివ్య తేజోమయ నిజ స్వరూప దర్శనం సాధ్యం కాదు. అది యుగ ధర్మం. అందుకే దైవాంశ సంభూతులు జన్మించి లోకోపకారానికై కృషి చేస్తారు. కంచి పరమాచార్యులుగా కీర్తి గడించారు. శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రి మరియు మహాలక్ష్మీ దంపతులకు అనూరాధా నక్షత్రములో 1894 మే 20వ తేదీన తమిళనాట విల్లుపుర గ్రామమునందు చంద్రశేఖరేంద్రులు జన్మించారు. వీరు స్మార్త హోయసల కర్నాటక బ్రాహ్మణులు. వీరి అసలు నామధేయము స్వామినాథన్. కుంభకోణములో వెలసిన స్వామినాధుని తలంపుతో వీరి నామకరణం జరిగింది.

ఒకనాడు స్వామినాధన్ యొక్క జాతకాన్ని ఒక ప్రముఖ జ్యోతిష పండితుడు చూచి ఆశ్చర్యానికి లోనవుతాడు. ఒకనాడు ఆధ్యాత్మిక లోకం మొత్తం వీరి పాదాక్రాంతమౌతుందని తెలియచేస్తాడు. వీరికి 11వ ఏట ఉపనయనం జరిగింది మరియు భగవదేచ్ఛతో తమ 13వ ఏట కంచి కామకోటి పీఠానికి 68వ అధిపతిగా నియుక్తులైనారు.

**వేదజ్ఞాన్ వేదభాష్యజ్ఞాన్ కర్తుం యస్య సముద్యమ**
**గురుర్యస్య మహాదేవ తం వందే చంద్రశేఖరం**

కంచి కామకోటి పీఠాధిపత్యాన్ని చేపట్టిన సమయానికి గురువుల నుండి శిక్షణ పొందే అవకాశం తనకు లేకపోవడం ఆయనకు ఎప్పుడూ వెలితిగా అనిపించేది. అయినా తన బాధ్యతలను చేపట్టి సమర్థవంతంగా నిర్వహించటానికి తగిన శిక్షణ పొందే కార్యక్రమాన్ని ఆచార్యులు వెంటనే ప్రారంభం చేశారు. కుంభకోణంలోనే వుంటూ రెండేళ్లపాటు దిగ్గంతులైన పండితుల వద్ద ఆయన సంస్కృతం అభ్యసించారు. కుంభకోణంలో సందడి యెక్కువగా వుండడంతో స్వామి వారి ఏకాగ్రతకు భంగం లేకుండా వుండేందుకు వారి మకాం అఖండ కావేరి వొడ్డున వున్న మహేంద్ర మంగళం అనే చిన్న పల్లెకు మార్చారు. నదీ తీరంలో ప్రత్యేకంగా నిర్మించిన పర్ణశాలలో వుంటూ స్వామి వారు వేదాలను, షడ్దర్శనాలను, వివిధ శాస్త్రాలను అధ్యయనం చేశారు. అంతేకాక, గణితశాస్త్రం, జ్యోతిషం,

సంగీతం, చిత్రలేఖనము, శిల్పనిర్మాణము మొదలయిన అనేక శాస్త్రాలను ఆయన నేర్చుకుంటూ వుండేవారు. తనను దర్శించటానికి వచ్చే ప్రముఖులను అడిగి ఆయన అనేక విషయాలను తెలుసుకొంటుండే వారు. ఆ విధంగా ఆయన ఒక విజ్ఞాన సర్వస్వంగా రూపొందారు. గంగైకొండ చోళాపురం వెళ్లి అక్కడి ప్రాచీన శిలా శాసనాలను పరిశీలించేవారంటే వివిధ అంశాలపై ఆయనకుండే ఆసక్తి, శ్రద్ధా అర్థం అవుతాయి. తదనంతర కాలంలో వీరు దేశమంతటా పాదచారియై తిరుగుతూ ధర్మ ప్రబోధాలు చేస్తూ, అనేక లీలలను ప్రదర్శిస్తూ, లోకాన్ని తేజోమయ సంపన్నంగా తయారు చేయటానికి తమ వంతు కృషిచేశారు. హిందూ మత ఔన్నత్యాన్ని దశదిశలా వ్యాపింప చేశారు. వేద రక్షణ, ధర్మ రక్షణ ధ్యేయంగా వీరు రామేశ్వరం నుండి కాశీ వరకు రెండు సార్లు దేశ పర్యటన గావించారు. ఆది శంకరాచార్యుల అవతారంగా భావించబడే స్వామివారికి దేశ విదేశాలలో అనేక మంది ప్రముఖులు శిష్యులుగా వుండేవారు. వీరిని గురించి అనేక గ్రంథాలు వెలువడ్డాయి.

మాం పాహి సర్వేశ్వరీ మోక్షధాత్రి అనే మకుటంతో దుర్గా పంచరత్నం అనే మహత్తరమైన స్తోత్రం భక్తుల కోసం ఆశువుగా రచించారు. పితృకార్యాలను ఎప్పుడూ అశ్రద్ధ చేయరాదని పదే పదే బోధించేవారు. పితృదేవతలు అనుగ్రహం లేకపోతే అనేక అరిష్టాలు కలుగుతాయని బోధించేవారు. ఆచార వ్యవహారాలకు అమితమైన విలువనిచ్చేవారు. ధర్మం యొక్క శక్తి ఆ ధర్మం ఆచరించే వ్యక్తులపైన ఆధారపడి ఉంటుందని, అందువలన నియమ నిబద్ధతతో ఆచరించాలని ఉద్బోధించేవారు. వివిధ మతస్థులు కూడా స్వామివారి సేవలో తరించేవారు. వారి మత విశ్వాసాలకు అనుగుణంగా ఆయా మతస్థులకు వారి వారి దైవ దర్శనాలు కలిగేవి. అందువలన వారిని సర్వదేవతా స్వరూపంగా భావిస్తారు.

చంద్రశేఖరేంద్ర స్వామివారి వాక్శుద్ధి, సంకల్ప సిద్ధి అమోఘమైనవి. వీరి వాక్కులు అసాధ్య కార్యాలను సైతం సుసాధ్యాలుగా మార్చేవి. వీరికి భూత, భవిష్యత్తు, వర్తమానాలు సదా వారి కనుల ముందు గోచరమౌతుంటాయి. వీరి జీవితం మొత్తం లీలా సముద్రము. కొన్నిటిని పరిశీలిద్దాం.

ఒకనాడు వీరి వద్దకు ఒక వృద్ధ దంపతులు వచ్చారు. వారు స్వామివారికి నమస్కారం చేసి జీవితంలో ఏమీ సాధించలేదని, ఆశ్రమంలో సేవచేసే భాగ్యం ఈయమని కోరతారు. అదే సమయంలో మరొక దంపతులు తమ కుమార్తె వివాహ విషయమై అడగటానికి పుత్రికతో అక్కడకు వస్తారు. స్వామివారు మొదటి దంపతులతో మీ వద్ద ధన సంపదలు వున్నాయి కదా ఏదైనా మంచి పని చేయవచ్చు కదా అని అడుగగా అందుకు వారి సమ్మతిస్తారు. అప్పుడు స్వామివారు రెండవ దంపతుల కుమార్తెకు వివాహం చేయమని చెప్పగా అందుకు వారు అంగీకరిస్తారు. అప్పుడు స్వామివారు మీది రెండవ వివాహం కదా, మీ కుమార్తెను చిన్నతనంలోనే విడిచి పెట్టారు కదా అని అడుగగా అందుకు వారు ఆశ్చర్యంతో అంగీకరిస్తారు. అప్పుడు స్వామివారు ఆ అమ్మాయిని చూపి, ఈమే మీ పుత్రిక అని పరిచయం చేస్తారు. రెండవ దంపతులు తమకు ఈ అమ్మాయి చిన్నతనంలో దొరికిందని, అప్పటినుండి తమ కూతురులాగా పెంచి పెద్దచేసామని చెబుతారు. తరువాత ఆ అమ్మాయి వివాహం కన్నవారు మరియు పెంచినవారి సమక్షంలో వైభవంగా జరుగుతుంది. స్వామివారి దివ్యదృష్టికి అందరూ ఆశ్చర్యపడతారు.

మరొక లీలను పరిశీలిద్దాం. కంచి పరమాచార్యుల సేవలో తరించి జన్మ ధన్యత పొందిన వారిలో శ్రీకంఠన్ ప్రముఖులు. ఒకసారి పరమాచార్య స్వామివారు మఠంలో లేరు. కొద్ది దూరంలో ఉన్నారు. సాయంత్రం శ్రీకంఠన్ అత్యంత భక్తితో సేవా భావంతో రుబ్బురోలులో పిండి రుబ్బుతూ ఉన్నారు. చేతులు పని చేస్తూ ఉన్నాయి . కాని మనస్సంతా మహాస్వామి వారి గురించిన ఆలోచనలే. మఠం సేవకులొకరు గాభరాగా లోపలికి వచ్చి ఆయాసంతో రొప్పుతూ చేస్తున్న పనిని వదిలి వెంటనే బయటకు రమ్మని స్వామివారి ఆదేశం అని తెలిపారు. ఎందుకు ఇలాంటి ఆదేశాన్ని ఇచ్చారు. ఏమిటి విషయం అని శ్రీకంఠన్ ఎప్పుడూ ఆలోచించరు. పరుగు పరుగున వెంటనే మహాస్వామి వారి సమక్షానికి వచ్చేశారు. శ్రీకంఠన్ బయటకు వచ్చిన కొద్ది క్షణాల్లోనే అతను కూర్చున్న భవనం యొక్క పైకప్పు కూలసాగింది. శ్రీకంఠన్ గనక బయటకు వచ్చి ఉండకపోయిఉంటే పైకప్పు శిథిలాల్లో అతను చిక్కుకునిపోయేవారు. ఇది గమనించిన శ్రీకంఠన్ కళ్ళ నీరు కారుతుండగా తన ప్రాణాలు కాపాడిన దేవునికి సాష్టాంగ వందనం చేసి తన జీవితాన్ని మహాస్వామి వారి పాదాల చెంత వదిలేశాడు

ఒకసారి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలోని అర్ధమండపంలోకొన్ని మార్పులు చేయాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. కాని దీనికి గణపతి స్థపతి వ్యతిరేకించారు. ఎందుకంటే అటువంటి మార్పుల వలన దేవాలయ పవిత్రతకు మరియు స్వామివారి శక్తికి భంగం వాటిల్లుతుందని. కాని వారి

అభిప్రాయము ఎవరూ గౌరవించలేదు. అప్పట్లో తిరుమలకు సంబంధించిన ఎటువంటి కార్యక్రమమైనా చంద్రశేఖరేంద్ర స్వామివారి అనుమతితోనే జరిగేది. ఇది తెలిసిన గణపతి స్థపతి స్వామివారి వద్దకు హుటాహుటిన చేరుకుంటాడు. ఆ సమయంలో చంద్రశేఖరులు ధ్యానంలో వుంటారు. గణపతి స్థపతి నుండి విషయం తెలుసుకున్న స్వామివారు తమ చల్లని చిరునవ్వుతో అంతా నీవు అనుకున్నట్టుగానే జరుగుతుంది. చింత వలదు అని అభయమిచ్చారు. తరువాత అప్పటి ముఖ్యమంత్రి అయిన శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారి చొరవతో ఆ కార్యక్రమం రద్దు చేయబడుతుంది. ఈ లీల చంద్రశేఖరుల దివ్య విభూతులకు అద్దం పడుతుంది.

మతాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తింపచేసిన మహనీయులు పరమాచార్యులు. భారతదేశానికి రాజ్యాంగ నిర్మాణం చేసే సమయంలో తాతాచారి అనే పెద్దకు వచ్చిన ఆహ్వానం మేరకు మతసంస్థలకు రాజ్యాంగ రక్షణ అవసరమన్న స్వామి ఆశయాన్ని రాయబార వర్గంలోని ముఖ్యుడైన సోరెన్సన్ మహోదయునికి వివరించారు. స్వామి ఒక్క క్షణం ధ్యానంలో మునిగి, ఆ తరువాత మతాన్ని ప్రాథమిక హక్కుగా పరిగణిస్తూ చట్టం చేయమని బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరుతూ వినతి పత్రం తయారు చేయమని భక్తులకు ఆదేశించారు. ఆ తరువాత ఢిల్లీ వెళ్ళి సోరెన్ సన్ కు విజ్ఞాపన పత్రం అందించటం, రాజ్యాంగంలో మత స్వాతంత్ర్యపు హక్కు స్థానం సంపాదించటం జరిగింది.

1927వ సంవత్సరంలో భారత స్వాతంత్ర్య సమరానికి సారథ్యం వహిస్తున్న మహాత్మాగాంధీ దక్షిణ భారత పర్యటన చేస్తున్నారు. ఆ సమయంలో గాంధీజీ పరమాచార్యులను దర్శనం చేసుకున్నారు. గాంధీగారి లక్ష్యం నెరవేరాలని స్వామి మనసున తలచుకున్నారని, అది నెరవేరిందని మనం ఊహించుకోగలం.

ఈ రోజు శ్రీశ్రీశ్రీ జగద్గురువులు చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి వారి ఆరాధనలో భాగంగా వారిని స్మరించుకుంటే, వారు సనాతన ధర్మానికి చేసిన కృషికి కృతజ్ఞత తెలిపినవారమౌతాము. వారు అనేక స్తోత్రాలు రచించారు. వారి పరంపరలోనే వచ్చిన శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారు పది శ్లోకాలు వ్రాసారు. "ఆత్మావై పుత్రనామాసి". అంటే తండ్రీ కొడుకులకు బేధం లేనట్లే అదే పరంపరలో చంద్రశేఖరులకు, విజయేంద్రులకు బేధం లేదనిపిస్తుంది.

వీరు వ్రాసిన శ్లోకాలు చిత్తశుద్ధిని ఇమ్మని ప్రార్థిస్తూ వ్రాసినవి. నిజానికి కావలసినది అదే. చిత్తశుద్ధి ఉంటే జీవితము సార్థకమే.

**శృతి స్మృతి పురాణోక్త ధర్మ మార్గరతం గురుమే !**
**భక్తానాం హితవక్తారం నమస్తే చిత్తశుద్ధయే !!**

అంతేకాకుండా గురువులు నేర్పిన ధర్మమార్గంలో నడవటానికి చిత్తశుద్ధిని ఇవ్వమని...


**వినయేన ప్రార్థయేహం విద్యాం బోధయ మే గురో !**
**మార్గమన్యం న జానే2హం భవంతం శరణం గత: ! !**

అంటూ వినయపూర్వక వందనాలను పరమాచార్యకు అందచేస్తున్నారు విజయేంద్రులు.

బృందావనంలో కొలువైన విగ్రహ రూపం కూడా భక్తుల సమస్యలకు ఊరట కలిగిస్తూ అనుగ్రహిస్తున్నారు. భక్తులు వారి సమస్యలను అక్కడి పురోహితునికి విన్నవించుకుంటే వారు స్వామి వారు చెవులో విన్నవిస్తారు. త్వరలో వారి సమస్యకు పరిష్కారం లభించటం నేటికి ప్రత్యక్ష నిదర్శనం. ఐక్యరాజ్య సమితిలో సంగీత విదుషీమణి యం.ఎస్. సుబ్బలక్ష్మి పాట పాడవలసి వచ్చినపుడు, స్వామివారు ప్రపంచ శాంతికి సంబంధించిన సాహిత్యం గానం చయమని సూచన ఇచ్చారు. సంస్కృతంలో వ్రాసిన ఆ గీతము యొక్క ఆంగ్ల అనువాద పత్రములు అందరికీ వితరణ చేయబడినవి. గానం పూర్తి అయిన తరువాత ఐక్యరాజ్య సమితి సభ్యులు నిలబడి ప్రణామాలు అర్పించారు. పరమాచార్యకు మించిన శాంతి కాముకులు మరొకరు లేరనడానికి ఇది చక్కని ఉదాహరణ.

పరమాచార్యులవారి ఆధ్వర్యంలో అనేక స్వచ్ఛంద సంస్థలు వుండేవి. ఒక సందర్భములో ఒక శాఖకు సంబంధించిన కొంత ధనము మరొక శాఖకు బదిలీ చేయబడినది. ఈ విషయం లెక్కల తనిఖీ విభాగం వారు ఈ విషయాన్ని స్వామివారి దృష్టికి తీసుకుని వెళ్ళినప్పుడు స్వామివారు విచారం వ్యక్తం చేసి, ఇటువంటి దోషానికి ఎటువంటి శిక్ష వేస్తారు అని అడిగారు. వారు నెల రోజుల జైలు శిక్ష పడుతుందని చెప్పారు. తరువాత స్వామివారు తమంతట తాముగా ఆ శిక్షవేసుకుని నెలరోజులు ఒక గదిలో బందీగా వుండి కేవలం తులసి తీర్థం, మారేడు దళం తీసుకుంటూ గడిపారు. ఈ విధంగా ధర్మపరిరక్షణకు వారు అనుసరించిన మార్గం అందరికీ మార్గదర్శకము.

వర్ణింపనలవికాని అనేక లీలలు వారి జీవితంలో కానవస్తాయి. సదా గోసేవలో తరించేవారు. వారు ఎక్కువ సమయం గోశాలలో గడిపేవారు. 1994 జనవరి 8న స్వామి శివసాన్నిధ్యం చెందారు. వారు ప్రత్యక్షంగా, భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికీ వారి అనంత లీలా విభూతులు ఇప్పటికీ అనేకమంది భక్తులకు అనుభవయోగ్యమే. శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్రుల దివ్య ఆశీస్సులు మనందరిపై ఉండాలని కోరుకుందాం.



ధారావాహికం

# శ్రీమాన్ అనంతాళ్వార్ల దివ్య చరితము

- పి. వేంకట రామిరెడ్డి

గత సంచిక తరువాయి

## తొమ్మిదవ అధ్యాయము

**అనంతాళ్వాన్ మరియు వారి శిష్యుల ఆకలి శ్రీనివాసుడు తీర్చుట**

క్రమ క్రమంగా అనంతాళ్వాన్‌లు శ్రీనివాసునికి చేసేటి పుష్పకైంకర్యములు, వారిరువురి నడుమ జరిగెడి సంభాషణముల గూర్చి, తిరుమల వచ్చెడి యాత్రికులకు, ఆలయ అర్చకులు కథలు కథలుగా చెప్పసాగిరి. దాని పర్యవసానముగ అనంతాళ్వాన్ ఖ్యాతి వెలుగులోకి రాసాగెను. తిరుమల దర్శించెడివారుచ, అనంతాళ్వాన్ మరియు వారి శిష్య బృందమును వారి వారి ఊర్లకు ఆహ్వానించసాగెను.

అనంతాళ్వాన్ మొదట ఒంటరిగా వచ్చినను, తర్వాత తర్వాత అనంతాళ్వాన్ల ఖ్యాతి ప్రకటితమయ్యే కొలది పలువురు శిష్యులుగా చేరి ఒక పెద్ద శిష్యబృందమే తయారయ్యెను.

ఒకసారి అనంతాళ్వాన్ తన శిష్యులగు వరదార్యులు మున్నగు కొందరు భాగవత శ్రేష్ఠులను తీసుకుని, తన ధర్మోపదేశములతో అనుగ్రహించు సంకల్పముతో కేరళదేశ పర్యటనకు పోయెను. ఇంకొంత కాలము అచట ఉండవలసినను శ్రీవేంకటాచలపతి ఎడబాటు సహించలేక తిరుమలకు వెనుదిరిగెను.

అవ్విధముగ నడిచి, నడిచి తిరుమల గిరులను అధిరోహింపసాగెను. ఎండ తీక్షణము అతి తీవ్రముగ నుండ, ఎటులనో నొక కాలువ కడ చేరి సంధ్యావందనాది కార్యక్రమముల గావించి, ఊర్ధ్వపుండ్రముల ధరియించి నొక చెట్టు నీడన, ఆకలి దప్పులతో ముందుకు నడవలేక కూర్చుండి పోయెను. తన సఖుడు అనంతాళ్వాన్, తన ఎడబాటు సహియింపజాలక వేంకటాచలమునకు వచ్చుచున్నాడని, మార్గమధ్యమున అనంతాళ్వాన్ అతని శిష్యబృందము డస్సిపోయి ఆకలితో నున్నారని గ్రహియించిన మన కనక మహాలక్ష్మి మగడు, కమల దళాక్షుడగు శ్రీకాంతుడు ఒక బ్రాహ్మణ బాలుని వేషము ధరియించి దద్ధోజనము (పెరుగు అన్నము), సాంబారు అన్నపు మూటలు కట్టుకుని, అనంతాళ్వాన్ల కడ చేరి అయ్యా, మీరు మంచి ఆకలి మీద ఉన్నారని, మీ ఆకలి తీర్చ తెచ్చితినని, మీరు భుజియించిన, నేను అతి శీఘ్రముగ వెడలిపోవలెనని పలుక, అంత అనంతాళ్వాన్ శిష్యులతో మన ఆకలి దీర్చ ఈ బాలుని ఆ వేంకటాచలాధీశుడే పంపినట్లున్నది. అందరమూ ఇంత ఎంగిలిపడి, శీఘ్రముగ వేంకటాచలము చేరి, శ్రీవేంకటనాథుని దర్శించుకుందమనుచు ఆ బాలునితో, ఓయీ, బాలకా నీవునూ కొంత భాగము తీసుకుని తినుమన్న, సరేయని బాలుడు పలికి అనంతాళ్వాన్, వారి శిష్యులకునూ కొసరి కొసరి వడ్డించి తినుమనుచూ వారి ఆకలి తీర్చి, తాను వారికి అల్లంత దూరమున పోయి కూర్చుండి తినెదనని పలుకుచూ కొంత దూరము పోయి అదృశ్యుడాయెను.

ఇది చూచిన అనంతాళ్వాన్ వారి శిష్యబృందముతో, ఇది ఖచ్చితముగా శ్రీశ్రీనివాసుని లీలయే. ఆకలి గొన్నవారి ఆకలి దీర్చేటి నిరతాన్నదాన ప్రియుని, స్థితి కారకుడైన శ్రీవేంకటనారాయణుని పనియేయని, ఆ శ్రీవేంకటనాథుని లీలల మరిన్ని వారికి చెప్పుచూ, ఆనంద నిలయము చేరి ఒకింత విస్మయులయ్యిరి. ఏలయన కటి, వరదహస్త ముద్రాంకితుడగు శ్రీవేంకటనాథుని వరదహస్తమునకు అంటి యున్న దద్ధోజనము, సాంబారు అన్నపు గురుతులు కాన్పించెను. అంత అనంతాళ్వాన్ శ్రీస్వామివారి లీలను వేయినోళ్ళ పొగడుచు, సాష్టాంగ ప్రణామములాచరించి తన ఇంటికి వెడలిపోయెను.

ఆహా! చూచితిమి కదా! అన్నార్తుల పాలిటి శ్రీనివాసుని కరుణ, కటాక్ష వీక్షణములు. ఆకలితో ఆర్తిగ మనము శ్రీనివాసా, గోవిందా యని మనసారా తలచినంతనే పరుగులిడి వచ్చి మన ఆకలిని తీర్చువాడు మన ఆనంద నిలయుడు, శ్రీవేంకటేశ్వరుడు.

ఇక ఇంతకంటే చిత్రమైన లీలను తెలుసుకుందము. సాక్షాత్తు శ్రీవేంకటనాథుడు, తాను అనంతాళ్వాన్ల శిష్యుడనని, మధురకవి దాసుడనని, తన గురువునకు గురువు తనకు గుగ్గురువు శ్రీరామానుజుల వారని, గురు–శిష్య సంబంధముల తెల్పెడి రెండు తనియన్ (శ్లోకము) లలో తెలియజెప్పినటువంటి పరమపావన శ్రీవేంకటేశ్వరుని లీలను గూర్చి ఇప్పుడు ముచ్చటించుకుందుము.

నాటి రోజులలో నేటి వలె తిరుమల నధిరోహించ, వాహనములుండెడివి కావు. నడిమధ్యన ఆకలి తీర్చుకున అరణ్యమార్గమున, సత్రములుండెడివి కావు. తిరుమల శ్రీవారి దర్శనమన్న తిరుమల గిరుల ఆరోహ, అవరోహణములన్న ఎంతయో శ్రమపడవలసి వచ్చెడిది.

ఇట్టి పరిస్థితులలో శ్రీరంగము నుండి కొందరు శ్రీవైష్ణవులు, తిరుమలేశుని దర్శనమునకై తిరుమలగిరి అధిరోహించ మొదలిడిరి. మార్గమధ్యము చేరుసరికి వారికి ఆకలి మొదలై, అల్లాడుచూ అలసిపోయి ఏమైనా భుజియించకున్న ఒక్క అడుగైనా వేయలేమన్న స్థితికి చేరిరి. కొందరు సాటి యాత్రికులు ఏమైనా, వారి కడనున్న తిండి పదార్థములు పెట్ట జూచిరి. కాని నిష్ఠాగరిష్ఠులైన శ్రీవైష్ణవులు తీసుకొనక తిరస్కరించిరి.

వీరి దుస్థితి గమనించిన అఖిలాండ కర్తయు, అంబుజనాభుడు, అంజనాద్రీశుడగు శ్రీవేంకటనాథుడు తానే ఒక బ్రాహ్మణ వటువు రూపము దాల్చి, పెద్ద పులిహోర మూటనొకదానిని తలపై నిడుకుని మోయలేక మోయుచున్నట్లు వారికడ చేరి, వారితో ఇట్లనియెను.

అయ్యలారా! మీరు శ్రీరంగము నుండి వచ్చుచున్నారని, మీ ఆకలి తీర్చుటకై మా గురువుగారగు అనంతాళ్వాన్ వారు పూజాకార్యక్రమములు సలుపుకొనుచున్నారని, మధ్యలో తాను వచ్చుటకు సాధ్యపడదని నాకు చెప్పి ఈ పులిహోర మూట నా నెత్తిపై పెట్టి పంపించారు. ఇది తిని మీ ఆకలి తీర్చుకొనుడని ఆ బాలుడు పలుక, ఇది విని వారు ఆ బాలుని వైపు సందేహముగ చూచుటను చూసి మరల వారితో అయ్యా, నేనునూ, మా గురువుగారగు అనంతాళ్వాన్ ల వారి వలె వోలె మధురకవి దాసుడనే, సందేహించక వారు పంపిన ఈ ఆహారమును భుజించి, నన్నునూ మా గురువగు మధురకవి దాస బిరుదాంకితుడగు అనంతాళ్వాన్ లను ఆనందింప చేయమని పలికెను.

అంతట ఆ శ్రీవైష్ణవులు ఆ బాలకుని పరీక్షింప, అట్లైన వైష్ణవ సంప్రదాయమును అనుసరించి నీ గురువుపై నొక తనియన్ (శ్లోకము) చెప్పుమన ఆ బాలుడు వల్లెయని తడుముకొనక

**అఖిలాత్మగుణావాసం అజ్ఞానతిమిరావహమ్**

**ఆశ్రితానాం సుశరణం వందే అనంతార్యదేశికమ్** అని చెప్పెను.

ఈ తనియన్ కు అర్థమేమన ''జ్ఞానమునకు దయ యనెడి గుణములకు ఆలవాలమై, ఆశ్రిత జనుల అజ్ఞానమును పోగొట్టి, వారికి మేలైన రక్షణ నిచ్చి శరణన్న వారిని కాపాడేటి అనంతార్యుడను నా గురువర్యునకు నమస్కరించుచున్నాను.

అయిననూ శ్రీవైష్ణవుల సందేహము తొలగక, ఆ బాలునితో సరియే నీవూ, నీ గురువును గూర్చి చెప్పగలిగితివి కానీ, నీ గురువుకు, వారి గురువుకు గల సంబంధార్థముల తెలుపుమన, దానికి ఆ వటుడు ఇంకొక తనియన్ ఈ క్రింది విధముగ వల్లె వైచెను.

**శ్రీమద్రామానుజాచార్య శ్రీపాదాంభోరుహద్వయమ్**

**సదుత్తమాంగ సంధార్యమనంతార్య మహంభజే**

అర్థము : శ్రీమద్భగవద్రామానుజాచార్యుల వారి పరమ పవిత్రమైన శ్రీ పాదముల తన శిరముపై నుంచుకున్న సత్పురుషులగు నా గురువగు శ్రీ అనంతార్యుల వారికిని, వారి గురువగు శ్రీమద్రామానుజుల వారికిని నమస్కరించి, వారిని సేవింతును. ఆ చిన్న బ్రాహ్మణ వటుడు ఇట్లు తడుముకొనక వారితో చెప్పగనే, ఆ శ్రీవైష్ణవ శిష్య శిఖామణులకు వాని యందు గురి కుదిరి ఆ బాలుని చేతిలోని పులిహోర మూట తీసుకుని తృప్తిగా భుజియించి ఆకలి తీర్చుకుని, ఆ బాలునికై తిరిగి చూచునంతలో ఆ దివ్యబాలుడు అదృశ్యుడాయెను.

ఆ దృశ్యము చూచి వారు ఆశ్చర్యముతో వారిలో వారు జరిగిన లీల తీరు తలచుకొనుచూ తిరుమల చేరి అనంతాళ్వాన్ తోటలో, అనంతాళ్వాన్ ను కలిసి మీరు తమరి శిష్యునితో పంపిన పులిహోర బహు రుచికరముగా నున్నదనియు, దానిని స్వీకరించి తమ ఆకలిని, అలసటను తీర్చుకుంటిమని చెప్ప, దిగ్భ్రాంతికి గురియైన అనంతాళ్వాన్, నేను మీకు పులిహోర పంపితినా, పైగా నా శిష్యునితోనా అని అడిగి, తెప్పరిలిల అసలు ఏమి జరిగినదని వారిని అడుగగా, వారు జరిగినదంతయూ చెప్పి ఆ వచ్చిన బాలబ్రహ్మచారి తాను మధురకవి దాసుడనని, మధురకవిదాస బిరుదాంకితుడగు అనంతార్యుల శిష్యుడనని, వారి గురువు శ్రీరామానుజల వారని చెప్పినాడని తెలిపిరి.

అది విని అనంతాళ్వాన్, అయ్యా మీరు వచ్చు విషయమే నాకు తెలియదు. నేనెవ్వరినీ మీ వద్దకు పంపలేదు. ఇంత లీలను చేసినవాడు మరెవ్వరో కాదు, చేతనాచేతన స్వరూపుడగు ఆ చెంగళ్వరాయడే, మన శ్రీవేంకటనారాయణుడే యని తెలుప, అందరునూ శ్రీవేంకటనాథునికి జేజేలు పలుకుతూ, సంతోషముతో అనంతాళ్వాన్ల అనుమతితో ఆ దినముననే ఒక శాసనము చేసిరి. నేటినుండి ఆ బాలుడు పలికిన రెండు మంత్రములే లేదా తనియన్ లే, మధురకవి దాస ఆచార్య మంత్రములుగ అనంతాళ్వాన్ల శిష్యులందరూ ఆదరింపవలెనని, ఆచరింపవలెనని అట్లే పలికి మధురకవిదాస ప్రాముఖ్యమును విరాజిల్ల చేయవలయునని శాసనము చేసిరి.

తదుపరి మధురకవిదాసు బిరుదాంకితుడగు శ్రీమాన్ అనంతాళ్వాన్ల వారిని తగు రీతిగ సన్మానించి, సత్కరించి ''శ్రీమాన్ అనంతార్యులు'' అనెడి బిరుదు కూడా నొసంగిరి.

**ఇతిః శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము**

**అనంతాళ్వాన్ల, శ్రీవైష్ణవుల ఆకలి శ్రీనివాసుడు తీర్చుట యను**

**తొమ్మిదవ అధ్యాయము సంపూర్ణః**

ధారావాహికం



# శ్రీ విష్ణు మహాపురాణం

**కిడాంబి నరసింహాచార్య**

**గత సంచిక తరువాయి**

శ్రీ పరాశరుడు చెబుతున్నాడు – బుద్ధిమంతుడైన ముచికుందుడు ఇట్లా స్తుతించగా, అన్ని ప్రాణములకు సృష్టి సంహారములు చేయగల హరి ఇట్లా అన్నాడు –

భగవంతుని మాట – ఓ రాజా! నీకిష్టమైన లోకాలకు వెళ్ళు! నా అనుగ్రహంతో అంతులేని సంపద కలవాడవై, భోగాలను అనుభవిస్తూ గొప్పకులంలో జన్మిస్తావు. నీ గత జన్మ స్మృతులను కలిగి ఉండి నా అనుగ్రహంతో చివర మోక్షాన్ని పొందుతావు అని.

శ్రీ పరాశరుడు అంటున్నాడు – అని అనగా జగత్తులకు ప్రభువైన స్వామికి రాజు నమస్కరించి గుహనుండి బయటకు వచ్చాడు. బయట అల్పులైన నరులను చూచాడు. కలియుగం వచ్చిందని తలచి, రాజు తపస్సు చేయటానికై నరనారాయణులుండే గంధమాదన పర్వతానికి వెళ్ళాడు. ఉపాయంగా కృష్ణుడు శత్రువు బలాన్ని తెలుసుకుని వానిని చంపి, వాని యొక్క ఏనుగులు, గుర్రములు, రథములు తీసుకుని మధురానగరానికి వచ్చి, ద్వారకానగరంలో ఉగ్రసేనునకు సమర్పించాడు. యాదవ వంశము శత్రువులు అవమానిస్తారనే భయము లేకుండా గడిపింది. బలరాముడు కూడా యుద్ధము చాలించాడు. తనవాళ్ళను చూడాలనే కోరికతోనందకులానికివచ్చాడు.పిదపగోపాలురు,గోపికలు ఇదివరలో లాగానే ప్రేమతో చూచారు. గౌరవించారు. ఆతడు కొందరిని దగ్గరకు తీసుకొన్నాడు. కొందరిని కౌగలించుకున్నాడు. కొందరితో పరాచికాలాడాడు. ఇట్లా గోపాలురతో, గోపికలతో వ్యవహరించాడు. గోపాలురు బలరామునికి ఎన్నో ఆనందకరమైన మాటలు చెప్పారు. కొందరు గోపికలు ప్రణయ కోపాన్ని ప్రదర్శించారు. కొందరు ఈర్ష్యతో మాట్లాడారు. నగర స్త్రీలకు ప్రియుడైన బలరాముని కొందరు గోపికలు ఇట్లా అడిగారు.

చంచలమైన ప్రేమ కొద్దిగా కలిగిన కృష్ణుడు సుఖంగా ఉన్నాడా? మా చేష్టలను వెక్కిరిస్తూ, నగర స్త్రీలతో మాట్లాడినాడా? క్షణకాలం స్నేహం కలవాడు గొప్ప గౌరవాన్ని ప్రదర్శిస్తాడు. కృష్ణుడు మమ్ములను స్మరిస్తాడా? మా పాటలను, ఆ అవ్యక్త మధుర ధ్వనిని స్మరిస్తాడా? వాళ్ళ అమ్మని చూడటానికి ఎప్పుడైనా ఇక్కడికి వస్తాడా? ఆ, ఆ కృష్ణుని సంగతులెందుకు? ఇంకేదైనా మాట్లాడండి. మనం లేకుండా ఆయనకు గడిస్తే, ఆయన లేకుండా మనకు గడవదా? ఆయన కోసం మనం తల్లి తండ్రి, సోదరులు, భర్తలు, బంధుజనులు వీళ్ళందరినీ వదిలి పెట్టామా? ఆయన కృతఘ్నుడా? అయినా బలరామా! ఇక్కడికి వచ్చే విషయం గాని, అట్లాంటి మాటలు గాని కృష్ణుడన్నాడా? నిజం చెప్పు. అబద్ధమాడొద్దు. దామోదరుడు, గోవిందుడు నగర స్త్రీలపై మనస్సు కలవాడు, మామీద ప్రేమ లేనివాడు, కన్పించడం కష్టమైపోయేట్టుంది. కృష్ణా! దామోదరా! అని పిల్చినా కన్పించడేమో! కృష్ణుని మనస్సు కలవారై వారు గట్టిగా నవ్వారు. అనునయ వాక్యాలతో, ప్రేమతో నిండిన, గర్వంలేని మాటలతో బలరాముడు వారిని ఓదార్చాడు. కృష్ణుని మనోహర గాథలను చెప్పాడు. కొద్దిసేపటికి వారు తేరుకున్నారు. మునుపటి వలె బలరాముడు వారితో పరిహాసంగా చనువుగా ఉన్నాడు. పరిహాసపు మాటలు చెబుతూ బలరాముడు వారితో కలిసి వ్రజభూమిలో ఆనందించాడు అని విష్ణుపురాణమందు పంచమాంశ ఇరువది నాల్గవ అధ్యాయం సమాప్తం.

**ఇరువది ఐదవ అధ్యాయము**


శ్రీ పరాశరుడు చెబుతున్నాడు – బలరాముడు ఆదిశేషాంశ. భూభారాన్ని మోసేవాడు. ఒక మనిషిగా జన్మించినాడు. గోపాలురతో కలిసి ఆ మహాత్ముడు అడవిలో తిరుగుతున్నాడు. గొప్ప పని చేయటానికి వచ్చాడు. ఒక

పనికై భూమి మీద సంచరిస్తున్నాడు. ఆతని అనుభవం కొరకై ఓ వారుణీ! మదిరా! (సారాయి, కల్లు) నీవు ఆతని దగ్గరకు వెళ్ళు అని వరుణుడు వారుణితో (కల్లు, సారాయి) అన్నాడు. ఆ మహానుభావునకు నీవు ఇష్టమైనదానివి కా. ఆ అనంతుని సుఖం కొరకు వెళ్ళు అని వరుణుడు వారుణితో అనగా బలరాముడి దగ్గరకు వచ్చింది. బృందావనంలో ఉన్న కదంబ వృక్షం రంధ్రంలో అది దాగింది.

బలరాముడు తిరుగుతూ ఆ మదిర వాసనను గ్రహించి ఆ అందగాడు మదిరను సేవించాలని భావించాడు. వెంటనే అతడు (కదంబ వృక్షం నుండి మదిర ధార పడటం చూచాడు. చాలా ఆనందించాడు. ఆనందంతో గోపాలురు, గోపికలతో కలిసి మదిరను సేవించాడు. పాటలు పాడేవారు మృదువుగా పాడుతుండగా, మత్తులో ఒళ్ళంతా చెమట బిందువులు ముత్యాల్లా మెరుస్తూ ఉండగా యమునా నదితో అన్నాడు – ఓ యమునా! నేను స్నానం చేయదలిచాను రా అని మత్తుడై పలికిన బలరాముని మాటను ఆ నది వినలేదు. తృణీకరించింది. రాలేదు. బలరాముడు కోపంతో నాగలి ధరించి నాగలి కొసతో ఆ నదిని లాగాడు. రాకు, రాకు ఓ పాపిష్టిదానా! వేరే చోటికి పో అని అన్నాడు. ఆతడు లాగగా ఆ నది పోయే మార్గం మార్చివేసి బలరాముడున్న వనాన్ని ముంచేసింది. ఒక స్త్రీ రూపంగా ఆ నది వచ్చి భయపడుతూ బలరామునితో రక్షించు, రక్షించు. నన్ను వదులు అని అన్నది. ఆమె మాటను విని ఆ బలరాముడు అన్నాడు – నా పరాక్రమాన్ని అవమానపరిస్తే నేను నిన్ను నా నాగలితో వేయి ముక్కలు చేస్తాను అని.

శ్రీ పరాశరుడంటున్నాడు – అప్పుడు భయంతో ఆమె ప్రార్థించగా అనుగ్రహించి భూభాగంపై ఆమెను వదిలాడు. పిదప బలరాముడు స్నానం చేశాడు. ఆతని శరీరానికి గొప్ప కాంతి వచ్చింది. శిరస్సు పైకి ఒక కలువ పువ్వును, చెవికి ఒక కుండలాన్ని వరుణుడు పంపిన వాడని తామర పూలమాలను, సముద్రపురంగు గల నీలవస్త్రమును లక్ష్మి ఇచ్చింది. తలలో పూవు ధరించి, కుండలము ధరించి, నీలి వస్త్రమును ధరించి బలరాముడు కాంతితో వెలిగాడు. ఆ వ్రజంలో బలరాముడు ఇట్లా ఆనందించాడు. రెండు నెలల తర్వాత అతడు ద్వారకకు వెళ్ళాడు. రైవత రాజు కూతురు రేవతిని బలరాముడు వివాహమాడినాడు. ఆమెయందు నిశిత, ఉల్ముక అని ఇద్దరు కుమారులు కలిగినారు. అని విష్ణు మహాపురాణమందు పంచమాంశ, ఇరువది యైదవ అధ్యాయము సమాప్తము.

**(సశేషం)**



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

**42వ కళ్యాణం**

తేది 02-04-2023 ఆదివారం ఉదయం 10.30 నుండి హైదరాబాద్ లోని కాప్రా వద్ద గల మ్యాపిల్ హోమ్స్ కమ్యూనిటీ హాల్ లో అత్యంత వైభవంగా జరిగింది. దీనిని మ్యాపిల్ హోమ్స్ అసోసియేషన్ వారు నిర్వహించారు. కోలాటాల మధ్య స్వామివారి ఎదుర్కోళ్ళు, నృత్యాలతో వైఖానసాగమోక్తంగా అన్నమయ్య కీర్తనల మధ్యన జరిగింది.


**43వ కళ్యాణం**

తేది 16-04-2023 ఆదివారం ఉదయం 10.30 నుండి హైదరాబాద్ లోని కమలానగర్ ఈసీఐఎల్ వద్ద గల సీనియర్ సిటిజన్ గ్రౌండ్ లో వైఖానసాగమోక్తంగా, అన్నమయ్య కీర్తనల మధ్యన జరిగింది. దీనిని సీనియర్ సిటిజన్స్, కమలానగర్ వారు జి.దశరథ, ఎల్లారెడ్డి మొదలైనవారు నిర్వహించారు.

### శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో "శ్రీనివాస కళ్యాణాలు" అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)**


**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి
**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ, పురుషులకు తమ జీవితాల్లో ఏమి జరుగుతుందో కూడా అర్థం కాని విధంగా గందరగోళంగా ఉంటుంది. ఆర్థిక సమస్యలు, శత్రువులతో సమస్యలు, దగ్గరి బంధువులతో సమస్యలు ఉంటాయి. దూరపు ప్రయాణాలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. అనారోగ్య సమస్యలు ఉన్నాయి. తక్కువ మాట్లాడి, ఎక్కువ పని చేయాలి. నవగ్రహ ప్రదక్షిణలు చేస్తే మంచిది.

## వృషభరాశి
**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. గురు బలం కోరకు దక్షిణామూర్తికి, షిరిడి సాయిబాబాకు పూజలు చేయండి. వృత్తి వ్యాపారాల్లో కొంత శుభపరిణామాలు ఉంటాయి. గత నెలలోలాగా ఈ నెల కూడా చాలా బాగుంటుంది. పాత బాకీలు అకస్మీకంగా వసూలు అవుతాయి. ఈ నెలంతా సంతృప్తికరంగా ఉంటుంది.

## మిథునరాశి
**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అన్ని అనుకూలంగా కనిపించినా గ్రహ కలయిక బాగాలేదు. తక్కువగా మాట్లాడి ఎక్కువ పని చేయండి. తోటి వారితో చాలా జాగ్రత్తగా, మెలుకువగా ఉండటం వలన నిందారోపణలకు గురికారు. అమ్మవారికి నిత్య దీపారాధన చేయడం మంచిది.

## కర్కాటకరాశి
**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. విందు వినోదం ఆర్భాటాలకు అధిక ధన ఖర్చు చేస్తారు. ఆశించిన ఫలితం రాదు. తొందరపాటు నిర్ణయాలు వలన అనేక విధాలుగా చికాకు పడతారు. విద్యార్థి విద్యార్థినులు చాలా జాగ్రత్తలు పాటించగలరు. సరస్వతి దేవి పూజలు చేయగలరు.

## సింహరాశి
**మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆర్థికపరమైన సమస్యలు రావొచ్చు. వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఎవరికి హామీగా ఉండొద్దు. అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవడం అంతమంచిదికాదు. సత్య దేవుని వ్రతం చేయండి. సుఖశాంతి కలుగుతుంది.

## కన్యారాశి
**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు అకస్మికంగా ధన వ్యయం కలుగుతుంది. స్థిరాస్తులు కొనకుండా వాయిదా వేయండి. నిల్వ ఉన్న డబ్బుఅంతా ఖర్చు అవుతుంది. ఆదాయం, ఖర్చుల గురించి శ్రద్ధ వహించండి. అనవసర ఖర్చులను, విందు వినోదాలను వాయిదా వేయండి. తొందరపాటు నిర్ణయాల వలన కష్టాలు. దైవారాధన అవసరం.

## తులారాశి
**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అకస్మిక ధన ఆదాయంతో పాటు ఖర్చులు కూడా ఉన్నవి. ఎంత ఆదాయం వస్తుందో, ఎంత ఖర్చు అవుతుందో అర్థం కాదు. పిల్లల విదేశీ విద్యకు డబ్బు సమకూరుతుంది. ఖర్చులపైన నిఘా పెట్టి, డబ్బు దుబారా కాకుండా ప్రయత్నం చేయండి. ప్రతి విషయంలో నిర్లక్ష్యం లేకుండా చూడండి. సుబ్రమణ్యేశ్వర స్వామిని పూజించండి.

## వృశ్చికరాశి
**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ఆర్థికంగా పుంజుకోగలరు. ఆకస్మిక ధన లాభం సూచనలు ఉన్నాయి. మానసికంగా ధైర్యంగా ఉండాలి. ఏ విధమైన సమస్యలు వచ్చిన నిబ్బరంగా పరిష్కారం చేసుకునేందుకు అవకాశాలు ఉన్నాయి. ఆంజనేయస్వామికి ఆకు పూజ చేయించి, ప్రదక్షిణాలు చేయాలి.

## ధనూరాశి
**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు మిశ్రమ ఫలితాలు ఉంటాయి. ఖర్చులను వాయిదా వేసుకోగలరు. చాలా విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. ఎవ్వరి మనస్తత్వం నచ్చకపోయినా అందరితో కలిసిపోయి ప్రశాంతంగా ఉండండి. ఓర్పుతో మిమ్మల్ని మీరు కలుపుకొని పోవాలి. చిత్రగుప్తుని దేవాలయం కందికల్ గేటు దగ్గర ఉంది. బుధవారం పూజలు చేయించండి.

## మకరరాశి
**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు విందు వినోదాలు, బంధుమిత్రుల కలయికతో ఆనందంగా ఉంటారు. ప్రతి విషయంలో అనుకూలంగా ఉండటం వల్ల అకస్మిక ధన లాభం కలుగును. తొందరపాటు వల్ల ఉద్రేకానికి లోను కాకూడదు. మీ ఆర్భాటం చూసి చాలా మంది అసూయ పడగలరు. అన్నవరం సత్యనారాయణ స్వామి వ్రతం చేయండి.

## కుంభరాశి
**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. మీరు చేయు వృత్తి వ్యాపారాల్లో అకస్మిక ధన లాభం సూచనలు కనిపిస్తున్నాయి. ఏ మాత్రం ఆదమరిచినా వచ్చేది రాకపోవుట లేక ఏదో ఒకరకంగా బ్రేక్ పడటం జరుగుతుంది. నవగ్రహ ప్రదక్షిణలు, జపాలు, దానాలు చేయడం మంచిది.

## మీనరాశి
**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా అనిపించే విషయాల్లో సానుకూలంగా ఉంటుంది. ఆదాయం, వ్యయాలను బ్యాలెన్స్‌గా ఉంటాయి. వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రేమ వ్యవహారాల్లో సమస్యలు రాగలవు. తొందరపాటు నిర్ణయాల వలన ఇబ్బందులు పడతారు.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




**శ్రీ వేంకటేశం**

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,

హబ్సిగూడ, హైదరాబాద్-500007,

ఫోన్: 040-27175050

Email: srivenkatesham@gmail.com


ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. శ్రీరామునికి స్మరణ భక్తురాలు ఎవరు?
2. రుక్మిణీదేవిని తీసుకెళుతున్న శ్రీకృష్ణుణ్ణి ఎదిరించిందెవరు?
3. విష్ణువు కూర్మావతారంలో ఏ పర్వతాన్ని ఎత్తాడు?
4. హిరణ్యకశిపుని సోదరి ఎవరు?
5. సత్యవంతుని తండ్రి ఎవరు?
6. తాటక కొడుకు పేరేమి?;
7. శ్రీవారి నేత్ర దర్శనం ఏనాడు కలుగుతుంది?
8. విట్టు అంటే అర్థం?
9. కుమారస్వామి భార్యలు ఏ శక్తులు?
10. పండరి క్షేత్రానికి ఆ పేరు ఎవరి వల్ల వచ్చింది?
11. వేదవతి ఎవరి పుత్రిగా ప్రసిద్ధి?
12. శ్రీకృష్ణుడు ఇచ్చిన గురుదక్షిణ ఏది?
13. గౌరముఖుడు ఎవరి శిష్యుడు?
14. శ్రీవారి గంగాళానికి ఎవరి పేరు వచ్చింది?
15. పుండరీకునికి ఎవరి బోధ వలన జ్ఞానోదయమయింది?

1. ______________________
2. ______________________
3. ______________________
4. ______________________
5. ______________________
6. ______________________
7. ______________________
8. ______________________
9. ______________________
10. ______________________
11. ______________________
12. ______________________
13. ______________________
14. ______________________
15. ______________________

పేరు: ______________________

చిరునామా: ______________________

______________________

______________________

______________________

పిన్‌కోడ్: ______________________

ఫోన్: ______________________

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. వేదం, స్మృతి, సదాచరం, 2. చైత్ర శుక్ల పాడ్యమి, 3. చైత్రమాసం, 4. కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలు, 5. మనసు, 6. త్రిరాత్రోపవాసవ్రతం, 7. అంతరంగంలోను బహిరంగంగాను నిరంతరం భగవంతుని పైనే ధ్యాస కలిగి ఉండటం, 8. దండకారణ్యం, 9. సరయూ నది, 10.పులికాపు, 11. కామరసాయన తీర్థం, 12. అశ్వత్థ వృక్షం, 13. సుధర్మ, 14.శతశృంగగిరి మీద, 15. శతానందుడు

## సరైన సమాధానాలు రాసినవారు

1. జనమంచి జయశ్రీ, 2. పువ్వాల బాల్‌రెడ్డి, 3. పి. యశోద, 4. చింతలపాటి శివశంకరశాస్త్రి, 5. సూరి సౌభాగ్య లక్ష్మి, 6. రామదాసు

లక్కీడిప్ ద్వారా

స్వామివారి పాదాలు పొందిన విజేత

## పువ్వాల బాల్‌రెడ్డి



Postel Registration No: HSE/879/2022-2024

Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month

RNI No.: APTEL/2008/23122




**If Un delivered please return to:**

**SRI VENKATESHAM, (Sri Venkateshwara Maha Mantra Peetham)**

H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.srivenkatesham.org లో చదవండి

Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq